సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50


సంపుటి: 18 సంచిక: 103

శుక్రవారం 4-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'


చరిత్రలోనే కనీవిని ఎరుగని తక్కువ తరుగు
బంగారం కొనేటప్పుడు మీరు పెద్ద మొత్తంలో డబ్బులు ఆదా చేస్తారు.
ఇలాంటి వేలాది డిజైన్లలో అందమైన నగలు, ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
తరుగు V.A. 10%
ఇలాంటి రకరకాలైన డిజైన్లలో అందమైన వడ్డాణం / బ్రేస్‌లెట్ నగలు ఇదే తరుగులో మా వద్ద లభిస్తాయి. ఇక్కడ కొన్ని నగలు మాత్రమే చూపించాం.
బ్రేస్‌లెట్
MC DELHI V.A.3%
CASTING MC CHAIN STONE V.A.8%
KATTIYAR CASTING V.A.8%
LOTUS V.A.8%
LOTUS SAND V.A.8%
MC CASTING PLAIN V.A.8%
CASTING GENTS RUDRACHAM V.A.8%
BOMBAY STAMPING DELHI V.A.9%
BOMBAY NAVABEE FANCY V.A.9%
రకరకాలైన కాస్టింగ్ ఉంగరాలు (రాళ్లు పొదిగిన / రాళ్లు లేని) ఇదే తరుగులో మా వద్ద లభ్యం. ఇక్కడ కొన్ని ఉంగరాలు మాత్రమే చూపించాం.
ఎలాంటి దాపరికం లేని తక్కువ!
ఇతర నగల షోరూంలలో లలితా జ్యువెల్లరి వారి Estimate Slipను కస్టమర్లు చూపించిన తర్వాత.. వాళ్లు తరుగు తగ్గిస్తున్నారనే విషయం మా దృష్టికి వచ్చింది. కానీ, దేవుళ్లతో సమానమైన మా కస్టమర్లు మా వద్ద అలా విన్నవించుకోవాల్సిన అవసరం లేదు. ఏ నగ అయినప్పటికీ, మార్కెట్‌లో కంటే తక్కువ తరుగుకు మావద్ద తీసుకోవచ్చు!
నగల బుకింగ్ పథకం
OLD GOLD EXCHANGE
5 to 11 month scheme
100% తరుగు లేదు
Lalithaa
www.lalithaajewellery.com
హైదరాబాద్ - సోమాజిగూడ • దిల్‌సుఖ్‌నగర్ • కూకట్‌పల్లి • చందానగర్ • సుచిత్రా సర్కిల్
సికింద్రాబాద్ • నిజామాబాద్ • ఖమ్మం • వరంగల్ • మిర్యాలగూడ
VIRAL VIDEO 2.4+M VIEWS


'ప్రతిపల్లెలోనూ అందరికీ గ్యాస్ సరఫరా, ప్రతి మహిళకూ ఆర్థిక భరోసా నా ధ్యేయం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 103

శుక్రవారం 4-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గిల్ రికార్డుల హోరు

269 పరుగులు చేసిన భారత కెప్టెన్. టీమిండియా 587 ఆలౌట్. -9లో



ముందస్తు చెల్లింపు చార్జీలొద్దు

బ్యాంక్‌లకు ఆర్‌బీఐ ఆదేశం.. 2026 జనవరి 1 నుంచి అమల్లోకి... -9లో



భారత్‌తో స్థిరమైన ప్రపంచం

భారత్ బలంగా ఉంటే ప్రపంచం మరింత స్థిరంగా, సౌభాగ్యవంతంగా మారుతుందని ప్రధాని మోదీ ఘనా పార్లమెంట్‌లో చెప్పారు.

- వివరాలు 6లో▶



అంతరిక్షంలో అతిథి

మన సౌరమండలంలోకి ఒక తోకచుక్క అతిథిగా దూసుకొచ్చింది. దీనికి 3ఐ/అట్లాస్ అని నామకరణం చేశారు.

- వివరాలు 6లో▶



హమాస్ అంతం ఖాయం

హమాస్ సాయుధ సంస్థను శాశ్వతంగా అంతం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రతినబూనారు.

- వివరాలు 6లో▶



19న అఖిలపక్ష సమావేశం

పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో రెండ్రోజులు ముందుగా 19న అఖిలపక్షం ఏర్పాటు చేసినట్లు మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు.

- వివరాలు 6లో▶

సారీ.. వచ్చేసారి..

మంత్రి పదవులు ఆశించిన నేతలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

- అన్ని సామాజిక వర్గాలు, జిల్లాలకు భవిష్యత్తులో సముచిత న్యాయం
- అనుభవం, అర్హతలకనుగుణంగా పదవులు సర్దుబాటు చేస్తాం
- రెండోసారీ అధికారంలోకి వస్తాం.. అప్పుడూ అవకాశాలు వస్తాయి
- సీనియారిటీకి గౌరవం తప్పకుండా ఉంటుంది..
- 'స్థానిక' ఎన్నికలపై దృష్టి పెట్టండి.. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- తాజ్ కృష్ణా హోటల్లో ముఖాముఖిగా మాట్లాడి బుజ్జగింపు
- ఎవరి వాదనలు వారివే.. అలిగి వెళ్లిపోయిన ప్రేంసాగర్‌రావు!
- దాదాపు 3 గంటల పాటు హోటల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి
- శంషాబాద్ విమానాశ్రయంలో ఖర్గేకు ముఖ్య నేతల స్వాగతం
- నేడు పలు సమావేశాలు, బహిరంగ సభలో పాల్గొననున్న ఏఐసీసీ చీఫ్


గురువారం శంషాబాద్ విమానాశ్రయంలో మల్లికార్జున ఖర్గేకు స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


సాక్షి, హైదరాబాద్: అర్హులైన నేతలు మంత్రి పదవులు ఆశించడంలో తప్పులేదని అయితే పార్టీ అంతర్గత పరిస్థితులు రాజకీయ, సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకుని సర్దుకుపోవాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. రాష్ట్రంలోని అన్ని సామాజిక వర్గాలు, జిల్లాల వారీగా సముచిత న్యాయం చేసేందుకు పార్టీ కట్టుబడి ఉందని, భవిష్యత్తులో వారి వారి అనుభవం, అర్హతలకు అనుగుణంగా పదవులు సర్దుబాటు చేస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం జరగనున్న పలు సమావేశాల్లో పాల్గొనేందుకు ఖర్గే గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు వచ్చారు. శంషాబాద్ విమానాశ్రయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ నేత హర్కర వేణుగోపాలరావు తదితరులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. నేరుగా తాను బస చేసే తాజ్ కృష్ణా హోటల్‌కు చేరుకున్న ఖర్గే అక్కడ..ఇటీవలి కేబినెట్ విస్తరణ సందర్భంగా మంత్రి పదవులు ఆశించిన నేతలతో ముఖాముఖిగా సమావేశమయ్యారు.

మేం అర్హులం.. మాకు అవకాశం ఇవ్వాల్సిందే

ఏఐసీసీ చీఫ్‌తో భేటీ అయ్యేందుకు రావాలని గురువారం మధ్యాహ్నం కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు పార్టీ సమాచారం ఇచ్చింది. ఈ మేరకు సుదర్శన్‌రెడ్డి, ప్రేంసాగర్ రావు, బాలునాయక్, రామ్మోహన్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి సాయంత్రం హోటల్‌కు చేరుకుని ఖర్గేతో సమావేశమయ్యారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఆది శ్రీనివాస్‌కు కూడా సమాచారం మిగతా 8వ పేజీలో ▶

పార్టీ ఎజెండా ముఖ్యం..

అధికారమే లక్ష్యం



- ఏడాదిన్నరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు ప్రత్యామ్నాయం బీజేపీ అని ప్రజలు భావిస్తున్నారు
- వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారంలోకి వస్తాం
- నిత్యం ప్రజల మధ్యనే ఉంటా.. ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతా
- రేపు లేదా 10న బాధ్యతలు స్వీకరిస్తా

'సాక్షి'తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: బీజేపీలో ఎలాంటి నిర్ణయమైనా సమష్టిగా చర్చించిన తర్వాతే తీసుకుంటామని, దాన్నిఅమలు చేసే బాధ్యత మాత్రమే రాష్ట్ర అధ్యక్షుడిపై ఉంటుందని బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చెప్పారు. సొంతంగా, స్వార్థపూరితంగా నిర్ణయాలు తీసుకునే ప్రసక్తే లేదన్నారు. 'పార్టీ ఎజెండా ముఖ్యం.. 2028లో రాష్ట్రంలో అధికారమే లక్ష్యం' అనే నినాదంతో ముందుకెళ్తామని చెప్పారు. పార్టీ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్ కార్యక్రమాలపై గురువారం ఆయన 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

అప్పుల గురించి రేవంత్‌కు అప్పుడు తెలియదా?

ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఏడాదిన్నర కాలంలోనే పూర్తిగా విఫలమైంది. సీఎం రేవంత్‌రెడ్డి వివిధ సందర్భాల్లో మాట్లాడుతూ అప్పుల గురించి చెబుతున్నారు. ఎన్నికలకు ముందు ఈ అప్పుల సంగతి ఆయనకు తెలియదా? కనీస అవగాహన లేకుండానే హామీలు ఇచ్చారా? అమలు చేయాల్సి వచ్చేసరికి ఆర్థిక పరిస్థితి గురించి చెబుతారా? రైతు రుణమాఫీ ఇంకా పూర్తికాలేదు. రైతుబంధు అందడం లేదు. మహాలక్ష్మి, గృహలక్ష్మి అంటూ ఎన్నో హామీలు ఇచ్చి... ఇప్పుడు రాష్ట్రం దివాలా తీసిందంటూ ప్రజలను మోసం చేసే ప్రయత్నమే కనిపిస్తోంది. కాంగ్రెస్ హామీలు అమలు చేయలేని పరిస్థితిలో ఉన్నట్లు ప్రజలు గుర్తించారు. ప్రజాస్వామ్య తెలంగాణ మాటలకే పరిమితమైంది. భైంసాలో ఎంతోమంది బీజేపీ కార్యకర్తలను జైల్లో పెట్టారు. గోరక్షకులను అరెస్టులు చేశారు.

ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారు..

పదేళ్ల పాలన చూసిన తర్వాత బీఆర్ఎస్‌ను ప్రజలు వద్దనుకున్నారు. అందుకే కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

హామ్ రోడ్లపై టోల్ ఉండదు



'హామ్' పద్ధతిలో నిర్మించే రహదారులపై టోల్ వసూలు చేయబోమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని రహదారులన్నింటి నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేస్తామన్నారు.

- వివరాలు 5లో▶

తెలంగాణ ప్రజలకు రాహుల్ ద్రోహం



రాహుల్‌గాంధీ తెలంగాణకు హక్కుగా రావాల్సిన అంశాలపై ఏరోజూ మాట్లాడలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో రాహుల్ బీజేపీతో కలిసి పనిచేస్తున్నారన్నారు.

- వివరాలు 5లో▶

పైరసీ.. సినిమా చూపిస్తోంది!



సినిమా పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు గత ఏడాది రూ.3,700 కోట్ల నష్టం వాటిల్లింది. ఒక్క తెలుగు సినీ పరిశ్రమకే ఈ స్థాయిలో నష్టం వాటిల్లితే.. దేశవ్యాప్తంగా ఇతర భాషల చిత్రాల సంగతేంటి?

- వివరాలు 2లో▶

పదోన్నతుల గరిష్ట వయోపరిమితి పెంపు



అంగన్‌వాడీల్లోని హెల్పర్ల పదోన్నతులపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టీచర్‌గా పదోన్నతి పొందేందుకు సీనియర్లకు అవకాశం కల్పించింది. గరిష్ట వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

- వివరాలు 2లో▶


ఢిల్లీలో సీఈసీ జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్‌బీర్‌తో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ నేతలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి

ఇవిగో సాక్ష్యాలు!

ఈవీఎంల మాయాజాలంపై ఈసీకి ఆధారాలు అందించిన వైఎస్సార్‌సీపీ నేతల బృందం

- ఏపీలో పోలింగ్ రోజు తొలుత వెల్లడించిన శాతానికి... తుది శాతానికి మధ్య భారీ తేడా
- రాష్ట్రంలో పోలింగ్ శాతం మధ్య తేడా దేశంలోనే అత్యధికంగా ఏకంగా 12.54%
- పోలింగ్ శాతంలో తేడా వల్ల పెరిగిన ఓట్లే 87 శాసనసభ స్థానాల్లో గెలుపోటములను నిర్దేశించాయి
- హిందూపురం, రాయచోటి నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళిలో వ్యత్యాసాలు... ఓటింగ్‌లో పెరుగుదలే ఉదాహరణ
- ఈవీఎంలు, వీవీప్యాట్ల ఓట్లను సరిపోల్చి చూడాలి.. వీటన్నింటిపై విచారణ జరిపించాలి
- బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు జరపాలి
- మా విజ్ఞప్తులపై సీఈసీ సానుకూలంగా స్పందించింది: వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

8లో

ఆభరణాల గురించి సీఎం రేవంత్‌కు వివరిస్తున్న మలబార్ సంస్థ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు



ప్రపంచ దేశాలతోనే పోటీ

తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామం: సీఎం రేవంత్

- పెట్టుబడిదారులకు, వారి ఆస్తులకు పూర్తి రక్షణ లభిస్తుంది
- మహేశ్వరంలో మలబార్ బంగారు, వజ్రాభరణాల తయారీ సంస్థ ప్రారంభం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉత్పత్తుల ఎగుమతి విషయంలో మాకు దేశంలోని ఏ రాష్ట్రంతోనూ పోటీ లేదు. అమెరికా, సింగపూర్, కొరియా, యూకే వంటి అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాలతోనే మాకు పోటీ ఉంటుంది. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై సహా దేశంలోని ఏ ఒక్క నగరం కూడా మన హైదరాబాద్‌తో పోటీ పడలేదు..'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం మండలంలోని పారిశ్రామిక జనరల్ పార్క్‌లో 3.45 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన మలబార్ బంగారు, వజ్రాభరణాల తయారీ సంస్థను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు.

ఇక్కడ పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు

'తెలంగాణ పెట్టుబడులకు స్వర్గధామం. ఇక్కడ పెట్టుబడి పెట్టిన వారికి, వారి ఆస్తులకు పూర్తి రక్షణ లభిస్తుంది. గత 20 ఏళ్లలో పాలకులు మారారే కానీ.. పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఆయా ప్రభుత్వాల విధానాలు మాత్రం మారలేదు. మేం పెట్టుబడులకు మెరుగైన మిగతా 2వ పేజీలో ▶


రామకృష్ణారెడ్డి మొహినుద్దీన్ చలపతిరావు గాడి ప్రవీణ్


తెలంగాణ హైకోర్టుకు

కొత్త జడ్జీలు

నలుగురిని సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

- గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్ ఎంపిక
- న్యాయవాదుల కోటా నుంచే వారికి అవకాశం
- సిఫార్సులన్నీ ఆమోదం పొందితే 33కు చేరనున్న జడ్జీల సంఖ్య

2లో



వైరల్ ఫీవర్‌తో ఆస్పత్రిలో కేసీఆర్

- చికిత్స అందిస్తున్న వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎం.వి.రావు
- డెంగీ సోకినట్లు అనుమానం
- పరీక్షలు నిర్వహించిన వైద్యులు
- కేసీఆర్ ఆరోగ్యంపై సీఎం రేవంత్‌రెడ్డి వాకబు

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వైరల్ ఫీవర్‌తో బాధ పడుతూ సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చేరారు. గురువారం సాయంత్రం ఆయన ఆస్పత్రికి రాగా, వైద్యులు ప్రత్యేక గదిలో చికిత్స అందిస్తున్నారు. కాగా కేసీఆర్ డెంగీతో బాధ పడుతున్నట్లు వైద్యులు అనుమానిస్తున్నారని సమాచారం. కేసీఆర్ వ్యక్తిగత వైద్యుడు డాక్టర్ ఎం.వి.రావు నేతృత్వంలోని వైద్య బృందం పరీక్షలు నిర్వహించింది. గురువారం రాత్రి కేసీఆర్ ఆసుపత్రిలోనే డాక్టర్ల మిగతా 3వ పేజీలో ▶



సార్ చెప్పేదంతా జ్యోతిష్యమే కదా!

హలో మేడం..

- ఫీజు ఏ గేట్‌వే నుంచి కట్టాలి?
- వెబ్ ఆప్షన్స్‌లో జాగ్రత్తలు చెప్పండి
- ఎప్‌సెట్ కౌన్సెలింగ్‌లో ఎన్నో సందేహాలు
- కాల్ సెంటర్‌కు రోజుకు 600 కాల్స్.. కుప్పలు తెప్పలుగా మెసేజ్‌లు
- నేరుగా క్యాంప్ ఆఫీసుకు వస్తున్న విద్యార్థులు

ఈ ఫైలింగ్ ఎలా?

స్లాట్ బుకింగ్‌కు ఏం కావాలి? • ఎర్రర్ వస్తోంది.. ఏం చేయమంటారు?



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు తికమక పడుతున్నారు. దరఖాస్తు చేసే సమయంలో సవాలక్ష సందేహాలొస్తున్నాయి. దీంతో ఎప్‌సెట్ క్యాంప్ కార్యాలయాన్ని సంప్రదిస్తున్నారు. ఇంజనీరింగ్‌తోపాటు పాలిసెట్, ఇతర సాంకేతిక కోర్సుల కోసం సాంకేతిక విద్యామండలి ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో పాటే ఈ-మెయిల్స్ కూడా స్వీకరిస్తున్నారు. మరోవైపు క్యాంపు కార్యాలయంలో అనుమానాలు నివృత్తి చేసే ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకూ విరామం లేకుండా ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. రోజుకు కనీసం ఆరువందలకు తగ్గకుండా ఫోన్ కాల్స్, వందల కొద్దీ ఈ-మెయిల్స్ అందుతున్నాయి. క్యాంపు కార్యాలయానికీ రోజుకు వంద మంది వరకూ వస్తున్నారు. వీరందరికీ సమాధానం చెప్పేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. ఫోన్‌కాల్స్, మెసేజ్, మెయిల్స్‌కు ఎలా సమాధానం ఇవ్వాలనే అంశాలపై వారికి ముందే శిక్షణ ఇచ్చారు.

ఎన్నో అనుమానాలు

టోల్ ఫ్రీ మొదలు పెట్టిన తొలినాళ్లలో ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌పై ఎక్కువగా ప్రశ్నలు వచ్చాయని క్యాంప్ కార్యాలయ అధికారులు తెలిపారు. షెడ్యూల్ విడుదలైన తర్వాత స్లాట్ బుకింగ్, ఫీజు చెల్లింపు, కౌన్సెలింగ్‌కు సంబంధించిన విధివిధానాలపై ప్రశ్నలు వస్తున్నాయి. కొంతమంది అప్లికేషన్లు నింపడంపైనా మిగతా 3వ పేజీలో ▶



ఇంటర్ బోర్డ్ ఎత్తేద్దామా?

- టెన్త్, ఇంటర్... రెండూ ఎందుకు?
- టెన్త్ పాసై ఇంటర్ తప్పుతున్నారు
- జాతీయ స్థాయిలో 12 వరకు ఒకే విద్య
- ఇదే పద్ధతి రాష్ట్రాల్లో పాటిస్తే మేలు
- రాష్ట్రాలకు కేంద్ర విద్యాశాఖ సూచన

సాక్షి, హైదరాబాద్: పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను ఒకే గొడుగు కిందకు తేవాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే దీన్ని అమలు చేయాలని ప్రతిపాదించింది. ఇంటర్ బోర్డ్‌ను ఎత్తివేయాలనే ప్రతిపాదనను రాష్ట్రాల ముందు ఉంచింది. తాజాగా ఢిల్లీలో రాష్ట్ర అధికారులతో కేంద్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు సమావేశమై ఈ అంశంపై చర్చించారు. జాతీయ విద్యా విధానం మిగతా 3వ పేజీలో ▶

పదోన్నతుల గరిష్ట వయోపరిమితి 50 ఏళ్లకు పెంపు..

అంగన్‌వాడీ హెల్పర్లకు శుభవార్త
ఫైలుపై మంత్రి సీతక్క సంతకం
ఒకట్రెండు రోజుల్లో ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీల్లో పనిచేస్తున్న హెల్పర్ల పదోన్నతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హెల్పర్ నుంచి టీచర్‌గా పదోన్నతి పొందేందుకు సీనియర్లకు అవకాశం కల్పించింది. ప్రస్తుతం 45 ఏళ్ల వయసు వరకు హెల్పర్లకు పదోన్నతి కల్పిస్తున్నారు. దీంతో 45 ఏళ్లు దాటిన వారు.. అర్హత ఉన్నా పదోన్నతి లేకుండా ఉద్యోగ విరమణ చేయాల్సి వస్తోంది. ఈ అంశాన్ని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సంఘాల ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం.. పదోన్నతి గరిష్ట వయోపరిమితిని 50 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన ఫైలుపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. తాజా నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 4322 మంది హెల్పర్లు.. టీచర్లుగా పదోన్నతి పొందే అవకాశం లభించింది. వయోపరిమితి పెంపు ఉత్తర్వులు అతి త్వరలో వెలువడనున్నాయి.

త్వరలో జీపీవోల నియామకం

రెవెన్యూ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఎంపికైన గ్రామ పరిపాలనాధికారుల(జీపీవో)కు త్వరలో నియామక పత్రాలు అందజేసి విధుల్లోకి తీసుకోనున్నారని రెవెన్యూ జేఏసీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి వెల్లడించారు. జీపీవోల నియామక పరీక్ష రాసి అర్హత సాధించిన 3,454 మందిని మొదటి విడతలో నియమిస్తారని తెలిపారు. రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి, సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్.. గురువారం సచివాలయంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో 10,954 గ్రామాలుండగా, ప్రస్తుతం 3,454 మంది జీపీవోలు మాత్రమే ఎంపికయ్యారని గుర్తు చేశారు. మిగిలిన పోస్టుల భర్తీకి ఆసక్తి కలిగిన మాజీ వీఆర్ఏలు, వీఆర్వోలు.. మరోసారి జీపీవో అర్హత పరీక్ష రాసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. 61 ఏళ్లు దాటిన వీఆర్ఏల వారసులకు సైతం జీపీవోలుగా అవకాశం కల్పించాలని లచ్చిరెడ్డి విజ్ఞప్తి చేశారు. మిగిలిన పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. మృతి చెందిన వీఆర్ఏల పిల్లలతో కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఇతర జిల్లాలకు పంపిన వీఆర్ఏలను సొంత జిల్లాలకు బదిలీ చేయాలని సూచించారు. కాగా, తన విజ్ఞప్తులపై లోకేశ్ కుమార్ సానుకూలంగా స్పందించారని లచ్చిరెడ్డి తెలిపారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చించి త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. పని ఒత్తిడిని బట్టి.. కార్యాలయాల్లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్లతో కూడా భూభారతి సదస్సుల దరఖాస్తుల విచారణ జరిపేందుకు జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు ఇస్తామని తెలిపారన్నారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, మల్లేష్, రాంబాబు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ సేవలు పొడిగింపు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార ప్రజా సంబంధాల శాఖలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న 150 మంది ఉద్యోగులను మరో ఏడాది పాటు పొడిగించారు. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరి సేవల కొనసాగింపు కోసం.. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలతో కొత్త ఒప్పందాలు చేసుకోవాలని ఆదేశించారు.

పైరసీ.. సినిమా చూపిస్తోంది!

సినిమా పైరసీ వల్ల తెలుగు చిత్ర పరిశ్రమకు గత ఏడాది రూ.3,700 కోట్ల నష్టం వాటిల్లిందని తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్లడించింది. ఒక్క తెలుగు సినీ పరిశ్రమకే ఈ స్థాయిలో నష్టం వాటిల్లితే.. మరి దేశవ్యాప్తంగా ఇతర భాషల చిత్రాల సంగతేంటి? పైరసీ నష్టాల నుండి బయటపడేందుకు చిత్ర నిర్మాతలు బీమా రక్షణను కోరుతున్నారు. బీమా సంస్థలు మాత్రం.. నష్టాలను లెక్కించడం, నిరూపించడం కష్టమంటూ బీమా కవరేజ్ ఇవ్వడానికి ఇష్టపడడం లేదు.


- సాక్షి, స్పెషల్ డెస్క్



పుష్ప–2, కల్కి 2898 ఏడీ, గేమ్ ఛేంజర్, తండేల్, సింగిల్.. మొన్నటికి మొన్న కన్నప్ప.. ఇలా చెప్పుకుంటూ పోతే పైరసీకి గురైన సినిమాల జాబితా పెద్దదే. ఈ ఏడాది మార్చిలో విడుదలైన సల్మాన్ ఖాన్ నటించిన సికందర్ చిత్రం లీక్ కావడంతో నిర్మాత రూ.91 కోట్ల నష్టాన్ని చవిచూశారన్న వార్తలు గుప్పుమన్నాయి. చిత్ర పరిశ్రమను పైరసీ భయం వెంటాడుతోంది. ప్రధానంగా పెద్ద బడ్జెట్ చిత్రాల విషయంలో నిర్మాతలు ఆందోళనగా ఉన్నారు. పైరసీ సంబంధ నష్టాల నుండి బయటపడేందుకు చిత్ర నిర్మాతలు బీమా రక్షణను కోరుతున్నారు. అయితే కవరేజ్ విషయంలో బీమా సంస్థలు వెనుకాడుతున్నాయని సినీ పరిశ్రమ చెబుతోంది.

వ్యవస్థాగత మార్పులతో..: బీమా కవరేజ్‌పై ఆధారపడటం కంటే వ్యవస్థాగత మార్పుల ద్వారా పైరసీని ఎదుర్కోవాలని కొందరు నిర్మాతలు భావిస్తున్నారు. పైరసీ కవర్‌తో నష్టాలను తిరిగి పొందే బదులు కఠిన చట్టాలను తీసుకురావడం ద్వారా పైరసీని ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నది వారి ఆలోచన. మరికొందరు మాత్రం పైరసీ కవర్‌తో నష్టం కొంతైనా పూడ్చుకోవచ్చని భావిస్తున్నారు. నిధుల సవాళ్లు ఉన్న సమయంలో పైరసీ కవర్ కోసం అదనపు ఖర్చు అనేది నిర్మాతలకు భారమయ్యే వ్యవహారమే. సినీ రంగానికి 'పరిశ్రమ' హోదా ఇవ్వడం వల్ల ఈ సమస్యలు తొలగిపోతాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలా మంది చిత్ర నిర్మాతలు పైరసీ ముప్పును పరిష్కరించడానికి ప్రత్యేక బీమా ఉత్పత్తుల కంటే ప్రధానంగా యాంటీ–పైరసీ అమలుపై ఆధారపడుతున్నారు. అంటే కాపీరైట్ కలిగిన కంటెంట్‌ను అనధికారికంగా వినియోగం, పంపిణీని అడ్డుకోవడానికి వ్యూహాలు, చర్యలను అమలు చేస్తున్నారు.

రెండు ప్రధాన బీమాలు..: మన చలన చిత్ర పరిశ్రమలో ప్రధానంగా రెండు బీమాలు ఉన్నాయి. వీటిలో ఒకటి చిత్ర నిర్మాణం కోసం కాగా, మరొకటి పంపిణీ కోసం. నిర్మాణంలో ఆలస్యం; తారాగణం, సిబ్బంది అనారోగ్యం; పరికరాల నష్టం, ప్రొఫెషనల్ సేవల్లో లోపాలు తప్పులు లేదా నిర్లక్ష్యం కారణంగా క్లయింట్‌కు కలిగే ఆర్థిక నష్టాలకు 'చలనచిత్ర నిర్మాణ బీమా' కవరేజీని అందిస్తోంది. ఫిల్మ్ ప్రింట్లు, డిజిటల్ మాస్టర్స్ నష్టం, థియేటర్లలో విడుదల జాప్యం, వ్యాపార అంతరాయాలు, విడుదలకు ముందు లేదా డిజిటల్ విడుదల ప్రారంభ దశలలో లీక్ లేదా పైరసీ నుండి ఉత్పన్నమయ్యే నష్టాల నుండి 'చలనచిత్ర పంపిణీ బీమా' రక్షిస్తుంది.



పైరేటెడ్ మూలాల నుండి..


అధిక బడ్జెట్‌తో నిర్మాణాలు చేపట్టే స్టూడియోలు పైరసీ కవర్ కోసం బీమా సంస్థలను సంప్రదిస్తున్నాయి. సినిమా విడుదలకు ముందే కంటెంట్ లీక్ అవుతోందనే భయం నిర్మాతలు, నిర్మాణ సంస్థల్లో పెరుగుతోందని బీమా కంపెనీ 'అలయన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్' చెబుతోంది. 'మీడియా పార్ట్‌నర్స్ ఆసియా' ఇటీవలి నివేదిక ప్రకారం.. పైరసీ అదుపు చేయకపోతే భారత్‌లో డిజిటల్ వీడియో పరిశ్రమకు ఆదాయ నష్టాలు ప్రస్తుత రూ.10,260 కోట్ల నుంచి 2029 నాటికి రెండింతలై రూ.20,520 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. కరోనా మహమ్మారి తర్వాత సబ్‌స్క్రిప్షన్ ఆదాయంలో 150 శాతం పెరుగుదల ఉన్నప్పటికీ.. దేశంలోని 51 శాతం మీడియా వినియోగదారులు పైరేటెడ్ మూలాల నుండి కంటెంట్‌ను వినియోగిస్తున్నారని 'ఈవై–ఐఏఎంఏఐ' రిపోర్ట్ వెల్లడించింది.

బీమా కంపెనీలతో చర్చలు..

ఈ నష్టం ఆదాయంపై ప్రభావం చూపడమే కాకుండా డిజిటల్ వీడియో పరిశ్రమ వృద్ధికి ఆటంకం కలిగిస్తోంది. ఉద్యోగ నష్టాలకు దారితీస్తోంది. 'ఆదాయాలపై పైరసీ ప్రభావం చూపుతూనే ఉంది. సినిమా పంపిణీకి బీమాను ఎంచుకునేటప్పుడు.. పైరసీ నష్టాలు, నిరోధక చర్యలకు కూడా కవరేజ్ ఉండాలి' అని నిర్మాతలు అంటున్నారు. సినిమా పైరసీ నుంచి రక్షణ పొందడానికి నిర్మాతలు, బీమా కంపెనీల మధ్య చర్చలు జరుగుతున్నాయి. పైరసీకి కవరేజ్ అత్యావసరం అన్న డిమాండ్ పెరుగుతోంది. బీమా సంస్థలు మాత్రం పైరసీ నష్టాలకు బీమా కవరేజ్ చేయడానికి ఇష్టపడడం లేదు. ఎందుకంటే నష్టాలను లెక్కించడం, నిరూపించడం కష్టం అనేది వాటి వాదన.

తెలంగాణ హైకోర్టుకు కొత్త జడ్జీలు

- నలుగురిని సిఫార్సు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం
- గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతి రావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌ల ఎంపిక
- న్యాయవాదుల కోటా నుంచే వారికి అవకాశం.. అడ్వొకేట్ల హర్షం
- సిఫార్సులన్నీ ఆమోదం పొందితే 33కు చేరనున్న జడ్జీల సంఖ్య



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నలుగురు న్యాయమూర్తులు రానున్నారు. ఈ మేరకు సుప్రీంకోర్టు కొలీజియం మంగళవారం వారి నియామకాల కోసం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. న్యాయవాదులు గౌస్ మీరా మొహినుద్దీన్, సుద్దాల చలపతిరావు, వాకిటి రామకృష్ణారెడ్డి, గాడి ప్రవీణ్‌కుమార్‌లను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులుగా సిఫార్సు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో 26 మంది న్యాయమూర్తులున్నారు. ప్రధాన న్యాయమూర్తిగా సిఫార్సు చేసిన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌తోపాటు జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ కన్నెగంటి లలిత, జస్టిస్ సుమలతలను తెలంగాణకు బదిలీ చేస్తూ గత నెల సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ సుజోయ్‌పాల్‌ను కలకత్తా హైకోర్టుకు బదిలీ చేయాలని కోరింది. కొత్తగా ఎంపికైన వారు నలుగురు, బదిలీపై ఇక్కడికి వచ్చేవారు నలుగురు, ఇక్కడి నుంచి వెళ్లే వారు ఒకరు.. వీరందరి సిఫార్సులకు కేంద్రం ఆమోదం తెలిపితే న్యాయమూర్తుల సంఖ్య 33 (సీజేతో కలిపి)కు పెరగనుంది. ఇంకా 9 ఖాళీలుంటాయి. చాలాకాలం తర్వాత న్యాయవాదుల కోటా నుంచి న్యాయమూర్తులుగా పదోన్నతులు కల్పించడంపట్ల అడ్వొకేట్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త జడ్జీల నేపథ్యాలు ఇవి..

సుద్దాల చలపతిరావు 1971 జూన్ 25న జనగాంలో జన్మించారు. తండ్రి జగన్‌మోహన్‌రావు. 1998 మార్చి 26న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. వై.రామారావు వద్ద 1998 నుంచి 2004 వరకు జూనియర్‌గా పనిచేశారు. 2004 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సిటి సివిల్ కోర్టులతోపాటు హైకోర్టులో సివిల్, క్రిమినల్ సహా అన్ని విభాగాల కేసుల్లో వాదనలు వినిపించారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సెల్‌గా 2022లో నియమితులయ్యారు. ప్రస్తుతం అవే విధులు నిర్వహిస్తున్నారు.

వాకిటి రామకృష్ణారెడ్డి 1970 సెప్టెంబర్ 14న జన్మించారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు స్వగ్రామం. వారిది వ్యవసాయ కుటుంబం. తండ్రి సర్పంచ్‌గా, జెడ్పీటీసీగా సేవలందించారు. తల్లి గృహిణి. అన్న, చెల్లి ఉన్నారు. 1998లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఎ.అనంతసేన్‌రెడ్డి వద్ద జూనియర్‌గా పనిచేశారు. 2005 నుంచి స్వతంత్ర ప్రాక్టీస్ ప్రారంభించారు. రంగారెడ్డి, సికింద్రాబాద్, సిటీ సివిల్ కోర్టుతోపాటు తెలంగాణ, ఏపీ హైకోర్టుల్లో వాదనలు వినిపించారు. రాజ్యాంగ, సివిల్, క్రిమినల్, రెవెన్యూ, ట్యాక్స్, ఫ్యామిలీ, కంపెనీ కేసుల్లో సమర్థులు. ఇప్పటివరకు 1,000 పిటిషన్లకుపైగా దాఖలు చేశారు. 2016–17లో తొలి తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈడీ స్టాండింగ్ కౌన్సెల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



ఏపీ హైకోర్టుకు గేదెల తుహిన్‌కుమార్‌ను న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది.

గౌస్ మీరా మొహినుద్దీన్ 1969 జూలై 15న జన్మించారు. ఆయన హైదరాబాద్ బాలానగర్‌కు చెందిన వారు. తండ్రి మహమ్మద్ ఇస్మాయిల్ హెచ్ఎంటీ మేనేజర్‌గా పనిచేశారు. వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని నెల్లూరు వీఆర్ న్యాయ కళాశాల నుంచి న్యాయ విద్య పూర్తి చేశారు. ఉస్మానియా వర్సిటీలో ఎల్ఎల్ఎం చదివారు. 1993 మార్చి 17న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఉమ్మడి బార్ కౌన్సిల్, తెలంగాణ బార్ కౌన్సిల్‌కు స్టాండింగ్ కౌన్సిల్‌గా విధులు నిర్వర్తించారు. సివిల్, రాజ్యాంగంతోపాటు పలు విభాగాల్లో సమర్థ వాదనలు వినిపించారు.

గాడి ప్రవీణ్‌కుమార్ 1971 ఆగస్టు 28న జన్మించారు. ఆయన స్వస్థలం నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్. తండ్రి జగన్మోహన్‌రావు. కాకతీయ వర్సిటీ నుంచి ఎల్ఎల్‌బీ.. ఓయూలో ఎంఏ, ఎల్ఎల్ఎం చదివారు. 1998 నవంబర్ 12న న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. హైకోర్టు, అడ్మినిస్ట్రేటివ్, ట్రిబ్యునల్స్, లేబర్ కోర్టులో పలు కేసులు వాదించారు. రాజ్యాంగ, సర్వీస్ మ్యాటర్స్, లేబర్ లా, క్రిమినల్ లా.. పలు విభాగాల్లో నిష్ణాతులు. ప్రస్తుతం హైకోర్టులో డిప్యూటీ సొలిసిటర్ జనరల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

బొగ్గు గనుల ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంచాలి: కిషన్‌రెడ్డి

కన్హా ఆశ్రమంతో సింగరేణి ఎంవోయూ



కిషన్‌రెడ్డి సమక్షంలో ఒప్పందం చేసుకుంటున్న సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, హార్ట్‌ఫుల్‌నెస్ డైరెక్టర్ సంజయ్ సెహగల్

సాక్షి, హైదరాబాద్/నందిగామ: సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో పచ్చదనాన్ని పెద్దఎత్తున చేపట్టాలని సంస్థ అధికారులను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కోరారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం కన్హా శాంతివనంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ సహాయ మంత్రి సతీష్‌చంద్ర ఆధ్వర్యంలో కోల్ మైనింగ్, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థలు గురువారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ కార్యక్రమానికి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఒప్పందంలో భాగంగా అటవీ శాఖ ఆదేశాలకు అనుగుణంగా సింగరేణి సంస్థ గనుల ప్రాంతంలో మొక్కలను నాటడానికి, పలు రకాల పర్యావరణహిత చర్యలు చేపట్టడానికి, ప్రముఖ యోగా, పర్యావరణ పరిరక్షణ సంస్థ అయిన హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ (కన్హా ఆశ్రమం) కృషిచేస్తుంది. కిషన్‌రెడ్డి సమక్షంలో సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.బలరామ్, హార్ట్‌ఫుల్‌నెస్ డైరెక్టర్ సంజయ్ సెహగల్ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సింగరేణి ప్రాంతంలో కన్హా ఆశ్రమం ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటుచేసి, పెద్ద ఎత్తున మొక్కలను పెంచడంతో పాటు ఎకో పార్కులను నిర్మించడం, వర్షాధ జ్యాలు, హరిత కంచెల ఏర్పాటు వంటి పర్యావరణహిత చర్యలు చేపట్టనున్నారు. మొత్తం 14,900 హెక్టార్ల విస్తీర్ణంలో సుమారు 7 కోట్ల మొక్కలను నాటి, వాటిని వనాలుగా పెంచబోతోందని సీఎండీ బలరామ్ తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి సతీశ్‌చంద్ర దూబే, బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి రూపేంద్ర బ్రార్, సింగరేణి డైరెక్టర్ గౌతం పాల్గొన్నారు.

ఫోన్‌లో పుతిన్, ట్రంప్ చర్చలు

మాస్కో: ఇరాన్, ఉక్రెయిన్ ఇతర కీలక అంశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చర్చించారు. వీరిద్దరూ గురువారం ఫోన్‌లో మాట్లాడుకున్నారని రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ వెల్లడించింది. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక పుతిన్‌తో మాట్లాడటం ఇది ఆరోసారని వివరించింది. ఇరాన్‌కు సంబంధించిన అన్ని సమస్యలను రాజకీయ, దౌత్య మార్గాల్లోనే పరిష్కరించుకోవాల్సిన అవసరముందని పుతిన్ నొక్కి చెప్పారని క్రెమ్లిన్ తెలిపింది. జూన్ 22న ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలపై అమెరికా భారీ బాంబులు వేయడం తెల్సిందే. అదేవిధంగా, ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని ట్రంప్ కోరగా, ఆ దేశంతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు పుతిన్ తెలిపారని పేర్కొంది. ఉక్రెయిన్ నాటోలో చేరేందుకు ప్రయత్నించడంతో ఆ దేశంలోని రష్యన్ మాట్లాడే వారి కోసమే తమ సేనలను పంపామని పుతిన్ తెలిపారంది. అయితే, ఉక్రెయిన్‌కు అమెరికా సరఫరా చేయకుండా నిలిపేసిన ఆయుధాల గురించిన ప్రస్తావన మాత్రం రాలేదని క్రెమ్లిన్ స్పష్టం చేసింది.

ఉత్తరాఖండ్‌లో విరిగిపడిన కొండచరియలు

40 మంది యాత్రికులను రక్షించిన ఎస్‌డీఆర్ఎఫ్

రుద్రప్రయాగ: ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సోన్‌ప్రయాగ్‌లో కొండచరియలు విరిగిపడ్డాయి. కేదార్‌నాథ్ నుంచి తిరిగి వస్తూ చిక్కుకుపోయిన 40 మంది భక్తులను రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) రక్షించింది. కేదార్‌నాథ్ యాత్ర మార్గంలో కీలకమైన రవాణా కేంద్రమైన సోన్‌ప్రయాగ్ సమీపంలో బుధవారం రాత్రి 10 గంటల సమయంలో అకస్మాత్తుగా కొండచరియలు విరిగిపడ్డాయి. శిథిలాలు పడి రహదారి మూసుకుపోయి రాకపోకలు అసాధ్యం అవడంతో యాత్రికులు చిక్కుకుపోయారు. వేగంగా స్పందించిన ఎస్‌డీడీఆర్ఎఫ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని, సహాయక చర్యలను చేపట్టాయి. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లోనూ అధికారులు శిథిలాల నుంచి యాత్రికులను సురక్షితంగా తరలించారు. భారీ వర్షాలతో కొండ రాష్ట్రమైన ఉమ్టాలోని బద్రిష్ హోటల్ సమీపంలో కొండచరియలు విరిగిపడటంతో బద్రినాథ్ జాతీయ రహదారి మూసుకుపోయింది. అదేవిధంగా, యమునోత్రి జాతీయ రహదారి తీవ్రంగా ప్రభావితమైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సిల్లై బ్యాండ్, ఓజ్రి మధ్య రహదారిలోని కొన్ని భాగాలు కొట్టుకుపోయాయి. అగ్రఖాల్, చంబా, జఖింధర్, దుఘ మందర్ సహా వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చంబా బ్లాక్‌లోని అనేక ప్రాంతాల్లో నీటి సరఫరా వ్యవస్థలు ప్రభావితమయ్యాయి. వరదలతో నిండిన రోడ్లు, మూసుకుపోయిన మార్గాలతో నివాసితులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, స్థానిక పోలీసులు, అటవీ శాఖ సిబ్బందితో సహా బహుళ సంస్థలు యాత్రికులు, నివాసితులకు సహాయం అందిస్తు న్నాయి. అనేక జిల్లాల్లో భారీ వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కొనసాగే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. 'డెహ్రాడూన్, పౌరి గర్హ్వాల్, తెహ్రీ, నైనిటాల్, బాగేశ్వర్ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయి''అని ఐఎండీ అంచనా వేసింది.

సింధుకు వైద్యం బాధ్యత నాదే

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సింధు తల్లి లలితను ఓదారుస్తున్న మంత్రి పొంగులేటి. పక్కన ఎంపీ రఘురాంరెడ్డి

కూసుమంచి: రోడ్డు ప్రమాదంలో గాయపడి దీర్ఘకాలంగా అచేతన స్థితిలో మంచానికే పరిమితమైన సింధు కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ధర్మాతండాకు చెందిన సింధు రెండేళ్ల కిందట రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. అప్పటి నుంచి ఆమె తండ్రి జర్పుల పరశురాం కూతురుకు లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. దాతలు ఇచ్చిన డబ్బులకు తోడు లక్షల్లో అప్పులు అయ్యాయి. ఈ నేపథ్యంలో కూతురుకు వైద్యం చేయించే శక్తిలేక గత ఆదివారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై 'సాక్షి'ప్రధాన సంచికలో 'నా వల్ల కావడం లేదు తల్లీ'శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం కూసుమంచి మండల పర్యటనకు వచ్చిన మంత్రి పొంగులేటి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలసి పరశురాం ఇంటికి వెళ్లారు. మంచంలో అచేతన స్థితిలో ఉన్న సింధును చూసి, ఆమె తల్లి లలితను ఓదార్చారు. సింధు చికిత్స బాధ్య తను తాను స్వీకరిస్తానని, హైదరాబాద్ తీసుకొస్తే ఎంపీతో కలసి ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి ఖర్చంతా భరిస్తానని భరోసా ఇచ్చారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న సీఎం సహాయనిధి నగదు ఇప్పిస్తానని మంత్రి వారికి భరోసా కల్పించారు.

ప్రపంచ దేశాలతోనే పోటీ

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశాలు కల్పిస్తూ ముందుకెళ్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులను కడుపులో పెట్టి చూసుకుంటుంది. ఇక్కడ పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు ఆర్జించొచ్చు.

కొనుగోళ్లలో తెలుగు మహిళల ముందంజ

బంగారు, వజ్రాభరణాల కొనుగోలు విషయంలో ఇతర రాష్ట్రాల మహిళలతో పోలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల మహిళలే ముందుంటారు. ఆ తర్వాతి స్థానంలో తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల మహిళలు ఉంటారు. బంగారు ఆభరణాల తయారీకి మహేశ్వరం అనువైన ప్రదేశం. ఇక్కడ దేశంలోనే అతిపెద్ద యూనిట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయం. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని మహేశ్వరం, ముచ్చర్ల, బేగరి కంచె కేంద్రంగా 30 వేల ఎకరాల్లో భారత ఫ్యూచర్ సిటీని తీర్చి దిద్దబోతున్నాం. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే కాదు వారికి లాభాలు చేకూరేలా ప్రభుత్వం సహకరిస్తుంది..'అని సీఎం హామీ ఇచ్చారు.

తయారీ రంగానికీ హబ్‌గా మార్చేందుకు కృషి: శ్రీధర్‌బాబు

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఐటీ, ఫార్మా రంగాల మాదిరే తయారీ రంగానికీ తెలంగాణను హబ్‌గా మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. తెలంగాణ తయారీ రంగం గ్రాస్ వాల్యూ యాడెడ్ (జీవీఏ) 2022–23లో రూ.1.34 లక్షల కోట్లు ఉండగా, 2023–24లో 9 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్లకు చేరిందని తెలిపారు. తెలంగాణ జీఎస్‌డీపీలో తయారీ రంగం వాటా 19.5 శాతం ఉండగా, జాతీయ స్థాయిలో ఇది 17.7 శాతమే ఉందని చెప్పారు. తెలంగాణ తయారీ రంగ ఎగుమతులు రూ.1.2 లక్షల కోట్ల మార్కు దాటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, ఐటీ, పరిశ్రమల ముఖ్య కార్యదర్శి సంజయ్‌కుమార్, మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఎజెండా ముఖ్యం.. అధికారమే లక్ష్యం

▶ మొదటి పేజీ తరువాయి

విధానాలనే అమలు చేస్తోంది. అందుకే కేవలం ఏడాదిన్నరలోనే ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్.. రెండింటికీ ప్రత్యామ్నాయం బీజేపీ అనే అభిప్రాయం ఇప్పుడు ప్రజల్లో ఉంది. రెండు ప్రభుత్వాలను చూసిన తెలంగాణ ప్రజలు బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నారు. ఈ పరిస్థితికి తగినట్లు బీజేపీ రాష్ట్రానికి సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తుంది. అధికారంలోకి వచ్చేలా కష్టపడతాం.

ఒక్క ఎమ్మెల్యేతో మొదలుపెట్టి..

రాష్ట్రంలో బీజేపీ క్రమంగా బలపడుతోంది. ఒకప్పుడు ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉండేవారు. ఇప్పుడు 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, 8 మంది ఎంపీలు, ఒక రాజ్యసభ సభ్యుడితో బలమైన పార్టీగా ఎదిగింది. గతంలో కేవలం మూడు, నాలుగు శాతం ఓట్లున్న ఈ పార్టీ..గత పార్లమెంటు ఎన్నికల్లో 22 శాతం ఓట్లతో సగం ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తప్పకుండా అధికారంలోకి వస్తామనే ధీమా ఏర్పడింది.

గెలుపు గుర్రాలకే 'స్థానిక' టికెట్లు

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్నాం. జీహెచ్ఎంసీలో పెద్ద సంఖ్యలో సీట్లు వచ్చాయి. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లపై ఉన్న వ్యతిరేకత మాకు కలిసివస్తుంది. త్వరలో వర్క్‌షాప్ నిర్వహిస్తాం. ఎవరెవరికి సీట్లు ఇవ్వాలనే దానిపై చర్చిస్తాం. సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకుంటాం. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తాం. ఇతర పార్టీల నుంచి వచ్చేవాళ్లను చేర్చుకుంటాం. కొత్త నీరు వస్తేనే కదా ప్రవాహం పెరిగేది. టాలెంట్‌కు తగిన పదవులు కూడా ఇస్తాం. పాత, కొత్త నాయకులనే తేడా అస్సలు లేదు.

నిత్యం ప్రజల మధ్యనే ఉంటా..

రాష్ట్ర అధ్యక్షుడిగా క్షేత్రస్థాయి పర్యటనలకే తొలి ప్రాధాన్యత. పార్టీ పరంగా మాకు 38 జిల్లాలున్నాయి. కార్యాలయానికే పరిమితం కాకుండా నిత్యం ప్రజల మధ్యనే ఉంటా. సమస్యలపై ఉద్యమాలు చేపడతా. ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడతా. ఇందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న బీసీ నినాదం ఉత్తమాటే. బీసీ బిల్లు ఇక్కడ రూపొందించి అక్కడ అమలు చేయడమనేది తెలివి తక్కువ చర్య. బిల్లు ఆమోదిస్తే గెజిట్ ఇవ్వాలి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీ బిల్లు తయారు చేసి కేంద్రాన్ని అమలు చేయమన్నది. మా ప్రధానమంత్రి బీసీ వర్గానికి చెందిన వ్యక్తి. ప్రతి ఎన్నికల్లో రిజర్వేషన్ల ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేస్తాం. యువతకు, మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇచ్చే సమయాన్ని బట్టి ఈ నెల 5 లేదా 10వ తేదీన బాధ్యతలు స్వీకరిస్తా.


ట్రంప్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లుకు కాంగ్రెస్ ఆమోదం

వాషింగ్టన్: పన్ను విరామం, వ్యయ కోతలతోపాటు అమెరికా నుంచి అక్రమ వలసదారులను వెనక్కి పంపే కార్యక్రమానికి నిధుల కేటాయించేందుకు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదిత ప్రతిష్టాత్మక 'వన్ బిగ్ బ్యూటిఫుల్' బిల్లు ప్రతినిధుల సభలో నెగ్గింది. స్థానిక కాలమానం ప్రకారం గురువారం ఉదయం ప్రతినిధుల సభలో తీవ్ర ఉత్కంఠ నడుమ ఎట్టకేలకు 218–214 మెజారిటీతో బిల్లు ఆమోదం పొందింది. రిపబ్లికన్ సభ్యుల్లో 218 మంది బిల్లుకు అనుకూలంగా ఓటేశారు. ఇద్దరు రిపబ్లికన్ సభ్యులు థామస్ మసీ, బ్రియాన్ ఫిజ్‌ప్యాట్రిక్ మాత్రమే వ్యతిరేకంగా ఓటేశారు. డెమొక్రటిక్ పార్టీలో 212 మంది సభ్యులంతా బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. ఇప్పటికే ఎగువ సభ(సెనేట్)లో బిల్లు ఆమోదం పొందిన విషయం తెల్సిందే. తాజాగా దిగువసభ(హౌస్ ఆఫ్ రెప్రజెంటేటివ్స్)లోనూ బిల్లుకు ఆమోదముద్ర పడటంతో ఇక తుదిఆమోదంగా దీనిపై అధ్యక్షుడు ట్రంప్ సంతకం చేయనున్నారు. దీంతో బిల్లు చట్టంగా మారుతుంది. నేడు ఈ బిల్లుపై ట్రంప్ సంతకంచేసి ప్రసంగిస్తారని తెలుస్తోంది.

ఎంఎస్ఎంఈల డిజిటల్ వినియోగం

మారుతున్న వినియోగదారుల అభిరుచులు, పుట్టుకొస్తున్న నూతన వ్యాపార విభాగాలు, దేశీయంగానేగాక విదేశాల్లోనూ ఆదాయ అవకాశాలు.. అన్నింటికీ మించి పోటీ ప్రపంచం.. వీటన్నింటి ఫలితంగా ఎంఎస్ఎంఈలు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నాయి. వ్యాపార లక్ష్యాల సాధనకు, అభివృద్ధి చెందుతున్న డిజిటల్ వ్యవస్థకు అనుగుణంగా టెక్నాలజీని సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నాయి. ఇలా వినియోగించడంలో దేశంలో దక్షిణాది అగ్రస్థానంలో ఉంటే.. దక్షిణాదిలో తెలంగాణ దూసుకుపోతోంది. డిజిటలీకరణలో ముందున్న టాప్-5 రంగాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళలే ముందుండటం విశేషం. ప్రముఖ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా ఎంఎస్ఎంఈలపై చేసిన అధ్యయనంలో ఈ ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్



సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) కంపెనీల డిజిటలీకరణ, డిజిటల్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించగలిగే సామర్థ్యంపై టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా 'ఎంఎస్ఎంఈ గ్రోత్ ఇన్‌సైట్స్ స్టడీ 2025' అనే నివేదిక విడుదల చేసింది. ప్రత్యేకంగా డిజిటల్ మెచ్యూరిటీ ఇండెక్స్ (డీఎంఐ) రూపొందించింది. డిజిటల్ టెక్నాలజీ వినియోగ స్థాయిని తెలుసుకునేందుకు వొడాఫోన్ ఐడియా అందుబాటులోకి తెచ్చిన ప్లాట్‌ఫామ్‌లో 16 రంగాలకు చెందిన 2 లక్షలకుపైగా ఎంఎస్ఎంఈలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. డిజిటల్ చానెల్స్ ద్వారా ఎంఎస్ఎంఈలు ఎంత సమర్థవంతంగా వినియోగదారులతో నిమగ్నమయ్యాయి, సేవలందిస్తున్నాయి, అంతర్గత కార్యకలాపాలు, ఉద్యోగుల కనెక్టివిటీ, ప్రధాన వ్యాపార ప్రక్రియలలో ఏ మేరకు డిజిటల్ సాధనాలు వినియోగిస్తున్నాయి వంటి అంశాల ఆధారంగా ఈ సూచికను సిద్ధం చేశారు. దీనిప్రకారం దేశంలో 12 శాతం ఎంఎస్ఎంఈల్లో మాత్రమే పూర్తిగా డిజిటలీకరణ జరిగింది.

అనుభవం ఉన్న వారే..

వ్యాపారవేత్తల సగటు డీఎంఐ 59.8 ఉంది. పరిణతి చెందిన వ్యవస్థాపకులు.. ముఖ్యంగా 40–60 సంవత్సరాల వయస్సు గల వ్యాపారవేత్తలు అధికంగా సాంకేతికతలను అందిపుచ్చుకుంటున్నారు. ఈ వయసు విభాగం డీఎంఐ ఏకంగా 64 నమోదైంది. అనుభవజ్ఞులైన వ్యాపార యజమానుల్లో స్థిరత్వం, అధిక టర్నోవర్ వంటి అంశాలు డిజిటలీకరణకు దోహదం చేస్తున్నాయని నివేదిక చెబుతోంది. 60 ఏళ్లకుపైగా వయసు విభాగంలో డీఎంఐ 56.7, అలాగే 30–40లో 57, చివరగా 30 ఏళ్లలోపు ఉన్న వ్యాపారులకు 57.2గా ఉంది. యువ వ్యవస్థాపకులు ఇప్పటికీ రూ.50 కోట్ల కంటే తక్కువ టర్నోవర్ విభాగంలోనే ఉన్నారు కాబట్టి డిజిటలీకరణకు సంబంధించిన పెట్టుబడి నిర్ణయాలను ఆచితూచి తీసుకుంటున్నారని వివరించింది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. పురుష వ్యాపారవేత్తలతో దాదాపు సమానంగా మహిళల డీఎంఐ ఉంది. పురుషుల డీఎంఐ 57.7 కాగా, మహిళా వ్యాపారవేత్తలది 57.4.

వ్యాపారంతో ముడిపడి..

డిజిటల్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించగలిగే సామర్థ్యం.. కంపెనీల టర్నోవర్‌తో ముడిపడి ఉన్నట్టు ఈ అధ్యయనంలో తేలింది. రూ.10 కోట్ల కంటే తక్కువ వార్షిక ఆదాయం గల ఎంఎస్ఎంఈల సగటు డీఎంఐ 56.3. రూ.10–50 కోట్ల టర్నోవర్‌లో 56.4 ఉంటే.. రూ.50–100 కోట్లలో 63.8, అలాగే రూ.100 కోట్ల కంటే ఎక్కువ టర్నోవర్ కలిగిన కంపెనీల డీఎంఐ ఏకంగా 72.9 ఉంది. అంటే అధిక ఆదాయం కలిగిన ఎంఎస్ఎంఈలు టెక్నాలజీపై ఎక్కువ ఖర్చు చేస్తున్నాయన్నమాట.

రంగాల వారీగా చూస్తే..

రంగం	డీఎంఐ
ఫైనాన్షియల్ సర్వీసెస్	66
రవాణా	62
రిటైల్	62
యాత్రలు–ఆతిథ్యం	60
ఆరోగ్యం	60
సరుకు రవాణా	60
ఎనర్జీ–యుటిలిటీస్	60
తయారీ	60

డిజిటలీకరణ దిశగా..

- పూర్తి స్థాయిలో డిజిటలీకరణకు నిధులను పెంచాలని **65%** కంపెనీలు భావిస్తున్నాయి.
- **81%** కంపెనీలు 2025లో తమ క్లౌడ్ వ్యయాలను పెంచాలని యోచిస్తున్నాయి.
- **83%** కంపెనీలు వచ్చే మూడేళ్లలో సైబర్ భద్రతను కీలక సాంకేతిక పరిజ్ఞానంగా గుర్తించాయి.
- సైబర్ దాడులను ఎదుర్కొన్నట్టు **39%** కంపెనీలు వెల్లడించాయి.

దేశాభివృద్ధిలో ఎంఎస్ఎంఈలు


దేశంలో ప్రస్తుతం ఉన్న ఎంఎస్ఎంఈల సంఖ్య సుమారు 6 కోట్లు	వీటిద్వారా వచ్చిన ఉద్యోగాలు సుమారు 25 కోట్లు	వ్యవసాయం తరువాత అత్యధిక ఉద్యోగులు/కార్మికులు ఉన్న రంగం
జీడీపీలో వీటి వాటా 30%	దేశ ఎగుమతుల్లో 46% ఈ రంగానిదే	




తెలంగాణ టాప్

దేశంలో డిజిటల్ మెచ్యూరిటీ ఇండెక్స్ 2023లో 56.6 నమోదైతే.. ప్రస్తుత సంవత్సరంలో కాస్త మెరుగుపడి 58 పాయింట్లకు చేరుకుంది. ప్రాంతాల వారీగా 62.9 పాయింట్లతో దక్షిణాది ముందంజలో నిలిచింది. పశ్చిమ భారతం 57.4, తూర్పు 57.1, ఉత్తరాది 55.8 పాయింట్లను సొంతం చేసుకున్నాయి. దక్షిణాదిన తెలంగాణ టాప్‌లో నిలిచి 71.2 స్కోర్ సాధించింది. ప్రధానంగా ఐటీ, ఐటీఈఎస్ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందడమే ఈ బలమైన పనితీరుకు కారణం. ప్రముఖ టెక్ సంస్థలు, అభివృద్ధి చెందుతున్న స్టార్టప్స్‌తో చురుకైన పర్యావరణ వ్యవస్థ డిజిటల్ వాతావరణాన్ని అలవాటు చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాయి. కేరళ 63.7, మహారాష్ట్ర 59.2 స్కోర్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

'డిజిటల్ మెచ్యూరిటీ ఇండెక్స్'లో తెలంగాణ హవా	
టెక్ వినియోగంలో 40–60 ఏళ్ల వ్యాపారులు టాప్	5 కీలక రంగాల్లో టాప్‌లో మహిళా వ్యాపారులు
'ఎంఎస్ఎంఈ గ్రోత్ ఇన్‌సైట్స్ స్టడీ 2025'లో వెల్లడి	





క్లుప్తంగా...

దివంగత రోశయ్యకు అరుదైన గౌరవం

- ఏటా అధికారికంగా జయంతి వేడుకలు



సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం దివంగత కొణిజేటి రోశయ్య కు రేవంత్‌రెడ్డి సర్కార్ అరుదైన గౌరవాన్ని ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో ఇకపై ఏటా అధికారికంగా జూలై 4న కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను నిర్వహించాలని నిర్ణయించింది. ప్రభుత్వం ఈ బాధ్యతను పర్యాటక, సాంస్కృతిక శాఖకు అప్పగించింది. అన్ని జిల్లా కేంద్రాల్లో కలెక్టర్లు పాల్గొని రోశయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా రోశయ్య జయంతిని అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహించనున్నారు.

వివాదరహితుడు రోశయ్య..

ఉమ్మడి ఏపీ మాజీ సీఎం రోశయ్య జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను స్మరించుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు ఆర్థిక శాఖ మంత్రి హోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్య దక్కించుకున్నారన్నారు. రోశయ్య జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని తమ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. 50 ఏళ్ల రాజకీయాల్లో క్రియాశీలంగా ఉన్నా వివాదరహితుడిగా పేరు పొందారని అన్నారు.


కొండపోచమ్మ సాగర్ నుంచి సాగునీరివ్వండి

- రైతు కమిషన్ చైర్మన్‌ను కలిసి కోరిన ఎర్రవల్లి రైతులు

సాక్షి, హైదరాబాద్: మాజీ సీఎం కేసీఆర్ నివాసం ఉంటున్న ఎర్రవల్లి గ్రామానికి చెందిన రైతులు గురువారం హైదరాబాద్‌లో రైతు కమిషన్‌ను కలిశారు. సకాలంలో వర్షాల్లేక వరిసాగు అగమవుతోందని.. అందువల్ల కొండపోచమ్మ సాగర్ నుంచి తమకు నీటిని విడుదల చేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, చెవిటి వెంకన్న, గడుగు గంగాధర్, భవానీ రెడ్డిని కోరారు. వారి సమస్యలు విన్న కోదండరెడ్డి వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అప్పటికప్పుడే నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఉత్తమ్ కొండపోచమ్మ సాగర్ కింద ఉన్న వ్యవసాయ భూములకు నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఎర్రవల్లి రైతులు మంత్రికి ఫోన్ చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీకి హక్కులు వస్తే తెలంగాణకు అన్యాయమే

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్



సాక్షి, హైదరాబాద్: గోదావరి నదీ జలాల్లో ఏపీకి హక్కులు వస్తే తెలంగాణకు అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు, నీళ్లపై దాడి జరుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం పట్ల చంద్రబాబు నాయుడు మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని, చంద్రబాబు శిష్యుడు రేవంత్ రెడ్డి అబద్ధాల్లో పెద్దన్నగా మారారని ఆరోపించారు. తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోలేదని చంద్రబాబు నాయుడు అబద్ధాలు చెపుతున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు దత్తత తీసుకున్న పాలమూరు జిల్లా ప్రాజెక్టులపై ఫిర్యాదు చేశారని, ఆయన మాటలకు, చేతలకు సంబంధం ఉండదని ధ్వజమెత్తారు. తెలంగాణ సమస్యలు, నీళ్ల గురించి కాంగ్రెస్ పార్టీకి అవగాహన లేదన్నారు. ప్రస్తుతం తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపైనే హరీశ్‌రావు మాట్లాడుతున్నారన్నారు.

'అన్నారం' లోపాలకు బాధ్యత మీదే!

- నీటిపారుదల శాఖకు లేఖలో బరాజ్ నిర్మాణ సంస్థ 'అఫ్కాన్స్'
- మీ సూచనల మేరకే బోర్ హోల్‌డ్రిల్లింగ్ నిలుపుదల చేశాం
- మీరిచ్చిన షెడ్యూల్ ప్రకారమే బరాజ్ నిర్వహణ, పర్యవేక్షణ
- డిజైన్ల వైఫల్యంతోనే దిగువన సీసీ బ్లాకులు కొట్టుకుపోయాయి
- నిర్మాణం, నాణ్యతలో లోపాలున్నాయన్న ఎన్డీఎస్ఏ కమిటీ ఆరోపణలు నిరాధారం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన అన్నారం బరాజ్ నిర్మాణం, నాణ్యత నియంత్రణలో తీవ్ర లోపాలున్నట్టు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ తుది నివేదికలో చేసిన ఆరోపణలను బరాజ్ నిర్మాణ సంస్థ 'అఫ్కాన్స్–విజేత–పీఈఎస్ జేవీ' తోసిపుచ్చింది. ఈ ఆరోపణలకు కమిటీ ఆధారాలేవీ చూపలేకపోయిందని పేర్కొంది. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించిన తమపై ఎన్డీఎస్ఏ కమిటీ నిరాధారణ ఆరోపణలు చేసిందని మండిపడింది. ఎన్డీఎస్ఏ కమిటీ నివేదికలో తేల్చిన చాలా వరకు లోపాలకు బాధ్యత నీటిపారుదల శాఖదేనని స్పష్టం చేసింది. నీటిపారుదల శాఖ కఠిన పర్యవేక్షణ కింద ఇచ్చిన డిజైన్లు, కాంట్రాక్టునిబంధనలు, ప్రమాణాల ఆధారంగానే పనులు చేశామని స్పష్టం చేసింది. నీటిపారుదల శాఖ సంతృప్తి చెందే రీతిలో బరాజ్ నిర్మాణం పూర్తి చేసినందునే ఆ మేరకు పనులు పూర్తైనట్టు ఆ శాఖ ధ్రువీకరణ పత్రం జారీ చేసిందని గుర్తుచేసింది. 2021 డిసెంబర్ 16న డిఫెక్ట్ లయబిలిటీ గడువు (డీఎల్‌పీ), 2024 డిసెంబర్ 12న నిర్వహణ, పర్యవేక్షణ గడువులు సైతం పూర్తయ్యాయని తెలిపింది. నిర్మాణం, డీఎల్‌పీ దశల్లో నిర్మాణ లోపాలు, నిర్మాణ సామగ్రి నాణ్యతపై ఆ శాఖ నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పేర్కొంది. ఎన్డీఎస్ఏ కమిటీ తుది నివేదికలోని సిఫారసుల ఆధారంగా బరాజ్ పునరుద్ధరణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలంటూ నీటిపారుదల శాఖ మే 9న రాసిన లేఖకు స్పందనగా 'అఫ్కాన్స్' గత నెల 27న నీటిపారుదలశాఖకు ఈ మేరకు ప్రత్యుత్తరం రాసింది.

బోర్ హోల్స్ ఆపేయాలన్నారు కదా...

మధ్యంతర సిఫారసులకు అనుగుణంగా జియోటెక్నికల్ పరీక్షల కోసం నిర్దేశిత ప్రాంతంలో బోర్ హోల్స్‌ను డ్రిల్ చేయలేదంటూ కమిటీ తుది నివేదికలో చేసిన ఆరోపణలను 'అఫ్కాన్స్' తిరస్కరించింది. బీ–35 వద్ద ఆర్‌సీసీ ర్యాఫ్ట్‌కి 3.35 మీటర్ల వరకు డ్రిల్లింగ్ చేయగానే ఇసుకతోపాటు నీళ్లు వచ్చాయని గుర్తుచేసింది. 'మీ సూచన మేరకు 8 మీటర్ల లోతు వరకు డ్రిల్లింగ్ కొనసాగించాం. నీళ్లతోపాటు ఇసుక ఉబికి రావడం కొనసాగడంతో మీ ఉన్నతాధికారులు, సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ సీఈని సంప్రదించాక బోర్ హోల్స్ డ్రిల్లింగ్‌ను నిలుపుదల చేయాలని క్షేత్రస్థాయి అధికారులు చేసిన సూచన మేరకు పనులు ఆపేశాం. అదే విషయాన్ని మీకు లేఖ ద్వారా తెలియజేశాం' అని 'అఫ్కాన్స్' తెలిపింది. అలాగే 2024 జూన్ 5న నీటిపారుదల శాఖ రాసిన లేఖ ఆధారంగానే తాము కర్టెన్ గ్రౌటింగ్ నిర్వహించామని స్పష్టం చేసింది.

డిజైన్ లోపాలే కారణం..

బరాజ్ నిర్మాణానికి ముందు చేపట్టే పరీక్షలు, అధ్యయనాలను సరిగ్గా నిర్వహించలేదని ఎన్డీఎస్ఏ తప్పుబట్టగా ఈ అంశాలు తమ పరిధిలోకి రావని 'అఫ్కాన్స్' తెలిపింది. అలాగే బరాజ్ దిగువన సీసీ బ్లాకులు కొట్టుకుపోవడానికి డిజైన్ లోపాలే కారణమని.. దీనితోనూ తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. బరాజ్ నుంచి కిందకు ప్రవహించే వరదలోని శక్తితో బరాజ్‌కు నష్టం జరగకుండా డిజైన్లలో తగిన పరిష్కారాన్ని చూపకపోవడంతోనే సీసీ బ్లాకులు కొట్టుకుపోయాయని పేర్కొంటూ 2020 మే 29నే నీటిపారుదల శాఖకు లేఖ రాసిన విషయాన్ని గుర్తుచేసింది. లోపాలను గుర్తించడానికి అనంతర కాలంలో నిర్వహించిన మోడల్ స్టడీస్ సైతం ఇదే అంశాన్ని ధ్రువీకరించగా.. నీటిపారుదల శాఖ సైతం అంగీకరించిందని పేర్కొంది. నీటిపారుదల శాఖ సూచనలు, డిజైన్ల ఆధారంగా మళ్లీ ఆ లోపాలను సరిదిద్దామని తెలిపింది.

సికెంట్ పైల్స్ అసమర్థత అందరికీ తెలిసిందే..

'బరాజ్ పునాదుల కింద నిర్మించిన ఆర్‌సీసీ/పీసీసీ పైల్స్ వ్యాసం, లోతు ఎంత ఉండాలి? ఎక్కడ నిర్మించాలి? అనే అంశాలు మీ పరిధిలోకే వస్తాయి. ఆర్‌సీసీ/పీసీసీ పైల్స్ పీడనాన్ని సమర్థంగా తట్టుకోలేవు. కాలంతోపాటు బలహీనపడుతాయన్నది అందరూ అంగీకరించే వాస్తవం. నిర్మాణంతోపాటు డిఫెక్ట్ లయబిలిటీ గడువు దశల్లో నాణ్యతా లోపాలను మీరు ప్రస్తావించలేదు' అని 'అఫ్కాన్స్' పేర్కొంది.

మీ సూచనల ప్రకారమే నిర్వహణ...

'డిజైన్ లోపాలు, ప్రధానంగా 'క్రాక్ ఓపెన్ కండిషన్' కారణంగానే బరాజ్ దిగువన రక్షణగా ఉన్న సీసీ బ్లాకులు కొట్టుకుపోయాయి. మీరు ఇచ్చిన గేట్ల ఆపరేషన్ షెడ్యూల్ ఆధారంగానే బరాజ్ నిర్వహణ, పర్యవేక్షణ మాన్యువల్‌ను తయారు చేసి సమర్పించాం. రోజువారీ నిర్వహణ చర్యలను మీతో కలిసి సంయుక్తంగా రిజిస్టర్‌లో నమోదు చేశాం' అని అఫ్కాన్స్ స్పష్టం చేసింది.

పెండింగ్ బిల్లులకు పరిష్కారం

- మంత్రి లక్ష్మణ్ హామీ



సాక్షి, హైదరాబాద్: గిరిజన సంక్షేమ శాఖలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను సత్వరమే పరిష్కరిస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ స్పష్టం చేశారు. ఈ పెండింగ్ బిల్లులకు సంబంధించిన సమాచారాన్ని తనకు ఇవ్వాలని, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి వేగంగా పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. గురువారం సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. శాఖాపరంగా చేపడుతున్న కార్యక్రమాలు, కొనసాగుతున్న పథకాల పురోగతిని పరిశీలించారు. అతి త్వరలో విభాగాల వారీగా సమావేశాలు నిర్వహిస్తానన్నారు. గిరిజన గురుకుల సొసైటీ పరిధిలో కార్యక్రమాల అమలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ విభాగంలో నిర్వహిస్తున్న పనులను సమీక్షించారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు వి.సర్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

హలో మేడం.. ఈ ఫైలింగ్ ఎలా?

▶ మొదటి పేజీ తరువాయి

ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొరపాటున ఏదైనా డేటా తప్పుగా ఇస్తే సరిచేస్తారా అని ముందే ప్రశ్నిస్తున్నారు. కుల ధ్రువీకరణ, ఆదాయ పత్రాలను ఎలా పొందాలని, ఎప్పుడు తీసుకున్నవి చెల్లుతాయని అడుగుతున్నారు. ప్రతీ దశలోనూ స్లాట్ బుక్ చేసుకోవాలా అనే ప్రశ్నలు వేస్తున్నారు. ధ్రువపత్రాల పరిశీలనకు ఎక్కడకు వెళ్లాలి? ఏఏ సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని కొంతమంది అడుగుతున్నారు. స్లాట్ బుకింగ్, ఆప్షన్ల సమయంలో ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలూ కాల్ సెంటర్ ద్వారా తెలుసుకుంటున్నారు. ఆప్షన్లు మొదలు కాకున్నా, ఇంజనీరింగ్ సీట్లు ఎన్ని? ఏ ర్యాంకుకు ఎక్కడ సీటు వస్తుందని ప్రశ్నిస్తున్నారు. కొంతమంది స్లాట్ బుకింగ్ కోసం ఏ గేట్ వే ద్వారా డబ్బులు చెల్లించాలని, మరికొంతమంది గేట్ వే ద్వారా చెల్లిస్తుంటే ఎర్రర్ వస్తుందని చెబుతున్నారు. ఇలాంటి ప్రశ్నలన్నింటికీ క్యాంపు కార్యాలయం సిబ్బంది ఓపికగా సమాధానం ఇస్తున్నారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచీ ఫోన్లు వస్తున్నాయి. ఈ ఏడాది నుంచి నాన్–లోకల్ తీసివేయడంతో తాము ఏ కేటగిరీ కింద సీటు పొందొచ్చని ప్రశ్నిస్తున్నారు.

కాల్ సెంటర్‌కు మంచి స్పందన



వందల సంఖ్యలో ఫోన్లు వస్తున్నాయి. కౌన్సెలింగ్‌కు వెళ్లే విద్యార్థి ప్రతీ సందేహాన్ని నివృత్తి చేసుకుంటున్నారు. ఇది మంచి స్పందనే. సాంకేతిక విద్య వెబ్‌లోకి వెళ్తే ఎప్‌సెట్ కౌన్సెలింగ్ వివరాలు తెలుస్తాయి. అంతేకాదు, గత ఏడాది ఏ ర్యాంకుకు ఎక్కడ సీటు వచ్చాయనేది అందుబాటులో ఉంచాం. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ టోల్ ఫ్రీ నంబరులో సిబ్బంది అందుబాటులో ఉంటారు. 7660009768– 79 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

– శ్రీనివాస్, ఎప్‌సెట్ క్యాంప్ ఆఫీసర్

ప్రతీ సందేహానికి సమాధానం



విద్యార్థులు ఫోన్‌లో కౌన్సెలింగ్‌కు సంబంధించిన అనేక సందేహాలు అడుగుతున్నారు. మేం ఇచ్చే సమాధానాల తర్వాత సంతృప్తి చెందుతున్నారు. కొన్నిసార్లు స్లాట్ బుకింగ్ ఎర్రర్స్ వచ్చినప్పుడు వెంటనే వాటిని నివృత్తి చేస్తున్నాం. తిరిగి లాగిన్ అయ్యేలా చేస్తున్నాం.

– శ్యామల, టోల్ ఫ్రీ నంబర్ సిబ్బంది

మెయిల్స్ అన్నీ పరిశీలిస్తాం



రోజూ వందల్లో మెయిల్స్ వస్తున్నాయి. విద్యార్థులు అడిగే ప్రశ్నల్లో కొన్నింటికీ ఎప్‌సెట్ వెబ్‌సైట్‌లో సమాచారం ఉంటుంది. ఆ లింక్‌ను వారికి పంపుతున్నాం. సాంకేతిక సమస్యలు ఉంటే ఆయా విభాగాలకు పంపి, తక్షణమే పరిష్కరించేలా చేస్తున్నాం.

– నవ్య, ఈ–మెయిల్స్ పరిశీలించే ఉద్యోగి

వైరల్ ఫీవర్‌తో ఆస్పత్రిలో కేసీఆర్

▶ మొదటి పేజీ తరువాయి

పర్యవేక్షణలో ఉంటారని యశోద ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అయితే సాధారణ వైద్య పరీక్షల్లో భాగంగానే కేసీఆర్ ఆసుపత్రిలో చేరినట్లు డాక్టర్లు తెలిపారు.

నిలకడగా కేసీఆర్ ఆరోగ్యం

మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని యశోద ఆసుపత్రి యాజమాన్యం గురువారం రాత్రి విడుదల చేసిన హెల్త్ బులెటిన్ లో వెల్లడించింది. గురువారం సాయంత్రం ఆయనను సోమాజిగూడలోని తమ ఆసుపత్రిలో చేరాల్సిందిగా సలహా ఇచ్చామన్నారు. నీరసంగా ఉందని కేసీఆర్ తెలిపారన్నారు. రక్తంలో అధిక చక్కెర స్థాయిలతో పాటు ఆయన శరీరంలో సోడియం లెవల్స్ పడిపోయినట్టు ప్రాథమిక వైద్య పరీక్షల్లో వెల్లడైందని బులెటిన్‌లో పేర్కొన్నారు. మిగతా అంతా సాధారణ స్థాయిలోనే ఉన్నట్టు యశోద యాజమాన్యం తెలిపింది. ఆయన వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, మందుల ద్వారా మధుమేహాన్ని నియంత్రించడానికి, సోడియం స్థాయిలను పెంచడానికి ప్రయత్నిస్తున్నామని ఆసుపత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఎం.వి.రావు ఆ బులెటిన్‌లో తెలిపారు.

సీఎం రేవంత్ వాకబు

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు ఆరోగ్య పరిస్థితి గురించి సీఎం రేవంత్‌రెడ్డి వాకబు చేశారు. గురువారం కేసీఆర్ అనారోగ్యంతో యశోద ఆసుపత్రిలో చేరిన నేపథ్యంలో అక్కడి డాక్టర్లు, అధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌కు మంచి చికిత్స అందించాలని కోరారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని సీఎం ఆకాంక్షించారు. కాగా, కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరాతీశారు. అమ్మవారి ఆశీర్వాదంతో కేసీఆర్ త్వరగా కోలుకొని దైనందిన కార్యక్రమాల్లో పాల్గొనాలని సంజయ్ ఆకాంక్షించారు.

ఇంటర్ బోర్డ్ ఎత్తేద్దామా?

▶ మొదటి పేజీ తరువాయి

అమలే ఎజెండాగా జరిగిన ఈ సమావేశంలో ఇంటర్, టెన్త్ బోర్డుల విలీనంపై చర్చ జరిగింది. వివిధ రాష్ట్రాల్లోని విద్యా విధానాలు, పరిస్థితులను కేంద్ర అధికారులు వివరించారు. వీటిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రతిపాదనకు సహకరించాలని కోరారు. ఈ చర్చల సారాంశాన్ని రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు సీఎం కార్యాలయానికి గురువారం తెలిపారు. దీనిపై సమగ్ర నివేదిక ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు.

రాష్ట్రాల్లోనూ కేంద్ర విధానం..!

కేంద్ర విద్యా సంస్థల్లో 12వ తరగతి వరకు బోర్డ్ ఒకటే ఉంటుంది. బోధనాంశాలు, నిర్వహణ, నిర్ణయాలు అన్నీ ఒకేరకంగా ఉంటాయి. రాష్ట్రాల్లో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంటుంది. పాఠశాలల్లో పదో తరగతి వరకే బోధన ఉంటుంది. టెన్త్ ఉత్తీర్ణులు ఇంటర్ కాలేజీల్లో చేరాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఇంటర్ బోర్డ్ పరిధిలోకి విద్యార్థి వస్తాడు. కేంద్ర, రాష్ట్ర విద్యా సంస్థల మధ్య ఈ తేడా సరికాదన్నది నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ ఉద్దేశం. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఒకే బోర్డ్ పరిధిలోకి స్కూల్, ఇంటర్ విద్యను తేవాలని కేంద్రం సూచించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రెడిట్స్ విధానం అనుసరిస్తున్న నేపథ్యంలో 12వ తరగతి వరకు ఈ విధంగానే ఉండాలనే ప్రతిపాదన చేస్తోంది. కొన్ని దశాబ్దాల క్రితం కూడా హెచ్ఎస్ఎల్‌సీ ఉండేది. 12వ తరగతి వరకు ఒకటే స్కూల్‌లో బోధన చేసేవారు. ఆ తర్వాత విద్యార్థులు ఉన్నత విద్యకు వెళ్లేవాళ్లు.

డ్రాపౌట్స్ తగ్గించవచ్చా?

ఒకే బోర్డ్ పరిధిలో 12వ తరగతి వరకు ఉండటం వల్ల విద్యార్థుల డ్రాపౌట్స్ తగ్గించవచ్చని అధికారులు అంటున్నారు. రాష్ట్రంలో ఏటా 5 లక్షల మందికిపైగా టెన్త్ పరీక్షల్లో అర్హత సాధిస్తున్నారు. ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాల తర్వాత ఉత్తీర్ణులయ్యేవారు 4 లక్షల లోపే ఉంటున్నారు. వీళ్లలో 3 లక్షల మంది ఉన్నత విద్యకు వెళ్తున్నారు. టెన్త్ నుంచి ఇంటర్‌కు వెళ్లే విద్యార్థులు మధ్యలోనే విద్య మానేస్తున్నారా? లేదా ఇంకేమైనా నేర్చుకుంటున్నారా? అనే సమగ్ర వివరాలు విద్యాశాఖ వద్ద లేవు. ఇటీవల సీఎం సమీక్షలోనూ ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ఒకే క్యాంపస్‌లో 12వ తరగతి వరకు విద్యార్థి కొనసాగితే మధ్యలో మానేసే అవకాశం ఉండదని కేంద్రం భావిస్తోంది. దేశంలో ఎనిమిది రాష్ట్రాల్లోనే టెన్త్, ఇంటర్ బోర్డులు వేర్వేరుగా ఉన్నాయి. ఇందులో తెలుగు రాష్ట్రాలూ ఉన్నాయి. మిగతా రాష్ట్రాల్లో ఇంటర్ బోర్డ్ కాకుండా సెకండరీ గ్రేడ్ విద్యా విధానం అమలు చేస్తున్నారు. దీనివల్ల డ్రాపౌట్స్ తగ్గుతున్నాయని కేంద్ర విద్యా శాఖ రాష్ట్రాలకు తెలిపింది.

నిర్ణయం చెబుతాం

ఒకే బోర్డ్ ఉండాలనే ప్రతిపాదనను కేంద్రం తీసుకొచ్చింది. సమావేశంలో వాళ్లు చెప్పిన అంశాలన్నీ విన్నాం. సాధ్యాసాధ్యాలను ప్రభుత్వానికి వివరిస్తాం. ప్రభుత్వ నిర్ణయాన్ని బట్టి ముందుకెళ్తాం. త్వరలో సమావేశ వివరాలపై ముఖ్యమంత్రికి నివేదిక ఇస్తాం.

– డాక్టర్ నవీన్ నికోలస్, పాఠశాల విద్య డైరెక్టర్.

భూమిని నివాస స్థలంగా చేసి, దానిమధ్య నదులను ఏర్పరచి, అది కదలకుండా దానిపై పర్వతాలను మేకులుగా నాటిన వాడు మరియు రెండు సముద్రాలమధ్య అడ్డుతెరను నిర్మించినవాడు ఆయనే.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 4 జూలై 2025

నీళ్లు నమిలిన క్వాడ్!

అమెరికాలో బుధవారం జరిగిన చతుర్భుజ కూటమి (క్వాడ్) దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం అనుకున్న విధంగానే కశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో మొన్న ఏప్రిల్ 22న ఉగ్రవాదులు దాడిచేసి 26 మందిని పొట్టన బెట్టుకున్న ఉదంతాన్ని తీవ్రంగా ఖండించింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనటంలో సహకరించుకోవటానికి సిద్ధంగా ఉన్నామని ఉమ్మడి ప్రకటన తెలియజేసింది. 'ఇందుకు కారకులైనవారినీ, దాడిలో పాల్గొన్నవారినీ, వారికి ఆర్థికంగా సహకరించినవారినీ ఎలాంటి జాప్యం లేకుండా శిక్షించటానికి ఐక్యరాజ్యసమితి దేశాలన్నీ తోడ్పడాల'ని సూచించింది. క్వాడ్ వంటి కూటములు ఏర్పడటం వెనకుండే ధ్యేయం సంక్షోభ సమయాల్లో సమష్టిగా అడుగు ముందుకేయటం కోసమే. కానీ ఉగ్రవాదులు పాకిస్తాన్ నుంచి వచ్చినట్టు స్పష్టంగా తెలుస్తున్నా ఆ దేశాన్ని వేలెత్తి చూపటానికీ, అటువంటి కార్యకలాపాలు మానుకోవాలని హెచ్చరించటానికీ కూటమిలోని మిగతా మూడు దేశాలూ సిద్ధంగా లేవంటే క్వాడ్ ఆవిర్భావానికి గల ప్రాతిపదికే ప్రశ్నార్థకంగా మిగిలినట్టు లెక్క. పెహల్‌గామ్ ఘటన అనంతరం మన దేశం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడిచేసింది. దానికి ప్రతిగా పాకిస్తాన్ సైన్యం మనపై క్షిపణులతో, డ్రోన్‌లతో దాడికి దిగాక మన దళాలు వాటిని తిప్పికొట్టడంతోపాటు అక్కడి వైమానిక స్థావరాలను ధ్వంసం చేశాయి. ఇరు దేశాల మధ్యా ఇది పూర్తి స్థాయి యుద్ధంగా పరిణమించే సూచనలు కనబడ్డాయి. కారణాలేమైతేనేం ...నాలుగు రోజుల అనంతరం కాల్పుల విరమణకు ఇరు దేశాలూ అంగీకరించాయి. ప్రపంచ దేశాలన్నీ ఈ పరిణామాలను ఎంతో ఆందోళనతో గమనించాయి. కానీ ఉమ్మడి ప్రకటన పాక్ పేరెత్తి ఖండించకుండా మర్యాదపూర్వకంగా, లౌక్యంగా మాట్లాడితే ఒరిగేదేమిటి? క్వాడ్ ఈనాటిది కాదు. పద్దెనిమిదేళ్ల క్రితం జపాన్ ద్వారా మన దేశాన్ని ఒప్పించి ఈ కూటమి ఏర్పాటుకు నాంది పలికింది అమెరికాయే. 2007లో కూటమి ఏర్పాటుపై చర్చించటానికి నాలుగు దేశాలూ సమావేశమైనప్పుడే చైనా ఉరిమింది. తనకు వ్యతిరేకంగానే ఈ కూటమి ఏర్పడుతున్నదంటూ నిష్ఠూరానికి పోయింది. ఏడాది గడవకముందే జపాన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడి కూటమి నుంచి తప్పుకొంటున్నట్టు ప్రకటించింది. 2008లో ప్రభుత్వం మారి ఆస్ట్రేలియా సైతం నిష్క్రమిస్తున్నట్టు తెలియజేసింది.

ఇలాంటి పరిస్థితుల్లో 2017లో తిరిగి క్వాడ్‌కు జీవం పోసింది అప్పటి ట్రంప్ ప్రభుత్వమే. అప్పటికల్లా దక్షిణ చైనా, తూర్పు చైనా సముద్ర జలాల్లో చైనా కార్యకలాపాలు పెరిగాయి. 'అన్నీ నేనే... అంతా నాదే' అంటూ పగడాల దిబ్బలు, ఇసుక మేటలు చైనా తన ఖాతాలో వేసుకుంది. అంతటితో ఊరుకోక స్ప్రాట్లీ దీవుల చుట్టూ ఏడు కృత్రిమ దీవుల నిర్మాణం ప్రారంభించింది. ఇది జపాన్‌తో పాటు ఆస్ట్రేలియానూ... ఆ రెండు దేశాలకూ అన్ని విధాలా అండగా ఉంటున్న అమెరికానూ చికాకు పెట్టిన పర్యవసానంగానే క్వాడ్ మళ్లీ పురుడు పోసుకుంది. సారాంశంలో ఇది అమెరికా, చైనాల మధ్య జరిగే ఆధిపత్య పోరులో భాగంగా వచ్చింది. అందులో మనల్ని భాగస్వాముల్ని చేసి తన వివాదాన్ని మనకు కూడా అంటించిన అమెరికా మనకు సమస్య వచ్చినప్పుడు మాత్రం మనవైపుండదని పెహల్‌గామ్ రుజువు చేసింది. మరి ఇలాంటి కూటములు పెట్టి ప్రయోజనమేమిటి? విదేశాంగ శాఖ మాజీ కార్యదర్శి కన్వల్ సిబల్ అన్నట్టు పాకిస్తాన్‌తో మిగిలిన మూడు సభ్య దేశాలకూ, ముఖ్యంగా అమెరికాకూ స్నేహ సంబంధాలుండటం వల్ల ఉమ్మడి ప్రకటనలో నేరుగా దాన్ని ప్రస్తావించటానికి మొహమాటపడి ఉండొచ్చు. మరి అదే పరిస్థితి మనకు ఉండదా? మనకూ, పాకిస్తాన్‌కూ వున్న వైషమ్యాలపై క్వాడ్ పెట్టేనాటికే మిగిలిన మూడు దేశాలకూ అవగాహన ఉండాలి. మరి ఎందుకు కలుపుకొన్నట్టు? ఇలాంటి పరిస్థితి తలెత్తగలదని ఆనాడు తెలియదా?

భూగోళంలో ఏమూల ఉగ్రవాదం ఉన్నా దాన్ని నిర్మూలించేదాకా వదలబోమని, దానిపట్ల దయాదాక్షిణ్యాలుండబోవని 2001లో తాను చేసిన శపథం అమెరికాకు గుర్తుందా? క్వాడ్ కూటమి సమావేశానికి ముందు మన విదేశాంగ మంత్రి జైశంకర్ మూడు దేశాల విదేశాంగ మంత్రులతో విడివిడిగా భేటీ అయ్యారు. పెహల్‌గామ్, తదనంతర పరిణామాలపై వారితో చర్చించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్తాన్ తీరును వివరించారు. బహుశా దాని పర్యవసానంగా కనీసం పెహల్‌గామ్‌ను ప్రకటనలో ప్రస్తావించి చర్య తీసుకోవాలన్న డిమాండైనా చేశారు. లేకుంటే దానికి కూడా దిక్కు లేకపోయేదేమో! పాకిస్తాన్ ఎన్ని తప్పుడు పనులకు పాల్పడుతున్నా అమెరికాకు ఆ దేశమంటే మోజు. 'రెండు దేశాలనూ బెదిరించి యుద్ధం ఆపాన'ని గొప్పలు పోయిన ట్రంప్, ఆ తర్వాత వారం గడవకుండా ఆ దేశ ఆర్మీ చీఫ్‌తో భేటీ అయి పొగడ్తలతో ముంచెత్తారు. చైనాతో మనకు సరిహద్దు వివాదాలున్న సంగతి నిజమే. ఆ విషయంలో మన దేశం రాజీ పడకుండా చర్చలు సాగిస్తోంది. దురాక్రమణకు ప్రయత్నించినప్పుడల్లా ఎదుర్కొంటున్నది. క్వాడ్ ఉనికిలోకి రాకముందునుంచీ అది కొనసాగుతోంది. పరస్పరం సహకరించుకోవటానికీ, ఎదగటానికీ కూటములు అవసరం. అధునాతన సాంకేతికతల్లో తోడ్పడే అత్యంత కీలకమైన ఖనిజాల, ఇతర వనరుల సరఫరాపై చైనా ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఎవరిపైనా ఆధారపడకుండా ఎదిగేందుకు, సరఫరాలకు అంతరాయం ఏర్పడకుండా చూసేందుకూ సమష్టిగా కృషి చేయాలని క్వాడ్ తీర్మానించటం హర్షించదగ్గదే. ఈ ఏడాది చివరిలో క్వాడ్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు మన దేశంలో జరుగుతున్న నేపథ్యంలో కూటమి భాగస్వాముల్లో మరింత సదవగాహన, సమన్వయం అవసరమని... కీలక సమయాల్లో నిర్మొహమాటంగా ఉండటం ముఖ్యమని తెలుసుకుంటే మంచిది.

'అణు వివక్ష' అంతమయ్యేనా?

విశ్లేషణ


దినేశ్ సి. శర్మ

భారత అణు కేంద్రాలు ఏపాటి సురక్షితమైనవి? చెర్నోబిల్ అణు కేంద్ర ప్రమాదం (1986) తర్వాత భారత్ అణుశక్తి సంస్థ అధిపతికి ఈ ప్రశ్న ఎదురైంది. ''మన అణు కేంద్రాలు ఎంత సురక్షితమైనవంటే వాటిని ఒక క్షిపణి తాకినా, విమానం వాటిపై కూలినా అవి చెక్కుచెదరవు'' అని ఆయన జవాబిచ్చారు. అణు విద్యుత్ కేంద్రాన్ని లేదా తత్సంబంధిత సదుపాయాలను నెలకొల్పేటప్పుడు యుద్ధంతో సహా ఎటువంటి విపత్తు సంభవించినా తట్టుకుని నిలబడేటట్లు అణు ఇంజనీర్లు ప్లాన్ చేస్తారు. ఏ అణు సదుపాయాన్ని ఏర్పాటు చేసేటప్పుడైనా దాని భద్రతకు ప్రధానంగా పూచీ వహించే అంశం ఏదైనా ఉందీ అంటే అది దానిని ఎక్కడ నెలకొల్పుతున్నారో ఆ భౌగోళిక ప్రాంతమే. భౌగోళిక సుస్థిరతతోపాటు జనావాసాలకు దూరంగా ఉండటం ముఖ్యం. సాధారణంగా అటువంటి సదుపాయాలు వ్యూహాత్మక ప్రయోజనాల రీత్యా అంతర్జాతీయ సరిహద్దులకు దూరంగా ఉంటాయి.

అణుదాడులు బాధ్యతారాహిత్యం

ఇరాన్‌లోని ఫర్డో, నతాంజ్, ఇస్ఫహాన్‌లను లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ ఇటీవల దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఫర్డో యురేనియం శుద్ధి సదుపాయాన్ని ఇరాన్ కేంద్ర ప్రాంతంలో పర్వతాల లోపల లోతున నిర్మించారు. యురేనియం శుద్ధి కేంద్రాలు, ఇంధన కడ్డీల తయారీ యూనిట్లు, విద్యుదుత్పాదన కేంద్రాలు, వ్యర్థాలను భద్రపరచే ప్రదేశాలు వంటి అణు సదుపాయాల భద్రత... అంతర్జాతీయ సమాజానికి ఎప్పుడూ ఆందోళనకర అంశంగానే ఉంటూ వస్తోంది. యాదృచ్ఛికంగానైనా లేదా ఉద్దేశపూర్వకంగానైనా ఎలాంటి ప్రమాదం సంభవించినా అది అణు ధార్మికత విడుదలకు కారణమై అటు మానవాళికి, ఇటు పర్యావరణానికి హానికరంగా పరిణమించవచ్చు. ఇటీవలి ఘర్షణలో ఆ మూడు చోట్ల వైమానిక దాడుల్లో అణు రియాక్టర్లను లక్ష్యంగా చేసుకోలేదని చెబుతున్నారు. ఫలితంగా, వాటి చుట్టూ ఉన్న ఇతర సదుపాయాలు ధ్వంసమయ్యాయి. ఉక్రెయిన్–రష్యా మధ్య యుద్ధంలో ఈమధ్య ఉక్రెయిన్‌లోని జపోరియిష వంటి అణు సదుపాయాలు దాడులకు లోనుకావచ్చని వాటి భద్రతపై ఆందోళన నెలకొంది. అలాగే, ఉత్తర కొరియా కూడా అణు బూచికి చిరునామాగా మారింది. పైగా, అది అంతర్జాతీయ తనిఖీలకు అంగీకరించడం లేదు.

అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) ఇలాంటి విషయాల్లో ప్రపంచ పెద్దమనిషిగా వ్యవహరించవలసి ఉంది. అణు విచ్ఛిత్తి పదార్థాల రవాణాతోపాటు, అణు ధార్మికతకు దారితీయగల ప్రమాదాలపై అది ఒక కన్ను వేసి ఉంచుతుంది (తాజాగా ఐఏఈఏకు సహకారాన్ని నిలిపివేయాలని ఇరాన్ నిర్ణయించింది). ఒక రియాక్టర్ పై దాడి జరిగి, అది ధ్వంసమైతే దాని నుంచి విడుదలయ్యే అణు ధార్మికత సుదూర ప్రాంతాలకు కూడా వ్యాపిస్తుంది. చెర్నోబిల్, ఫుకుషిమా దుర్ఘటనల్లో అదే జరిగింది. రెండు దేశాల మధ్య ఘర్షణలు సాగుతున్నప్పుడు ఏ పక్షమైనా సరే రెండవ పక్షానికి చెందిన అణు రియాక్టర్‌పై దాడికి దిగినా, ధ్వంసం చేసినా అది సదరు దేశం పక్షాన పూర్తి బాధ్యతారాహిత్యం అవుతుంది.



◆ 'ప్రాజెక్ట్ రూలిసన్' (1969) వంటి శాంతియుత విస్ఫోటనాలను అమెరికా నిర్వహించినప్పుడు, వాటిని వైజ్ఞానిక విజయాలుగా జేజేలు కొట్టారు. అదే ఇండియా 1974లో శాంతియుత విస్ఫోటనాన్ని నిర్వహించినపుడు ఆంక్షలు విధించారు. ఇరాన్ అణ్వాయుధాలను నిర్మించగల సామర్థ్యాన్ని సంతరించుకోగల స్థితిలో ఉందనే అభిప్రాయమే ఇరాన్ అణు సదుపాయాలపై ఇటీవలి అమెరికా దాడులకు కారణం.

◆ అణు శక్తి రంగంలో ఐరోపా దేశాలు ఎంతో ప్రగతిని సాధించినందువల్ల వాటి భద్రతను అవి చూసుకోగలవనే అభిప్రాయం వ్యక్తమయ్యింది. దీనితో ఏకీభవించనివి దిగ్బంధనాలను ఎదుర్కోవలసి వస్తోంది.

అసమానతే అంతస్సూత్రమా?

రెండవ ప్రపంచ యుద్ధానంతర కాలంలో సైన్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా సహకారాన్ని ఇచ్చిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని భావించడం జరిగింది. ఐఏఈఏ 1957లో ఏర్పడడానికి ప్రేరణ ఇచ్చిన అంశాల్లో అది కూడా ఒకటి. ప్రభుత్వాలనన్నింటినీ ఒకచోట చేర్చడం, టెక్నాలజీ అంశాలపై వాటికి దారి చూపడం, అణు శక్తి శాంతియుత ప్రయోజనాలపై సమాచారాన్ని క్రోడీకరించడం అనే భావనతో అది ఏర్పడింది. ఐఏఈఏ ఏర్పాటుకు దారితీసిన చర్చల్లో భారత్ కూడా పాల్గొంది. అందులో భారత్ వ్యవస్థాపక సభ్యురాలు. కొన్ని దశాబ్దాలుగా, ఆ సంస్థ గవర్నర్ల బోర్డులో సభ్యురాలిగా ఉంటూ కీలక పాత్ర పోషిస్తోంది.

అణు శక్తిని ద్వంద్వ ఉపయోగ టెక్నాలజీగా వినియోగిస్తున్నారు. దాంతో, ఆ కార్యకలాపాలు గోప్యంగా సాగుతూ, సమాచార వినిమయం క్లిష్టంగా మారింది. అణు పదార్థాలను సురక్షితంగా వ్యవహరించేటట్లు చూడటంతోపాటు, అణ్వాయుధాల తయారీకి వాటిని బదలాయించకుండా నివారించడం కూడా ఐఏఈఏ ప్రధాన కర్తవ్యం. కానీ, ఆది నుంచి కూడా ఈ నిఘా సంస్థ విధి నిర్వహణలో ఒక రకమైన అసమానత అంతర్లీనంగా ఉంటూ వస్తోంది.

ఐఏఈఏ వైజ్ఞానిక సలహా మండలికి మన హోమి జహంగీర్ భాభా అధ్యక్షుడిగా పనిచేశారు. ఆ మండలి, 1960లలో ప్రతిపాదించిన సురక్షితా ప్రమాణాల స్వరూప స్వభావాలపై కఠిన వైఖరిని అవలంబించింది. ఎటువంటి తనిఖీలకు అంగీకరించేది లేదని తెగేసి చెప్పిన కొన్ని దేశాలకు ఒక తరహా నిబంధనలు, ఐరోపా దేశాలకు మరో రకమైన నిబంధనలు విధించడాన్ని ప్రశ్నించింది. మిగిలిన దేశాలను మాత్రం కఠినమైన నిరోధాలు, తనిఖీలకు లోనుచేశారు. అణు శక్తి రంగంలో ఐరోపా దేశాలు ఎంతో ప్రగతిని సాధించినందు వల్ల వాటి భద్రతను అవి చూసుకోగలవనే అభిప్రాయం వ్యక్తమయ్యేది. అయితే, ఈ వ్యవస్థతో ఏకీభవించనివారు దిగ్బంధనాలను ఎదుర్కోవలసి వస్తోంది. అణు విస్ఫోటనాలను సైనికేతర ప్రయోజనాలకు వినియోగించినా వివాదం నెలకొంటోంది. భారీ స్థాయి ఇంజినీరింగ్, గనుల తవ్వకం, ఇతర తవ్వకాలు లేదా భూగర్భ జలాశయాలను నిర్మించడం వంటివి ఆ కోవలోకి వస్తాయి.

ప్రాజెక్ట్ రూలిసన్ వంటి శాంతియుత విస్ఫోటనాలను అమెరికా నిర్వహించినప్పుడు, వాటిని వైజ్ఞానిక విజయాలుగా జేజేలు కొట్టారు. మన దేశం 1974లో శాంతియుత విస్ఫోటనాన్ని నిర్వహించినపుడు మనపై ఆంక్షలు విధించారు. ఇరాన్ అణ్వాయుధాలను నిర్మించగల సామర్థ్యాన్ని సంతరించుకోగల స్థితిలో ఉందనే అభిప్రాయమే ఇరాన్ అణు సదుపాయాలపై ఇటీవల అమెరికా దాడులకు కారణం.

అందరికీ ఒకే న్యాయం

అణు శక్తి దాని తొలినాటి శాస్త్రీయ సహకార పరిధిని ఏనాడో అతిక్రమించింది. భారీ పారిశ్రామిక కార్యకలాపాలతో అది ఇపుడు ముడిపడి ఉంది. అణు కార్యకలాపాలు అపారమైన ఆర్థిక పెట్టుబడులు, భౌగోళిక రాజకీయాలతో సన్నిహిత సంబంధం కలిగినవిగా రూపాంతరం చెందాయి. భారత్‌తో సహా, అనేక దేశాలలో అణు శక్తి రంగంలోకి ప్రైవేటు సంస్థలు అడుగిడబోతున్నాయనే మాటలు విన వస్తున్నాయి. ప్రైవేటు అణు విద్యుదుత్పాదన కేంద్రాలు ఐఏఈఏ పర్యవేక్షణలోకి పరోక్షంగా వస్తాయి. అవి దానికి విధేయత చూపేటట్లు చూడవలసిన బాధ్యత ఆ యా ప్రభుత్వాల పైనే ఉంటుంది.

అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం కింద తనకు లభించిన సంప్రదాయ సిద్ధమైన నిఘా పాత్రతోపాటు, అలాంటి సవాళ్లకు కూడా ఐఏఈఏ తనను తాను సిద్ధం చేసుకోవలసి ఉంటుంది. దేశాలు అణు పదార్థాలను ఆయుధాల తయారీకి తరలించకుండా చూడటం ఆ ఒప్పందం ప్రకారం ఐఏఈఏకి అప్పగించిన ప్రాథమిక కర్తవ్యం. అంతర్జాతీయ సుస్థిరతకు, న్యూక్లియర్ టెర్రరిజం బెడదను తగ్గించడానికి పరిస్థితులను సరిచూసే, తనిఖీ వ్యవస్థ కీలకం. కానీ, దాని పనితీరు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. అణ్వస్త్రాల వ్యాప్తిని నిరోధించడంలో ఐఏఈఏ పాత్రను చాలా దేశాలు బలపరుస్తున్నాయి. కానీ, జాతీయ సార్వభౌమాధికారాన్ని గౌరవించాలని, అణు సాంకేతికతను వినియోగించుకోవడంలో అందరికీ సమాన సౌలభ్యం ఉండాలని అవి డిమాండ్ చేస్తున్నాయి.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

తెలుగు అయితే మార్చాలా?



కర్ణాటక ప్రభుత్వం బాగేపల్లి పేరును భాగ్యనగర అని మార్చింది. ఎందుకంటే 'పల్లి' అనేది తెలుగు మాట కాబట్టి. ఎంత మూర్ఖత్వం! బెంగళూరులోని దొమ్లూర్, దొడ్డనెకుండి ప్రాంతాలకు శబ్దలక్షణ పరంగా తెలుగు మూలాలున్నాయంటారు. వాటిని కూడా మారుస్తారా? మనకు గేమ్ ఛేంజర్ ప్రభుత్వం కావాలిగానీ, పేర్లు మార్చే గిమ్మిక్కుల ప్రభుత్వం కాదు.
– చేతన్ కుమార్ అహింస, కన్నడ నటుడు-యాక్టివిస్ట్

మీదే తుది నిర్ణయం!



హ్యాపీ బర్త్‌డే, యువర్ హోలీనెస్! మీరు సుదీర్ఘంగా మంచి ఆరోగ్యంతో జీవించాలి. దీర్ఘకాలంగా ఉన్న సంప్రదాయం, దలై లామా వ్యవస్థ ప్రకారం, మీ పునర్జన్మ నిర్ణయాన్ని తైవాన్ ప్రజలం పూర్తిగా గౌరవిస్తున్నాం, మద్దతిస్తున్నాం. ఇందులో ఎవరూ జోక్యం చేసుకోగూడదు. (14వ దలై లామా 90వ జన్మదిన ఉత్సవాలు జూలై 6న జరగనున్నాయి.)
– జోసెఫ్ వు, తైవాన్ జాతీయ భద్రతా సమితి ప్రధాన కార్యదర్శి

ఆటలకు ఎల్లల్లేవు!



ఆసియా కప్, జూనియర్ వరల్డ్ కప్ కోసం పాకిస్తాన్ హాకీ జట్టు ఇండియాకు రానుంది. ఇది మంచి సంకేతం. రాజకీయాలకు క్రీడలు ఎందుకు బందీ కావాలి?
– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

ఎందుకు ఎత్తేసినట్టు?



ఎటూ ఒక నెలలో నిషేధాన్ని ఎత్తేసేదానికి, అసలు పాకిస్తానీ యూట్యూబ్ ఛానల్స్‌ను ఎందుకు నిషేధించారో అర్థంకాదు. ఈ ముప్పై రోజుల్లో ఏం మారిందని?
– అజయ్ కామత్, నేత్ర వైద్యుడు

మీరే హిందీ మాట్లాడుతూ...



ముంబై, మహారాష్ట్రల్లో హిందీ మాట్లాడటం చాలా సహజం. ఎన్ని రోజులున్నా మాతో ఎవరూ మరాఠీలో మాట్లాడనప్పుడు, మరాఠీ మాట్లాడనందుకు జనాన్ని కొట్టడం అవివేకం. మరాఠీవాళ్లు కూడా తమలో తాము హిందీ మాట్లాడుకుంటారు.
– అపర్ణ జైశంకర్, వైద్యురాలు

ఇన్ బాక్స్

ఉద్యమ జ్వాల అల్లూరి

స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ఆంగ్లేయులకు సింహస్వప్నంగా నిలిచిన పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు. అల్లూరి జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్యోద్యమంలో ఓ స్ఫూర్తిమంతమైన అధ్యాయం. దేశానికి స్వాతంత్ర్యం పొందటానికి సాయుధ పోరాటం ఒక్కటే మార్గమని నమ్మిన అల్లూరి... తన పోరాట పటిమతో బ్రిటిష్ సైన్యాన్ని వణికించాడు. మన్యం ప్రాంతంలో గిరిజనులను సమీకరించి బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేశాడు. లోకజ్ఞానం లేని అడవి బిడ్డలనే ఆయుధాలుగా మార్చి తెల్లదొరల గుండెలు చీల్చాడు.



చిన్నతనం నుంచే సీతారామరాజులో దేశభక్తి ఉండేది. విద్యాభ్యాసం తరువాత దేశాటన చేశాడు. ఆ తరువాత మన్యం ప్రాంతంలో అమాయక ఆదివాసీలు పడుతున్న కష్టాలను చూశాడు. బ్రిటిష్‌వారి ఆంక్షలకు వ్యతిరేకంగా గళమెత్తాడు. ప్రకృతి సంపదలను అనుభవించే హక్కు గిరిజనులకు ఉందని ఎలుగెత్తి చాటాడు. పోడు వ్యవసాయానికి పన్ను కట్టక్కర లేదన్నాడు. గిరిజనులను నిలువు దోపిడీ చేస్తున్న దళారుల మీదా, వారికి అండదండలుగా ఉన్న బ్రిటిష్ వాళ్ల మీదా తన విల్లును ఎక్కుపెట్టాడు. సమాచారం ఇచ్చి మరీ పోలీసు స్టేషన్‌లపై దాడులు నిర్వహించి బ్రిటిష్‌వాళ్లకు ముచ్చెమటలు పట్టించాడు.

అల్లూరికి సాయం చేస్తున్నారన్న నెపంతో బ్రిటిష్ అధికారులు మన్యం ప్రజలను వేధించటం మొదలు పెట్టారు. దీంతో తనకున్న అవకాశాలతో పూర్తి స్థాయిలో మన్యం ప్రజలకు రక్షణ కల్పించలేని రామరాజు లొంగిపోవాలనుకున్నాడు. అలా అయినా మన్యం ప్రజలకు వేధింపులు తగ్గుతాయని భావించాడు. రెండేళ్లపాటు సీతారామరాజును పట్టుకోవడానికి నానాపాట్లు పడిన ఆంగ్లేయులు చివరికి చింతపల్లి అడవుల్లో ఆయన్ని పట్టుకున్నారు. కొయ్యూరులో ఒక చెట్టుకు కట్టేసి 1924 మే 7న దారుణంగా కాల్చి చంపారు. అల్లూరి పోరాటం గురించి తెలుసుకుని గాంధీజీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ వంటి స్వాతంత్ర్య పోరాట అగ్రనాయకులు ఆయన దేశభక్తిని, ధైర్య సాహసాలను కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా ఆ వీర కిశోరానికి ఘన నివాళి అర్పిద్దాం!

– అనంతాత్మకుల కొండబాబు । సీనియర్ జర్నలిస్ట్
(నేడు అల్లూరి సీతారామరాజు జయంతి)

కృత్రిమ మేధకు కేరాఫ్ అడ్రస్‌గా...

అభిప్రాయం


దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

అడిగిన సమాచారాన్ని క్షణాల్లో కళ్లముందు ఆవిష్కరించే కృత్రిమ మేధ (ఏఐ) ఇప్పుడు కల కాదు... వాస్తవం! ఐటీలో దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా ఉన్న తెలంగాణ దాన్ని సైతం సొంతం చేసుకునేందుకు, ఆ రంగంలో మనవాళ్లను మెరికల్లా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రాథమిక విద్య నుంచే ఏఐపై విద్యార్థులకు అవగాహన పెంచి ప్రపంచ ఏఐ విప్లవంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేక సిలబస్ రూపొందించే కార్యక్రమం మొదలైంది.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) చడీ, చప్పుడూ లేకుండా మన సమస్త జీవన రంగాల్లోకీ ఇప్పటికే ప్రవేశించింది. అనేక రంగాల రూపురేఖల్ని సంపూర్ణంగా మారుస్తోంది. పారిశ్రామిక రంగంలో దాని పురోగమనం కని విని ఎరుగని రీతిలో ఉంది. ఏఐ అసాధారణ వృద్ధి... ఉపాధికి సైతం పెను సవాలు విసురుతోంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఏఐకి తగినట్టుగా ఎదగటం తప్పనిసరి.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇకపై తెలివికీ, ఏఐ ఆధారిత పరిష్కారాలకూ రూపశిల్పులు కావాలి. కోడ్ ఉత్పాదన, డీబగ్గింగ్, ఆప్టిమైజేషన్ లు ఇప్పుడు కీలకం. ఏఐకి తగిన సూచనలు అందజేయగల సమర్థమంతమైన ప్రాంప్ట్ ఇంజినీరింగ్ సంప్రదాయ ప్రోగ్రామింగ్ లంత ప్రాధాన్యం కలిగినదిగా గుర్తించాలి.

యాక్సిడెంటల్ కాంప్లెక్సిటీ (బాయిలర్ ప్లేట్ కోడ్, రొటీన్ టాస్క్స్)ని ఏఐ సునాయాసంగా ఛేదించగలుగుతోంది గనుక ఇంజినీర్లు ఉన్నత స్థాయి పరిష్కారాలిచ్చే 'అసెన్షియల్ కాంప్లెక్సిటీ'పై దృష్టి పెట్టాలి. ఇవన్నీ సంక్లిష్టలతో కూడిన డిజైన్, ఎథికల్ ఏఐ అమలు, చిక్కుముడులతో ఉండే ఆర్కిటెక్చర్ వగైరాలను నిశితంగా పరిశీలించే నైపుణ్యంగల ఇంజినీర్ల అవసరాన్ని పెంచుతాయి. ఏఐ ఎథిక్స్ నిపుణులు, డేటా సైంటిస్టులు, ఎంఎల్ ఇంజినీర్లు, ఏఐ సమన్వయంలో నిపుణులు, ఏఐ ఆడిటర్లు వంటి ఉద్యోగాలకు మంచి డిమాండు ఉండబోతోంది.

కృత్రిమ మేధ డేటాను విశ్లేషిస్తుంది. కానీ దానికి సందర్భశుద్ధి ఉండదు. ఆరోగ్యం, ఆర్థికం, వ్యవసాయం వంటి భిన్న రంగాల అవసరాలనూ, అందులోని సమస్యలనూ అవగాహన చేసుకున్న ఇంజినీర్లు ఏఐను సమర్థమంతంగా, జాగ్రత్తగా వినియోగించటంలో ఉపయోగపడతారు. విమర్శనాత్మక ఆలోచనలు, సృజనాత్మకత, భాగస్వామ్యం, కమ్యూనికేషన్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ వంటివి మనుషులకు మాత్రమే సాధ్యమైన లక్షణాలు. డెలాయిట్ నివేదిక ప్రకారం 90 శాతం యాజమాన్యాలు ఉద్యోగుల నుంచి ఈ సాఫ్ట్ స్కిల్స్ ఆశిస్తున్నాయి.

జీసీసీలకు హైదరాబాద్ అడ్డా

బహుళజాతి సంస్థలు భిన్న ప్రాంతాల్లో తమ వ్యూహాత్మక, సాంకేతిక, నిర్వహణ అవసరాల నిమిత్తం నెలకొల్పే ప్రపంచ సామర్థ్య కేంద్రాలకు (జీసీసీలు) హైదరాబాద్ అడ్డా అయింది. ఇక్కడ 355 జీసీసీలు ఉండగా, వీటిల్లో 3 లక్షలమంది నిపుణులు పనిచేస్తున్నారు. దేశంలోని జీసీసీల్లో ఇది 21 శాతం. ఎలీ లిలీ, మారియెట్ ఇంటర్నేషనల్, ఎవర్‌నార్త్, వ్యాన్‌గార్డ్ వంటి ప్రపంచ సంస్థలు తమ జీసీసీలకు హైదరాబాద్‌ను ఎంచుకుంటున్నాయి. వీటిల్లో అమెరికాలోనే పెద్దదయిన వ్యాన్‌గార్డ్ ఏఐ/ఎంఎల్‌పై ఫోకస్‌తో 2,300 మందిని రిక్రూట్ చేసుకోబోతోంది. అంటే హైదరాబాద్ గ్లోబల్ ఇన్నొవేషన్ హబ్‌గా రూపుదిద్దుకుంటోందన్న మాట. ఈ జీసీసీ అడ్డా గ్లోబల్ వేల్యూ సెంటర్ల (జీవీసీ) ప్రధాన కేంద్రంగా మారటం ఎంతో దూరంలో లేదు. ఐపీ క్రియేషన్, హై వాల్యూ ప్రొడక్షన్, వీటికి తోడ్పడే రాష్ట్ర ప్రభుత్వ దార్శనికత... జీవీసీలకు దారితీస్తోంది.



◆ ఏఐని 2025-26 విద్యాసంవత్సరంలో అంతర్భాగం చేయటానికి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఇప్పుడున్న సిలబస్‌లో 20 శాతాన్ని పునస్సమీక్షించటానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది.

తెలంగాణ ప్రభుత్వం ముందు తరాలను ఏఐ విప్లవంలో భాగం చేయడం కోసం తన విద్యావ్యవస్థలో ఏఐని భాగం చేయదల్చుకుంది. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఏఐ మౌలిక సూత్రాలను పరిచయం చేయాలని సంకల్పించింది. ఒకటి, రెండు తరగతుల్లో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ నేర్పించటం, నాలుగు అయిదు తరగతుల గణితంలో ఏఐ ఫండమెంటల్స్‌ను ప్రవేశపెట్టడం దీని ధ్యేయం. ఇందుకు సంబంధించిన పైలెట్ ప్రోగ్రాం కోసం 20 జిల్లాల్లోని వంద ప్రాథమిక పాఠశాలల్ని ఎంచుకోవడం జరిగింది. ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్-ఏఐ/ఏఎక్స్ఎల్) ప్రోగ్రాం 27 జిల్లాల్లోని 513 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు విస్తరిస్తోంది. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకూ గణిత శాస్త్రంలో ప్రత్యేకించి ఏఐ అంతర్భాగం కాబోతోంది. 5,560 మంది టీచర్లు ఏఐపై శిక్షణ పొందుతున్నారు.

ఏఐని 2025-26 విద్యాసంవత్సరంలో అంతర్భాగం చేయటానికి అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ఇప్పుడున్న సిలబస్‌లో 20 శాతాన్ని పునస్సమీక్షించటానికి తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఫిన్‌టెక్ వంటివి ఈ కోర్సుల్లో అధ్యయనాంశాలు కాబోతున్నాయి. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ ఏఐ/ఎంఎల్ ప్రోగ్రాంలలో కోర్సులు అందజేస్తోంది.

ఏఐ సిటీ రాబోతోంది!

విశాలమైన 200 ఎకరాల్లో ఏఐ సిటీ రూపుదిద్దుకుంటోంది. ఏఐ డేటా సెంటర్ క్లస్టర్ ఈ సిటీలో భాగమవుతుంది. ఇందులో 25,000 జీపీయూలు (వీటిపై మొన్న ఏప్రిల్‌లో ఎంవోయూలు అయ్యాయి) ఉండబోతున్నాయి. పర్యవసానంగా దేశంలో అత్యంత శక్తిమంతమైన ఏఐ సూపర్ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలకు హైదరాబాద్ కేంద్రం కాబోతోంది.

వ్యాసకర్త తెలంగాణ ఐటీ, పరిశ్రమల మంత్రి

లక్ష్మీ కటాక్షం

లక్ష్మీ కటాక్షం వల్ల అష్టైశ్వర్యాలు పొందవచ్చునన్న నమ్మకానికి సాక్షాత్తూ వేదసూక్తాల సాక్ష్యం ఉంది. బ్రహ్మ, ఇంద్ర, గంగాధరుల వైభవం కూడా శ్రీదేవి మెల్లని కడగంటి చూపు వల్ల లభించిందే (శ్రీమత్ మంద కటాక్ష లబ్ధ విభవ బ్రహ్మ ఇంద్ర గంగాధరమ్...) అని ఆస్తికులు విశ్వసిస్తారు. ఆమె కటాక్షానికి అంతటి శక్తి కలగటం వెనక గల కీలకాన్ని ఆదిశంకరులు కవితాత్మకంగా అభివర్ణించారు.

జ్యోతిర్మయం

అల వైకుంఠ పురంలో నెలవైన ఆ శ్రీహరి రూపం మీద, మహాలక్ష్మి చల్లని నల్లని కంటి చూపు సోకిందట. మగువల వీక్షణలు తుమ్మెదల బారులా నల్లగా ఉన్నట్లు భావించటం కవిత్వ సంప్రదాయం, 'కవి సమయం'. ఆమె క్రీగంటి చూపు తనను తాకగానే హరి పులకించిపోయాడు. ఆయన నిగనిగల శరీరం మీద ఆ పులకలు స్ఫుటంగా కనిపించాయి. నల్లని, దృఢమైన తమాల వృక్షం మీద విరివిగా అంకురించిన చిన్ని చిన్ని మొగ్గల గుత్తుల లాగా కనిపించాయి.

స్వామి పులకలను తాకిన సరసిజాక్షి వీక్షణలు, అరవిరిసిన ఆ మొగ్గలను ఆశ్రయించిన తుమ్మెదల లాగా కనిపించాయి. తుమ్మెద పువ్వులో మకరందాన్ని స్వీకరించి తనలో నింపుకొంటుంది. అలాగే, సకల సంపదలకూ, విభూతులకూ ఆకరమైన జగన్నాథుడి మీద సోకిన వీక్షణం, ఆ సంపదలనూ, విభూతులనూ కానుకగా అంగీకరించి, స్వీకరించింది. 'అంగీ'కృతం– అంటే తన శరీరంలో భాగం చేసుకున్నది.

అంగం హరేః పులక భూషణం ఆశ్రయంతీ,
భృంగ అంగనా ఇవ ముకుల ఆభరణం తమాలం,
అంగీకృత అఖిల విభూతిః అపాంగ లీలా
మాంగల్యదా అస్తు మమ, మంగళ దేవతాయాః!

ముకుళములు (మొగ్గలు) ఆభరణంగా గల తమాల వృక్షాన్ని ఆడు తుమ్మెద ఆశ్రయించినట్టు, నారాయణుడి పులకలెత్తిన శరీరాన్ని ఆశ్రయిస్తూ, ఆయన అఖండ విభూతులను స్వీకరించి తనలో 'అంగీ'భూతం చేసుకున్న మా మంగళ దేవత మహాలక్ష్మి కడగంటి చూపుల లీలా విలాసం, నాకు మంగళ ప్రదాయకము అగుగాక!

మంగళ దేవతాయాః అపాంగలీలా, మమ మాంగల్యదా అస్తు! ఎంత చింతన చేస్తే అంత మనోహరంగా అనిపించే ఇంతటి అద్భుతమైన ఉత్ప్రేక్ష చేసినప్పుడు, ఆది శంకరాచార్యులకు పట్టుమని పదేళ్లు కూడా లేవంటారు. పేదరాలి ఇంట సిరులు కురిపించేందుకు, ఆచార్యుల వారు ఆలపించిన 'కనకధారా స్తోత్రం'లో మకుటాయమానమైన మొదటి శ్లోకం ఇది.

– మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం; **తిథి:** శు.నవమి సా.4.24 వరకు, తదుపరి దశమి; **నక్షత్రం:** చిత్త సా.5.30 వరకు, తదుపరి స్వాతి; **వర్జ్యం:** రా.11.43 నుండి 1.29 వరకు; **దుర్ముహూర్తం:** ఉ.8.12 నుండి 9.04 వరకు, తదుపరి ప.12.31 నుండి 1.23 వరకు; **అమృత ఘడియలు:** ఉ.10.29 నుండి 12.15 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **యమగండం** ప.3.00 నుండి 4.30 వరకు; **సూర్యోదయం:** 5.33; **సూర్యాస్తమయం:** 6.35.

క్లుప్తంగా...

బీజేపీ సీనియర్ నేత మృతి



హరికుమార్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన కేంద్రమంత్రి సంజయ్

కరీంనగర్ టౌన్: కరీంనగర్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు, కరీంనగర్ సీనియర్ నాయకుడు తాళ్లపల్లి హరికుమార్‌గౌడ్ గురువారం తెల్లవారుజామున గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందారు. ఆయన జిల్లాలో మూడు దశాబ్దాలుగా పార్టీ అభివృద్ధికి కృషిచేశారు. హరికుమార్ కుటుంబ సభ్యులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీసులు తప్పుడు కేసు పెట్టారని.. యువకుడి ఆత్మహత్య

- ఇందిరమ్మ ఇల్లు రాలేదని గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో రమేశ్ ఆవేదన
- నాయకుల ఫిర్యాదుతో స్టేషన్‌కు రమ్మని చెప్పడంతో మనస్తాపం



చుక్క రమేశ్ (ఫైల్)

గోవిందరావుపేట: 'ఇందిరమ్మ ఇల్లు పొందడానికి అన్ని విధాలా అర్హుడిని.. అయినా జాబితాలో నా పేరు లేదు. దీని పై గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో రాజకీయ నాయకులను అడిగినందుకు నాపై తప్పుడు కేసులు పెట్టారు'అంటూ ఓ యువకుడు సూసైడ్ నోట్ రాసి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. చల్వాయి గ్రామానికి చెందిన చుక్క రమేశ్ (24) గురువారం ఉదయం తన అమ్మమ్మ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకి పాల్పడ్డాడు. రెండు నెలలుగా గ్రామానికి సంబంధించిన 'చల్వాయి సమాచారం'అనే వాట్సాప్ గ్రూప్‌లో తనకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని రాజకీయ నాయకులను ప్రశ్నిస్తూ వస్తున్నాడు. ఈ నేపథ్యంలోనే బుధవారం కూడా పదేపదే నేతలను ప్రశ్నించడంతో కొందరు నాయకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు స్టేషన్‌కి రమ్మని పిలవడంతో తప్పుడు కేసు నమోదు చేశారని మనస్తాపం చెంది రమేశ్ ఆత్మహత్యకి పాల్పడ్డాడు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు, బంధువులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్, ములుగు జాతీయ రహదారి 163పై రెండు గంటలపాటు బైఠాయించారు. కాగా, రమేశ్ ఆత్మహత్యపై కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి రూ.50 వేల ఆర్థికసాయం చేశారు. మృతుడు రమేశ్ అమ్మమ్మ ఫిర్యాదు మేరకు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌తోపాటు మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ములుగు డీఎస్పీ రవీందర్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

శివసేన రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ

సాక్షి, హైదరాబాద్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో శివసేన పోటీ చేస్తుందని.. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాసన సభ, లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయనందున తమ పార్టీ తీవ్రంగా నష్టపోయిందన్నారు. స్థానిక ఎన్నికల్లో ఎలాంటి పొత్తులు ఉండవని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలు కోసం కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

కన్నీటి నిరీక్షణ

మృతదేహాల కోసం బాధిత కుటుంబాల ఆవేదన



తమ వారి ఆచూకీ కోసం రోదిస్తున్న బాధితులు

- గురువారం రాత్రి పది మృతదేహాల డీఎన్‌ఏ రిపోర్టుల రాక
- ఆయా కుటుంబాలకు పది మృతదేహాల అప్పగింత
- ఇంకా మార్చురీల్లోనే ఏడు మృతదేహాలు
- నాలుగు రోజులైనా లభించని తొమ్మిది మంది ఆచూకీ..
- శిథిలాల్లో వెలుగుచూస్తున్న మాంసపు ముద్దలు
- మరణించింది 38 మందే : సిగాచి పరిశ్రమ ప్రకటన
- రియాక్టర్ పేలడం వల్ల ప్రమాదం జరగలేదు.. మరోమారు 'సిగాచి' వెల్లడి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/పటాన్‌చెరు : పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో మృతి చెందిన వారి జాడ కోసం ఆయా కుటుంబాలు ఇంకా నిరీక్షిస్తున్నాయి. పేలుడు ఘటన చోటు చేసుకొని నాలుగురోజులు గడుస్తున్నా తమ వారి ఆచూకీ లభించక బాధిత కుటుంబాలు నరకయాతన అనుభవిస్తున్నాయి. గుర్తు పట్టనంతగా కాలిపోయి..ఛిద్రమైన మృతదేహాల గుర్తింపు ప్రక్రియ నాలుగో రోజు కొనసాగింది. గురువారం రాత్రి వరకు కొత్తగా పది మంది మృతదేహాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. డీఎన్‌ఏ రిపోర్టులు...ఆయా కుటుంబ సభ్యుల డీఎన్‌ఏ రిపోర్టులకు సరిపోవడంతో ఈ పది మృతదేహాలను అప్పగించారు. బుధవారం వరకు 21 మృతదేహాలను గుర్తించగా, తాజాగా మరో పది మృతదేహాలు ఎవరివో తేలింది. దీంతో మొత్తం 31 మృతదేహాలను అధికారులు గుర్తించారు. మృతుల కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థిక సాయం కింద రూ.లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.

ఇంకా ఏడు మృతదేహాల డీఎన్‌ఏ రిపోర్టులు రావాలి..

ఈ దుర్ఘటనలో 40 మంది చనిపోలేదని, 38 మంది చనిపోయారని గురువారం విడుదల చేసిన ప్రకటనలో సిగాచి పరిశ్రమ తెలిపింది. ప్రమాదంలో గాయపడిన 33 మందిలో 12 మంది ఆయా ఆస్పత్రుల నుంచి డిశ్చార్జ్ అయ్యారని పేర్కొన్నారు. వీరికి తాత్కాలిక ఉపశమనం కింద రూ.లక్ష చొప్పున అందించామన్నారు. రియాక్టర్ పేలడం వల్ల ప్రమాదం సంభవించలేదని తాము చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నామని ఆ ప్రకటనలో తేల్చి చెప్పారు. 38 మృతదేహాల్లో గురువారం రాత్రి వరకు 31 మృతదేహాలను గుర్తించారు. ఇంకా ఏడు మృతదేహాలకు సంబంధించిన డీఎన్‌ఏ రిపోర్టులు రావాల్సి ఉంది. ఈ ఏడు మృతదేహాలతో పాటు, మరికొన్ని అవయవాలు మార్చురీలో ఉన్నాయి. చేయి, ఎముక, కాలు, మాంసపు ముద్దలు ఇలా శరీర భాగాలను మార్చురీలో భద్రపరిచారు. వాటి డీఎన్‌ఏ శాంపిల్‌లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.



శిథిలాల్లో లభించిన సెల్‌ఫోన్ భాగం

ఆ తొమ్మిది మంది ఎక్కడ..?

ఈ ఘటన తర్వాత సుమారు తొమ్మిది మంది ఆచూకీ తెలియకుండా పోయింది. వీరికి సంబంధించిన మృతదేహాలు ఇంకా దొరకలేదు. శిథిలాల తొలగింపు ప్రక్రియ కూడా దాదాపు దగ్గర పడుతోంది. శుక్రవారం వరకు తొలగింపు ప్రక్రియ పూర్తవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఇటు శిథిలాల కింద ఇంకా ఈ తొమ్మిది మంది మృతదేహాలు లభించక పోవడంతో వారు ఏమై ఉంటారోనని ఆందోళన వ్యక్తమవుతోంది. పేలుడు భారీ స్థాయిలో ఉండటం.. వంద మీటర్ల దూరం వరకు యంత్ర పరికరాలు ఎగిరి పడటం చూస్తే ఈ మృతదేహాలు కనిపించనంత స్థాయిలో కాలిపోయి ఉంటాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అణువణువూ పరిశీలన

సిమెంటు ఇటుక (డెబ్రిస్) భవన శిథిలాలను జేసీబీలతో తొలగించి పక్కనే ఉన్న ఒక ఖాళీ స్థలంలో వేసి అణువణువూ పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో మానవ శరీరపు మాంసపు ముద్దలు, కాళ్లుచేతులు లభిస్తున్నాయి. కొన్ని ఐడీ కార్డులు సెల్‌ఫోన్ పరికరాలు కూడా దొరికాయి. అధికారుల వద్ద ఉన్న జాబితాలో లేని పేర్లతో కూడిన ఐడీ కార్డులు కూడా దొరికాయి. హైడ్రా సిబ్బంది ఈ మట్టి దిబ్బల కింద ఉన్న మాంసపు ముద్దలను జాగ్రత్తగా పరిశీలించి నిక్షిప్తం చేస్తున్నాయి. ఈ ప్రక్రియ అతి జాగ్రత్తగా చేస్తుండటంతో సమయం ఎక్కువగా తీసుకుంటోంది పరిశ్రమ మూడంతస్తుల భవనం కుప్పకూలడంతో డెబ్రిస్ అధిక మోతాదులో జమైంది. పరిశ్రమ ఆవరణలో మట్టి దిబ్బలు ఎక్కువ కావడంతో వాటిని తొలగించి అందులో ఏమైనా మానవ శరీర భాగాలు ఉంటాయనే అనుమానంతో గాలింపు చేపట్టారు. అధికారులు ఊహించినట్టుగానే చిన్నచిన్న శరీరం ముద్దలు వారికి లభించాయి. వాటిని జాగ్రత్తగా సేకరించి డీఎన్‌ఏ పరీక్ష కోసం తరలిస్తున్నారు.

అల్లుడిని చూసి స్పృహ తప్పిన మామ



పేలుడు ధాటికి తీవ్రంగా గాయపడిన మున్మున్ చౌదరి ధ్రువ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న అతని మామ బీరేందర్‌చౌదరి బిహార్ నుంచి గురువారం ఇక్కడకు వచ్చాడు. చికిత్స పొందుతున్న అల్లుడిని చూసి స్పృహతప్పి కుప్పకూలిపోయాడు. వెంటనే అతడిని అదే ఆస్పత్రిలో చేర్పించారు. అయితే వైద్య సేవల కింద రూ.70 వేలు బిల్లు వేశారు. దీన్ని చూసి కంగుతిన్న బాధిత కుటుంబం లబోదిబోమంటోంది. ఆపదలో ఉన్న ఈ సమయంలో ఆస్పత్రిలో యాజమాన్యం మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సింది పోయి.. వేలల్లో బిల్లు వేస్తే ఎలా అని వారు వాపోయారు.

హామ్ రోడ్లపై టోల్ ఉండదు

- మూడేళ్లలో గ్రామీణ రోడ్లన్నీ పూర్తి చేస్తాం
- ఇప్పటికే రూ.6,500 కోట్లతో నిర్మాణ పనులు
- చిన్న పెండింగ్ బిల్లులు ఈ నెలలో క్లియర్
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి



సమీక్షలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హామ్) పద్ధతిలో నిర్మించే రహదారులపై టోల్ వసూలు చేయబోమని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హామ్ రోడ్లపై ఎలాంటి అపోహలు వద్దని అన్నారు. రాష్ట్రంలోని రహదారులన్నింటి నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేస్తామని, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రహదారులకు తొలి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. గురువారం ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో అన్ని స్థాయిల ఇంజనీర్లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.6,500 కోట్ల వ్యయంతో గ్రామీణ రహదారుల నిర్మాణం కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో రహదారులపై మరణాలు అధికంగా జరగటానికి అనేకచోట్ల బ్లాక్‌స్పాట్స్ ఉండటమే కారణమని చెప్పారు. ఆ బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సరిదిద్దే పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి రహదారులకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. పెండింగ్ బిల్లులను ఈ నెలలో చెల్లిస్తామని ప్రకటించారు.

మూడేళ్లలో ట్రిపుల్ ఆర్ నిర్మాణం

రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) నిర్మాణం మూడేళ్లలో పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో త్వరలోనే ప్రధాని మోదీ, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసి ఈ అంశంపై చర్చిస్తామని చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డును వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించామని, ఇప్పుడు ట్రిపుల్ ఆర్ నిర్మాణంతో హైదరాబాద్ రూపురేఖలే మారిపోతాయని అన్నారు. ఆర్ అండ్ బీ శాఖలోకి కొత్తగా 181 మంది ఏఈలను తీసుకున్నామని, ఇంజనీర్లకు పదోన్నతులు కూడా కల్పించినట్లు చెప్పారు. రోడ్ల ప్యాచ్ వర్క్‌ల కోసం రూ.140 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి ప్రభుత్వ తప్పొప్పులను చెప్పాలని వెంకట్‌రెడ్డి సూచించారు. హరీశ్‌రావు, కేటీఆర్‌తో తమకు సంబంధం లేదని, వారు తమస్థాయికి తగ్గవారు కాదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయించింది కేసీఆర్, కేటీఆర్ అని ఆరోపించారు.

చిన్నారుల్లో పోషక స్థితిపై ప్రోగ్రెస్ రిపోర్టులు

- పోషకాహార లోపాలు తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ
- మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: అంగన్‌వాడీల్లోని చిన్నారుల్లో పోషక స్థితిపై ప్రోగ్రెస్ రిపోర్టులు తయారు చేయాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో సెర్ప్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల ఉన్నతాధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం, పోషకాహార మిషన్, ఉద్యోగ ఖాళీల భర్తీ, కారుణ్య నియామకాలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల బలోపేతం కోసం ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకునేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తేవాలని సూచించారు. అంగన్‌వాడీల్లోని చిన్నారుల్లో పోషకాహార లోపాలను తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. పిల్లలకు అందించే ఆహారంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించేలా వంద రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను తక్షణం సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోకి తరలించాలని కోరారు. జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని నూతన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం స్థలాలను గుర్తించి, భవనాలు నిర్మించాలని సూచించారు. అవసరమైతే మొబైల్ కేంద్రాలు, కంటైనర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. సుప్రీంకోర్టు కేసు నేపథ్యంలో అంగన్‌వాడీల్లో ఖాళీల భర్తీ, కారుణ్య నియామకాలను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అల్పాహారం కోసం కిచిడీ మిక్స్, ఉప్మా మిక్స్‌లకు సిద్ధం చేశారని, వాటిని వేడి నీటిలో వేసి మరిగించగానే అల్పాహారం సిద్ధమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా కిచిడీ మిక్స్, ఉప్మా మిక్స్‌లను రుచిచూసి అందులో మార్పుచేర్పులను మంత్రి సీతక్క సూచించారు.

ఆర్టీసీ అద్దెబస్సులతో నెలకు కోటి ఆదాయం

ఆర్టీసీ అద్దె బస్సుల ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాలు రూ.కోటి ఆర్జించాయని మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటివరకు 150 బస్సులను ఆర్టీసీకి మహిళా సంఘాలు అద్దెకు ఇవ్వగా ఒక్కో బస్సుకు ఆర్టీసీ నెలకు రూ.70 వేలు చెల్లిస్తోందని చెప్పారు. మొదటి నెల పేమెంట్‌ను మహిళా సంఘాలకు ఆర్టీసీ చెల్లించిందని వెల్లడించారు. దీనికి సంబంధించిన చెక్కును ఆర్టీసీ యాజమాన్యం నుంచి సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్ అందుకున్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సృజన తదితరులు పాల్గొన్నారు.



ప్రమాద ఘటనపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న నిపుణుల కమిటీ సభ్యులు

'సిగాచి' ప్రమాదంపై నిపుణుల కమిటీ దర్యాప్తు షురూ

- ఘటనాస్థలాన్ని పరిశీలించిన నలుగురు సభ్యులు
- నాలుగు గంటలపాటు అన్ని కోణాల్లో పరిశీలన

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: సిగాచి పరిశ్రమలో పేలుడు దుర్ఘటనపై సమగ్ర దర్యాప్తునకు సీఎస్ఐఆర్ శాస్త్రవేత్త డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక నిపుణుల కమిటీ దర్యాప్తు ప్రారంభించింది. కమిటీ చైర్మన్‌తో పాటు సభ్యులు టి.ప్రతాప్‌కుమార్, సూర్యనారాయణ, సంతోష్ గూగిల బృందం గురువారం ఘటనాస్థలాన్ని పరిశీలించింది. సుమారు నాలుగు గంటలపాటు వారి పరిశీలన కొనసాగింది. ప్రమాదానికిగల కారణాలను అన్వేషించింది. సేఫ్టీ వాల్వ్ పని చేయకపోవడానికి గల కారణాలను పరిశీలించింది. కంపెనీ తీసుకున్న అనుమతులు, తయారు చేస్తున్న ఉత్పత్తుల వివరాలను నమోదు చేసుకుంది. సుమారు మూడు దశాబ్దాలుగా నడుస్తున్న ఈ పరిశ్రమలో వివిధ విభాగాలకు చెందిన యంత్రపరికరాలను ఎన్నిసార్లు మార్చారని కమిటీ సభ్యులు ఆరా తీశారు. చివరిసారిగా తనిఖీలు ఎప్పుడు జరిగాయనే వివరాలను సేకరించారు. ప్రమాదం మానవ తప్పిదంతో జరిగిందా లేక మరేదైనా కారణమా అనే అంశంపై ఆరా తీసినట్లు సమాచారం. అయితే కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడలేదు.

కొనసాగుతున్న శిథిలాల తొలగింపు ప్రక్రియ..

సిగాచి పరిశ్రమలో శిథిలాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. గురువారం కూడా ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా బృందాలు శిథిలాలను లారీల్లో పరిశ్రమ సమీపంలోని సుమారు నాలుగు ఎకరాల స్థలానికి తరలిస్తున్నారు. ఈ దుర్ఘటనపై దర్యాప్తు చేసేందుకు, ప్రమాద కారణాలను తెలుసుకొనేందుకు వీలుగా శిథిలాలను ప్రత్యేక స్థలంలో ఉంచాలని నిర్ణయించారు. శిథిలాల్లో లభిస్తున్న కార్మికుల ఐడీ కార్డులు, సెల్‌ఫోన్ల వంటి వాటిని భద్రపరిచి ఫోరెన్సిక్ బృందానికి లేదా ప్రత్యేక విచారణ చేసేందుకు అందుబాటులో ఉంచుతున్నారు. కాగా, ఈ దుర్ఘటనలో మృతిచెందిన, గాయపడిన తమ రాష్ట్రాల కార్మికుల వివరాలు సేకరించేందుకు బిహార్, ఒడిశా నుంచి వచ్చిన ప్రత్యేక అధికారుల బృందాలు స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాయి.

తెలంగాణ ప్రజలకు రాహుల్ ద్రోహం

- ఏనాడూ విభజన చట్టం హామీలపై మోదీని నిలదీయలేదు
- బనకచర్లపై రాహుల్ మౌనం కుట్రపూరితం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా ఏడాది పూర్తి చేసుకుంటున్న రాహుల్‌గాంధీ తెలంగాణ సమస్యలు, ఈ ప్రాంతానికి హక్కుగా రావాల్సిన అంశాలపై ఏరోజూ మాట్లాడలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణకు ద్రోహం చేయడంలో రాహుల్ బీజేపీతో కలసి పనిచేస్తున్నారని గురువారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. తెలంగాణ రైతుల నోట్లో మట్టికొట్టే బనకచర్ల ప్రాజెక్టు విషయంలో రాహుల్ మౌనంగా ఉండడం ముమ్మాటికీ కుట్రేనని మండిపడ్డారు. గోదావరి జలాల్లో రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన వాటాను రేవంత్‌రెడ్డి తన గురువు చంద్రబాబుకు ధారాదత్తం చేస్తుంటే ఆపకుండా, రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ అగ్రనాయకత్వం తీరని అన్యాయం చేస్తోందని విమర్శించారు. 2014 పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలుపై నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని ఇప్పటివరకు రాహుల్‌గాంధీ ప్రశ్నించలేదన్నారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి కేంద్రాన్ని రాహుల్ ఎందుకు నిలదీయడం లేదో చెప్పాలన్నారు. వరంగల్ ప్రజల చిరకాల కోరికైన కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ విషయంలోనూ రాహుల్ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మరచిపోలేదన్నారు. సింగరేణికి బొగ్గు బ్లాక్‌లను కేటాయించకుండా ఆ సంస్థ అస్తిత్వాన్నే మాయం చేయాలనుకున్న మోదీ ప్రభుత్వ కుట్రలపై రాహుల్ ఏ రోజూ లోక్‌సభలో మాట్లాడలేదన్నారు. హామీల అమలుకు తనదే గ్యారంటీ అని గప్పాలుకొట్టిన రాహుల్, ఇప్పుడు తెలంగాణకు రాకుండా ముఖం చాటేశారన్నారు.

హరితహారంతో అద్భుత ఫలితాలు

కేసీఆర్ ప్రారంభించిన హరితహారంతో తెలంగాణ పచ్చటి స్వర్గధామంలా మారిందని కేటీఆర్ పేర్కొన్నారు. 'ఒక చిన్న మొక్క నిశ్శబ్దంగా అడవికి జన్మనిస్తుంది'అనడానికి రాష్ట్రంలో విజయవంతమైన హరితహారం నిదర్శనమని ఆయన అన్నారు. కేసీఆర్ ఆలోచనకు అనుగుణంగా 2015లో మొదలైన హరితహారంతో అద్భుత ఫలితాలు వచ్చాయన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఊపిరాడని నగరాల దుస్థితి తెలంగాణకు రాకూడదన్నదే హరితహారం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

మనవళ్లను కాపాడి.. నాయనమ్మ మృతి

- ప్రాణం తీసిన కరెంటు తీగ



కమలమ్మ(ఫైల్)

కందుకూరు: మనవళ్లను రక్షించే క్రమంలో తాను విద్యుత్ షాక్‌కు గురై నాయనమ్మ మృతిచెందింది. ఈ ఘటన గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం లేమూరులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుర్విి అంజయ్య, కమలమ్మ (59) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లు సంతానం. కమలమ్మ కుటుంబానికి ఇటీవల ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడంతో పాత ఇంటిని తొలగించి, కొత్తింటి నిర్మాణ పనులు ప్రారంభించారు. పాత ఇంటి ప్రహరీ గేట్ వద్ద బల్బులకు సంబంధించిన కరెంటు తీగలను తొలగించకుండానే పనులు చేస్తున్నారు. గురువారం సాయంత్రం కమలమ్మ మనవళ్లు, మనవరాలు (పదేళ్లలోపువారు) గోడ వద్ద ఆడుకుంటుండగా కరెంట్ తీగలకు తగిలి షాక్‌కు గురయ్యారు. ఇది గమనించిన కమలమ్మ వారిని పక్కకు తోసేసే క్రమంలో తాను విద్యుదాఘాతానికి గురైంది. కాగా, చిన్నారులు ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి బయటపడ్డారు.

కీలక పోస్టులు ఖాళీ !

- నీటిపారుదల శాఖలో పూర్తిస్థాయి ఈఎన్‌సీ ఒక్కరూ లేకపోవడం తొలిసారి..
- ఉన్న ఒక్క ఈఎన్‌సీని సరెండర్ చేసిన సర్కారు
- మేడిగడ్డపై విజిలెన్స్ నివేదికతో పదోన్నతులకు బ్రేక్
- మరోవైపు ఉద్యోగ విరమణలతో ప్రతి నెలా పెద్దసంఖ్యలో కీలక పోస్టులు ఖాళీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నీటిపారుదల శాఖలో కీలక పోస్టులన్నీ ఖాళీ అయ్యాయి. ఆరు ఇంజనీర్-ఇన్-చీఫ్ (ఈఎన్‌సీ)లకు ప్రస్తుతం పూర్తిస్థాయి ఈఎన్‌సీ ఒక్కరు కూడా లేరు. ఈఎన్‌సీ, సీఈలు వంటి ఉన్నత పదవుల్లోని ఇంజనీర్లు పెద్ద సంఖ్యలో ఉద్యోగ విరమణ చేయగా, వారి స్థానంలో కొత్త వారిని నియమించడానికి ప్రభుత్వానికి సరైన అనుభవం, నైపుణ్యం కలిగిన ఇంజనీర్లు లభించడం లేదు. ఏళ్ల తరబడిగా ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొంది.

➤ జి.అనిల్‌కుమార్ ఒక్కరే శాఖలో పూర్తిస్థాయి ఈఎన్‌సీ (జనరల్) హోదాను కలిగి ఉండగా, గత నెల 16న రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను తొలగించి తదుపరి పోస్టును కేటాయించలేదు. ఆయన స్థానంలో చీఫ్ ఇంజనీర్ (ఎంక్వైరీస్) ఎండీ అంజాద్ హుస్సేన్‌కు ఈఎన్‌సీ(జనరల్)గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఆరు ఈఎన్‌సీ పోస్టుల్లో నాలుగు పోస్టులు పూర్తిగా ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జ్‌లను సైతం ఈ పోస్టుల్లో ప్రభుత్వం నియమించడం లేదు.

➤ ఈఎన్‌సీ (అడ్మిన్)గా కరీంనగర్ ఇన్‌చార్జ్ ఈఎన్‌సీ బి.శంకర్‌కు ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించగా, గత నెల చివరన ఆయన ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఈఎన్‌సీ(అడ్మిన్)తో కరీంనగర్ ఈఎన్‌సీ పోస్టూ ఖాళీ అయ్యింది. ఈఎన్‌సీ(అడ్మిన్) లేకపోవడంతో కోరం లేక నీటిపారుదల శాఖలోని స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ సమావేశాన్ని వాయిదా వేసుకోవాల్సి వస్తోంది. దీంతో పనులకు టెండర్ల నిర్వహణ కోసం అనుమతులు నిలిచిపోయాయి.

➤ ఈఎన్‌సీ రామగుండం, ఈఎన్‌సీ గజ్వేల్ పోస్టులూ చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయి.

➤ జిల్లా స్థాయిలో కీలకమైన చీఫ్ ఇంజనీర్(సీఈ) పోస్టులూ పెద్ద సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. చాలామంది సీఈలు మూడు నాలుగు పోస్టుల్లో అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. రాష్ట్రంలో 22 టెరిటోరియల్ చీఫ్ ఇంజనీర్ (సీఈ) పోస్టులు ఉండగా, సగానికి పైగా ఖాళీగా ఉన్నాయి.

పదోన్నతులపై బ్రేక్..

ప్రస్తుతం శాఖలో 6 ఈఎన్‌సీ, 14 సీఈ, 35 ఎస్ఈ, మరో 35 ఈఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కొన్ని పోస్టుల్లో కింది స్థాయి ఇంజనీర్లను ప్రభుత్వం అదనపు బాధ్యతల్లో నియమించగా, మరికొన్ని పూర్తిస్థాయిలో ఖాళీగా ఉన్నాయి. సీఈ నుంచి ఈఎన్‌సీగా, ఎస్ఈ నుంచి సీఈగా పదోన్నతులు ఇవ్వాలని శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సిఫారసు చేసింది. ఆలోగా మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిన ఘటనకు బాధ్యులైన 38 మంది ఇంజనీర్లకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసి వారిపై చర్యలకు ఉపక్రమించింది. వీరిలో చాలా మంది పదోన్నతులపై ఉన్నతస్థాయి పోస్టుల్లో నియామకం కోసం ఎదురుచూస్తుండగా ఆ అవకాశాలు సన్నగిల్లాయి.

సీడీఓ, ఇంటర్ స్టేట్‌లో కీలక పోస్టులు ఖాళీ

➤ ప్రస్తుతం గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై ఏపీ, తెలంగాణ మధ్య వివాదం నడుస్తోంది. రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పంపిణీపై కృష్ణా ట్రిబ్యునల్-2 విచారణ కొనసాగుతోంది. శాఖలో ఈ వ్యవహారాలను పర్యవేక్షించే అంతర్రాష్ట్ర జలవనరుల విభాగానికి అధిపతి అయిన చీఫ్ ఇంజనీర్‌తోపాటు తర్వాతి స్థానంలో ఉండే సూపరింటెండింగ్ ఇంజనీర్ పోస్టు సైతం ఖాళీ అయ్యింది.

➤ కీలకమైన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీవో) అధిపతి అయిన సీఈ పోస్టు సైతం ఖాళీగా ఉంది. సీడీఓ ఎస్ఈకే సీఈగా అదనపు బాధ్యతలను అప్పగించగా, గత నెలాఖరున ఆయనా ఉద్యోగ విరమణ చేయడంతో సీడీఓ సీఈతో పాటు ఎస్ఈ పోస్టూ ఖాళీ అయ్యింది.

➤ కాళేశ్వరం ప్రాజెక్టు బరాజ్‌ల పునరుద్ధరణకు సీడీఓ డిజైన్లు అందించాల్సి ఉంది. హుస్సేన్‌సాగర్, హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల పర్యవేక్షణను చూసే హైదరాబాద్ సీఈ పోస్టు సైతం ఖాళీ కాగా, కొత్తవారిని నియమించలేదు. నగరంలోని చెరువులను పర్యవేక్షించే ఎస్ఈ పోస్టూ ఖాళీగా ఉంది.

ప్రాజెక్టుల నిర్వహణకు దిక్కులేదు

సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణలో తీవ్ర లోపాలు, తప్పిదాలు జరిగినట్టు కాళేశ్వరం బరాజ్‌లపై ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ సమర్పించిన నివేదిక తేటతెల్లం చేసింది. ఈ బాధ్యతలను పర్యవేక్షించే ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) పోస్టూ ఖాళీగా ఉండగా, మంచిర్యాల సీఈ టి.శ్రీనివాస్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. కృష్ణా, గోదావరి నదులకు వరదలు ఉప్పొంగుతుండగా వాటిపై నిర్మించిన ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణకు ఈ విభాగమే కీలకం.

19న అఖిలపక్ష సమావేశం: రిజిజు

21 నుంచి పార్లమెంటు సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో రెండు రోజులు ముందుగా 19వ తేదీన అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు గురువారం ఈ విషయాన్ని ప్రకటించారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు నెల రోజులపాటు జరగనున్నాయి. ఈ ప్రతిపాదనకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని కిరణ్ రిజిజు 'ఎక్స్'లో వెల్లడించారు. స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 13, 14వ తేదీల్లో సమావేశాలు ఉండవని చెప్పారు. పార్లమెంటు సమావేశాలను ఆగస్టు 12వ తేదీతోనే ముగించాలని ముందుగా నిర్ణయించారు. అయితే కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన వాటిని అమలు చేయడానికే సమావేశాల వ్యవధిని మరో తొమ్మిది రోజులు పొడిగించినట్లు సమాచారం. సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక, సామాజిక సంక్షేమానికి సంబంధించిన బిల్లులతో సహా పలు ముఖ్యమైన బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

హమాస్ అంతం ఖాయం: నెతన్యాహూ

అష్కెలాన్: గాజావ్యాప్తంగా తమతో పోరాడుతున్న హమాస్ సాయుధ సంస్థను శాశ్వతంగా అంతం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ప్రతినబూనారు. హమాస్‌ను తుదముట్టించడంలో మరో ప్రశ్నకు తావులేదని ఆయన కుండబద్దలు కొట్టారు. హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయెలీలు, విదేశీయులను ఎలాగైనా విడిపించుకుంటామని ఆయన ధీమా వ్యక్తంచేశారు. 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ మొగ్గు చూపుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే నెతన్యాహూ ఇలా భిన్నమైన ప్రకటన చేయడం గమనార్హం. ఓవైపు మధ్యవర్తిత్వ చర్చల కోసం ఈజిప్ట్, ఖతార్‌లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ఇప్పటికే హమాస్ ప్రతినిధులు ప్రకటించారు. గాజా ఉత్తర సరిహద్దు సమీపంలోని ఇజ్రాయెల్ నగరం అష్కెలాన్‌లో బుధవారం జరిగిన ఒక పైప్‌లైన్ నిర్మాణ కార్యక్రమంలో నెతన్యాహూ పాల్గొని ప్రసంగించారు. ''హమాస్ వద్ద బందీలుగా ఉన్నవారందరినీ విడిపిస్తాం. హమాస్‌ను గాజా గడ్డ నుంచి తుడిచేస్తాం. ఇకపై గాజాలో హమాస్ పేరు వినపడకుండా చేస్తాం. హమాస్‌ల ఏలుబడిలో 'హమస్థాన్' అనేది ఉనికిలోకి రాకుండా చేస్తాం. హమాస్‌ను అంతమొందించే వరకు వెనకడుగు వేయబోం. హమాస్‌ను కూకటివేళ్లతో సహా పెకలిస్తాం'' అని నెతన్యాహూ అన్నారు.

వారసుడిపై నిర్ణయం దలైలామాదే

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: 15వ దలైలామా ఎంపికపై 14వ దలైలామాకు, ఆయనకు సంబంధించిన గాడెన్ ఫొడ్రంగ్ ట్రస్టుకు తప్ప ఇంకెవరికీ హక్కు, అధికారం లేవని కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తేల్చిచెప్పారు. ఆ వ్యవహారంలో ఇతరులు జోక్యం చేసుకోవడానికి వీల్లేదని స్పష్టంచేశారు. వారసుడిని దలైలామానే ఎంపిక చేసుకుంటారని, ఆ విషయం ఆయనకే వదిలేయాలని చెప్పారు. తదుపరి దలైలామా ఎంపికపై భారత ప్రభుత్వం స్పందించడం ఇదే మొదటిసారి. తన వారసత్వం కొనసాగుతుందని, కొత్త దలైలామాను ఎంపిక చేస్తామని, ఇందులో చైనా ప్రమేయం ఉండదని టిబెట్ బౌద్ధ ఆధ్యాత్మిక గురువు, 14వ దలైలామా బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కిరణ్ రిజిజు గురువారం మీడియాతో మాట్లాడారు. నూతన దలైలామా ఎంపిక ప్రస్తుత దలైలామాతోపాటు నిర్దేశిత ట్రస్టు ద్వారానే జరగాలని ఆయన అనుచరులంతా కోరుకుంటున్నట్లు తెలిపారు. శతాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం జరగాల్సిన ఈ ప్రక్రియలో ఇతరులు కలుగజేసుకోవడం సరైంది కాదన్నారు. పరోక్షంగా చైనా తీరును కిరణ్ రిజిజు తప్పుపట్టారు. 15వ దలైలామా ఎంపికకు తమ ఆమోదం ఉండాల్సిందేనని చైనా ఇప్పటికే స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

మాలిలో ముగ్గురు భారతీయుల కిడ్నాప్

బమాకో: పశ్చిమ మాలిలోని డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న ముగ్గురు భారతీయులు కిడ్నాప్‌కు గురయ్యారు. నిషేధిత ఉగ్రవాద సంస్థ అల్–ఖైదాతో సంబంధం ఉన్న ఉగ్రవాదులు అపహరించారని అధికారులు గురువారం ధ్రువీకరించారు. మంగళవారం నాడు మాలిలోని కేస్ ప్రాంతంలో ఉన్న డైమండ్ సిమెంట్ ఫ్యాక్టరీపై భారీగా ఆయుధాలు ధరించిన ముష్కరులు దాడి చేశారు. ఫ్యాక్టరీలోకి చొరబడి కార్మికులను బందీలుగా పట్టుకున్నారు. ఈ అపహరణ వెనుక అల్ ఖైదాతో సంబంధం ఉన్న జమాత్ నుస్రత్ అల్–ఇస్లాం వాల్–ముస్లిమిన్ హస్తం ఉందని అనుమానిస్తున్నారు. ఈ ఉగ్రవాద సంస్థ మాలి అంతటా అనేక దాడులు చేసింది. దాడిపై భారత విదేశాంగ స్పందించింది. దుర్భరమైన హింసాత్మక చర్యను ఖండించింది. కార్మికులు సురక్షితంగా విడుదల య్యేలా చూడాలని మాలి ప్రభుత్వాన్ని కోరింది.

రూ.1.05 లక్షల కోట్ల రక్షణ కొనుగోళ్లకు ఆమోదం

న్యూఢిల్లీ: రక్షణ శాఖకు అవసరమైన ఆయుధాలు, రక్షణ వ్యవస్థలు, సామగ్రి కొనుగోలుకు ఆమోదం లభించింది. ఈ కొనుగోలు విలువ రూ.1.05 లక్షల కోట్లు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని రక్షణ సేకరణ మండలి(డీఏసీ) దీనికి గురువారం ఆమోదముద్ర వేసింది. ఈ ఆయుధాలు, సామగ్రిని దేశీయంగానే కొనుగోలు చేస్తారు. రూ.44 వేల కోట్ల విలువైన 12 మైన్ కౌంటర్–మెజర్స్ వెస్సెల్స్ కూడా ఉన్నాయి. వీటిని భారత నావికాదళం ఉపయోగించుకోనుంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత అత్యాధునిక ఆయుధాల సేకరణపై భారత రక్షణ శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది.

అంతరిక్షంలో అతిథి

మన సౌరకుటుంబంలోకి తరలివచ్చిన తోకచుక్క

భూమి దిశగా గ్రహశకలాలు దూసుకొస్తూ అతిథుల్లా పలకరిస్తుంటాయి. అయితే ప్రచండ వేగంతో రావడంతో భూవాతావరణంలోకి రాగానే మండిపోయి మసైపోతాయి. కానీ దేదీప్యమానంగా వెలిగిపోయే తోకతో మెరుపువేగంతో దూసుకొచ్చే తోకచుక్క ఇందుకు మినహాయింపు. ఆకాశంలో కనిపించినంతసేపు కనువిందు చేయడం దీని ప్రత్యేకత. అలాంటి తోక చుక్క ఒకటి మన సౌరమండలంలోకి అతిథిగా వచ్చిందని నాసా శాస్త్రవేత్తలు తాజాగా ప్రకటించారు. దీనికి 3ఐ/అట్లాస్ అని నామకరణం చేశారు. చరిత్రలో ఇప్పటిదాకా సౌరకుటుంబం ఆవలి నుంచి వచ్చిన మూడో కొత్త తోకచుక్క ఇదేనని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చిలీలోని రియో హర్టాడో నగరంలో ఏర్పాటుచేసిన ఆస్ట్రరాయిడ్ టెర్రిస్ట్రియల్–ఇంపాక్ట్ లాస్ట్ అలర్ట్ సిస్టమ్(అట్లాస్) సర్వే టెలిస్కోప్, అమెరికా శాన్‌డీగో కౌంటీలోని పాలమార్ అబ్జర్వేటరీ జ్వికీ టెలిస్కోప్‌లు ఈ తోకచుక్క రాకను జూలై ఒకటో తేదీన కనిపెట్టాయి. ధనస్సు రాశిగా పిలవబడే నక్షత్ర కూటమి వైపు నుంచి ఈ తోకచుక్క మన సౌరకుటుంబం దిశగా వచ్చిందని శాస్త్రవేత్తలు గుర్తించారు.

భూమికెలాంటి ప్రమాదం లేదన్న సైంటిస్టులు

ప్రస్తుతం ఈ తోకచుక్క భూమికి 67 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఇంతదూరం నుంచి వెళ్తుండటంతో దీని కారణంగా భూమికి ఎలాంటి ప్రమాదం లేదని అధ్యయనకారులు తేల్చిచెప్పారు. ఈ తోకచుక్క తన మార్గంలో పయనిస్తూనే సూర్యుని సమీపంగా వెళ్లనుంది. ప్రస్తుతం ఇది సూర్యునికి 67 కోట్ల కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్టోబర్ 30వ తేదీన ఆదిత్యునికి అతి దగ్గరగా వెళ్లనుంది. కేవలం 21 కోట్ల కిలోమీటర్ల దూరం నుంచి అది తన పథంలో దూసుకుపోనుంది. అంటే అంగారక గ్రహం కంటే కూడా ఇది సూర్యుని సమీపానికి వెళ్లనుంది. సెప్టెంబర్ నెల వరకు ఖగోళ ఔత్సాహికులు ఈ తోకచుక్కను టెలిస్కోప్ సాయంతో చూడొచ్చు. తర్వాత అది సూర్యుని ఆవలిదిశ వైపుగా వెళ్లడంతో భూమి మీద నుంచి తోకచుక్క సరిగా కనిపించకపోవచ్చు. మళ్లీ డిసెంబర్ తర్వాత కనువిందు చేయనుంది. గతంలో 2017లో ఒక తోకచుక్క, 2019లో మరో తోకచుక్క ఇలా మన సౌరకుటుంబంలోకి అలా అతిథులుగా వచ్చి ఇలా వెళ్లిపోయాయి. 1ఐ/ఓముఆమువా, 2ఐ/బొరిసోవ్ తోకచుక్కల తరహాలోనే ఇది కూడా తోకచుక్కలకు సంబంధించిన మరింత వాస్తవిక సమాచారాన్ని అందించి వెళ్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కొత్త తోకచుక్క కావడంతో దీని తోక పొడవు, వెడల్పుల వివరాలు ఇంకా తెలియలేదు. కొత్త తోకచుక్కను సీ/2025 ఎన్1 అనే పేరుతోనూ పిలుస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

బలమైన భారత్‌తో స్థిరమైన ప్రపంచం

ఘనా పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

- గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకకు బలం ఇవ్వాలి
- ప్రపంచ పాలనా విధానంలో సంస్కరణలు రావాల్సిందేన్న ప్రధాని

అక్రా: భారతదేశం బలంగా ఉంటే ప్రపంచం మరింత స్థిరంగా, సౌభాగ్యవంతంగా మారుతుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచ పరిణామాలు వేగంగా మారిపోతున్న నేపథ్యంలో ప్రపంచ పాలనా విధానంలో విశ్వసనీయమైన, ప్రభావవంతమైన సంస్కరణలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందని స్పష్టంచేశారు. ఘనా పార్లమెంట్‌లో గురువారం ప్రధాని మోదీ ప్రసంగించారు. దక్షిణార్ధ గోళ దేశాల (గ్లోబల్ సౌత్) గొంతుకకు బలం, విలువ ఇవ్వకపోతే ప్రపంచ అభివృద్ధి సాధ్యం కాదని తేల్చిచెప్పారు. ప్రస్తుత ప్రపంచ అనిశ్చిత పరిస్థితుల్లో స్థిరమైన భారత ప్రజాస్వామ్యం ఒక ఆశారేఖగా వెలిగిపోతోందని హర్షం వ్యక్తంచేశారు. ఇండియా సాధిస్తున్న వేగవంతమైన అభివృద్ధి ప్రపంచ ప్రగతికి ఉత్ప్రేరకంగా మారిందన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ప్రపంచానికి ఒక బలమైన మూలస్తంభంగా నిలుస్తోందన్నారు. భారత్ మరింత బలోపేతమైతే ప్రపంచ స్థిరత్వానికి, సౌభాగ్యానికి తిరుగు ఉండదని స్పష్టంచేశారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

నినాదాలకు మించిన కార్యాచరణ

''అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఇండియా అగ్రస్థానంలో ఉంది. స్థిరమైన పాలన, రాజకీయ వ్యవస్థ అనే పునాదిపై ఇండియా త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం తథ్యం. గ్లోబల్ సౌత్‌లో మా వాటా 16 శాతంగా ఉంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ మా దేశంలోనే ఉంది. ఇండియా ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌గా మారింది. పెట్టుబడులకు అంతర్జాతీయ కంపెనీలు ముందుకొస్తున్నాయి. మరోవైపు ప్రపంచానికి కొత్తకొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. వాతావరణ మార్పులు, మహమ్మారులు, ఉగ్రవాదం, సైబర్ సెక్యూరిటీ వంటివి సమస్యగా మారాయి. గత శతాబ్దంలో ఏర్పాటైన అంతర్జాతీయ సంస్థలు వీటిని పరిష్కరించలేకపోతున్నాయి. అందుకే గ్లోబల్ గవర్నెన్స్‌లో విశ్వసనీయమైన, ప్రభావంతమైన సంస్కరణలు కచ్చితంగా రావాలి. ప్రపంచం బాగు కోసం గ్లోబల్ సౌత్‌కు మరింత బలం చేకూరాలి. నినాదాలకు మించిన కార్యాచరణ కావాలి. జీ20 కూటమికి మేము సారథ్యం వహించినప్పుడు 'ఒకే భూగోళం, ఒకే కుటుంబం, ఒక భవిష్యత్తు' అనే విజన్‌తో పనిచేశాం. మా హయాంలోనే ఆఫ్రికన్ యూనియన్ జీ20లో శాశ్వత సభ్యదేశంగా మారింది.

ఆఫ్రికా అభివృద్ధి ఎజెండాకు మద్దతు

ఆఫ్రికా అభివృద్ధి ప్రయాణంలో పాలుపంచుకొనేందుకు ఇండియా కట్టుబడి ఉంది. ఆఫ్రికా ప్రజల అభ్యున్నతి కోసం ఆఫ్రికా అభివృద్ధి ఎజెండా–2063కు మద్దతిస్తున్నాం. ఆఫ్రికా లక్ష్యాలు మాకు ప్రాధాన్యతలు. కలిసి పనిచేస్తూ సమానంగా ఎదగాలన్నదే మా విధానం. ఆఫ్రికాతో మా అభివృద్ధి భాగస్వామ్యం కొనసాగుతుంది. స్థానికంగా నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల సృష్టికి కృషి చేస్తాం. ఆఫ్రికాలో కేవలం పెట్టుబడులు పెట్టడమే కాదు, స్థానిక ప్రజల సాధికారతే మా ధ్యేయం. స్ఫూర్తిదాయకమైన చరిత్ర కలిగిన ఘనాలో పర్యటిస్తుండడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. ప్రజాస్వామ్యానికి తల్లిలాంటిది భారత్. మాకు ప్రజాస్వామ్యం అంటే కేవలం ఒక వ్యవస్థ కాదు.. మా ప్రాథమిక విలువల్లో అదొక అంతర్భాగం. ఇండియాలో ప్రజాస్వామ్యానికి వేలాది సంవత్సరాల చరిత్ర ఉంది. నిజమైన ప్రజాస్వామ్యం చర్చ, సంవాదాన్ని ప్రోత్సహిస్తుంది. అది ప్రజలను ఐక్యం చేస్తుంది. గౌరవం, మానవ హక్కులకు అండగా నిలుస్తుంది. ఏ దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకైనా పారదర్శక, స్వేచ్ఛాయుత ఎన్నికలు ఆత్మలాంటివి. ఇండియాలో ఎన్నికల సంఘం పనితీరును దగ్గరగా గమనించడం ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది'' అని ప్రధానమంత్రి స్పష్టంచేశారు. ఘనా పార్లమెంట్‌లో ఘనా–ఇండియా పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ సొసైటీని స్థాపించడాన్ని ఆయన స్వాగతించారు. ఇండియాలో 2,500 రాజకీయ పార్టీలున్నాయని మోదీ చెప్పగా ఘనా పార్లమెంట్ సభ్యులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు.



ఘనా పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

భారత్–ఘనా మధ్య 'సమగ్ర భాగస్వామ్యం'

భారత్–ఘనా దేశాలు తమ పరస్పర సంబంధాలను 'సమగ్ర భాగస్వామ్యం' స్థాయికి పెంచుకున్నాయి. ఘనా అభివృద్ధి ప్రయాణానికి భారత్ తోడుగా నిలుస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆయన గురువారం ఘనా అధ్యక్షుడు జాన్ ద్రమానీ మహామాతో సమావేశమయ్యారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం మోదీ ఒక ప్రకటన విడుదల చేశారు. భారత్–ఘనా మధ్య పరస్పర వాణిజ్యాన్ని రాబోయే ఐదేళ్లలో రెండింతలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రెండు రోజుల పర్యటన కోసం మోదీ బుధవారం రాత్రి ఘనా చేరుకున్నారు. తొలుత ఘనా అధ్యక్షుడితో కలిసి ప్రతినిధుల స్థాయి చర్చల్లో పాల్గొన్నారు. గురువారం ఇరువురు నేతలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య నాలుగు కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. సంస్కృతి, సంప్రదాయ వైద్యంతోపాటు వేర్వేరు రంగాల్లో సహకారం కోసం ఈ ఒప్పందాలు కుదిరాయి. ఘనాకు భారత్ కేవలం భాగస్వామి మాత్రమే కాదని, ఘనా దేశ నిర్మాణంలో అండగా నిలుస్తోందని మోదీ ఉద్ఘాటించారు.

మోదీకి ఘనా జాతీయ గౌరవ పురస్కారం

ప్రధాని నరేంద్ర మోదీకి ఘనా జాతీయ గౌరవ పురస్కారం 'ద ఆఫీసర్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ ఆఫ్ ఘనా' లభించింది. ఘనా అధ్యక్షుడు జాన్ ద్రమానీ మహామా ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేశారు. ప్రశంసనీయమైన రాజనీతిజ్ఞత ప్రదర్శించడంతోపాటు ప్రపంచ స్థాయి నేతగా ప్రభావం చూపుతున్నందుకు గాను మోదీని ఘనా ప్రభుత్వం ఈ పురస్కారంతో సత్కరించింది. ఇది తనకు దక్కిన గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు. ఇది ఎంతో గర్వకారణమని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయుల తరఫున ఘనా జాతీయ గౌరవ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నట్లు వ్యాఖ్యానించారు.

ముగిసిన ఘనా పర్యటన

భారత ప్రధానమంత్రి ఘనాలో రెండు రోజుల పర్యటన ముగించుకొని గురువారం ట్రినిడాడ్ అండ్ టొబాగో దేశానికి పయనమయ్యారు. శుక్రవారం ఆ దేశ పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మోదీ ప్రసంగించే అవకాశం ఉంది.

'ఒక్కటి'గా వచ్చి ముక్కలుగా తరలె!

ఎంతకూ ఎగరని అత్యాధునిక బ్రిటన్ ఎఫ్–35 యుద్ధవిమానం ● విడగొట్టి విడిభాగాలుగా తరలించనున్న యూకే!

తిరువనంతపురం: ప్రపంచంలోని అత్యంత అధునాతన యుద్ధవిమాన రకాల్లో ఒకటిగా నిలిచిన ఎఫ్–35బీ స్టెల్త్ ఫైటర్‌జెట్ చివరకు నట్లు బోల్ట్‌లు ఊడదీసుకుని సీ–17 గ్లోబ్‌మాస్టర్ భారీ సరుకు రవాణా విమానంలో స్వదేశానికి తిరుగుపయనం కానుంది. దాదాపు 20 రోజులుగా తిరువనంతపురం విమానాశ్రయ రన్‌వేపైనే నిలిచిపోయిన ఈ యుద్ధవిమానాన్ని ఎన్ని మరమ్మతులు చేసినా ఇంజనీర్లు మళ్లీ గాల్లోకి టేకాఫ్ చేయలేకపోయారు. చివరకు దీనిని సరకు రవాణా విమానంలో విడిభాగాలుగా మోసుకెళ్లడం తప్ప మరో మార్గం లేదని తేల్చేశారు. ఈ ఎఫ్–35బీ విమానం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మోహరించిన బ్రిటన్‌కు చెందిన యుద్ధవిమాన వాహకనౌక 'హెచ్ఎంఎస్ ప్రిన్స్ ఆఫ్ వేల్స్' నుంచి బయల్దేరి, తిరిగి మళ్లీ దాని మీదనే ల్యాండ్ కావాల్సి ఉంది. కానీ అననుకూల పరిస్థితుల్లో అత్యవసరంగా కేరళలోని తిరువనంతపురం ఎయిర్‌పోర్ట్‌లో జూన్ 15వ తేదీ ఉదయం అత్యవసరంగా ల్యాండయింది. ఆ తర్వాత ఇంతవరకు ఒక్క మీటర్ కూడా పైకి ఎగరలేదు. దీని కనీస ధర రూ.940 కోట్లు అని రక్షణరంగ వర్గాలు వెల్లడించాయి. ఇంతటి ఖరీదైన యుద్ధవిమానం 4వ నంబర్ రన్‌వేపై మొరాయించడంతో బ్రిటన్ వెంటనే రాయల్ నేవీ ఏడబ్ల్యూ101 మెర్లిన్ హెలికాప్టర్‌లో సీనియర్ ఇంజనీర్లను పంపించింది. వాళ్లు ఎంత రిపేర్లు చేసినా లాభం లేకుండాపోయింది. జూలై ఐదో తేదీన 40 మంది ఇంజనీర్లు, మెకానిక్‌లు, సిబ్బందితోకూడిన బృందం తిరువనంతపురం నగరానికి చేరుకుని దీని రెక్కలను విడదీసి అతిపెద్ద గ్లోబ్‌మాస్టర్ విమానంలోకి ఎక్కించనున్నారు.

ప్రచారసాధనంగా లోహవిహంగం

ఇలా 20 రోజులుగా అక్కడే ఉండటంతో కేరళలో ఇదొక పర్యాటక అంశంగా మారింది. ''భూతల స్వర్గంగా భావించే కేరళకు విదేశీయులు వచ్చి మళ్లీ వెళ్లిపోవడానికి ఇష్టపడరు. అలాగే ఈ విదేశీ విమానం కూడా అలాగే ఇక్కడే ఉంటానని మొండికేస్తోంది'' అనే వాక్యాలు ఇప్పుడు కేరళలో తెగ పాపులర్ అయ్యాయి. వీటి మీద మీమ్స్ వరద వెల్లువెత్తుతోంది. కేరళ పర్యాటకశాఖ సైతం ఈ విమానాన్ని తమ ప్రచార సాధనంగా మార్చుకుంది. '' కేరళ ఎంతో అందమైన ప్రదేశం. ఈ రమణీయతను చూస్తూ నేనిక్కడే ఉండిపోతా. అందరికీ నేను ఇదే సలహా ఇస్తా'' అని స్వయంగా ఈ విమానం చెబుతున్నట్లుగా ఒక పోస్టర్‌ను సిద్ధంచేసి ప్రచారంలోకి తెచ్చింది. '' ఇక్కడే ఉండాలని కోరుకుంటున్నందుకు థాంక్యూ'' అంటూ కేరళ టూరిజం తన 'ఎక్స్' ఖాతాలో మరో పోస్ట్‌పెట్టింది. ఈ యుద్ధవిమానాన్ని అమెరికాకు చెందిన లాక్‌హీడ్ మార్టిన్ అనే ప్రైవేట్ రక్షణరంగ తయారీసంస్థ రూపొందించింది. ఐదో తరం స్టెల్త్ యుద్ధవిమానాల్లో ఇది అధునాతనమైంది.



అమర్‌నాథ్ యాత్ర షురూ

- బాబా బర్ఫానీకి అందిన తొలి హారతి
- పహల్గాం, బాల్టాల్ క్యాంప్‌ల నుంచి బయలుదేరిన మొదటి బృందం
- ఆగస్టు 9వ తేదీతో ముగియనున్న యాత్ర
- భారీ బందోబస్తు చేపట్టిన యంత్రాంగం

సాక్షి, న్యూఢిల్లీ: హిమాలయాల్లోని పవిత్ర అమర్‌నాథ్ గుహలోని మంచు స్ఫటిక శివలింగ దర్శనానికి వేళయ్యింది. అత్యంత కఠినమైన, అననుకూల వాతావరణం మధ్య మొత్తం 38 రోజులపాటు సాగే అమర్‌నాథ్ యాత్ర గురువారం ప్రారంభమైంది. ఉదయం 3,880 మీటర్ల ఎత్తులోని అమర్‌నాథ్ గుహలో బాబా బర్ఫానీకి తొలి హారతి కార్యక్రమం నిర్వహించారు. వందలు, వేల కిలోమీటర్ల దూరం నుంచి వచ్చిన భక్తుల్లో మొదటి యాత్రికుల బృందం పహల్గాం, బాల్టాల్ బేస్ క్యాంప్‌ల నుంచి 'హర్ హర్ మహాదేవ్', 'బమ్ బమ్ భోలే' నినాదాలతో గుహ దిశగా ప్రయాణం ప్రారంభించారు. బుధవారం జమ్మూలోని భగవతీ నగర్ క్యాంప్ నుంచి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపడంతో 168 వాహనాల్లో 5,892 మందితో కూడిన యాత్రికుల తొలి బృందం పయనమైంది. ఈ యాత్ర ఆగస్టు 9వ తేదీన రక్షాబంధన్ రోజున ముగుస్తుంది. ఇప్పటికే 3.5 లక్షలకుపైగా భక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. జమ్మూలోని సరస్వతీ ధామ్, వైష్ణవి ధామ్, పంచాయతీ భవన్, మహాజన్ సభ వంటి కేంద్రాల్లో రోజూ సుమారు 2,000 మంది రిజిస్ట్రేషన్లను చేసుకుంటున్నారు. 2011లో అత్యధికంగా 6.34 లక్షల మంది భక్తులు అమర్‌నాథుని దర్శించుకున్నారు. ఈసారి ఇప్పటి వరకు యాత్రకు 3.5 లక్షల మంది ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారు.

ఘనమైన భద్రతా ఏర్పాట్లు

1990 నుంచి 2017 వరకు అమర్‌నాథ్ యాత్ర మార్గంలో 36 వరకు ఉగ్రవాద దాడులు జరిగాయి. ఈ దాడుల్లో 53 మంది యాత్రికులు మరణించగా, మరో 167 మంది గాయపడ్డారు. 2000లో అమర్‌నాథ్ యాత్రపై మొదటి ఉగ్రవాద దాడి జరిగింది. ఈ ఏడాది యాత్రను ప్రశాంతంగా పూర్తి చేయడానికి జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్, ఆర్మీ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశాయి. ప్రధానమైన పహల్గాం, బాల్టాల్ మార్గాల్లో కాంక్రీటు బంకర్లు, చెక్‌పోస్టులు, డ్రోన్ల ద్వారా నిత్యం నిఘా కొనసాగిస్తున్నారు. యాత్రికుల వాహనాలు పాస్‌ల ద్వారా మాత్రమే అనుమతులు పొందుతున్నాయి. పలు అంచెల భద్రతా ఏర్పాట్లలో భాగంగా ప్రతి దశలో మెటల్ డిటెక్టర్లు, డాగ్ స్క్వాడ్లతో అణువణువూ తనిఖీలు చేస్తున్నారు.



రెండు రూట్ల ద్వారా యాత్ర

పహల్గాం రూట్: 48 కిలోమీటర్ల దూరం, సుమారు 5 రోజులు పడుతుంది. పహల్గాం నుంచి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న చందన్వాడి వరకు యాత్ర తేలిక. అక్కడి నుంచి 3 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న పిస్సూ టాప్, ఆపై మరో 9 కిలోమీటర్లు నడవాలి. సాయంత్రానికి శేషనాగ చేరుకుంటారు. రెండో రోజు అక్కడ్నుంచి 14 కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచతరణి చేరుకుంటారు. ఆపైన చివరిగా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న అమర్‌నాథ్ గుహకు పయనమవుతారు.

బాల్టాల్ మార్గం: యాత్ర సమయం తక్కువగా ఉన్న వారు ఈ మార్గంలో వెళ్లవచ్చు. సుమారు 16 కిలోమీటర్ల దూరముండే ఈ మార్గంలో సుమారు 2 రోజుల్లో పవిత్ర గుహకు చేరుకునే వీలుంది. అయితే ఇది కాస్త కఠినమైన పర్వతమయం, మలుపులతో కూడిన మార్గం. వృద్ధులకు అనువైంది కాదు.

అట్టుడుకుతున్న యూరప్

- ఎండల తీవ్రతకు 8 మంది మృతి
- స్విస్ అణు రియాక్టర్ మూసివేత

బెర్లిన్: యూరప్ దేశాల్లో వడగాడ్పుల తీవ్రత కొనసాగుతోంది. ఇప్పటివరకు స్పెయిన్‌లో నలుగురు, ఇటలీ, ఫ్రాన్స్‌లో ఇద్దరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. కార్చిచ్చు ముప్పు పొంచి ఉండటంతో ప్రభుత్వాలు ముందు జాగ్రత్త చర్యలకు ఉపక్రమించాయి. స్విట్జర్లాండ్‌లోని బెజ్నౌ అణు రియాక్టర్‌ను మూసివేశారు. మరో అణు రియాక్టర్‌లో విద్యుదుత్పత్తిని సగానికి తగ్గించారు. స్పెయిన్‌లోని కాటలోనియా ప్రాంతంలో కార్చిచ్చుతో ఇద్దరు చనిపోయారు. ఎండల వేడిమికి తాళలేక 300 మంది ఆస్పత్రి పాలయ్యారని ఫ్రాన్స్ మంత్రి ఒకరు వివరించారు. ఇటలీ ప్రభుత్వం 18 నగరాల్లో రెడ్ అలెర్ట్ ప్రకటించింది. జర్మనీలోని అత్యధిక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్ దాటాయి. దీంతో, జనం వేడి నుంచి ఉపశమనం కోసం ఓపెన్ ఎయిర్ స్విమ్మింగ్ పూల్స్, సరస్సులను ఆశ్రయిస్తున్నారు. జర్మనీలోని చాలా ప్రాంతాల్లో స్కూళ్లను మూసివేశారు. బ్రాండెన్‌బర్గ్, సాగ్జనీల్లో పలు ప్రాంతాల్లో మొదలైన కార్చిచ్చును ఫైర్ సిబ్బంది అదుపులోకి తెచ్చారు. పర్యాటక ప్రాంతాలైన పారిస్‌లోని ఈఫిల్ టవర్‌తోపాటు బ్రస్సెల్స్‌లోని అటోమియంను మూసివేశారు.

యూపీ, కేరళ విద్యార్థులతో శుభాంశు మాటామంతీ

- ఐఎస్ఎస్ లోపలి వాతావరణాన్ని చూసి అబ్బురపడిన విద్యార్థులు
- విద్యార్థుల ప్రశ్నలకు సావధానంగా శుక్లా సమాధానం

లక్నో/తిరువనంతపురం: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోని భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లాతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి కేరళ, ఉత్తరప్రదేశ్ పాఠశాల విద్యార్థులు అత్యంత అరుదైన, మాటల్లో చెప్పలేని అనుభూతిని పొందారు. భారరహిత స్థితిలో స్వేచ్ఛగా గాల్లో కదలాడుతూ బంతితో ఆడుకుంటున్న శుక్లాను చూసి ఆ విద్యార్థులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. పట్టరాని ఆనందంతో పదే పదే ప్రశ్నలు సంధించారు. వాళ్ల ప్రశ్నలకు శుక్లా వివరణాత్మక సమాధానాలిచ్చారు. '' ఆయన అలా శూన్యస్థితిలో చక్కర్లు కొడుతుంటే ఎంతో చూడముచ్చటగా ఉంది. మేము అడిగిన ఎన్నో ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. ఐఎస్ఎస్‌లో ఎలా గాల్లో ఈదినట్లుగా ముందుకు కదలాలో ఆయన స్వయంగా కదిలి చూపించారు'' అని కోజికోడ్‌లోని నయార్‌కుళి ప్రభుత్వ హయ్యర్ సెకండరీ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని సంఘవి చెప్పారు. శుక్లా సొంతూరు లక్నోలో, తిరునంతపురంలోని విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లోని విద్యార్థులూ ఆయనతో మాట్లాడారు. ఐఎస్ఎస్‌లో ఉన్నప్పుడు వ్యోమగాములు ఎలాంటి ఆహారం తీసుకుంటారు?. అలా కదులుతూ ఉంటే నిద్రపోవడమెలా?. హఠాత్తుగా ఒంట్లో బాగోలేకపోతే డాక్టర్ ఉండరుగా. అప్పుడెలా?. ఇక్కడి నుంచి ఐఎస్ఎస్‌కు వెళ్లాక ఎంతకాలానికి అక్కడి వాతావరణానికి అలవాటుపడతారు?. తిరిగొస్తే ఇక్కడ మామూలుగా మారడానికి ఎంత టైమ్ పడుతుంది?.. ఇలా విద్యార్థులు అడిగిన ఎన్నో ప్రశ్నలకు శుక్లా సమాధానాలు చెప్పారు. '' ఐఎస్ఎస్‌లో నిద్రపోవడం ఒక సరదా పని. ఇక్కడ నేల, పైకప్పు రెండూ ఉండవు. అందుకే కొందరు గోడలకు, కొందరు సీలింగ్‌కు అతుక్కుని నిద్రిస్తూ కనిపిస్తారు. కదలకుండా పడుకోవాలంటే నిద్రపోయే స్లీపింగ్ బ్యాగ్‌ను దేనికైనా కట్టేసుకోవాల్సిందే'' అని ఆయన నవ్వుతూ చెప్పారు. దీంతో విద్యార్థులు విరగబడి నవ్వారు. '' ఇక్కడి వచ్చినప్పటితో పోలిస్తే ఇప్పుడు నేను ఎంతో మెరుగ్గా ఉన్నా. భారరహిత స్థితికి అలవాటు పడటం కాస్తంత ఇబ్బందిగా ఉంటుంది. తిరిగి భూమి మీదకొచ్చాక గురుత్వాకర్షణ స్థితికి మారడం కూడా ఒక సవాలే'' అని శుక్లా అన్నారు. '' ఒంటరిగా ఉన్నామని ఫీల్ అయితే వెంటనే కుటుంబసభ్యులు, స్నేహితులతో వర్చువల్‌గా మాట్లాడి మనసును తేలికచేసుకుంటాం. తరచూ వ్యాయామం చేస్తాం. ప్రయోగాలు సరేసరి'' అంటూ శుక్లా చెప్పుకొచ్చారు. ఇస్రో వారి విద్యార్థి సంవాద్ కార్యక్రమంలో భాగంగా వ్యోమగాములతో విద్యార్థుల మాటామంతీ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. '' ఎప్పుడైనా కొన్ని నిమిషాలు తీరిక సమయం దొరికితే వెంటనే కిటికీల వద్దకు వెళ్లి అంతరిక్ష నుంచి మన పుడమిని చూడటం ఎంతో ఆసక్తికరంగా, ఆనందంగా ఉంటుందని ఆయన నాతో చెప్పారు'' అని ఒక విద్యార్థి 'పీటీఐ వీడియోస్'తో చెప్పింది.

హైకోర్టు చెప్పినా అమలు చేయరాయే!

19 ఏళ్లుగా దేవాదాయ శాఖలో పదోన్నతులు లేవు

- దాన్ని సరిదిద్ది డీపీసీ రివ్యూ చేయాలంటూ కోర్టుల ఆదేశం
- అందుకు వీలుగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు
- అయినా కసరత్తు ప్రారంభించని అధికారులు



సాక్షి, హైదరాబాద్: పరిపాలన ట్రిబ్యునల్ చెప్పింది..హైకోర్టు ఆదేశించింది..ఆ మేరకు ప్రభుత్వం అనుమతి జారీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. కానీ, అందుకు సంబంధించిన కసరత్తు మాత్రం ప్రారంభించటం లేదు. ఆ కసరత్తుకు కావాల్సిన పేపర్ వర్క్ చేయడానికి కమిషనర్ ఆదేశిస్తే సిబ్బంది నుంచి సమాధానమే కరువవుతోంది. దాదాపు ఐదు పర్యాయాలు కోరినా, ఓ రకంగా సహాయ నిరాకరణ కనిపిస్తోంది. ఇది దేవాదాయ శాఖలో అధికారుల పదోన్నతుల వ్యవహారంలో నెలకొన్న విచిత్ర పరిస్థితి. వెరసి దాదాపు 19 ఏళ్లుగా పూర్తిస్థాయి పదోన్నతులు కల్పించకపోవటంతో దేవాదాయ శాఖలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఇప్పుడు పదోన్నతుల ప్రక్రియ ముందుకెళ్లకుండా.. కోర్టు తీర్పు అమలు చేస్తే తాము సీనియారిటీ కోల్పోతామన్న ఉద్దేశంతో కొందరు కావాలనే పరపతి ఉపయోగించి జాప్యం చేస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇదీ సంగతి

దేవాదాయ శాఖ పరిధిలోని దేవాలయాలు, ప్రధాన కార్యాలయంలో దాదాపు 19 ఏళ్లుగా పదోన్నతులు కల్పించలేదు. 2006 నుంచి 2009 మధ్య అడ్హాక్ ప్రమోషన్లు కల్పించినా, అవి లోపభూయిష్టమని ఇటీవల తేలింది. వెరసి 2006 నుంచి సీనియారిటీని లెక్కగట్టి పదోన్నతులు కల్పించాలి. ఈ మేరకు పరిపాలన ట్రిబ్యునల్, హైకోర్టులు ఆదేశించినా అది అమలు కావటం లేదు. దేవాదాయ శాఖలోని సహాయక కమిషనర్, ఉప కమిషనర్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు (మఫిసిల్ సిబ్బంది) సూపరింటెండెంట్ పదోన్నతి పొంది దేవాలయాల్లో కార్యనిర్వహణాధికారులుగా గతంలో నియమితులయ్యారు. నిజానికి మఫిసిల్ సిబ్బంది వారి పోస్టుల సంఖ్య ఆధారంగా, ఏర్పడే ఖాళీలతోనే పదోన్నతులు పొందాల్సి ఉంటుంది. వారిని దేవాలయాల్లోకి బదిలీ చేసి అక్కడ సీనియారిటీ పొందుతూ ఉన్నత స్థానాలు కేటాయించటాన్ని తప్పు పడుతూ 2011లో దేవాలయాల్లోని సీనియర్ కార్యనిర్వహణాధికారులు పరిపాలన ట్రిబ్యునల్ను ఆశ్రయించారు. 2013లో ఈఓల వాదనను సమర్థిస్తూ ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. దీనిని సవాల్ చేస్తూ, మఫిసిల్ పోస్టుల నుంచి పదోన్నతి పొందిన ఓ ఉన్నతాధికారి హైకోర్టును ఆశ్రయించారు. కానీ, కోర్టుకు సరైన వివరాలు అందించని కారణంగా 2024 వరకు ఆ కేసు కొనసాగింది. గతేడాది మార్చిలో ట్రిబ్యునల్ తరహా తీర్పునే హైకోర్టు వెలువరించింది. దీంతో మఫిసిల్ ఉద్యోగుల పదోన్నతులతోపాటు, దేవాలయ ఉద్యోగుల సీనియారిటీని లెక్కగట్టి డీపీసీ రివ్యూ చేయాల్సిందిగా కమిషనర్ ప్రభుత్వానికి నివేదించగా, సర్కారు సమ్మతిస్తూ డీపీసీ రివ్యూకు వీలుగా ఆదేశాలు జారీ చేసింది. 2006 నుంచి పొందిన అడ్హాక్ పదోన్నతులు సహా.. అప్పటి నుంచి ఇప్పటి వరకు పదోన్నతులను సరిచేస్తూ రావాల్సి ఉంది. దీంతో పదోన్నతులు రాకుండానే రిటైర్ అయిన వారికి కూడా ఇప్పుడు పదోన్నతుల లబ్ధి కలుగుతుంది. ఖాళీలకు విరుద్ధంగా మఫిసిల్ కేటగిరీ నుంచి దేవాలయాల్లోని పోస్టులకు వచ్చి పదోన్నతులు పొందిన వారికి రివర్షన్ కూడా ఉంటుంది. దేవాలయాల్లో పనిచేస్తున్న వారిలో సీనియారిటీ ఆధారంగా అర్హులకు పదోన్నతులు వస్తాయి.

అడ్డుకుంటున్నారట...

ఇలా జరిగితే..ఇప్పటి వరకు పొందిన సీనియారిటీకి దెబ్బ తగిలి పదోన్నతి కోల్పోవాల్సి వస్తుందన్న ఉద్దేశంతో.. మఫిసిల్ కోటా నుంచి వచ్చిన కొందరు పలుకుబడి ఉపయోగించి ఈ ప్రక్రియ ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారని దేవాలయ అధికారులు ఆరోపిస్తున్నారు. గత ఫిబ్రవరిలో డీపీసీల రివ్యూ కోసం ప్రభుత్వం ఉత్తర్వు ఇస్తే ఇప్పటి వరకు ఆ ప్రక్రియే మొదలు కాలేదు. అందుకు వీలుగా ఖాళీలు, గతంలోని పదోన్నతుల వివరాలు అందజేయాల్సిందిగా కమిషనర్ ఐదు పర్యాయాలు ఆయా విభాగాలకు లేఖలు రాస్తే సమాధానమే రావటం లేదు. ఆ వివరాలు రాకుండా డీపీసీ సాధ్యం కాదు..కావాలనే ఆ వివరాలు అందకుండా కొందరు పైస్థాయిలో కుట్ర చేస్తున్నారని పదోన్నతులు రాకుండా ఉండిపోయిన అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రక్రియ కోసం ప్రయత్నిస్తున్న వారిని ఆ సీట్ల నుంచి బదిలీ చేయిస్తున్నారని పేర్కొంటున్నారు. వెరసి.. అర్హులకు పదోన్నతులు రాకుండా, అర్హత లేని వారు పదోన్నతులతో కొనసాగుతున్న అస్తవ్యస్త పరిస్థితి దేవాదాయ శాఖలో కొనసాగుతోంది. దీనిపై ఉద్యమించేందుకు ఇప్పు డు కొందరు అధికారులు సిద్ధమవుతున్నారు.



వైఎస్ జగన్ను కలిసిన మాజీ ఎమ్మెల్యే వంశీ

సాక్షి, అమరావతి: వైఎస్సార్సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గుంటూరు జిల్లా తాడేపల్లిలోని ఆయన నివాసంలో గురువారం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దంపతులు కలిశారు. వంశీపై కూటమి ప్రభుత్వం 11 అక్రమ కేసులు పెట్టి 140 రోజులపాటు అక్రమంగా నిర్బంధంలో ఉంచింది. ఈ నేపథ్యంలో కష్టకాలంలో ఉన్న తనకు అండగా నిలిచినందుకుగాను జగన్కు వంశీ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

జనాలు నలిగిపోతాన్రు!

మళ్లీ మన టైమొచ్చేదాకా బరాయించాల..! మరింకేటి సేత్తాం!

జగనైతే ఎవరికీ ఏలోటూ లేకుండా
అందరికీ అన్నీ ఏసోడు!
కరోనా టైమ్లో కూడా
జగన్ ఏ పథకం ఆపలేదు..
చంద్రబాబు వొచ్చాక ఇప్పడేటీ రాలేదు..

అంతా మోసమే! ఎప్పడో
చేత్తానంటే ఎలా అవుతాది?

బాబు ఏడాది
పాలనపై ఉత్తరాంధ్ర
గుండె చప్పడు ఇదీ!

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్ను స్కాన్ చేయండి

శివశంకర్ను ఏపీకి కేటాయించాల్సిందే!

- క్యాట్ ఉత్తర్వులు అమలు చేయాలని హైకోర్టు ఆదేశం
- డీవోపీటీ దాఖలు చేసిన పిటిషన్ కొట్టివేత



సాక్షి, హైదరాబాద్: ఐఏఎస్ అధికారి శివశంకర్ లోతేటిని ఆంధ్రప్రదేశ్కు కేటాయించాల్సిందేనని కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు తేల్చిచెప్పింది. ఫిబ్రవరి 28న కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ (క్యాట్) ఇచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ, వాటిని అమలు చేయాలని ఆదేశించింది. క్యాట్ తీర్పును అమలు చేసేందుకు నాలుగు వారాలు గడువు ఇచ్చింది. కేంద్ర సిబ్బంది శిక్షణా విభాగం (డీవోపీటీ) దాఖలు చేసిన పిటిషన్ను కొట్టివేసింది. 2014 రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు కేటాయించినా, అప్పట్లోనే క్యాట్ ఆదేశాలతో ఆయన ఏపీలో విధులు నిర్వహిస్తున్నారు. అయితే 2024 అక్టోబర్లో ఎవరికి కేటాయించిన రాష్ట్రాలకు వారు వెళ్లాల్సిందేనంటూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై క్యాట్కు, హైకోర్టుకు వెళ్లిన అఖిల భారత సర్వీస్ అధికారులకు చుక్కెదురైంది. కేంద్రం ఉత్తర్వులను నిలుపుదల చేస్తూ మధ్యంతర ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో కేటాయించిన రాష్ట్రాల్లో అధికారులు రిపోర్టు చేశారు. ఇందులో భాగంగా శివశంకర్ తెలంగాణకు వచ్చారు. అయితే ఆయన దాఖలు చేసిన పిటిషన్పై వాదనలు కొనసాగించిన క్యాట్ ధర్మాసనం ఫిబ్రవరి 28న తుది ఉత్తర్వులు వెలువరించింది. ఏపీ స్థానికత ఉన్న అధికారిని తెలంగాణకు కేటాయించడాన్ని తప్పుబట్టింది. పోస్టల్ అడ్రస్ రంగారెడ్డి జిల్లా ఆధారంగా స్థానికత నిర్ధారించడం సరికాదని పేర్కొంది. శివశంకర్ను తిరిగి ఏపీకి కేటాయించాలని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. అయితే రెండు నెలలైనా ఏపీకి కేటాయించకపోవడంతో శివశంకర్ ఏప్రిల్లో ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన క్యాట్ తాము ఇచ్చిన ఉత్తర్వులు నాలుగు వారాల్లో అమలు చేయాలని స్పష్టం చేసింది. లేనిపక్షంలో ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదో డీవోపీటీ కార్యదర్శి హాజరై చెప్పాలని ఆదేశించింది.

విజయనగరంలో పుట్టి పెరిగారు..

ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో క్యాట్ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కేంద్రం హైకోర్టులో అప్పీల్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్పై జస్టిస్ అభినంద్కుమార్ షావిలీ, జస్టిస్ తిరుమలాదేవి ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. శివశంకర్ తరఫున న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. 'కొంతకాలం రంగారెడ్డి జిల్లాలో ఉండగా శివశంకర్ యూపీఎస్సీ నుంచి సమాచారం కోసం ఇచ్చిన చిరునామాను మాత్రమే డీవోపీటీ పరిగణనలోకి తీసుకుంది. వాస్తవానికి ఆయన ఆంధ్రప్రదేశ్లోని విజయనగరం ప్రాంతంలో పుట్టి పెరిగారు. చదువు అక్కడే పూర్తి చేశారు..'అని వివరించారు. ఇందుకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను, విద్యాభ్యాసానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను కోర్టుకు అందజేశారు. ఈ నేపథ్యంలో వాదనల అనంతరం ధర్మాసనం.. కేంద్రం దాఖలు చేసిన పిటిషన్ను కొట్టివేసింది. శివశంకర్ను ఏపీకి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించింది.

వైద్య కళాశాలల్లో డమ్మీ ఫ్యాకల్టీపై సీబీ'ఐ'

- ప్రమాణాలు లేకున్నా ఉన్నట్లు చూపిస్తున్న యాజమాన్యాలు
- సహకరిస్తున్న కొందరు ఎన్ఎంసీ సిబ్బంది, అధికారులు
- తనిఖీల సమయం ముందే లీక్ చేసినందుకు డబ్బు వసూలు
- 36 మందిపై కేసు నమోదు.. పలువురి అరెస్ట్
- నిందితుల్లో ఆరుగురు తెలుగు రాష్ట్రాల వ్యక్తులు



సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో నడుస్తున్న 'ఘోస్ట్ ఫ్యాకల్టీ'ల దందాపై సీబీఐ దృష్టి పెట్టింది. నిర్దిష్ట ప్రమాణాలు, అవసరమైన స్థాయిలో ఫ్యాకల్టీలు లేని కళాశాలల లైసెన్స్ రెన్యువల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించింది. ఈ వ్యవహారంలో ఆయా కళాశాలలు, దళారులతోపాటు నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ)లోని కొందరు సిబ్బందితోపాటు కేంద్ర ఆరోగ్య–కుటుంబ సంక్షేమ శాఖలోని కొందరు అధికారుల పాత్ర ఉందని నిర్ధారించింది. ఈ వ్యవహారంపై గత సోమవారం కేసు నమోదు చేసిన ఢిల్లీ సీబీఐ కార్యాలయంలో కొందరిని అరెస్టు చేసింది. సంస్థలు, వ్యక్తులు సహా మొత్తం 36 మంది నిందితుల జాబితాలో ఉండగా వారిలో ఆరుగురు తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కావడం గమనార్హం. నిందితులందరికీ త్వరలో నోటీసులు జారీ చేసి విచారించడానికి సీబీఐ సన్నాహాలు చేస్తోంది. వారంతా ఎన్ఎంసీ అధికారులతో కుమ్మక్కై తనిఖీల ప్రక్రియను ప్రభావితం చేశారని సీబీఐ ఎఫ్ఐఆర్లో ఆరోపించింది. వరంగల్లోని ఫాదర్ కొలంబో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ట్రస్టీగా ఉన్న జోసెఫ్ కొమ్మారెడ్డి కూడా నిందితుడిగా ఉన్నారు. ఎన్ఎంసీ నివేదికలు తమకు అనుకూలంగా రావడం కోసం ఆయన మధ్యవర్తుల ద్వారా రెండు విడతల్లో రూ. 66 లక్షల లంచం చెల్లించినట్లు సీబీఐ పేర్కొంది. హరియాణాకు చెందిన డాక్టర్ వీరేంద్ర కుమార్ దక్షిణాదిలోని ఆయా ప్రైవేట్ మెడికల్ కాలేజీలకు ప్రతినిధిగా వ్యవహరించినట్లు తెలిపింది. ఆయనకు ఏపీలోని కదిరికి చెందిన డాక్టర్ బి. హరిప్రసాద్, హైదరాబాద్లోని శ్రీనగర్ కాలనీకి చెందిన డాక్టర్ అంకం రాంబాబు, విశాఖపట్నం అక్కయ్యపాలేనికి చెందిన డాక్టర్ కృష్ణ కిషోర్ సహకరించినట్లు ఆరోపించింది. డాక్టర్ హరిప్రసాద్ వైద్య కళాశాలలకు కన్సల్టెంట్గా వ్యవహరిస్తూ తనిఖీల సమయంలో డమ్మీ ఫ్యాకల్టీలను (ఘోస్ట్ ఫ్యాకల్టీలు) ఏర్పాటు చేయడం, ఎన్ఎంసీ అధికారులతో పైరవీలు చేయడం ద్వారా కళాశాలల లైసెన్సుల పునరుద్ధరణ ప్రయత్నాలు చేసేవారని సీబీఐ ఆరోపించింది. ఓ సందర్భంలో విశాఖపట్నంలోని గాయత్రి మెడికల్ కాలేజీ డైరెక్టర్ వెంకట్ నుంచి రూ. 50 లక్షలు తీసుకొని ఆ మొత్తాన్ని హవాలా మార్గంలో ఢిల్లీ పంపినట్లు సీబీఐ ఎఫ్ఐఆర్లో పేర్కొంది. వరంగల్లోని ఫాదర్ కొలంబో కాలేజీకి సంబంధించిన క్లియరెన్సుల కోసం జోసెఫ్ కొమ్మారెడ్డి రెండు విడతలుగా రూ. 66 లక్షలు చెల్లించారని సీబీఐ తెలిపింది. సీబీఐ ఎఫ్ఐఆర్ ప్రకారం కేంద్ర ఆరోగ్య శాఖ డైరెక్టర్ పూనమ్ మీనా తన వ్యక్తిగత సహాయకుడు పీయూష్ మల్యాన్ను ఆయా కాలేజీల్లో ఎన్ఎంసీ తనిఖీలు నిర్వహించే తేదీలను ముందే తెలుసుకోవాలని ఆదేశించినట్లు సీబీఐ గుర్తించింది. ఈ వివరాలన్నీ ఆమె ద్వారానే ఇతర నిందితులకు చేరాయని.. ఇందుకోసం భారీ మొత్తం చేతులు మారినట్లు సీబీఐ స్పష్టం చేసింది. నేరపూరిత కుట్ర, ప్రభుత్వ ఉద్యోగులను ప్రలోభపెట్టడం, వాణిజ్య సంస్థల ద్వారా లంచాల చెల్లింపు సహా అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద ఈ కేసు నమోదు చేసింది. ఇప్పటికే ఈ కుంభకోణానికి సంబంధించి కర్ణాటక, రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్లలోని 40 ప్రాంతాల్లో సోదాలు చేసిన సీబీఐ పలు కీలక ఆధారాలు సేకరించింది.

సీట్ల పెంపు నిర్ణయం సర్కార్దే

- ఇంజనీరింగ్ కాలేజీలకు తేల్చిచెప్పిన హైకోర్టు
- సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోలేమని వెల్లడి
- సీట్ల పెంపుపై కళాశాలల పిటిషన్లు కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల పెంపు, కోర్సుల విలీనంపై తుది నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదే అని హైకోర్టు తేల్చిచెప్పింది. సీట్ల పెంపు, కోర్సుల విలీనానికి కాలేజీలు చేసుకున్న అభ్యర్థనను ప్రభుత్వం తిరస్కరించడం సమంజసమేనని స్పష్టంచేసింది. ఈ అంశంపై మే 2న సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సమర్థించింది. బీటెక్, బీఈలో కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర కోర్సుల్లో సీట్ల పెంపునకు, కొన్ని కోర్సులను ఇతర కోర్సుల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ పలు ఇంజనీరింగ్ కాలేజీలు గతేడాది హైకోర్టును ఆశ్రయించాయి. విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం.. సీట్లను పెంచడంతోపాటు వాటికి మాప్ అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా, ఈ పెంచిన సీట్లను 2024–25 విద్యా సంవత్సరానికి కూడా వర్తింపజేయాలని, బీటెక్ (సీఎస్ఈ) సీట్లను పెంచాలని ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వాన్ని కాలేజీలు అభ్యర్థించాయి. ఈ విజ్ఞప్తిని తిరస్కరించడంతో సీఎంఆర్, మల్లారెడ్డి, ఎంఎల్ఆర్, మర్రి లక్ష్మారెడ్డి, సెయింట్ మార్టిన్స్ తదితర కళాశాలలు హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్పై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. సీట్లకు సంబంధించి గతంలో హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన ఉత్తర్వులను ఈ ఏడాదికి కూడా వర్తింపజేయాలన్న విజ్ఞప్తిని తోసిపుచ్చారు. ప్రభుత్వ నిర్ణయంలో ఎలాంటి వివక్ష కనిపించడం లేదని, జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పారు. సింగిల్ జడ్జి తీర్పుపై కాలేజీలు అప్పీల్ దాఖలు చేశాయి. ఈ అప్పీల్పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్పాల్, జస్టిస్ రేణుక యారా ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అప్పీళ్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిపక్ష నేతలకు చెందిన కాలేజీల్లో సీట్ల పెంపునకు సర్కార్ నిరాకరిస్తోందని కాలేజీల తరఫు సీనియర్ న్యాయవాదులు దేశాయి ప్రకాశ్రెడ్డి, ఎస్.నిరంజన్రెడ్డి వాదించారు. స్థానిక పరిస్థితుల మేరకు అధ్యయనం చేసి సీట్ల పెంపుపై నిర్ణయం తీసుకున్నామని ప్రభుత్వం తరఫున ఏజీ ఎ.సుదర్శన్రెడ్డి వాదించారు. ప్రభుత్వ నిర్ణయంలో ఎలాంటి వివక్ష లేదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఇంజనీరింగ్ కాలేజీల పిటిషన్లను కొట్టివేసింది. సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పింది.

అమెరికా వద్దు... యూరోప్ ముద్దు

- ఉన్నత చదువులకు విద్యార్థుల యూరోప్ బాట
- అమెరికా వీసాలు క్లిష్టతరం కావడమే కారణం
- ఈ ఏడాది జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్కు ఇప్పటికే 50 వేల మంది
- తెలుగు రాష్ట్రాల నుంచి పెరిగిన డిమాండ్



సాక్షి, హైదరాబాద్: వలసలు, విదేశీ విద్యార్థులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వైఖరి.. యూరోప్ దేశాలకు మేలు చేస్తోంది. ముఖ్యంగా ట్రంప్ తీరుతో అమెరికా విశ్వవిద్యాలయాలు వెలవెలబోతుండగా.. యూరప్ వర్సిటీలు కళకళలాడుతున్నాయి.

ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాలనుకునే సగటు భారతీయ విద్యార్థి ఇప్పుడు యూరోప్ బాట పడుతున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు యూరోప్ తరలివెళ్తున్నారు. ఈ సంవత్సరం ఇప్పటికే 50 వేల మందికి పైగా తెలుగు విద్యార్థులు యూరోప్ దేశాలకు వెళ్లినట్లు అంచనా. బాగా ప్రాచుర్యం ఉన్న బ్రిటన్, ఫ్రాన్స్ కంటే జర్మనీకి ఎక్కువ మంది వెళ్తుండటం విశేషం. వీసాలు సులభంగా లభించటం, కోర్సు పూర్తిచేసిన వెంటనే వర్క్ పర్మిట్లు దొరుకుతుండటంతో విద్యార్థులను జర్మనీ ఎక్కువగా ఆకట్టుకుంటున్నట్లు నిపుణులు చెబుతున్నారు. అమెరికాలో అనిశ్చితి నేపథ్యంలో అక్కడికి వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధంచేసుకున్న విద్యార్థులు ఇప్పుడు జర్మనీ వైపు దృష్టి సారించారు. వీరిలో ఎక్కువ మంది ఇంజనీరింగ్, లైఫ్సైన్సెస్ కోర్సుల్లో చేరుతున్నారు. చదువులు పూర్తిచేసిన వెంటనే ఉద్యోగాలు లభించేవిధంగా డిజైన్ చేసిన కోర్సులను ఎక్కువమంది ఎంపిక చేసుకుంటున్నట్లు అమీర్పేటకు చెందిన ఓ విద్యా కన్సల్టెన్సీ నిర్వాహకులు తెలిపారు.

అమెరికా ఆశలు ఆవిరి..

అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత విదేశీ విద్యార్థుల ఆశలు ఆవిరయ్యాయి. అక్కడ చదివే సుమారు 3.5 లక్షల మంది భారతీయ విద్యార్థుల్లో తెలుగువారే 50 శాతానికి పైగా ఉన్నట్లు అంచనా. కనీసం 1.85 లక్షల మంది తెలుగు విద్యార్థులు పలు విశ్వవిద్యాలయాల్లో చదువుతున్నారు. అక్కడ చదివే విదేశీ విద్యార్థులకు మూడేళ్లపాటు ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రెనింగ్ (ఓపీటీ) కింద ఉద్యోగాలు చేసుకునే అవకాశం ఉండేది. ట్రంప్ వచ్చిన తరువాత ఈ అవకాశం ప్రమాదంలో పడింది. దీంతో యూఎస్ వెళ్లాలనుకొనే విద్యార్థులు ఆ ఆలోచనను విరమించుకుంటున్నారు. వీసాలు కూడా క్లిష్టతరంగా మారిపోవటంతో హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే వందలాది ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీలకు కూడా డిమాండ్ పడిపోయింది.

జాబ్ గ్యారెంటీ

అమెరికా కంటే జర్మనీలో ఖర్చులు ఎక్కువే. కానీ యూఎస్లాంటి ఇబ్బందికర పరిస్థితులు ఇక్కడ లేవు. పైగా చదువు పూర్తి చేసుకున్న తరువాత ఏదో ఒక సంస్థలో తప్పనిసరిగా ఉద్యోగం లభిస్తుందనే భరోసా ఉంటుంది. అందుకే జర్మనీకి వెళ్లాను.

– సాయి తిరుమల మణికంఠ వావిలాల, ఏఐ విద్యార్థి, ఉప్పల్

జర్మనీ సరైన డెస్టినేషన్..

జర్మనీలోని పలు విశ్వవిద్యాలయాల్లో బిజినెస్ మేనేజ్మెంట్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి కోర్సులను ఎక్కువ మంది ఎంపిక చేసుకుంటున్నారు. గతేడాది సుమారు 45 వేల మంది జర్మనీకి వెళ్లగా, ఈ ఏడాది ఇప్పటికే 54 వేల మంది తెలుగు విద్యార్థులు జర్మనీ, బ్రిటన్ బాట పట్టారు. అక్కడ కోర్సులు పూర్తిచేసిన తరువాత 18 నెలల పాటు వర్క్ వీసాకు అవకాశం కల్పిస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ సంతృప్తి 62 శాతమే

- పనిఒత్తిడిలో ఉన్నట్లు 68 శాతం వెల్లడి
- పనిమంతులమని 89 శాతం మందిలో విశ్వాసం
- ఉద్యోగ భద్రతపై 65 శాతం మందిలో సానుకూల భావన
- మ్యాన్పవర్ గ్రూప్ గ్లోబల్ టాలెంట్ బారోమీటర్ సర్వేలో ఆసక్తికర గణాంకాలు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా 62 శాతం మంది ఉద్యోగులు మాత్రమే తాము చేస్తున్న ఉద్యోగాలపట్ల సంతృప్తిగా ఉన్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. అదే సమయంలో ఉద్యోగాల్లో పనిఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు 68 శాతం మంది చెప్పగా తాము పూర్తి నైపుణ్యంతో ఉన్నామని, పనిమంతులం అన్న నమ్మకం ఉందని 89 శాతం మంది ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. మ్యాన్పవర్ గ్రూప్ అనే సంస్థ గ్లోబల్ టాలెంట్ బారోమీటర్–2025 పేరుతో భారత్ సహా 19 దేశాల్లో ఈ సర్వే నిర్వహించింది. వృత్తిలో సంతృప్తి, ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసం, పనిఒత్తిడి, ఉద్యోగంపట్ల ఆసక్తి తదితర అంశాలపై ఉద్యోగుల అభిప్రాయాలు సేకరించింది. సర్వే సంస్థ పేర్కొన్న ప్రకారం.. రాబోయే ఆరు నెలల్లో తమ ఉద్యోగాలు సురక్షితమేననే భావనను 65 శాతం మంది వ్యక్తం చేయగా మరో 35 శాతం మంది మాత్రం తమ ఉద్యోగాలు ఎప్పుడు పోతాయో తెలియని ఆందోళనలో ఉన్నారు. గతేడాది నిర్వహించిన సర్వేలో రానున్న ఆరు నెలలకు తమ ఉద్యోగాలకు ఢోకా లేదన్న భరోసా 71 శాతం మంది వ్యక్తం చేయగా ఈ ఏడాది అది 6 శాతం తగ్గడం గమనార్హం.

పని ఒత్తిడి పెరిగింది..

పని ఒత్తిడి పెరిగిందని, వివిధ కారణాలతో వృత్తిగతంగా ఆందోళనలు ఎదుర్కొంటున్నామని సర్వేలో పాల్గొన్న 68 శాతం మంది పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే పనిఒత్తిడి ఒక శాతం పెరిగినట్లు నివేదిక తెలిపింది. ప్రధానంగా మేనేజర్ స్థాయిలో 82 శాతం మంది ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నట్లు నివేదిక తెలిపింది. అస్థిరత, కృత్రిమ మేధ పెరగడం సహా వివిధ కారణాలను అందుకు వారు ఉదహరించినట్లు వివరించింది. తమ వద్ద పూర్తి నైపుణ్యం ఉన్నా యజమాని వద్ద అనుకున్నంతగా వృత్తిగత అభివృద్ధి సాధించడం కష్టమన్న అభిప్రాయం సర్వేలో పాల్గొన్న ప్రతి ముగ్గురిలో ఒకరు వ్యక్తం చేసినట్లు నివేదిక తెలిపింది.

ర్యాష్ డ్రైవింగ్లో మరణిస్తే బీమా సొమ్ము రాదు

సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ: ఎవరైనా నిర్లక్ష్యంగా వాహనం నడిపి ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలకు బీమా సొమ్ము పొందడానికి అర్హత ఉండదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. ఇలాంటి కేసుల్లో బీమా కంపెనీలు పరిహారం సొమ్ము ఇవ్వలేవని పేర్కొంది. 2014 జూన్ 18న కర్ణాటకలో ఎన్.ఎస్.రవీషా అనే వ్యక్తి ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అత్యధిక వేగంతో కారునడుపుతూ ప్రమాదంలో మరణించారు. ఆయన కుటుంబానికి బీమా సొమ్ము చెల్లించేందుకు ఇన్సూరెన్స్ సంస్థ అంగీకరించలేదు. దాంతో రవీషా భార్య, కుమారుడు, తల్లిదండ్రులు తొలుత కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్ను హైకోర్టు కొట్టివేసింది. ఈ మేరకు 2024 నవంబర్ 23న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ వారు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమకు రూ.80 లక్షల పరిహారం చెల్లించేలా బీమా కంపెనీని ఆదేశించాలని కోరారు. వారు దాఖలు చేసిన పిటిషన్పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి.వి.నరసింహ, జస్టిస్ ఆర్.మహాదేవన్తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ఈ కేసులో పరిహారం చెల్లించేలా బీమా కంపెనీని ఆదేశించలేమని పేర్కొంది. హైకోర్టు ఆదేశాల్లో జోక్యం చేసుకొనేందుకు నిరాకరించింది.

అమరావతిలో కన్సల్టెన్సీల రాజ్యం

అసెంబ్లీ, హైకోర్టు, పౌర నిర్మాణాల కోసం 64 మంది కన్సల్టెంట్లు

సాక్షి, అమరావతి: కన్సల్టెంట్ల రాజ్యానికి చంద్రబాబు ప్రభుత్వం మరోసారి గేట్లు తెరిచింది. రాజధాని అమరావతిలో నిర్మించే ప్రతి ప్రాజెక్టు కోసం కన్సల్టెంట్ల నియామకానికి సీఆర్డీఏ చర్యలు చేపట్టింది. అసెంబ్లీ, హైకోర్టు, పౌర నిర్మాణాల కోసం ప్రాజెక్ట్ మేనేజ్మెంట్ కన్సల్టెంట్ల కోసం ఆసక్తి వ్యక్తీకరణ ప్రతిపాదనలను ఆహ్వానించింది. ఈ నెల 5వ తేదీలోగా ప్రతిపాదనల సమర్పణకు తుది గడువుగా నిర్ణయించింది. అసెంబ్లీ, హైకోర్టు, పౌర నిర్మాణ పనులను ప్రతి దశలో పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు పురోగతి నివేదికను కన్సల్టెంట్లు సీఆర్డీఏకు సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకోసం వివిధ రంగాలకు చెందిన 64 మంది కన్సల్టెంట్లను నియమించనున్నట్టు సీఆర్డీఏ పేర్కొంది. ఇందుకోసం రూ.13.14 కోట్లు చెల్లించనున్నట్టు తెలిపింది. ఇప్పటికే రాజధానిలో కన్సల్టెంట్ల పేరుతో ఏకంగా రూ.100 కోట్లకు పైగా సీఆర్డీఏ చెల్లిస్తున్న విషయం తెలిసిందే.

క్లుప్తంగా...

ప్రభుత్వ అసమర్థత వల్లే ఎరువుల కొరత

ఎంపీ డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: దేశంలో ఎక్కడా యూరియా కొరత లేదని, రాష్ట్రంలో మాత్రమే ఉందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ గురువారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా కొరతపై అపోహలు కలిగించేలా కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్‌ఎస్ నేతలు కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో యూరియా కొరత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, అసమర్థ పాలన వల్లే ఏర్పడిందని విమర్శించారు. సరఫరా, నిల్వల ప్రణాళికలో వైఫల్యం వల్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సీజన్‌లో రాష్ట్రానికి అవసరమైన యూరియా కంటే ఎక్కువగా కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రానికి 9.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే, కేంద్రం 12.02 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసిందని వివరించారు. డీఏపీ, ఎన్‌పీకేఎస్ వంటి అన్ని ఎరువులను రాష్ట్ర అవసరానికి మించి పంపించినట్లు స్పష్టం చేశారు. కేంద్రం ఎప్పటికప్పుడు రాష్ట్ర అవసరాలను అంచనా వేసి అధికంగా సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని అరుణ విమర్శించారు.

42 శాతం రిజర్వేషన్లపై పార్టీల మౌనమెందుకు?

రైల్‌రోకో పోస్టర్ ఆవిష్కరణలో ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ పార్టీల అగ్రనేతలు ఎందుకు మాట్లాడటం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. బీసీల ఓట్లు కావాలి తప్ప.. వాళ్లకు రిజర్వేషన్లు వద్దా అని నిలదీశారు. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న తలపెట్టిన రైల్‌రోకో పోస్టర్‌ను గురువారం ఆమె తన నివాసంలో ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కోసం రైల్ రోకోకు పిలుపునిచ్చామని గుర్తు చేశారు. ఆ రోజున ఢిల్లీకి వెళ్లే ప్రతి రైల్‌ను ఆపేస్తామని తేల్చిచెప్పారు. దక్కన్ నుంచి ఢిల్లీకి వెళ్లే రైళ్లను ఆపి బీసీ రిజర్వేషన్ల సెగ ఢిల్లీకి తగిలేలా చేయాలని కోరారు. ఈ బిల్లులు నెలల తరబడి కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నా కాంగ్రెస్ అగ్రనేతలు వాటిపై కేంద్రాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లులపై ఈనెల 8వ తేదీలోపు సీఎం అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని ఆమె డిమాండ్ చేశారు.

ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయరేం?

బీజేపీ నేత మధుసూదన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదని బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. ఫసల్ బీమా యోజన దేశంలోని రైతులకు వరంలాంటిదని, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయినా రైతు అప్పుల్లో మునిగిపోకుండా నష్టపరిహారం పొందేలా ఈ పథకం రూపుదిద్దుకుందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాలు ఈ పథకాన్ని అమలు చేస్తుండగా, తెలంగాణ ప్రభుత్వం మాత్రం దీనిని అమలు చేయడం లేదని, రైతు సంక్షేమం అంటూ హడావుడి చేయడం తప్ప రైతులకు లబ్ధి చేకూరే పథకాన్ని అమలు చేయకపోవడం విడ్డూరమన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు సీజన్లు మాత్రమే అమలు చేసిందని, బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి మంచి పేరు రావొద్దన్న రాజకీయ దురుద్దేశంతోనే ఈ పథకాన్ని అమలు చేయలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ పథకం కింద పంపిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించడం దారుణమని పేర్కొన్నారు.

ఎరువుల కొరతపై చర్చకు సిద్ధమా?

బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎరువుల కొరతపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సవాలు చేశారు. ఆయన గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. యూరియా సరఫరాపై కాంగ్రెస్ నాయకులు బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై బురదజల్లే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. యూరియా సరఫరాలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దేశంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, కేవలం రాష్ట్రంలో మాత్రమే కొరత ఉందని స్పష్టం చేశారు.

ఇవిగో సాక్ష్యాలు..!

ఈవీఎంల మాయాజాలంపై ఈసీకి ఆధారాలు అందించిన వైఎస్సార్ సీపీ నేతల బృందం



మీడియాతో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి. పక్కన పీవీ మిథున్‌రెడ్డి, బెల్లాన చంద్రశేఖర్

సాక్షి, న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గతేడాది ఆంధ్రప్రదేశ్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంలు) పనితీరులో మాయాజాలం.. ఈవీఎంలలో పోలైన ఓట్లకు (ఫారం–17 ప్రకారం), లెక్కించిన ఓట్లకు (ఫారం–20 ప్రకారం) మధ్య భారీ వ్యత్యాసం ఉండటం.. అదే రోజు రాత్రి ఈసీ తొలుత ప్రకటించిన పోలింగ్ శాతానికీ, ఆ తర్వాత నాలుగు రోజులు గడిచాక ప్రకటించిన శాతానికి మధ్య దేశంలోనే అత్యధికంగా భారీ తేడా ఉండటం.. తొలుత ప్రకటించిన దానితో పోలిస్తే అనూహ్యంగా పోలింగ్ ఏకంగా 12.54 శాతం పెరగడం.. దీనివల్ల సగటున ఒక్కో శాసనసభ స్థానంలో 28 వేల ఓట్లు, లోక్‌సభ స్థానం పరిధిలో 1.96 లక్షల ఓట్లు పెరగడం.. అంతిమంగా ఇది 87 శాసనసభ స్థానాల పరిధిలో గెలుపోటములను నిర్దేశించడం.. తదితర అంశాలపై వైఎస్సార్‌సీపీ నేతల బృందం కేంద్ర ఎన్నికల సంఘానికి (సీఈసీ) ఫిర్యాదు చేసింది. పలు నియోజకవర్గాల్లో ఈవీఎంల పనితీరు అనుమానాస్పదంగా ఉందన్న అంశాన్ని సాక్ష్యాధారాలతో సీఈసీ ముందుంచింది. ఈవీఎంల పనితీరుపై సర్వత్రా అనుమానాలు రేకెత్తుతున్న నేపథ్యంలో వాటిని పక్కనపెట్టి బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్‌ను సీఈసీ దృష్టికి గట్టిగా తీసుకొచ్చింది. 2024 ఎన్నికల్లో ఈవీఎంల పనితీరుకు సంబంధించి సాంకేతిక అంశాలు, కొన్ని పోలింగ్ బూత్‌లలో చోటు చేసుకున్న అసంబద్ధ వ్యవహారాలపై వైఎస్సార్‌సీపీ గతంలోనే సీఈసీకి ఫిర్యాదుచేసింది. ఈ నేపథ్యంలో దీనిపై వివరణ ఇచ్చేందుకు గురువారం ఢిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ప్రధాన ఎన్నికల అధికారి (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్, కమిషనర్లు వివేక్ జోషి, సుఖ్‌బీర్ సింగ్ సంధు నిర్వహించిన సమావేశానికి వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, లోక్‌సభ పక్షనేత పి.మిథున్‌రెడ్డి, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరయ్యారు. సుమారు గంటపాటు జరిగిన ఈ సమావేశంలో ఎన్నికల్లో జరిగిన అవకతవకలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. అనంతరం మిథున్‌రెడ్డి, చంద్రశేఖర్‌తో కలిసి వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు.

ఈవీఎం, వీవీ ప్యాట్‌లను పోల్చి చూడాలి

2024 ఎన్నికల్లో వినియోగించిన ఈవీఎంల తీరుపై అనేక అనుమానాలున్నందున వాటిని నివృత్తి చేయాలని కోరాం. ఈవీఎంలు, వీవీ ప్యాట్ల ఓట్లను పోల్చి చూడాలని కోరాం. ఇందుకు ఫీజు కింద నిర్ణీత రుసుము కూడా ఇప్పటికే చెల్లించాం. బ్యాటరీ చార్జింగ్ విషయంలో కూడా ఈవీఎంలపై అనేక సందేహాలున్నాయి. పోలింగ్ పూర్తయ్యాక 80 శాతం ఉంటే.. 40 రోజుల తర్వాత కౌంటింగ్ సమయంలో 98 శాతం చార్జింగ్ ఉన్న సందర్భాలు కనిపించాయి. సాయంత్రం 6 గంటల తర్వాత చాలాచోట్ల పోలింగ్ శాతం పెరిగింది. నాలుగు కోట్ల ఓట్లలో 51 లక్షల ఓట్లు సాయంత్రం ఆరు గంటల తర్వాతే పోలయ్యాయి. వీటిపై అనేక అనుమానాలున్నాయని, విచారణ జరిపించాలని సీఈసీని కోరాం. అయితే, వీవీ ప్యాట్‌లను కంపారిజన్ చేయడం కుదరదని చెప్పారు. అవి రీ చార్జబుల్ బ్యాటరీలు కావడం వల్ల చార్జింగ్ పెరగడం, తగ్గడం అంటూ జరగదని చెబుతున్నారు.

రాయచోటి ఓ ఉదాహరణ..

2014–19 కంటే గతేడాది ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిన విషయాన్ని సీఈసీకి వివరించాం. రాయచోటి నియోజకవర్గం దీనికి ఉదాహరణ అని చెప్పాం. దీనిపై ఎన్నికల సంఘం సానుకూలంగా స్పందించింది. ఎక్కువ శాతం పోలింగ్ అంశంపై నియోజకవర్గం డేటా తెప్పించుకుని పరిశీలిస్తామని చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల పెరుగుదలపై మావద్ద ఉన్న ఆధారాలను ప్రధాన ఎన్నికల అధికారి జ్ఞానేశ్‌కుమార్‌కు అందించాం. దీనిపై ఈసీ సానుకూలంగా స్పందిస్తూ.. ఓటర్ల జాబితా విషయంలో త్వరలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ప్రత్యేక విస్తృత సవరణ) చేపడతామని హామీ ఇచ్చింది.

హిందూపురం ఓటింగ్ సరళిలో వ్యత్యాసాలు..

ఈవీఎంలపై సాంకేతికతపరంగా ఉన్న సందేహాలను ఈసీకి వివరించాం. మేం ఓడిపోయాం కదా అని నేరం ఎవరిపైనా మోపట్లేదు. అందుకే ప్రత్యేకంగా హిందూపురం నియోజకవర్గంలో జరిగిన అవకతవకలను సీఈసీ ముందుంచాం. హిందూపురం నియోజకవర్గం పోలింగ్ బూత్ నెంబర్–157, 28లలో వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థికి 472 ఓట్లు పోలవ్వగా, అదే బూత్‌లో అసెంబ్లీ అభ్యర్థికి కేవలం ఒకే ఒక్క ఓటు పోలైన విషయాన్ని సీఈసీ దృష్టికి తీసుకెళ్లాం. ఇక కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థికి ఒక ఓటు రాగా, అసెంబ్లీ అభ్యర్థికి 464 ఓట్లు వచ్చాయి. టీడీపీ పార్లమెంట్ అభ్యర్థికి 8 ఓట్లు పోలవ్వగా, అసెంబ్లీ అభ్యర్థికి 95 ఓట్లు వచ్చిన విషయాన్ని ఆధారాలతో సహా సీఈసీ ముందుంచాం. ఓటింగ్ సరళిలో ఇన్ని తేడాలు రావడం మా అనుమానాలకు కారణం. దీనిపై క్షుణ్ణంగా విచారణ చేపట్టాలని కోరాం. దీంతో.. బిహార్ తరహాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించేందుకు సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ అంగీకరించారు.

బ్యాలెట్‌తోనే ఎన్నికలు జరపాలి..

ప్రస్తుత పరిస్థితుల్లో ఈవీఎంలను, వీవీ ప్యాట్‌లను విశ్వసించేందుకు ఏమాత్రం ఆస్కారం లేనందున బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలన్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ డిమాండ్‌ను కేంద్ర ఎన్నికల సంఘానికి తెలియచేశాం. అమెరికా, జర్మనీ, యూరప్ దేశాల్లో సైతం బ్యాలెట్‌తోనే ఎన్నికలు జరుగుతున్న విషయాన్ని వారికి గుర్తు చేశాం. బ్యాలెట్ విధానంలో పోలింగ్ జరిగితే ఎన్నికల ప్రక్రియపై విశ్వసనీయత, పారదర్శకత ఉంటుందని వివరించాం. వీవీ ప్యాట్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ లెక్కించబోమని.. ఆయా పోలింగ్ బూత్‌లకు సంబంధించి సీసీ ఫుటేజీలను కూడా ఇచ్చేది లేదని సీఈసీ చెప్పింది.

ఎన్నికల ప్రక్రియ బలోపేతం: ఈసీ

ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంలో భాగంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆహ్వానించినట్లు కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జాతీయ, ప్రాంతీయ పార్టీల అధ్యక్షులు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను ప్రత్యక్షంగా కమిషన్ దృష్టికి తేవాలనే ఉద్దేశంతోనే వైఎస్సార్‌సీపీ బృందంతో చర్చలు జరిపినట్లు సీఈసీ తెలిపింది. ఈమేరకు ఎన్నికల ప్రక్రియను మరింత పటిష్టం చేసేందుకే వివిధ రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు గురువారం వైఎస్సార్‌సీపీ నేతలతో భేటీ అనంతరం సీఈసీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. రాజకీయ పార్టీలతో నిర్మాణాత్మక చర్చలు అవసరమని ఈసీ పేర్కొంది.

అన్ని పంటలకూ రసాయన ఎరువులే

రాష్ట్రంలో ఏటా పెరుగుతున్న ఎరువుల వినియోగం

- 2014లో 25 లక్షల మెట్రిక్ టన్నులు.. 2025 నాటికి 40.51 లక్షల మెట్రిక్ టన్నుల వాడకం
- సేంద్రియ ఎరువులకు మొగ్గుచూపని రైతులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రసాయన ఎరువుల వినియోగం ఏటా గణనీయంగా పెరుగుతోంది. రైతులకు అధిక దిగుబడి అందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.లక్షల కోట్ల సబ్సిడీ భరిస్తూ రైతులకు యూరియా, ఇతర రసాయన ఎరువులు అందిస్తోంది. అయితే ఎరువుల వాడకం ఏటా అటుఇటుగా లక్షల టన్నుల్లో పెరుగుతుండటం గమనార్హం. అందులోనూ యూరియా వాడకం గ్రామా ల్లో భారీగా పెరిగింది. రెండు దశాబ్దాల క్రితం వరి ఎదుగుదల కోసం యూరియాను వాడిన రైతులు, ఆ తర్వాతి కాలంలో పత్తి, మొక్కజొన్న, మిరప మొదలు అన్ని రకాల పంటలతోపాటు కూరగాయల పాదులకు సైతం వినియోగిస్తున్నారు. గత పదేళ్లలోఎరువుల వాడకం రాష్ట్రంలోనే 60 శాతం పెరగడం పరిస్థితికి అద్దం పడుతోంది. ఎరువుల వల్ల భూసారం దెబ్బతింటుందని, రసాయన ఎరువులకు బదు లు సేంద్రియ ఎరువులను వాడాలని పర్యావరణవేత్తలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నా, రైతాంగం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. దుక్కులు దున్నింది మొదలు పంట చేతికి వచ్చేంత వరకు యూరియాతోపాటు డీఏపీ, కాంప్లెక్స్, ఎన్‌పీకే (నత్రజని, పాస్పరస్, పొటాషియం), తదితర ఎరువులను పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం.. అంతకన్నా పెరిగిన ఎరువుల వినియోగం

రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరుగుతున్నకొద్దీ రసాయన ఎరు వుల వినియోగం కూడా క్రమంగా పెరుగుతోంది. పదేళ్ల క్రితం వానాకాలం సీజన్‌లో సుమారు 80 లక్షల ఎకరాల్లో ప్రధాన పంటలు సాగవ్వగా, ప్రస్తుతం కోటీ 30 లక్షల ఎకరాలకు పెరిగింది. ఇందులో పత్తి, వరి ప్రధాన పంటలు కాగా, ఈ రెండు పంట లకు యూరియాతోపాటు ఇతర రసాయన ఎరువులను కూడా వినియోగిస్తున్నారు. పత్తికి ఎరువులతోపా టు పురుగు మందులను కూడా అ ధికంగా వినియోగిస్తుండడం రైతులకు భారంగా మారుతోంది. 2014–15లో రాష్ట్రంలో అన్ని రకాల ఎరువులు కలిపి 25 లక్షల మెట్రిక్ టన్ను లు వినియోగించగా, 2024–25 నాటికి 40.51 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగింది.

సేంద్రియ ఎరువుల దారిలో వెనుకడుగే

ప్రజల్లో సేంద్రియ పంటలపై అవగాహన పెరిగింది. రసాయనాలు వినియోగించకుండా పండించినట్టుగా ప్రచారం చేస్తున్న సేంద్రియ పంటలను ఎక్కువ ధరలు చెల్లించి మరీ కొనుగోలు చేస్తున్నారు. ఉప్పు నుంచి బియ్యం వరకు కూరగాయల నుంచి పప్పు ధాన్యాల వరకు సేంద్రియ పద్ధతిలో పండించినట్టుగా చెబుతూ వ్యాపారులు భారీగానే లాభాలను ఆర్జిస్తున్నారు. అయితే రాష్ట్రంలో సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న పంటలు తక్కువగా ఉండటం మాత్రం ఆందోళనను కలిగించే విషయం. సేంద్రియ ఎరువులపై పెరిగినంత అవగాహన, గణాంకాల్లో రసాయన ఎరువుల వాడకాన్ని పరిశీలిస్తే కనిపించడం లేదు. సేంద్రియ పద్ధతిలో నత్రజని తక్కువగా లభిస్తుండడంతో పంటలకు ఎన్‌పీకే వంటి రసాయన ఎరువులు వాడక తప్పడం లేదని వ్యవసాయ అధికారి ఒకరు తెలిపారు. పంటల ఎదుగుదలకు ఎవరెన్ని చెప్పినా, యూరియాను వాడక తప్పడం లేదని ఆయన పేర్కొన్నారు.

పదేళ్లలో తెలంగాణలో ఎరువుల వినియోగం ఇలా ఉంది.. (ఎల్‌ఎంటీలలో)

సంవత్సరం	మొత్తం ఎరువులు	యూరియా వినియోగం
2014-15	25.14	13.80
2015-16	24.61	12.52
2016-17	29.18	15.11
2017-18	28.79	14.04
2018-19	28.65	13.83
2019-20	33.17	15.72
2020-21	37.96	16.42
2021-22	30.63	17.12
2022-23	39.87	18.83
2023-24	37.68	19.01
2024-25	40.43	20.08

2020-21 తర్వాత యూరియా వినియోగం వేగంగా పెరిగింది. ప్రత్యేకంగా 2021-22 నుంచి ప్రతి ఏటా దాదాపు లక్ష టన్నుల చొప్పున వృద్ధి కనిపిస్తోంది.

ఖర్గేకు ఎమ్మెల్సీ కవిత లేఖ రాయడం విడ్డూరంగా ఉంది

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న మహేశ్ కుమార్ గౌడ్. చిత్రంలో సంపత్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: బీసీల రిజర్వేషన్ల గురించి ఎమ్మెల్సీ కవిత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాయడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఎద్దేవా చేశారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన సీడబ్ల్యూసీ సభ్యుడు వంశీ చంద్‌రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఖర్గేకు కవిత జాగృతి తరఫున లేఖ రాశారో, బీఆర్‌ఎస్ తరఫున రాశారో క్లారిటీ లేదన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఏం వెలగబెట్టారని, ఇప్పుడు బీసీల రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు తగ్గించింది కేసీఆర్ అని, పదేళ్లలో బీసీల గురించి ఒక్కనాడైనా కవిత మాట్లాడినట్టు పాత క్లిప్పింగ్ చూపించగలరా అని ప్రశ్నించారు. రాజకీయ శూన్యంలో కవిత మనుగడ కోసం బీసీల జపం చేస్తున్నారని, బీసీల గురించి మాట్లాడటానికి కవితకు అర్హత లేదన్నారు. బీసీల గురించి కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ ప్రకటించిన సమయంలో ఆమె లిక్కర్ స్కామ్‌లో జైల్లో ఊచలు లెక్కపెడుతున్నారని, నిరుద్యోగుల ఉసురు తగిలి బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయిందని ధ్వజమెత్తారు. ఆస్తి పంపకాల వాటా తెగిందా అని కవితను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రకటనలను క్రమశిక్షణ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. కిషన్‌రెడ్డి–కేసీఆర్ మధ్య ఫెవికాల్ బంధం ఉందని, మతతత్వ పార్టీతో లౌకికవాద పార్టీ అయిన కాంగ్రెస్ పార్టీకి ఏం సంబంధం అని ప్రశ్నించారు. ఎల్బీ స్టేడియంలో తలపెట్టిన సామాజిక న్యాయ సమరభేరి సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గ్రామ మండల, జిల్లా అధ్యక్షులు మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు కార్పొరేషన్ చైర్మన్లు కలిపి దాదాపు 40 వేల మంది హాజరవుతారన్నారు.

సారీ.. వచ్చేసారి

▶ మొదటి పేజీ తరువాయి

ఇచ్చినప్పటికీ నియోజకవర్గాల్లో ముందే నిర్ణయించిన సమావేశాల్లో పాల్గొనాల్సి ఉన్నందున వారు రాలేకపోయారు. కాగా ఈ భేటీలో ఎమ్మెల్యేలు.. తమకు ఎందుకు మంత్రి పదవి ఇవ్వాలో, తాము ఎలా అర్హులమో వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా, పార్టీ పట్ల విధేయతతో ఉంటున్నామని, తమకు ఉన్న అనుభవాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని మంత్రివర్గంలో తప్పనిసరిగా అవకాశం కల్పించాల్సిందేనని కోరారు. నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వలేదని, ఆ రెండు జిల్లాలకు కూడా తప్పకుండా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కష్టపడండి ..గెలిచి రండి

అందరి వాదనలను సావధానంగా విన్న ఖర్గే..ఎమ్మెల్యేల వినతులను పార్టీ తప్పకుండా పరిశీలిస్తుందని, భవిష్యత్తులో సముచిత ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. పార్టీ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అర్హులైన వారికి కూడా కొన్ని పదవులు ఇవ్వలేకపోయామని భవిష్యత్తులో తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. వీలును బట్టి పార్టీలో ప్రాధాన్యమిస్తామని, సీనియారిటీని తప్పకుండా గౌరవిస్తామని, సామాజిక న్యాయానికి కట్టుబడి ముందుకు వెళ్తామని తెలిపారు. పార్టీ రెండోసారి కూడా అధికారంలోకి వస్తుందని అప్పుడు మరిన్ని అవకాశాలు వస్తాయని చెప్పినట్లు సమాచారం. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని, మెజార్టీ స్థానాల్లో గెలవాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అన్నిటినీ విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యేలు

ఎమ్మెల్యేలతో ఖర్గే సమావేశం కొనసాగుతున్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హోటల్లోనే ఉన్నారు. సాయంత్రం 6:30 గంటలకు అక్కడికి వచ్చిన ఆయన.. 9 గంటల తర్వాత కూడా అక్కడే వేచి ఉన్నారు. ఖర్గేతో భేటీ అయిన ఎమ్మెల్యేలు ఆ తర్వాత సీఎంను కూడా కలిశారు. తమకు మంత్రి పదవులు ఎందుకు ఇవ్వాలో, ఖర్గేకి ఏం చెప్పామో వివరించారు. 9 దాటిన తర్వాత హోటల్ నుంచి రేవంత్ తన క్యాంపు కార్యాలయానికి వెళ్లిపోయారు. మీనాక్షి నటరాజన్, మహేశ్‌గౌడ్ కూడా హోటల్లో కొంతసేపు ఉండి ఆ తర్వాత శుక్రవారం నాటి సమావేశాలు, సభ ఏర్పాట్లను సమీక్షించేందుకు వెళ్లారు. కాగా సీఎంను కలిసేందుకు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ హోటల్‌కు రాగా భద్రతా సిబ్బంది అనుమతించలేదు.

చీఫ్ విప్ ఆఫర్ చేసినా..

తాను పార్టీ కోసం చేసిన కృషిని, పార్టీ పట్ల విధేయతను వివరించినప్పటికీ మంత్రి పదవిపై సరైన భరోసా లభించకపోవడంతో అలిగిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు హోటల్ నుంచి విసురుగా వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆయనకు చీఫ్ విప్ పదవి ఇస్తామని చెప్పినట్లు సమాచారం. కాగా ప్రేంసాగర్ రావును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సముదాయించే ప్రయత్నం చేశారు. అనంతరం బయట మీడియాతో మాట్లాడిన ప్రేంసాగర్ రావు.. తాను అలిగానన్నడంలో ఎలాంటి వాస్తవం లేదని, పార్టీ అధ్యక్షుడికి తన మనసులో మాట చెప్పి వెళ్లిపోయానని చెప్పారు.

కొండా మురళి దంపతుల వివరణ

వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ దంపతులు కూడా ఖర్గేను కలిశారు. జిల్లాకు చెందిన పార్టీ నేతలతో విభేదాలపై వివరణ ఇచ్చినట్టు తెలిసింది. అందరినీ కలుపుకొని వెళ్లాలని, సమన్వయంతో పనిచేయాలని, భవిష్యత్తులో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని ఖర్గే చెప్పినట్లు తెలిసింది. వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళిలు కూడా ఖర్గేతో కాసేపు సమావేశం అయ్యారు.

ఖర్గేతో భేటీ అనంతరం ఎవరేమన్నారంటే..

ఉమ్మడి జిల్లాలన్నింటికీ మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరినట్లు మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. 'పార్టీలో సీనియర్లం ఉన్నాం..మంత్రి పదవి ఇవ్వాలని కోరా..' అని సుదర్శన్‌రెడ్డి చెప్పారు. లంబాడా సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యత ఇస్తామని ఖర్గే హామీ ఇచ్చారని బాలునాయక్ తెలిపారు. తాను మంత్రి పదవికి ఎలా అర్హుడనో ఖర్గేకి వివరించానని రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. తనది నాలుగు తరాల విధేయత అని చెప్పానన్నారు.

నేడు వరస సమావేశాలు: మల్లికార్జున ఖర్గే శుక్రవారం వరుస సమావేశాల్లో పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు గాంధీభవన్‌లో టీపీసీసీ పీఏసీ భేటీలో పాల్గొంటారు. అనంతరం అడ్వైజరీ కమిటీతో పాటు పార్టీ ఇటీవల నియమించిన అన్ని కమిటీలతో సమావేశం అవుతారు. అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో ఎల్బీ స్టేడియంలో జరిగే గ్రామ, మండల పార్టీ అధ్యక్షుల బహిరంగ సభలో పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.


రాహుల్‌ను ప్రధానిగా చేయడమే నా లక్ష్యం

- మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి
- పరకాల మాది.. అడిగితే తప్పేంటి: మంత్రి సురేఖ



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీని బతికించడం, రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తన లక్ష్యమని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అన్నారు. గురువారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ను కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డిని ఇంకో పదేళ్లు సీఎంగా ఉండేలా చూడటం తన లక్ష్యమని చెప్పారు. తాను మొదటిసారి పార్టీ ఇన్‌చార్జిని కలిశానని, ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే పాల్గొనే సభకు వరంగల్ నుంచి ఎంత మందిని సమీకరించాలనే అంశంపై చర్చించానని తెలిపారు. బీసీ బిడ్డగా పీసీసీకి తాను అన్ని రకాలుగా సహకరిస్తానని చెప్పారు. పనిచేసే వారి పైనే రాళ్లు పడతాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తిస్థాయి మెజారిటీతో గెలిచేలా కృషి చేస్తానని వెల్లడించారు. వైఎస్సార్ హయాం నుంచి పార్టీ కోసం తాము నిబద్ధతతో పనిచేస్తున్నట్లు చెప్పారు. పార్టీలో గ్రూపులు సహజమేనని, గ్రూపులు లేనిది ఎక్కడ అని ప్రశ్నించారు. తాను ఎవరికీ భయపడనని స్పష్టం చేశారు. తాను సురేఖ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గాలలో మాత్రమే జోక్యం చేసుకుంటున్నట్లు చెప్పారు.

నా కూతురు ఏమనుకుంటుందో నాకేం తెలుసు : మంత్రి కొండా సురేఖ



ఒక ఇంట్లో ఎవరి ఆలోచనలు వారికి ఉంటాయని, ఎవరికి వారు తమ భవిష్యత్తును నిర్ణయించుకుంటారని మంత్రి కొండా సురేఖ అన్నారు. 'నా కూతురు ఏమనుకుంటుందో నాకు ఎలా తెలుసు. పరకాల మాది.. వంశపారంపర్యంగా పరకాల అడిగితే తప్పేంటి?' అని ప్రశ్నించారు. భవిష్యత్‌లో పార్టీ నిర్ణయానికే కట్టుబడి ఉంటామని చెప్పారు.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల పీఏసీఎస్ వద్ద యూరియా కోసం వచ్చిన రైతులు

యూరియా కోసం బారులు

- రోజుల తరబడి రైతుల పడిగాపులు
- భద్రాద్రి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇక్కట్లు

గుండాల: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో రైతులు యూరియా కోసం బారులు తీరుతున్నారు. గుండాల, ఆళ్లపల్లి, ఇల్లెందు తదితర ప్రాంతాల్లో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. గుండాల పీఏసీఎస్ వద్ద గురువారం వందల సంఖ్యలో రైతులు క్యూ కట్టారు. వారం రోజులుగా వర్షాలు పడుతుండటంతో పంటల సాగు పనులు ముమ్మరమవుతున్నాయి. దీనికి తోడు.. గతంలో కురిసిన తొలకరి వర్షాలతో కొందరు విత్తనాలు వేశారు. ఈ నేపథ్యంలో యూరియా అందుబాటులో లేక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం..

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న విస్తీర్ణం అంచనాకు మించి సాగవుతోంది. దీంతో ఎరువుల వాడకం అధికమైంది. దీనికి తోడు పలు గ్రామాల రైతులు పొలాల వద్దకు వెళ్లాలంటే.. ఏర్లు, వాగులు దాటాల్సి ఉంటుంది. వర్షాలు పెరిగితే.. వాటి నుంచి రాకపోకలు కష్టంగా ఉంటుంది. దీంతో ముందుగానే ఎరువులను పొలాల వద్దే నిల్వ చేసుకోవాలని భావిస్తున్న రైతులు.. కొనుగోళ్లకు పోటీ పడుతున్నారు. అయితే జిల్లాలో ఎక్కడా యూరియా కొరత లేదని, రైతులు ఆందోళన చెందొద్దని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
170	48
83,239	25,405

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	20,601	▲	208
డోజోన్స్	44,829	▲	344
ఎఫ్‌టీఎస్ఈ 100	8,823	▲	49
డాక్స్	23,934	▲	144
షాంఘై	3,461	▲	6
నికాయ్	39,786	▲	23


అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.48	87.16
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.03	118.97
€	యూరో	ఎస్‌బీఐ	98.13	102.63
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	48.00	69.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.65	58.48
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.62	69.30
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.85	23.36
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.34	24.12
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.03	12.85

ఎలక్ట్రానిక్ కంపెనీల హవా

షేర్ల ధరల భారీ ర్యాలీ
చైనాయేతర తయారీ ఎఫెక్ట్
పటిష్ట డిమాండ్‌తో మరింత స్పీడ్



ఈఎంఎస్‌లో అధిక వృద్ధికి అవకాశాలు

గత కొంతకాలంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ సర్వీసెస్ (ఈఎంఎస్) రంగం దుమ్మురేపు తోంది. వ్యవస్థాగత వృద్ధికి పలు అంశాలు తోడవడంతో ఈ రంగంలోని కంపెనీలు భారీ లాభాలతో పరుగులు తీస్తున్నాయి. చైనాయేతర తయారీ తదితర అంశాలతో ఏర్పడుతున్న డిమాండ్ ఈ రంగానికి బలాన్నిస్తోంది. దీంతో ఇటీవల దేశీ స్టాక్ మార్కెట్లో హవా చూపుతున్న ఈఎంఎస్ దిగ్గజాలు మరింత స్పీడందుకోనున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

మేకిన్ ఇండియాతో తయారీకి దన్నుగా నిలుస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు, చైనాయేతర దేశాలలో తయారీ యూనిట్ల ఏర్పాటుపై గ్లోబల్ దిగ్గజాల దృష్టి దేశీయంగా ఈఎంఎస్ కంపెనీలకు జోష్‌నిస్తోంది. దీనికితోడు కన్జూమర్ డ్యూరబుల్స్, ఆటో, ఇండస్ట్రియల్, ఎనర్జీ, డిఫెన్స్, మెడికల్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల నుంచి పటిష్ట డిమాండ్ వీటికి జత కలుస్తోంది. వెరసి ఈఎంఎస్ రంగంలోని పలు లిస్టెడ్ కంపెనీలు కొద్ది నెలలుగా ర్యాలీ బాటలో సాగుతున్నాయి. ఇటు దేశీ డిమాండుకుతోడు అటు ఎగుమతులు సైతం పుంజుకోవడం కంపెనీలకు ప్రోత్సాహాన్నిస్తోంది. నిజానికి ఈ రంగంలో మార్జిన్లు తక్కువకావడంతో అధిక అమ్మకాల పరిమాణమే కంపెనీలకు లబ్ధిని చేకూరుస్తుంది. అయినప్పటికీ కొద్ది నెలలుగా ఈ రంగం వెలుగులో నిలుస్తోంది.

భారీ అంచనాలు

దేశీయంగా ఈఎంఎస్ రంగం 2022–23 నుంచి 2027–28 కాలంలో వార్షికంగా 25 శాతం వృద్ధి సాధించనున్నట్లు పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. దీంతో 2027–28కల్లా రూ. 27.7 లక్షల కోట్లను తాకగలదని అంచనా వేశాయి. ఈ రంగం విలువ 2022లో రూ. 8.4 లక్షల కోట్లుగా నమోదైంది. ఈ గణాంకాల ప్రకారం వేసిన అంచనాలివి. కాగా.. ప్రభుత్వం స్థానిక తయారీకి దన్నునిస్తూ ప్రోత్సాహకాలతో కూడిన పథకాలను ప్రవేశపెడుతోంది. తద్వారా గ్లోబల్ దిగ్గజాలను దేశీయంగా తయారీకి ఆహ్వానిస్తోంది. దేశీయంగా పటిష్టస్థాయిలో ఇంజనీరింగ్, డిజైన్ సామర్థ్యాలు అందుబాటులో ఉండటానికి తోడు.. నైపుణ్యంగల మానవవనరులు చౌకగా లభిస్తాయి. అంతేకాకుండా ఈఎంఎస్ రంగానికి భారత్ భారీ మార్కెట్ కూడా. అధిక శాతం కంపెనీలు బీటూబీ కస్టమర్లపైనే దృష్టిపెడుతున్నాయి.

2025కల్లా ఆర్డర్లు ఇలా..

కంపెనీ పేరు	ఆర్డర్ బుక్
కేన్స్ టెక్	6,600
అవలాన్	2,880
సైయెంట్ డీఎల్ఎం	1,900
డేటా ప్యాటర్న్స్	860

(విలువ రూ. కోట్లలో)

షేర్ల జోరు తీరిలా..

కంపెనీ పేరు	ప్రస్తుత ధర	ఏడాది గరిష్టం
డిక్సన్ టెక్	15,069	19,150
అంబర్	7,331	8,167
కేన్స్ టెక్	6,179	7,825
డేటా ప్యాటర్న్స్	2,967	3,655
అవలాన్	838	1,074

(విలువ రూ.లలో)

కీలక రంగాల దన్ను

అధిక మార్జిన్లకు వీలున్న ఏరోస్పేస్, ఇండస్ట్రియల్స్, ఆటోమోటివ్, క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై ఆర్డర్లు లభిస్తుండటంతో లిస్టెడ్ కంపెనీల లాభదాయకత మెరుగుపడుతోంది. ఇందుకు దేశీ కంపెనీలు సంక్లిష్ట ప్రొడక్టుల అభివృద్ధిలో పోటీ పడుతున్నాయి. దేశీయంగా కన్జూమర్ ఎలక్ట్రానిక్స్ విస్తృతి తక్కువగా ఉండటం, వినియోగంపై వెచ్చించగల ఆదాయాలు పుంజుకోవడం వంటి అంశాలు కంపెనీలకు అండగా నిలుస్తున్నాయి. తయారీలో స్థానికతకు ప్రాధాన్యత, అధిక విలువ గల ప్రొడక్టుల తయారీలో నైపుణ్యం వంటి అంశాలతో లిస్టెడ్ దిగ్గజాలు దేశీయంగా ఈఎంఎస్ వ్యవస్థను ఏర్పాటు చేశాయి. ఫలితంగా ప్రపంచస్థాయిలో పోటీపడే తయారీ కేంద్రంగా భారత్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ నేపథ్యంలో బలపడుతున్న ఆర్డర్ల బుక్ లిస్టెడ్ దిగ్గజాలకు బూస్ట్‌నిస్తోంది.

దిగ్గజాల దూకుడు

దేశీ లిస్టెడ్ దిగ్గజాలలో డిక్సన్ టెక్నాలజీస్, కేన్స్ టెక్నాలజీస్, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, అవలాన్ టెక్నాలజీస్, సిర్మా ఎస్‌జీఎస్, సైయెంట్ డీఎల్ఎం, డేటా ప్యాటర్న్స్ ఇండియా తదితరాలున్నాయి. వీటిలో డిక్సన్, అంబర్‌ను మినహాయిస్తే మొత్తం ఆర్డర్ బుక్ విలువ గతేడాదికల్లా(2024–25) వార్షికంగా 23 శాతం పురోభివృద్ధిని సాధించింది. రూ. 16,300 కోట్లకు చేరింది. ఇక గతేడాది లిస్టెడ్ దిగ్గజాల మొత్తం ఆదాయం వార్షికంగా 84 శాతం జంప్‌చేసి రూ. 58,600 కోట్లను తాకింది. ఆదాయంలో డిక్సన్ 2 రెట్లు దూసుకెళ్లగా.. కేన్స్ 51 శాతం, అంబర్ 48 శాతం చొప్పున జంప్‌చేశాయి. ఇతర సంస్థల ఆదాయం సగటున 20 శాతానికిపైగా ఎగసింది. మొత్తం నిర్వహణ లాభం 73 శాతం పురోగమించి రూ. 3,500 కోట్లను తాకింది.

రుణాలపై ముందస్తు చెల్లింపు చార్జీలొద్దు

బ్యాంక్‌లకు ఆర్‌బీఐ ఆదేశం



ముంబై: ఫ్లోటింగ్ రేటు రుణాలపై ముందస్తు చెల్లింపు చార్జీలను విధించొద్దంటూ అన్ని బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలను ఆర్‌బీఐ ఆదేశించింది. వ్యక్తులు, ఎంఎస్ఈలు తీసుకునే ఫ్లోటింగ్ రేటు రుణాలు, అడ్వాన్సులపై (వ్యాపార అవసరాల కోసం సహా) ఈ చార్జీలు విధించరాదని ఆదేశాలు జారీ చేసింది. 2026 జనవరి 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. తన నియంత్రణ పరిధిలోని సంస్థలు (ఆర్ఈలు) ముందస్తు చెల్లింపుల చార్జీల విషయంలో భిన్నమైన పద్ధతులను అనుసరిస్తున్నట్లు ఆర్‌బీఐ సమీక్ష సందర్భంగా గుర్తించింది. దీనికితోడు ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించి తాజా ఆదేశాలు జారీ చేసింది. ''వ్యక్తులు, ఎంఎస్ఈలకు జారీ చేసిన రుణాలపై వాణిజ్య బ్యాంక్ (స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్, లోకల్ ఏరియా బ్యాంక్ మినహా), టైర్ 4 పట్టణ ప్రాథమిక సహకార బ్యాంక్, ఎన్‌బీఎఫ్‌సీ–యూఎల్, ఆల్ ఇండియా ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ ఎలాంటి ముందస్తు చెల్లింపు చార్జీలను విధించరాదు''అని అందులో పేర్కొంది. అలాగే, వ్యాపార అవసరాలకు కాకుండా వ్యక్తులకు జారీ చేసే అన్ని రుణాలపైనా ముందస్తు చెల్లింపు చార్జీలను విధించరాదని ఆర్‌బీఐ ఆదేశించింది. ఏ రూపంలో సమకూర్చుకున్న నిధులతో రుణాలను తీర్చివేసినా.. అలాగే, పాక్షిక- పూర్తి రుణ చెల్లింపులకూ ఇవే నిబంధనలు వర్తిస్తాయని పేర్కొంది.

స్టాక్‌బ్రోకర్‌గా వన్ మొబిక్విక్

సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: స్టాక్ బ్రోకర్, క్లియరింగ్ సభ్యులుగా వ్యవహరించేందుకు పూర్తి అనుబంధ సంస్థ మొబిక్విక్ సెక్యూరిటీస్ బ్రోకింగ్ (ఎంఎస్‌బీపీఎల్)కు అనుమతి లభించినట్లు మాతృ సంస్థ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ తాజాగా వెల్లడించింది. ఇందుకు నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు పేర్కొంది. 2025 జులై1న సెబీ నుంచి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ జారీ అయినట్లు తెలియజేసింది. వెరసి ఎంఎస్‌బీపీఎల్ దేశీ స్టాక్ బ్రోకర్‌గా కొనుగోళ్లు, అమ్మకాలు, లావాదేవీలు, క్లియరింగ్, ఈక్విటీ లావాదేవీల సెటిల్‌మెంట్లు చేపట్టనున్నట్లు వివరించింది. తాజా లైసెన్స్ కారణంగా క్యాపిటల్ మార్కెట్లో సంపద పంపిణీ(వెల్త్ డిస్ట్రిబ్యూషన్) విభాగంలో సేవలు మరింత విస్తరించేందుకు వీలుంటుందని తెలియజేసింది. తద్వారా సమీకృత ఫిన్‌టెక్ సంస్థగా అవతరించనున్నట్లు పేర్కొంది. మొబిక్విక్ గ్రూప్ అనుబంధ సంస్థ జాక్ ఈపేమెంట్ సర్వీసెస్(జాక్‌పే).. ఆన్‌లైన్ పేమెంట్ అగ్రిగేటర్‌గా సేవలందించేందుకు ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆర్‌బీఐ నుంచి అనుమతి పొందిన సంగతి తెలిసిందే.

ఐపీవోకు మీషో రెడీ

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: ఫ్యాషన్, బ్యూటీ, ఎలక్ట్రానిక్స్ ప్రొడక్టుల ఈకామర్స్ కంపెనీ మీషో పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. సాఫ్ట్‌బ్యాంక్‌కు పెట్టుబడులున్న కంపెనీ గోప్యతా విధానంలో ముందస్తు ఫైలింగ్‌ను చేపట్టినట్లు తెలుస్తోంది. గత నెల 25న అసాధారణ సమావేశం(ఈజీఎం)లో ఐపీవోకు ప్రాస్పెక్టస్ దాఖలుపై నిర్ణయించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా.. లిస్టింగ్ ద్వారా కనీసం రూ. 4,250 కోట్లు సమీకరించే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలియజేశాయి.

ఆఖరి గంటలో అమ్మకాలు

ఫైనాన్షియల్, మెటల్ షేర్లు డీలా
సెన్సెక్స్ నష్టం 170 పాయింట్లు

ముంబై: ఆఖరి గంట అమ్మకాలతో స్టాక్ సూచీలు గురువారం నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్ 170 పాయింట్లు నష్టపోయి 83,239 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 48 పాయింట్లు పతనమై 25,405 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు ప్రథమార్ధమంతా సానుకూలంగా ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 440 పాయింట్లు బలపడి 83,850 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 134 పాయింట్లు ఎగసి 25,587 స్థాయిని తాకింది. అయితే ట్రేడింగ్ చివర్లో ఫైనాన్షియల్, మెటల్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సూచీలు ఇంట్రాడే లాభాలు కోల్పోయి నష్టాలతో ముగిశాయి. అమెరికా బాండ్లపై రాబడులు తగ్గడం, డాలర్ ఇండెక్స్ బలహీనత కారణంగా డాలర్ మారకంలో రూపాయి విలువ ఏడు పైసలు బలపడి 85.55 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ మార్కెట్లు స్వల్పంగా లాభపడ్డాయి.

- రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో సర్వీసెస్ 1.08%, మెటల్, 0.77%, రియల్టీ, 0.61%, టెలికమ్యూనికేషన్ 0.55%, వినిమయ 0.48%, బ్యాంకెక్స్ 0.48% పతనమయ్యాయి.
- ఇండోగల్ఫ్ కార్ప్‌సైన్సెస్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర రూ.111 వద్దే లిస్టయింది. ఇంట్రాడేలో 1.50% పెరిగి రూ.113 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 0.18% స్వల్ప నష్టంతో ఇష్యూ ధర రూ.111 వద్దే ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.701 కోట్లుగా నమోదైంది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

10 నెలల గరిష్టానికి సేవల రంగం	రియల్టీలో సంస్థాగత పెట్టుబడులు డీలా

కార్ల్‌సన్‌పై గుకేశ్ గెలుపు




జాగ్రెబ్ (క్రొయేషియా): సూపర్ యునైటెడ్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ వరుసగా ఐదో విజయం అందుకున్నాడు. నార్వే దిగ్గజం, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌తో గురువారం జరిగిన ఆరో రౌండ్ ర్యాపిడ్ గేమ్‌లో గుకేశ్ 49 ఎత్తుల్లో గెలిచాడు. ఆరో రౌండ్ తర్వాత గుకేశ్ 10 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో ఉన్నాడు.

క్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్



కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో శ్రీకాంత్ 21–19, 21–12తో వాంగ్ పో వె (చైనీస్ తైపీ)పై గెలుపొందాడు.

గిల్ రికార్డుల హోరు ఇంగ్లండ్ బేజారు



గిల్ డబుల్ సెంచరీ సంబరం

269 పరుగులు సాధించిన భారత కెప్టెన్

- తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 587
- ఇంగ్లండ్ ప్రస్తుతం 77/3
- మరో 510 పరుగులు వెనుకంజ

'హెడింగ్లీలో నేను 147 పరుగులకే అవుటయ్యా... మరింత సుదీర్ఘ ఇన్నింగ్స్ ఆడాల్సింది. తప్పుడు షాట్‌తో వెనుదిరిగా'... రెండో టెస్టుకు ముందు భారత జట్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ చెప్పిన మాట ఇది. తాను నిజంగా నిలబడి పట్టుదలగా ఆడితే ఎలా ఉంటుందో ఇప్పుడు అతను ఎడ్జ్‌బాస్టన్‌లో చూపించాడు. 8 గంటల 29 నిమిషాల అసాధారణ బ్యాటింగ్, ఎక్కడా చిన్న తప్పుకు కూడా అవకాశం ఇవ్వకుండా... 94 శాతం నియంత్రణతో కూడిన చక్కటి షాట్లతో గిల్ అదరగొట్టాడు... ఏకంగా 269 పరుగులు చేసి పలు రికార్డులను అలవోకగా అధిగమిస్తూ పోయాడు. గిల్‌కు జడేజా, వాషింగ్టన్ సుందర్ అండగా నిలవడంతో టీమిండియా భారీ స్కోరుతో ప్రత్యర్థికి సవాల్ విసిరింది. ఒక దశలో 211/5తో కష్టాల్లో నిలిచిన జట్టు చివరి 5 వికెట్లకు ఏకంగా 376 పరుగులు జోడించింది. ఆపై బుమ్రా లేని లోటును తీర్చేలా ఆకాశ్‌దీప్, సిరాజ్ చెలరేగిపోయి ఇంగ్లండ్ టాప్–3ని కుప్పకూల్చారు. మూడో రోజూ మన బౌలర్ల జోరు సాగితే టీమిండియాకు మ్యాచ్‌పై పట్టు చిక్కడం ఖాయం.

బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 471 పరుగులు చేసి కూడా ఓడిన భారత్ ఈసారి అంతకంటే మరింత భారీ స్కోరును నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 310/5తో ఆట కొనసాగించిన భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 151 ఓవర్లలో 587 పరుగులకు ఆలౌటైంది. ఇంగ్లండ్ క్రికెట్‌లో స్టోక్స్–మెకల్లమ్ (బజ్‌బాల్) శకం మొదలైన తర్వాత ఆ జట్టుపై ప్రత్యర్థి సాధించిన అత్యధిక స్కోరు ఇదే కావడం విశేషం. టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (387 బంతుల్లో 269; 30 ఫోర్లు, 3 సిక్స్‌లు) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చగా, రవీంద్ర జడేజా (137 బంతుల్లో 89; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ చేజార్చుకున్నాడు. వాషింగ్టన్ సుందర్ (103 బంతుల్లో 42; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ఆరో వికెట్‌కు జడేజాతో 203 పరుగులు జోడించిన గిల్... ఏడో వికెట్‌కు సుందర్‌తో 144 పరుగులు జత చేశాడు. అనంతరం రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 3 వికెట్లకు 77 పరుగులు చేసింది. ఫాలోఆన్ తప్పించుకునేందుకు కూడా ఆ జట్టు మరో 311 పరుగులు చేయాల్సి ఉంది.

జడేజా చేజారిన సెంచరీ

మ్యాచ్ రెండో రోజు తొలి బంతికి సింగిల్‌తో గిల్, జడేజా భాగస్వామ్యం 100 పరుగులకు చేరింది. అనంతరం 80 బంతుల్లో జడేజా అర్ధసెంచరీ పూర్తి చేసుకోగా... దాటిని పెంచిన గిల్ టెస్టుల్లో తన అత్యధిక స్కోరును అందుకోవడంతో పాటు కెరీర్‌లో తొలిసారి 150 పరుగులు (263 బంతుల్లో) దాటాడు. ఆ తర్వాత మరింత జోరు ప్రదర్శించిన వీరిద్దరు బషీర్ ఓవర్లో చెరో సిక్స్ బాదారు. ఇదే ఊపులో శతకం దిశగా దూసుకుపోయిన జడేజా దురదృష్టవశాత్తూ ఆ అవకాశం కోల్పోయాడు. టంగ్ వేసిన షార్ట్ బంతి నుంచి అతను తప్పించుకునే ప్రయత్నం చేయగా... గ్లవ్‌కు తగిలిన బంతి గాల్లోకి లేచి కీపర్ చేతుల్లో పడింది. దాంతో ద్విశతక భాగస్వామ్యానికి తెర పడింది. అనంతరం సుందర్ కూడా చక్కటి షాట్లతో గిల్‌కు తగిన సహకారం అందించాడు. తొలి సెషన్‌లో భారత్ 25 ఓవర్లలో ఒక్క వికెట్ కోల్పోయి 109 రన్స్ చేసింది.



ఆకాశ్‌దీప్‌కు నితీశ్, జడేజా అభినందన

కొనసాగిన జోరు

రెండో సెషన్‌లో గిల్ మరింత చెలరేగిపోయాడు. బషీర్ ఓవర్లో సిక్స్ కొట్టిన అతను టంగ్ ఓవర్లో రెండు ఫోర్లతో 195కు చేరుకున్నాడు. ఆ తర్వాత టంగ్ బౌలింగ్‌లోనే ఫైన్ లెగ్ దిశగా సింగిల్ తీయడంతో 311 బంతుల్లో గిల్ డబుల్ సెంచరీ పూర్తయింది. ఆపై 200 నుంచి 250 వరకు చేరేందుకు గిల్‌కు కేవలం 37 బంతులు (8 ఫోర్లు, 1 సిక్స్) సరిపోయాయి. ఈ క్రమంలో బ్రూక్ ఓవర్లో అతను వరుసగా మూడు ఫోర్లు కొట్టాడు. ఎట్టకేలకు సుందర్‌ను రూట్ బౌల్డ్ చేయడంతో ఇంగ్లండ్‌కు కాస్త ఊరట లభించింది. రెండో సెషన్‌లో భారత్ 31 ఓవర్లలో ఓవర్‌కు 4.6 రన్‌రేట్‌తో ఏకంగా 145 పరుగులు సాధించడం విశేషం. టీ విరామానంతరం 'ట్రిపుల్'పై కన్నేసిన గిల్‌ను నిలువరించడంలో ఇంగ్లండ్ సఫలమైంది. టంగ్ వేసిన షార్ట్ పిచ్ బంతిని ఆడబోయి స్క్వేర్‌లెగ్‌లో సునాయాస క్యాచ్ ఇవ్వడంతో గిల్ అద్భుత ఇన్నింగ్స్ ముగిసింది. మరో 13 పరుగుల తర్వాత భారత్ తమ చివరి 2 వికెట్లు కోల్పోయింది.

టపటపా

ప్రత్యర్థి చేసిన కొండంత స్కోరు కనిపిస్తుండగా ఒత్తిడిలో బరిలోకి దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు పూర్తిగా తడబడ్డారు. ఆకాశ్‌దీప్ చెలరేగిపోతూ వరుస బంతుల్లో డకెట్ (0), పోప్ (0)లను అవుట్ చేయడంతో ఇంగ్లండ్ ఒక్కసారిగా షాక్‌కు గురైంది. ఆ తర్వాత క్రాలీ (19)ని సిరాజ్ పెవిలియన్ పంపడంతో పరిస్థితి మరింత దిగజారింది. అయితే రూట్, బ్రూక్ పట్టుదలగా నిలబడి ఇంగ్లండ్‌ను ఆదుకున్నారు. ఆరంభంలో కొంత తడబడినా చివరకు 12.5 ఓవర్లు నిలిచి రోజును ముగించారు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 87; రాహుల్ (బి) వోక్స్ 2; కరుణ్ నాయర్ (సి) బ్రూక్ (బి) కార్స్ 31; గిల్ (సి) పోప్ (బి) టంగ్ 269; పంత్ (సి) క్రాలీ (బి) బషీర్ 25; నితీశ్ రెడ్డి (బి) వోక్స్ 1; జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 89; సుందర్ (బి) రూట్ 42; ఆకాశ్‌దీప్ (సి) డకెట్ (బి) బషీర్ 6; సిరాజ్ (స్టంప్డ్) స్మిత్ (బి) బషీర్ 8; ప్రసిధ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (151 ఓవర్లలో ఆలౌట్) 587. వికెట్ల పతనం:** 1–15, 2–95, 3–161, 4–208, 5–211, 6–414, 7–558, 8–574, 9–574, 10–587. **బౌలింగ్:** వోక్స్ 25–6–81–2, కార్స్ 24–3–83–1, టంగ్ 28–2–119–2, స్టోక్స్ 19–0–74–1, బషీర్ 45–2–167–3, రూట్ 5–0–20–1, బ్రూక్ 5–0–31–0. **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) నాయర్ (బి) సిరాజ్ 19; డకెట్ (సి) గిల్ (బి) ఆకాశ్‌దీప్ 0; పోప్ (సి) రాహుల్ (బి) ఆకాశ్‌దీప్ 0; రూట్ (బ్యాటింగ్) 18; బ్రూక్ (బ్యాటింగ్) 30; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 3 వికెట్లకు) 77. వికెట్ల పతనం:** 1–13, 2–13, 3–25. **బౌలింగ్:** ఆకాశ్‌దీప్ 7–1–36–2, సిరాజ్ 7–2–21–1, ప్రసిధ్ కృష్ణ 3–0–11–0, నితీశ్ రెడ్డి 1–0–1–0, జడేజా 2–1–4–0.



జడేజా

1 టెస్టుల్లో అత్యధిక స్కోరు సాధించిన భారత కెప్టెన్‌గా గిల్ కొత్త రికార్డు నమోదు చేశాడు. గతంలో విరాట్ కోహ్లి (254 నాటౌట్-దక్షిణాఫ్రికాపై) పేరిట ఉన్న రికార్డును అతను సవరించాడు.

3 గావస్కర్, ద్రవిడ్ తర్వాత ఇంగ్లండ్ గడ్డపై డబుల్ సెంచరీ చేసిన మూడో భారత ఆటగాడు గిల్. ఇంగ్లండ్‌లో భారత్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు కూడా ఇప్పుడు గిల్‌దే. సునీల్ గావస్కర్ (221)ను గిల్ దాటాడు.

5 టెస్టు, వన్డే ఫార్మాట్‌లలో డబుల్ సెంచరీ చేసిన ఐదో బ్యాటర్ గిల్. గతంలో సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, రోహిత్ శర్మ (భారత్), క్రిస్ గేల్ (వెస్టిండీస్) ఈ ఘనత సాధించారు.

7 గిల్ సాధించిన పరుగులు (269). టెస్టుల్లో భారత్ తరఫున ఏడో అత్యధిక వ్యక్తిగత స్కోరు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



తీపి వద్దు.. సున్నా ముద్దు

చక్కెర లేని పానీయాల వినియోగం భారత్‌లో క్రమంగా పెరుగుతోంది. కోవిడ్-19 మహమ్మారి తర్వాత ప్రధానంగా పట్టణాలూ, నగరాల్లో ఈ ట్రెండ్ ఊపందుకుంది. గత 5 ఏళ్ల కాలంలో.. భారతీయ నాన్-ఆల్కహాల్ పానీయాల బ్రాండ్లు తక్కువ చక్కెర లేదా చక్కెర లేని డ్రింక్స్‌ను ఎక్కువగా ప్రవేశపెట్టాయి. కేవలం మూడు నెలల్లోనే కోకా-కోలా తయారీ 'షుగర్ ఫ్రీ థమ్సప్ ఎక్స్‌ఫోర్స్' అమ్మకాలు రికార్డు స్థాయిలో 25 లక్షల యూనిట్ కేసులు నమోదుకావడమే ఇందుకు ఒక ఉదాహరణ.

సాక్షి, స్పెషల్ డెస్క్

- తక్కువ చక్కెర, చక్కెర లేని డ్రింక్స్‌కు భారీ డిమాండ్
- 5 ఏళ్లలో చక్కెర రహిత పానీయాలు 142% అధికం
- కొనుగోళ్లను నడిపిస్తున్న పెద్ద నగరాల యూత్
- కోవిడ్ తర్వాత వీటి వినియోగంలో గుర్తించదగిన మార్పు

ప్రముఖ మార్కెట్ పరిశోధన సంస్థ 'మింటెల్ గ్రూప్' రూపొందించిన గ్లోబల్ న్యూ ప్రొడక్ట్స్ గణాంకాల ప్రకారం 2019 జూలై- 2024 జూన్ మధ్య కాలంలో భారతీయ నాన్-ఆల్కహాల్ పానీయాల బ్రాండ్లు తక్కువ చక్కెర లేదా చక్కెర లేని డ్రింక్స్‌ను ఎక్కువగా ప్రవేశపెట్టాయి. దేశంలో తక్కువ చక్కెర, తగ్గించిన చక్కెర పేరుతో విడుదల చేసిన ఉత్పత్తుల సంఖ్య 5 ఏళ్లలో 483% పెరిగింది. చక్కెర రహిత ఉత్పత్తులు 142% అధికం అయ్యాయి. 2024లో అత్యధికంగా సుమారు రూ.750 కోట్ల పానీయాల అమ్మకాలు జరిగాయి. 2023తో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. ముఖ్యంగా మెట్రో నగరాల్లోని వినియోగదారులు ఈ జోరును నడిపిస్తున్నారు. 'చిన్న వయసు వారిలో కూడా ఊబకాయం, మధుమేహం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శారీరక ఆరోగ్య స్పృహ పెరుగుతోంది' అని మింటెల్ ఇండియా ఫుడ్, డ్రింక్ సీనియర్ అనలిస్ట్ అనామిక బెనర్జీ అన్నారు.

జీరో షుగర్

ప్రపంచంలోనే అతిపెద్ద పానీయాల కంపెనీ అయిన కోకా-కోలాతోపాటు సమీప ప్రత్యర్థి పెప్సికో, అలాగే రిలయన్స్ కంజ్యూమర్ ప్రొడక్ట్స్.. కేలరీలను లెక్కించే కస్టమర్ల కోసం జీరో-షుగర్ వేరియంట్స్‌ను ఆఫర్ ఉన్నాయి. డైట్, కేలరీలు లేని వేరియంట్స్ అయిన కోక్ జీరో, డైట్ కోక్, స్ప్రైట్ జీరో, థమ్స్ అప్ ఎక్స్‌ఫోర్స్ వంటి వాటికి భారత్‌లో డిమాండ్ దూసుకెళుతోందని కోకా-కోలా తెలిపింది. ప్రధానంగా యువతలో వీటి వినియోగం ఎక్కువని వివరించింది. మారుతున్న జీవనశైలి, అందుబాటులో విభిన్న ఉత్పత్తులు ఉండడం ఈ వృద్ధిని నడిపిస్తోందని తెలిపింది.



చక్కెర శాతం, కేలరీల సంఖ్య, ఉపయోగించే స్వీటెనర్ రకాన్ని బట్టి సాధారణ, ఆరోగ్యకర పానీయాల మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఇటీవలి కాలంలో కృత్రిమ స్వీటెనర్ల వాడకం పెరగడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. వీటి ప్రభావం భారతీయులపై ఏ

ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిమితులు..

మేరకు ఉందో పరిశీలిస్తామని భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తెలిపింది. స్టీవియా, ఎసిసల్ఫేమ్ పొటా షియం, అస్పార్టేమ్, సుక్రలోజ్ వంటి నాన్-కెలోరిక్ స్వీటెనర్ల వాడకానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ భద్రతా పరిమితులను కూడా నిర్దేశించింది.

ప్రస్తుతానికి నగరాలూ పట్టణాల్లోనే..

ఎలక్ట్రోలైట్స్‌తో కూడిన పానీయం బాడీఆర్మర్ లైట్, స్పోర్ట్స్ డ్రింక్ ఛార్జ్‌డ్‌తోపాటు హానెస్ట్ టీ ఉత్పత్తులను ఇటీవలే కోకా-కోలా అందుబాటులోకి తెచ్చింది. అంతర్జాతీయ మార్కెట్ పరిశోధన సంస్థ 'కాంటార్' అధ్యయనం ప్రకారం చక్కెర లేని పానీయాలను వినియోగించే భారతీయ కుటుంబాల సంఖ్య నాలుగేళ్లలో 78% పెరిగింది. అయితే ఈ ఉత్పత్తులు ఇప్పటికీ నగరాలు, పెద్ద పట్టణాలకే పరిమితమయ్యాయి. ఇవి గ్రామీణ ప్రాంతాలకు చేరుకోవడానికి ఇంకా చాలా కాలం పడుతుందని 'కాంటార్' వరల్డ్ ప్యానెల్ విభాగం మేనేజింగ్ డైరెక్టర్ (దక్షిణాసియా) కె.రామకృష్ణన్ అన్నారు.

మహమ్మారి తర్వాత..

పెప్సికో పానీయాల విక్రయాల్లో గత ఏడాది సెవెనప్, పెప్సి, గాటోరేడ్ వంటి బ్రాండ్ల తక్కువ-చక్కెర, చక్కెర లేని విభాగం ఉత్పత్తుల వాటా పరిమాణం పరంగా 44% ఉంది. ఆఫ్రికా, నేపాల్, శ్రీలంకతో కలిపి.. తక్కువ-చక్కెర, చక్కెర లేని ఉత్పత్తుల అమ్మకాలు సంస్థ మొత్తం పరిమాణంలో 53% వాటాను కలిగి ఉన్నాయని భారత్‌లో పెప్సికో ఉత్పత్తులను తయారు చేస్తున్న వరుణ్ బెవరేజెస్ తెలిపింది. కంపెనీ పోర్ట్‌ఫోలియోలో తక్కువ-కేలరీ, జీరో-షుగర్ ఉత్పత్తులు 50% కంటే ఎక్కువ వాటా కలిగి ఉన్నాయని పెప్సికో ఇండియా ప్రతినిధి ఒకరు తెలిపారు. చక్కెర రహిత, తక్కువ చక్కెర పానీయాల పట్ల వినియోగదారులకు కొంత ఆసక్తి ఉన్నప్పటికీ.. కోవిడ్-19 మహమ్మారి తర్వాత వీటి వినియోగంలో గుర్తించదగిన మార్పు వచ్చిందని వివరించారు. 'కోవిడ్ సమయంలో ఇంటి భోజనానికి, శారీరక శ్రమకు ప్రాధాన్యత పెరిగింది. ఈ నేపథ్యంలో షుగర్ ఫ్రీ ఆధారిత ఉత్పత్తుల తయారీకి మొగ్గ చూపేలా చేసింది' అని తెలిపారు.

పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు మరింత సులభం

- ఆన్‌లైన్‌లోనే ఆటో ఎస్టిమేషన్
- కొత్తగా అందుబాటులోకి సాఫ్ట్‌వేర్
- దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ



సాక్షి, హైదరాబాద్: పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్ల మంజూరీని మరింత సులభతరం చేస్తున్నామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. దీని కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని ద్వారా సమర్థవంతమైన సేవలు అందుతాయని చెప్పారు. ఆటో ఎస్టిమేట్ పేరుతో రూపొందించిన సాఫ్ట్‌వేర్ వివరాలను గురువారం ఆయన మీడియాకు తెలిపారు. పరిశ్రమల అవసరాల కోసం హైటెన్షన్ సర్వీస్ కోసం దరఖాస్తు చేస్తారని, ఇప్పటి వరకూ వాటిని పరిశీలించి, విచారణ జరపడానికి ఎక్కువ సమయం పట్టేదని పేర్కొన్నారు. కొత్త విధానం వల్ల దరఖాస్తుదారుడి పూర్తి వివరాలు ఎస్ఎస్ఏ యాప్ ద్వారా ఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయానికి చేరుతాయన్నారు. కేంద్రీకృత విధానంలో ప్రధాన కార్యాలయంలోని కమర్షియల్ చీఫ్ ఇంజనీర్ వద్దకు దరఖాస్తుదారుని వివరాలు వస్తాయని చెప్పారు. ఈ సమాచారం చేరగానే అదే ఎస్ఎస్ఏ యాప్ ద్వారానే అవసరమైన ఖర్చులతో కూడిన అంచనా రూపొందుతుందని తెలిపారు. ఎస్టిమేట్ ఆమోదం తర్వాత డిమాండ్ నోటీసు సంబంధిత వినియోగదారుడికి మెయిల్ ద్వారా చేరుతుందని వివరించారు. ఆటో ఎస్టిమేట్ ఆమోదం అయిన విషయాన్ని సంబంధిత విద్యుత్ అధికారులకు పంపుతామన్నారు. సింగల్ విండో పద్ధతిలో జరిగే ఈ ప్రక్రియ వలన అతి తక్కువ సమయంలో అన్ని అనుమతులు జారీ అవుతాయన్నారు. ఇకపై కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసేవారు తేలికగా విద్యుత్ కనెక్షన్లు పొందవచ్చన్నారు.

ఎఫ్‌డీవో కార్యాలయ ఆస్తులు జప్తు



జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం ఎఫ్‌డీవో కార్యాలయం ఆస్తులను కోర్టు ఆదేశాల మేరకు సిబ్బంది గురువారం జప్తు చేశారు. అటవీ శాఖ నుంచి తొలగించిన కాంట్రాక్టు ఉద్యోగికి ఉద్యోగమైనా ఇవ్వాలని లేదా పరిహారమైనా చెల్లించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను ధిక్కరించడంతో.. సిబ్బంది ఫర్నిచర్‌ను జప్తు చేసి తరలించారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట కోర్టు ఫీల్డ్ అధికారి రజిత్‌కుమార్ తెలిపిన వివరాలివి. జన్నారం అటవీ డివిజన్‌లోని తాళ్లపేట రేంజ్‌లో జన్నారం మండలం మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దర్శనాల రాజం కాంట్రాక్టు ఉద్యోగిగా విధులు నిర్వర్తించాడు. వివిధ కారణాల వల్ల 2016లో అధికారులు అతన్ని విధుల నుంచి తొలగించారు. దీంతో రాజం 2017లో గోదావరిఖని లేబర్ కోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన కోర్టు రాజంకు.. 2016 సెప్టెంబర్ 1 నుంచి 2021 డిసెంబర్ 6 వరకు వేతనం రూ.15,89,700 చెల్లించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించినా అమలు చేయలేదు. దీంతో జన్నారం అటవీ డివిజన్ కార్యాలయం, తాళ్లపేట్ రేంజ్ కార్యాలయాల ఫర్నిచర్ జప్తు చేయాలని జూన్‌లో లేబర్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు లక్సెట్టిపేట కోర్టు ఫీల్డ్ అసిస్టెంట్ రజిత్‌కుమార్, సిబ్బంది మున్సిఫ్‌అలీ, సంధ్యారాణి ఆధ్వర్యంలో కుర్చీలు, టేబుళ్లు, కంప్యూటర్, బీరువాలు, ప్లాస్టిక్ కుర్చీలను వాహనంలో లక్సెట్టిపేట కోర్టుకు తరలించారు.

గౌరవంతోనే మహిళా సాధికారత

- ఇంట్లో, పని ప్రదేశాల్లోనూ మహిళలకు సరైన గౌరవం ఉండాలి
- మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి
- న్యాయవ్యవస్థలో పెరుగుతున్న మహిళా భాగస్వామ్యం

జీఎస్ఐసీసీ కార్యక్రమంలో ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్

సాక్షి, హైదరాబాద్

స్వగృహాలతోపాటు పని ప్రదేశాల్లో మహిళలకు సరైన గౌరవం దక్కినప్పుడే వారు సాధికారత సాధించినట్లు అని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ అన్నారు. ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు నివసిస్తారని (యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా) మన పెద్దలు చెప్పారని గుర్తుచేశారు. హైకోర్టు జెండర్ సెన్సిటైజేషన్ అండ్ ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (జీఎస్ఐసీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన వారికి హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) హాల్‌లో గురువారం బహుమతుల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జస్టిస్ సుజోయ్‌పాల్ హాజరై మాట్లాడారు. మధ్యప్రదేశ్‌లో మహిళా న్యాయమూర్తుల సంఖ్య 50 శాతం దాటిందని, భవిష్యత్‌లో పురుషులకు రిజర్వేషన్ కోరాల్సిన పరిస్థితి వస్తుందేమో అని చమత్కరించారు. తెలంగాణలోనూ న్యాయమూర్తులుగా మహిళలు అవకాశాలు అందిపుచ్చుకుంటున్నారని, అలాగే ఇతర రంగాల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని



కార్యక్రమంలో మాట్లాడుతున్న తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్. చిత్రంలో జస్టిస్ మాధవీదేవి, జస్టిస్ శ్రీదేవి, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్

కాపాడుకున్నప్పుడే మానవాళికి సత్ఫలితాలు అందుతాయని అన్నారు. చెట్లు ఆక్సిజన్ ఇస్తేనే మనం బతుకుతున్నాం అని గుర్తిస్తే వాటి ప్రాధాన్యం తెలుస్తుందని.. అలాగే మహిళల గొప్పతనం బోధపడితేనే ఇల్లు, సమాజం వర్ధిల్లుతుందని చెప్పారు. లింగ వివక్ష ఉందని అంగీకరించడం, వివక్షను గుర్తించడం, ఆ వివక్షను నిర్మూలించడం.. ఇది పాటిస్తే సమానత్వం సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు.

పక్షి ఒకే రెక్కతో ఎగరడం సాధ్యంకాదు

హైకోర్టులో లింగ సమానత్వంపై అవగాహన పెంచడం, ప్రోత్సహించడం, పక్షపాతం లేకుండా చూడటం, సమాన అవకాశాలు దక్కేలా చర్యలు చేపట్టడం, వేధింపులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవడం కోసం జీఎస్ఐసీసీని ఏర్పాటు చేసినట్లు ఆ కమిటీ చైర్‌పర్సన్ జస్టిస్ టి.మాధవీదేవి చెప్పారు. 2023, జూన్‌లో ఏర్పాటైన ఈ కమిటీకి రెండు ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని, వాటిని పరిష్కరించామని తెలిపారు. స్త్రీల పరిస్థితి మెరుగుపడకపోతే ప్రపంచ సంక్షేమం సాధ్యం కాదని స్వామి వివేకానంద చెప్పిన మాటలను గుర్తుచేశారు. పక్షి ఒకే రెక్కతో ఎగరడం సాధ్యంకాదనే విషయాన్ని గుర్తించాలని సూచించారు. చాలా మంది మహిళలు న్యాయం కంటే మౌనాన్ని ఎంచుకుంటారని.. పలు రకాల భయాలే అందుకు కారణమని పేర్కొన్నారు. అందుకే లింగ అవగాహన అవసరమని తెలిపారు. పురుషులు కూడా తమ చర్యల తీవ్రత, పరిణామాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని సూచించారు. జస్టిస్ జువ్వాడి శ్రీదేవి మాట్లాడుతూ.. హైకోర్టులో సురక్షితమైన, అందరినీ కలుపుకుని, గౌరవప్రదమైన పని వాతావరణాన్ని పెంపొందించడంలో కమిటీ కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. రాజ్యాంగ సంరక్షణ కోసం పనిచేస్తున్న న్యాయవ్యవస్థ లింగ సమానత్వాన్ని పెంపొందించడంలో ఇతర రంగాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కోవిడ్ తర్వాత వచ్చిన వర్క్‌ఫ్రం హోంలో భాగంగా డిజిటల్ వినియోగంలో సోషల్ మీడియా సాధనంగా వేధింపులు పెరిగాయని.. ఇవి కూడా పని ప్రదేశంలో వేధింపుల కిందకే వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ బి.విజయసేన్ రెడ్డి, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి, రాష్ట్ర బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నరసింహారెడ్డి, హెచ్‌సీఏఏ అధ్యక్షుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకనదారుల ఎంపికకు ప్రాతిపదిక ఏమిటి?

- తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రశ్నించిన హైకోర్టు
- ఇతర రాష్ట్రాల వారికి ఇక్కడి చరిత్ర తెలుస్తుందా అని ప్రశ్న
- వివరాలు సమర్పించాలని ఆదేశం.. విచారణ నేటికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వరంగ విద్యా సంస్థల్లో పనిచేసే వారిని ఏ ప్రాతిపదికన మూల్యాంకనదారులుగా ఎంపిక చేశారో చెప్పాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)ను హైకోర్టు ఆదేశించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు తెలంగాణ చరిత్రకు సంబంధించి మూల్యాంకనం ఎలా చేస్తారని ప్రశ్నించింది. దీనిపై వివరాలు సమర్పించాలని స్పష్టం చేస్తూ విచారణను నేటికి వాయిదా వేసింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని... దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతోపాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు గురువారం విచారణ కొనసాగించారు. టీజీపీఎస్సీ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'పరీక్ష రాసిన వారి సంఖ్యలో తేడాలు ఉన్నాయనే వాదన అసంబద్ధం. 21,110 మంది అభ్యర్థుల్లో 25 మంది స్పోర్ట్స్ కోటా మినహాయిస్తే 21,085 మంది ఉన్నారన్నారు. వారిలో తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మీడియం నుంచి వరుసగా 8,694, 12,381, 10 మంది పరీక్ష రాశారు. కోఠిలోని మహిళా కళాశాలలో టాయిలెట్లు లేని కారణంగానే పురుషులకు కేటాయించలేదు. యూపీఎస్సీ పరీక్షల సమయంలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయడంపై తీవ్ర ఆరోపణలు వచ్చిన విషయాన్ని గుర్తించాలి. మహిళలు అత్యధిక సంఖ్యలో అర్హత సాధించడం వెనక అక్రమాలేవీ జరగలేదు. కోఠి మహిళా కాలేజీ సెంటర్‌లో పరీక్షలు రాసిన మహిళా అభ్యర్థులు ఎంపికైన వారిలో 12 శాతం ఉన్నారనే వాదన తప్పు. ఆ ఎంపిక 5.4 శాతంలోపే. కంప్యూటర్ ప్రోగ్రాం ఆధారంగా పరీక్షా కేంద్రాల కేటాయింపు జరిగింది. అయితే దివ్యాంగులకు ఇబ్బంది ఉన్న కేంద్రాల నుంచి ఇతర కేంద్రాలకు మార్చాం'అని ఎస్. నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఏ ప్రాతిపదికన మూల్యాంకనదారులను ఎంపిక చేశారో చెప్పాలని కమిషన్‌ను ఆదేశిస్తూ విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

నా సొంత నిర్ణయాలేవీ లేవు?

అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలోనే ఫార్ములా ఈ-కారు రేస్


- ఆయన ఆదేశాల మేరకే చెల్లింపులు.. ఏసీబీ విచారణలో సీనియర్ ఐఏఎస్ అర్విందుకుమార్
- అత్యవసర పరిస్థితుల్లో ఆర్థికశాఖ అనుమతులు తీసుకోలేదని వెల్లడి



సాక్షి, హైదరాబాద్ : ఫార్ములా ఈ-కారు రేస్ నిర్వహణకు సంబంధించి తాను సొంతంగా తీసుకున్న నిర్ణయాలు ఏవీ లేవని, గత ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే తాను నడుచుకున్నట్లు సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ మరోమారు ఏసీబీ ఎదుట స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ-కారు రేస్‌కు సంబంధించిన అన్ని అగ్రిమెంట్స్ గత ప్రభుత్వంలో మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పర్యవేక్షణలోనే జరిగాయని, ఆయన ఆదేశాల మేరకే చెల్లింపులు జరిపామని ఆయన పేర్కొన్నట్టు సమాచారం. ఫార్ములా ఈ-కారు రేస్ కేసులో రెండో ముద్దాయిగా ఉన్న అర్వింద్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. ఇప్పటికే ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఒకసారి అర్వింద్‌కుమార్ స్టేట్‌మెంట్‌ను ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. తాజాగా మరోసారి నోటీసులు జారీ చేయడంతో అర్వింద్‌కుమార్ గురువారం ఉదయం 11-30 గంటలకు బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు. ఈ కేసు దర్యాప్తు అధికారి, డీఎస్పీ మాజిద్ అలీ నేతృత్వంలోని అధికారుల బృందం అర్వింద్‌ను సాయంత్రం ఐదు గంటల వరకు ప్రశ్నించింది. మాజీమంత్రి కేటీఆర్ నుంచి గతనెల 16న రెండో దఫా విచారణలో భాగంగా సేకరించిన అంశాలు, గతంలో ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) ప్రతినిధుల నుంచి సేకరించిన అంశాల ఆధారంగానే అర్వింద్‌ను ప్రశ్నించారు. నగదు బదిలీ, నిబంధనల ఉల్లంఘనలపైనే ఏసీబీ అధికారులు ప్రశ్నించి..అర్వింద్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. 2023 ఫిబ్రవరి 11న జరిగిన ఫార్ములా ఈ-కారు రేస్ సీజన్ 9 కోసం రూ.12 కోట్లు చెల్లించడం, ఫార్ములా ఈ ఆపరేషన్స్, స్పాన్సర్ ఏస్ నెక్స్‌జెన్ మధ్య తలెత్తిన చెల్లింపుల వివాదం నేపథ్యంలో ఏస్ నెక్స్‌జెన్ సీజన్ 10 నిర్వహణ నుంచి తప్పుకోవడం, ఆ తర్వాత అప్పటి మున్సిపల్ మంత్రి ఆదేశాల మేరకు ఎంఏయూడీ, ఎఫ్ఈవో మధ్య 2023 అక్టోబర్ 10న ఏ విధంగా అగ్రిమెంట్ చేసుకున్నదీ ఏసీబీ అధికారులకు అర్వింద్ వివరించారు. ఎంఏయూడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పరిమితులకు లోబడే తాను విధులు నిర్వర్తించినట్టు అర్వింద్ పేర్కొన్నారు. ఫార్ములా ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) ప్రపోజల్స్ ఎవరు తీసుకొచ్చారనే కోణంలో విచారించారు. ఈ క్రమంలోనే మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, ఎఫ్ఈవో, గ్రీన్‌కో సిస్టర్ సంస్థ ఏస్ నెక్స్‌జెన్ మధ్య 2022 అక్టోబర్ 25న జరిగిన త్రైపాక్షిక ఒప్పందం గురించి అర్వింద్ వివరించినట్టు తెలిసింది. కాగా, సీజన్ 10 నిర్వహణ కోసం ఎఫ్ఈవో, హెచ్ఎండీఏ బోర్డు మీటింగ్ నిర్వహించినట్టు అర్వింద్ తెలిపారు. ఇదంతా మున్సిపల్, ఎంఏయూడీ శాఖ మంత్రి ఆమోదంతో జరిగిందని వెల్లడించారు. ఇందుకోసం ఆర్థికశాఖ, రాష్ట్ర బడ్జెట్ , ప్లాన్ హెడ్ ఆఫ్ అకౌంట్ నుంచి నిధులు తీసుకోనందున అత్యవసర పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తీసుకోలేదని వెల్లడించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే హెచ్ఎండీఏ బోర్డు అకౌంట్ నుంచే ఫార్ములా ఈ ఆపరేషన్స్‌కు రూ.45.71 చెల్లించినట్టు అర్వింద్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. దీంతోపాటు రూ.8 కోట్లు ఇన్‌కమ్ ట్యాక్స్ కూడా బోర్డు నిధుల నుంచే చెల్లించినట్టు పేర్కొన్నారు. గత విచారణ సందర్భంగా కూడా తాను అన్ని అంశాలపై స్పష్టత ఇచ్చినట్టు అర్వింద్ ఏసీబీ ఎదుట స్పష్టం చేసినట్టు తెలిసింది. రెండో దశలోనూ మిగిలిన అందరి నుంచి మరోమారు స్టేట్‌మెంట్లు రికార్డు చేసే అవకాశం ఉన్నట్టు ఏసీబీ వర్గాల ద్వారా తెలిసింది.

ఫన్‌టాస్టిక్ క్లిక్..

జంతువులూ కామెడీ చేస్తాయా? అలా చేస్తాయి కాబట్టే.. గత పదేళ్లుగా నికాన్ కామెడీ వైల్డ్ లైఫ్ అవార్డులను ఏటా ఇస్తున్నారు. అవి పెట్టే కొన్ని పోజులు.. నవ్వు పుట్టిస్తాయి. అలాంటి ఫొటోల్లో ఉత్తమమైనవి ఎంపిక చేసి పురస్కారాలను ప్రదానం చేస్తారు. ఈ ఏడాది వచ్చిన వేలాది ఎంట్రీల్లో కొన్ని ఇవీ..



ట్రీ చెయ్యి.. కమాన్..

ఆడ సింహాలు చెట్టెక్కడానికి ప్రయత్నిస్తున్న ఈ చిత్రాన్ని హైదరాబాద్‌కు చెందిన శ్రీవారి భార్గవ తీశారు.



భళి భళి భళిరా భళి.. సాహోరే బాహుబల్లి

ఇందాక ఏదో అన్నారుగా.. దమ్ముంటే.. ఇప్పుడు రండిరా అన్నట్లుగా గొడవకు బాహుబలిలాంటి తన ఫ్రెండ్‌ను తోడు తీసుకొచ్చినట్లు కనిపిస్తున్న ఈ బల్లి చిత్రాన్ని రాచెల్ అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు.

కాల్పుల విరమణ ప్రకటించండి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ

సాక్షి ,హైదరాబాద్: తెలంగాణలో కాల్పుల విరమణను ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మావోయిస్టు కేంద్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈనెల 1న మావోయిస్టు కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట విడుదలైన లేఖ గురువారం వెలుగులోకి వచ్చింది. మూడు పేజీల సుదీర్ఘ లేఖలో పలు అంశాలను అభయ్ ప్రస్తావించారు. కాల్పుల విరమణపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరికి కట్టుబడి ఉండటాన్ని స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇప్పటికీ కాల్పుల విరమణను ప్రకటించలేదని తెలిపారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించకుండా కేంద్ర ప్రభుత్వాన్ని, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని కాల్పుల విరమణ కోసం కోరడం నైతికంగా సరికాదు కాబట్టి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అధికారికంగా కాల్పుల విరమణ ప్రకటించాలని తాము కోరుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలంగాణకు వస్తున్న సందర్భంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించేలా చొరవ చేయాలని కోరుతున్నట్టు పేర్కొన్నారు. అదేవిధంగా మావోయిస్టులతో శాంతిచర్చలకు విముఖంగా ఉన్న మోదీ-షా ప్రభుత్వ వైఖరిని ఖండించాలని పిలుపునిచ్చారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

శుక్రవారం 4-7-2025



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 103

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

● ఆర్ట్ అండ్ కల్చర్

అమెరికాలో అందెల సవ్వడి



మన కళలు మనతో ఉంటే ఏ దేశంలో ఉన్నా...మన దేశం మనలో ఉన్నట్లే! ఆ భావనతో కూచిపూడికి దగ్గరైంది నేహా. మన ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నేహా నృత్య ప్రదర్శన ఇచ్చింది. అమెరికాలో పుట్టి పెరిగినప్పటికీ నేహా రెడ్డి ఆళ్లకు భారతీయ నృత్యకళలపై మంచి అవగాహన ఉంది. చిన్న వయసులోనే కూచిపూడి నృత్యకారిణిగా 'శభాష్' అనిపించుకుంది. తల్లిదండ్రులు శివరామిరెడ్డి, నాగమల్లేశ్వరిల చొరవ, ప్రోత్సాహంతో వర్జీనియాలోని 'కళామండపం' నృత్య పాఠశాలలో గురువు మృణాళిని సదానంద దగ్గర కూచిపూడి నేర్చుకుంది నేహా. రేపు శనివారం మరోసారి తన నృత్యప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి రెడీ అయింది. నృత్యంలోనే కాదు చదువులోనూ రాణిస్తున్న నేహాకు డాక్టర్ కావాలనేది లక్ష్యం. నృత్య కళలో మరింతగా రాణించాలని, డాక్టర్ కావాలనే తన కలను నెరవేర్చుకోవాలని ఆశిద్దాం.

● టెక్ టాక్

కాన్వా కొత్త ఫీచర్... క్రియేట్ ఏ వీడియో క్లిప్



డిజైన్ సాఫ్ట్‌వేర్ కంపెనీ 'కాన్వా' 'క్రియేట్ ఏ వీడియో క్లిప్' అనే ఏఐ ఫీచర్ గురించి ప్రకటించింది. ఈ ఫీచర్ ద్వారా ఎనిమిది సెకన్ల వీడియో క్లిప్‌ను సౌండ్‌తో క్రియేట్ చేయవచ్చు. ఈ వీడియో పవర్డ్ ఫీచర్‌తో పిచ్ డెక్ ఓపెనర్, సోషల్ మీడియా పోస్ట్‌ను ఏఐ–జెనరేటెడ్ వీడియో టీజర్‌గా మారుస్తుంది. అయితే యూజర్‌లకు నెలకు అయిదు ఏఐ–జెనరేటెడ్ వీడియోలకు మాత్రమే అనుమతి ఉంది. 'అత్యాధునిక సాంకేతికతతో డైనమిక్, పాలిష్డ్, హైక్వాలిటీ విజువల్స్‌ను రియలిస్టిక్ మోషన్‌తో క్రియేట్ చేయవచ్చు' అంటుంది కంపెనీ.

ఇలా యూజ్ చేయాలి.... ● హోమ్‌పేజీ, సైడ్‌బార్ ద్వారా కాన్వా ఏఐలోకి వెళ్లాలి ● క్రియేట్ ఏ వీడియో క్లిప్–సెలెక్ట్ ● జెనరేట్ చేయాలనుకున్న వీడియో గురించి ప్రాంప్ట్ ఇవ్వాలి ● టెక్ట్స్, మ్యూజిక్ యాడ్ చేయడానికి 'బ్రాండ్ కిట్'లాంటి కాన్వా టూల్స్ ఉన్నాయి.

అవును... ఇది నిజమే!




- ఆస్ట్రేలియాలోని ఒక చెట్టు పేరు...ఇడియెట్ ఫ్రూట్ ట్రీ! దీన్ని 'గ్రీన్ డైనోసర్' అని కూడా పిలుస్తారు. ఆస్ట్రేలియాలోని పురాతన, ప్రత్యేకత కలిగిన చెట్లలో ఈ చెట్టు ఒకటి.
- బెల్జియంలోని ప్రాగ్ సిటీలో 'ఫ్రూట్ మ్యూజియం' ఉంది.
- 'రెయిన్ బో'లలో ఎన్నో రకాలు ఉన్నాయి. ఉదా: డబుల్ రెయిన్ బో, ట్విన్‌నెడ్ రెయిన్ బో, రిఫ్లెక్షన్ రెయిన్ బో, రెడ్ రెయిన్‌బో.
- అత్యాధునిక సాంకేతిక సాధనాలు ఉపయోగించి 3,000 సంవత్సరాల క్రితం నాటి ఈజిప్షియన్ మమ్మీ వాయిస్‌ను శాస్త్రవేత్తలు రీక్రియేట్ చేశారు.
- యాపిల్ ఫస్ట్ కంప్యూటర్–యాపిల్ 1
- 'డూ–ఇట్–యువర్‌సెల్ఫ్' కిట్‌తో యాపిల్ 1 మార్కెట్‌లో విడుదల అయింది.

● యంగ్ టాలెంట్

మత్స్యకార మణిహారం

జీవిత కాలం నడిసంద్రంలో వేట కొనసాగిస్తూ కడుపు నింపుకునే వాడబలిజెల (బెస్తవాళ్లు) కుటుంబంలో ఒక ఆణిముత్యం మెరిసింది. ఆ ఆణిముత్యం పేరు ప్రసాద్ సూరి. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన ప్రసాద్ సూరి(25) మత్స్యకార యువతకు స్ఫూర్తిగా నిలిచాడు. రాయడం, బొమ్మలు గీయడంలో ప్రతిభ చూపుతున్న ప్రసాద్ సూరి తన సృజనాత్మక ప్రయాణం గురించి 'సాక్షి'తో చెప్పిన విషయాలు...



వలస బతుకు

మాది అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని వాడ నర్సాపురం. యాభై ఏళ్ల క్రితం మా కుటుంబీకులు చేపల వేట వృత్తి, కుటుంబ పోషణ కోసం నాగార్జున సాగర్ కుడి కాలువ బుగ్గవాగు రిజర్వాయర్‌కు వలస వెళ్లిపోయారు. ఇప్పుడు ఆ ప్రాంతం పల్నాడు జిల్లాగా మారింది. ఆర్థికంగా బలహీనులైన మా కుటుంబానికి పొట్ట నింపుకోవడం కష్టం కావడంతో నా ఎలిమెంటరీ విద్యాభ్యాసం అక్కడక్కడా, చివరకు అమ్మగారి ఊరు రాంబిల్లి మండలం వాడ రాంబిల్లిలో పూర్తి అయింది. యలమంచిలిలో ఇంటర్ పూర్తి చేశాక జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్, మహారాజా సరోజారావు యూనివర్సిటీ (బరోడా)లో ఆర్కియాలజీలో మాస్టర్స్ డిగ్రీ చేశాను.

బతుకు పోరాటం

అణగారిన వర్గంలో పుట్టాను. ఆర్థిక వెతలు, చుట్టూ మద్యం తాగే అలవాటు ఉన్నవారు, గొడవలు, చెప్పలేని సాంఘిక రుగ్మతలను దగ్గర నుంచి పరిశీలించాను. అనుభవించాను. చిన్నప్పటి నుంచే పుస్తకాలు చదవడం ప్రారంభించాను.



వందలాది పుస్తకాల పఠనం నన్ను మార్చింది, ప్రభావితం చేసింది. ఖాళీగా ఉండకుండా బొమ్మలు గీయడం,పెయింట్లు వేయడం నా హాబీగా మారింది. నా పాత్రే చిరంజీవి అనే నామకరణంతో 'మై నేమ్ ఈజ్ చిరంజీవి' అనే నవలా రాశాను. మా కుటుంబం, మా బెస్తవారి స్థితిగతులు, భాష, యాస, సవాళ్లు, అవమానాలతో అల్లుకున్న నవల మై నేమ్ ఈజ్ చిరంజీవి. తర్వాత రాసిన రెండవ నవల 'మైరావణ' ఉత్తర కోస్తా తీరంలోని మత్స్యకార జీవితాలను స్పృశిస్తూ మా ఆచార వ్యవహారాలు, వలసలు, బతుకుపోరాటం, అవమానాలను కళ్లకు కట్టినట్లు జానపద శైలిలో రాశాను. 'మై రావణ'కు కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం ప్రకటించడం సంతోషంగా ఉంది. ఇప్పుడు మరో పుస్తకాన్ని రాస్తున్నాను. సినీ దర్శకునిగా ఎదగాలన్నది నా ఆకాంక్ష.

భవిష్యత్‌ను మార్చే చదువు

మా బెస్తవారిని వాడ బలిజెలు అనీ, వాడోళ్లు అనీ అంటారు. నేను చదువుకుంటూ, నవలలు రాస్తూనే నాన్నగారితో చేపలు పట్టడానికి వెళ్లే వాడిని. మా మత్స్యకార యువత చదువుకోవాలి. మా తల్లితండ్రులు చేపల వేట మీద దృష్టి పెట్టి పిల్లల భవిష్యత్ లక్ష్యాల గురించి ఆలోచించడం లేదు. చదువే మార్చుతుంది.

చదువే మనల్ని మార్చుకుంటుంది. విపరీతంగా చదివే అలవాటే నన్ను రచయితను చేసింది. సూరాడ ప్రసాద్‌ను ప్రసాద్ సూరిగా మార్చింది. నా పెన్ నేమ్ ప్రసాద్ సూరి.

– ఇంటర్వ్యూ: దాడి వెంకటరావు, అచ్యుతాపురం, సాక్షి

యువర్స్

● ఆన్‌లైన్ స్కూలు

గూగుల్ వారి మైక్రోలెర్నింగ్ కోర్సులు



సంవత్సరాలు చేసే కోర్సులు ఉంటాయి. నెలల కొద్దీ చేసే కోర్సులు ఉంటాయి. ఈ గూగుల్ కోర్సులు మాత్రం జస్ట్ నిమిషాల వ్యవధిలో చేసేవి...

లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్

ఎల్‌ఎల్‌ఎం అంటే ఏమిటి? ఎలా ఉపయోగపడుతుంది...మొదలైన విషయాలను తెలియజేసే కోర్సు ఇది. బేసిక్స్ తెలుసుకోవాలనుకునేవారికి, జెన్ ఏఐ యాప్స్ బిల్డ్ చేయాలనుకునేవారికి ఉపకరించే కోర్సు.

ఇమేజ్ జెనరేషన్

ఏఐ మోడల్ ఇమేజ్‌ను ఎలా జెనరేట్ చేస్తుంది? అనే ఆసక్తి మీలో ఉంటే ఈ కోర్సు మీ కోసమే. ఈ షార్ట్ కోర్సు ఏఐ ఇమేజ్ జెనరేషన్ మోడల్స్‌కు సంబంధించిన మెషిన్ లెర్నింగ్ మోడల్స్‌ను పరిచయం చేస్తుంది.

ఎన్‌కోడర్–డీకోడర్ ఆర్కిటెక్చర్

ఈ 30 నిమిషాల కోర్సు ఎన్‌కోడర్–డీకోడర్ ఆర్కిటెక్చర్‌కు సంబంధించిన సినాప్సిస్ ఇస్తుంది. సీక్వెన్స్–టు–సీక్వెన్స్ టాస్కులు, మెషిన్ ట్రాన్స్‌లేషన్...మొదలైన వాటి గురించి తెలియజేస్తుంది

అటెన్షన్ మెకానిజమ్

అటెన్షన్ మెకానిజమ్ అనేది డీప్‌లెర్నింగ్‌కు సంబంధించిన టెక్నిక్. టెక్ట్స్ సమరైజేషన్, మెషిన్ ట్రాన్స్‌లేషన్, క్వశ్చన్, ఆన్సరింగ్....మొదలైన మెషిన్ లెర్నింగ్ టాస్కుల పెర్‌ఫార్‌మెన్స్‌ను మెరుగుపరచడానికి ఉపకరించే 45 నిమిషాల కోర్సు ఇది.

ఇంట్రడక్షన్ టు జెనరేటివ్ ఏఐ

'జెనరేటివ్ ఏఐ'కి సంబంధించిన ప్రాథమిక విషయాలను పరిచయం చేసే మైక్రోలెర్నింగ్ కోర్సు ఇది. సంప్రదాయ ఎంఎల్ మోడల్స్ కంటే జెనరేటివ్ ఏఐ ఏ రకంగా భిన్నమైనదో తెలియజేస్తుంది. సొంతంగా జెన్ ఏఐ యాప్స్ డెవలప్ చేసుకోవడానికి ఉపకరించే గూగుల్ టూల్స్‌ను పరిచయం చేస్తుంది.

● మ్యూజిక్ వరల్డ్

స్వరాల తోటలో...



● గిని

ఇండియన్ పాప్‌లో తనదైన స్టైల్ సృష్టించుకొని దూసుకుపోతోంది పందొమ్మిది సంవత్సరాల గిని. 'ఫ్యూచర్ ఆఫ్ మ్యూజిక్'గా కూడా ప్రశంసలు అందుకుంటోంది....

తండ్రి ఉద్యోగ రీత్యా, గిని కుటుంబం ఒక ప్రాంతంలో స్థిరంగా ఉండేది కాదు. అయితే ఎక్కడికి వెళ్లినా ఆమెతో స్థిరంగా ఉన్నది మాత్రం సంగీతమే ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళుతున్నప్పుడు కుటుంబం మొత్తం కారులో వెళ్లేది. కారులో నాన్‌స్టాప్‌గా మ్యూజిక్ ప్లే అయ్యేది. భూపెన్ హజారిక నుంచి హరిహరన్ వరకు ఎంతో అద్భుతమైన గొంతులను వినే అవకాశం వచ్చేది.

కారు బ్యాక్ సీట్‌లో కూర్చున్న గిని పాట ప్లే అవుతున్నప్పుడు వారితో గొంతు కలిపేది. అలా పాటలతో పరిచయం ఏర్పడింది. ఆ తరువాత గానం ప్రాణమైపోయింది. మొదట్లో ప్రముఖ గాయకులను అనుకరించినా, ఆ తరువాత మాత్రం గానంలో తనదైన శైలిని సృష్టించుకుంది. కాలిగ్రఫీ, ఒరిగామి, గుర్రపు స్వారీ, కోడింగ్... ఏదైనా సరే, నేర్చుకోవాలనే ఆలోచన వస్తే పట్టుదలగా నేర్చుకునేది. యూట్యూబ్ వీడియోలు చూస్తూ గిటారు ప్లే చేయడం నేర్చుకుంది. పాటలు రాయడంలో, కంపోజ్ చేయడంలో తన టాలెంట్ నిరూపించుకుంది.

సాక్షి సినిమా

మిస్టర్ దహా



● ఆమిర్ ఖాన్

'కూలీ' సినిమాలో దహాగా కనిపించనున్నారు ఆమిర్ ఖాన్. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కూలీ'. ఈ చిత్రంలో నాగార్జున, శ్రుతీ హాసన్, సత్యరాజ్, ఉపేంద్ర తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 14న విడుదల కానుంది. కాగా 'కూలీ' సినిమాలో దహా అనే పాత్రలో ఆమిర్ ఖాన్ నటించినట్లుగా అధికారికంగా వెల్లడించి, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం క్లైమాక్స్‌లో దహా పాత్ర వస్తుందని, ఈ పాత్ర తెరపై కనిపించేది పదిహేను నిమిషాలే అయినా ఎక్కువ ప్రభావం చూపుతుందని సమాచారం. ఈ చిత్రం హిందీలో కూలీ: ది పవర్‌హౌస్' టైటిల్‌తో విడుదల కానుంది.

ఈసారి డేట్ మారదు



● 'హరిహర వీరమల్లు' పోస్టర్

''హరిహర వీరమల్లు' చరిత్రను గుర్తు చేసే సినిమా. పవన్ కల్యాణ్‌గారు నటించిన పూర్తి స్థాయి పాన్ ఇండియా యాక్షన్ చిత్రమిది. ఈ చిత్రం అద్భుతంగా రావడానికి నా కుమారుడు జ్యోతికృష్ణ ఎంతగానో శ్రమించాడు'' అని చిత్ర సమర్పకుడు, నిర్మాత ఏఎం రత్నం తెలిపారు. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన చిత్రం 'హరి హర వీరమల్లు'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిధీ అగర్వాల్ కథానాయికగా నటించారు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ నెల 24న విడుదల కానుంది. గురువారం జరిగిన ఈ సినిమా ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో జ్యోతికృష్ణ మాట్లాడుతూ– ''మా సినిమా గురించి కొందరు అసత్య ప్రచారాలు చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మా పని మేము చేసుకుంటూనే ఉన్నాం. ఈ సినిమాకి పునాది వేసిన క్రిష్‌గారికి ధన్యవాదాలు. ఈసారి డేట్ మారదు... ఇండస్ట్రీ రికార్డులు మారతాయి'' అని తెలిపారు. ''ఇది మా టీమ్ ఆరేళ్ల కష్టం'' అన్నారు ఎ. దయాకర్ రావు. ''ఈ సినిమాతో కచ్చితంగా బ్లాక్ బస్టర్ సాధించబోతున్నాం'' అని నిధీ అగర్వాల్ చెప్పారు.

సైకో కిల్లర్‌గా చేయాలని ఉంది

– వర్ష బొల్లమ్మ



''హీరోయిన్‌గా కొన్ని సినిమాలు చేశాను. అయితే క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవకాశం వచ్చినా చేస్తాను. స్క్రీన్‌పై వర్ష బాగా నటిం చిందనే పేరు తెచ్చుకుంటే చాలు. ఉదాహరణకు నిత్యా మీనన్‌గారికి మంచి పెర్ఫార్మర్‌గా పేరుంది. ఆమెలా పేరు తెచ్చుకోవాలని ఉంది. 'తమ్ముడు' కథ విన్నప్పుడు, ఈ సినిమాలో నేను చేసిన చిత్ర క్యారెక్టర్ కొత్తగా అనిపించింది. సవాల్‌గా తీసుకుని, ఈ సినిమా చేశాను'' అని హీరోయిన్ వర్ష బొల్లమ్మ అన్నారు. నితిన్ హీరోగా నటించిన యాక్షన్ చిత్రం 'తమ్ముడు'. ఈ చిత్రంలో లయ, సప్తమీ గౌడ, వర్ష బొల్లమ్మ, బాల నటి శ్రీరామ్ దిత్య ఇతర కీలక పాత్రల్లో నటించారు. శ్రీరామ్ వేణు దర్శకత్వంలో 'దిల్' రాజు, శిరీష్ నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ– ''అక్కాతమ్ముడు సెంటిమెంట్ నేపథ్యంలో సాగే సినిమా 'తమ్ముడు'. కానీ కథలో చాలా లేయర్స్ ఉన్నాయి. ఈ సినిమాలో నితిన్ క్యారెక్టర్ జైకి ఓ డ్రైవింగ్ ఫోర్స్‌లా ఉంటుంది చిత్ర పాత్ర. ఏదైనా చేయాలనుకుంటే వెంటనే చేసేయాలనుకునే మనస్తత్వం చిత్రది. ఈ సినిమా కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను. ఇక ఓ సైకో కిల్లర్ రోల్ చేయాలన్నది నా ఆకాంక్ష. ప్రస్తుతం 'కానిస్టేబుల్ కనకం' వెబ్ సిరీస్, మరో వెబ్ సిరీస్‌లో నటిస్తున్నాను. మరో రెండు సినిమాలు ఉన్నాయి'' అని అన్నారు.

రాముడు వర్సెస్ రావణుడు

'రామాయణ: ది ఇంట్రడక్షన్' గ్లింప్స్ విడుదల



● 'రామాయణ' పోస్టర్

''దర్శకుడిగా 'రామాయణ' సినిమా భారీ బాధ్యత మాత్రమే కాదు... గౌరవప్రదమైన అవకాశం కూడా. ఈ సినిమా మన సంస్కృతికి ఆత్మ వంటిది'' అని నితీష్ తివారీ పేర్కొన్నారు. రామాయణం ఆధారంగా నితీష్ తివారి దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న చిత్రం 'రామాయణ'. ఈ చిత్రంలో రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, లక్ష్మణుడుగా రవి దుబే, హనుమంతుడిగా సన్నీ డియోల్ నటిస్తున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, ఎనిమిదిసార్లు ఆస్కార్ అవార్డు అందుకున్న వీఎఫ్‌ఎక్స్ స్టూడియో డీఎన్‌ఈజీ సంయుక్తంగా యశ్ మాస్టర్ మైండ్ క్రియేషన్స్‌తో కలిసి 'రామాయణ'ను నిర్మిస్తున్నాయి. ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. 'రామాయణ పార్ట్ 1' 2026 దీపావళికి, 'పార్ట్ 2' 2027 దీపావళికి విడుదల కానున్నాయి. ఈ నేపథ్యంలో 'రామాయణ: ది ఇంట్రడక్షన్' గ్లింప్స్‌ను గురువారం విడుదల చేశారు. ముఖ్యంగా 'రామాయణ' సినిమాను ఐమ్యాక్స్ ఫార్మాట్ కోసం సిద్ధం చేస్తున్నారు. 'రామాయణ: ది ఇంట్రడక్షన్' వీడియోలో రణబీర్ కపూర్, యశ్ చిన్న షాట్స్‌లో కనిపించారు. ఈ సందర్భంగా ఈ చిత్రకథను చెబుతూ – ''బ్రహ్మ (సృష్టికర్త), విష్ణు (రక్షకుడు), శివుడు (లయకారుడు)... సృష్టిని కాపాడుతుంటారు. ఒక రాక్షస శిశువు ఈ సృష్టిలోనే అత్యంత భయంకరుడైన రావణుడిగా మారతాడు. అతని ఉద్దేశ్యం విష్ణువును నాశనం చేయడం. ఎందుకంటే విష్ణు ఎప్పుడూ తన జాతికి విరోధంగా ఉన్నాడని అతని నమ్మకం. అతడిని ఆపేందుకు విష్ణు ఒక మానవ రాజకుమారుడు అయిన రాముడిగా అవతరిస్తాడు. ఇక్కడినుంచే మొదలవుతుంది శాశ్వత యుద్ధం. రాముడు వర్సెస్ రావణుడు. మనిషి వర్సెస్ రాక్షసుడు. రామాయణం ఒక బ్రహ్మాండ యుద్ధ గాథ. శాశ్వత విధి. గొప్ప విజయం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. నిర్మాత నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ– ''ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులకు సంబంధించిన ఒక సాంస్కృతిక ఉద్యమం. రామాయణంతో మేము కేవలం చరిత్రను తిరిగి చెబుతున్నట్లుగా కాదు... మన వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నాం'' అని అన్నారు. ఇక ఈ సినిమాకు ఆస్కార్ అవార్డు విన్నింగ్ సంగీత దర్శకులు హాన్స్ జిమ్మర్, ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. హాలీవుడ్‌లో అగ్రశ్రేణి స్టంట్ డైరెక్టర్స్ టెర్రీ నోటరీ, గై నోరిస్ యుద్ధ సన్నివేశాలను రూపొందిస్తున్నారు. హాలీవుడ్ ప్రొడక్షన్ డిజైనర్ రవి బన్సల్, రాంసే ఎవరీ ప్రొడక్షన్ డిజైనర్స్‌గా చేస్తున్నారు.

పైరసీ నియంత్రణకి కఠిన చర్యలు

– 'దిల్' రాజు



● 'దిల్' రాజు, ప్రియాంక

''చిత్ర పరిశ్రమకి వీడియో పైరసీ అన్నది చాలా నష్టం కలిగిస్తోంది. ఈ పైరసీ నియంత్రణకి కఠిన చర్యలు చేపడుతున్నాం... ఇందుకోసం త్వరలో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నాం'' అని తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ 'దిల్' రాజు తెలిపారు. ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంకతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ– ''రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పలు కీలక సమావేశాలు నిర్వహించాం. సినిమా ఇండస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం. ఎఫ్‌డీసీ నోడల్ ఏజెన్సీగా ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సైబర్ సెల్, పోలీస్ శాఖల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేసి, సినిమా షూటింగ్‌లకు ఆన్‌లైన్ అనుమతులపైనా చర్చించనున్నాం. సినీ పరిశ్రమ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందరం కలిసి సినీ రంగాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది'' అన్నారు. ''ఇండస్ట్రీ సమస్యలను ఎవరైనా మా దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తాం'' అని ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంక హామీ ఇచ్చారు.

ప్రతి ఒక్కరిలో సోలో బాయ్ ఉంటాడు



● సతీష్

''ప్రేక్షకులకు మంచి సినిమాలు అందించాలనే ఆశయంతో నిర్మాతగా వచ్చాను. అయితే ముందు కొన్ని సినిమాలకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాను. ఆ తర్వాత డబ్బు సంపాదించుకుని వద్దామని రియల్ ఎస్టేట్ బిజినెస్‌లోకి వెళ్లి, డబ్బు సంపాదించి, నిర్మాతగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. నేను ఓ ప్రయోగంగా నిర్మించిన 'బట్టల రామస్వామి బయోపిక్కు' (2021) సినిమా మాకు వర్కవుట్ అయింది'' అని సెవెన్‌హిల్స్ సతీష్ అన్నారు. 'బిగ్‌బాస్' ఫేమ్ గౌతమ్ కృష్ణ, రమ్య పసుపులేటి, శ్వేత అవస్థి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సోలో బాయ్'. నవీన్ కుమార్ దర్శకత్వంలో సెవెన్‌హిల్స్ సతీష్ నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో సతీష్ మాట్లాడుతూ– ''జీవితంలో కష్టపడుతూ సొంతంగా తన కాళ్ల మీద తాను నిలబడాలనే ఆలోచనతో సాగే సినిమా 'సోలో బాయ్'. ప్రతి ఒక్కరిలో కనిపించే సోలో బాయ్ క్యారెక్టర్‌ను ఈ సినిమాలో గౌతమ్ కృష్ణ చేశాడు. నెక్ట్స్ థ్రిల్లర్ జానర్ కథతో నార్నే నితిన్‌తో ఓ సినిమా చేయబోతున్నాను. అలాగే నా దగ్గర ఓ కథ ఉంది. ఆ సినిమాకు దర్శకత్వం వహించాలని ఉంది'' అన్నారు.

ఓటీటీ – ఇది చూడొచ్చు

నమ్మకమే పెద్ద బూచి

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో 'విరాటపాలెం-పీసీ మీనా రిపోర్టింగ్' సిరీస్ ఒకటి. ఈ సిరీస్ గురించి తెలుసుకుందాం.



మనిషి మనుగడకు నమ్మకమే పునాది. మనం నమ్మిన సిద్ధాంతమే మనల్ని నడిపిస్తుంది. కానీ ఆ నమ్మకం మూఢ నమ్మకం కాకూడదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రోజుల్లో కూడా మూఢ నమ్మకాల వల్ల చాలా చోట్ల జరగరానివి జరుగుతుండడం ఆందోళనకరం. మూఢనమ్మకం మూర్ఖత్వమేనని చెప్పేదే 'విరాటపాలెం–పీసీ మీనా రిపోర్టింగ్' సిరీస్. జీ5 వేదికగా స్ట్రీమ్ అవుతోన్న ఈ సిరీస్ కథాంశమంతా దాదాపు మూఢనమ్మకాల మీదే కొనసాగుతుంది. అలాగే సిరీస్‌లోని ప్రతి ఎపిసోడ్ ఎంతో ఉత్కంఠ రేపుతుందనడంలో సందేహం లేదు. ఇక కథాంశంలోకి వస్తే... 1980 సంవత్సరంలో ప్రకాశం జిల్లా ఒంగోలు ప్రాంతంలోని ఓ మారుమూల పల్లెటూరులో జరిగిన కథే ఈ సిరీస్. ఆ ఊరిలో పెళ్లైన మొదటిరాత్రే పెళ్ళికూతుళ్ళు రక్తపు వాంతులు చేసుకుని చనిపోతుంటారు. దాదాపు పది సంవత్సరాల నుండి ఇలానే ఊళ్ళో జరగడం చూసి ఊళ్ళోని జనాలు తమ ఊరికి పెద్ద శాపం తగిలిందనుకుని కుమిలిపోతుంటారు. అంతేకాదు... ఆ ఊళ్ళో పెళ్ళి చేసుకోవడానికి కూడా జంకుతుంటారు. ఇదే సమయంలో ఆ ఊరికి కానిస్టేబుల్ మీనా కొత్తగా ట్రాన్స్‌ఫర్ై వస్తుంది. ఇలా పెళ్ళి కూతుళ్ళు చనిపోవడం చూసి మీనా దీనిపై విచారణ ప్రారంభిస్తుంది. ఒక దశలో విచారణ ఏదీ కొలిక్కి రానందున తానే పెళ్ళి పీటలెక్కి విచారణను వేగవంతం చేస్తుంది. పెళ్ళి చేసుకోబోతున్న మీనా కూడా తాళి కట్టించుకున్న తరువాత రక్తపు వాంతులు చేసుకుంటుంది. ఆ తరువాత కథ అనుకోని మలుపులు తిరుగుతుంది. మరి... పెళ్ళి కూతురు అయిన మీనా ఈ కేసును సాల్వ్ చేయగలిగిందా? అసలు ఈ పెళ్ళి కూతుళ్ళు చనిపోవడానికి కారణం ఆ ఊరికి పట్టిన శాపమేనా? ఇవన్నీ తెలుసుకోవాలంటే 'విరాటపాలెం–పీసీ మీనా రిపోర్టింగ్' సిరీస్ చూడాల్సిందే. చిన్న కథతో ఉత్కంఠ రేపే పాయింట్‌తో ఊహకందని ట్విస్టులతో ప్రేక్షకుడిని ఉద్రూతలూగించే ఈ సిరీస్ చూడదగినదే. పిల్లలు లేకుండా పెద్దలు చూడగలిగే ఈ సిరీస్ వాచబుల్ ఫర్ ది వీకెండ్.

– హరికృష్ణ ఇంటూరు

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+8 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 103

శుక్రవారం 4-7-2025



'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'



నకిలీ వైద్య దందా!

నగరంలో నకిలీ వైద్య దందా యథేచ్ఛగా సాగుతోంది. -3లో



మనసారా.. నవ్వేద్దాం..

నవ్వు నలభై విధాలా గ్రైటంటూ నగరంలో కామెడీ ఈవెంట్స్ విస్తరిస్తున్నాయి. -6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



గుండెను గుచ్చే అందమైన ముల్లు

నటీ నటులతో పాటు ఇతరులు తీసుకునే సౌందర్య చికిత్సలు, గుండెపై అవి చూపే ప్రభావాలపై ప్రత్యేక కథనం..

- వివరాలు 2లో



నీ కోసం.. నేనున్నానని..

జీవితంలోని సంక్షోభ సమయాల్లో తన తల్లి తనకు అండగా నిలబడిందని బాలీవుడ్ నటుడు అమీర్‌ఖాన్ చెప్పారు.

- వివరాలు 2లో



మత్స్యకార మణిహారం..

కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారానికి ఎంపికైన ప్రసాద్ సూరి 'సాక్షి'తో పంచుకున్న ముచ్చట్లు..

- వివరాలు ఫ్యామిలీ యువర్స్‌లో



గూగుల్ వారి 'మైక్రో లెర్నింగ్'..

సంవత్సరాలు కాదు.. నెలలు కాదు.. జస్ట్ నిమిషాల్లో చేసే గూగుల్ కోర్సుల వివరాల సమాహారం..

- వివరాలు ఫ్యామిలీ యువర్స్‌లో

నేడు జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు బోనం



చార్మినార్: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకుని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో భక్తులు శుక్రవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు బోనం సమర్పించనున్నారు. బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా నగరంలోని అమ్మవారి దేవాలయాలతో పాటు విజయ వాడలోని కనక దుర్గ అమ్మవారికి బంగారు బోనాలను సమర్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మొదటి బోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బోనాన్ని విజయవాడ కనక దుర్గమ్మ తల్లికి.. మూడో బోనాన్ని బల్కంపేట్ ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. నాలుగో బంగారు బోనాన్ని శుక్రవారం పెద్దమ్మ తల్లికి సమర్పించనున్నట్లు ఊరేగింపు కమిటీ చైర్మన్ గోపిశెట్టి రాఘవేందర్ తెలిపారు.

మూడో బోనం..

గోల్కొండ మురిపెం





గోల్కొండ శ్రీ జగదాంబిక మహంకాళి అమ్మవారికి గురువారం మూడో బోనం పూజ ఘనంగా జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే బారులుతీరారు. మరోవైపు నగీనా బాగ్‌లోని నాగదేవత వద్ద మహిళలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలి రావడంతో నగీనా బ్యారెక్స్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి యువకులు దప్పు వాయిద్యాలతో నృత్యాలు చేస్తూ.. భక్తిగీతాలను ఆలపిస్తూ ఆకట్టుకున్నారు. దారి పొడవునా శివసత్తుల విన్యాసాలు భక్తులను పారవశ్యానికి గురి చేశాయి. గోల్కొండ కోట మెయిన్ గేటు ఎదురుగా శివసత్తుల పూనకాలు చూడదానికి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గోల్కొండ కోట మెయిన్ గేటు నుంచి నగీనాబేగ్ మెట్ల మార్గం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేశారు. అదే విధంగా టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు ఫతేదర్వాజా, బంజారి దర్వాజా, మక్కై దర్వాజా తదితర ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా పర్యవేక్షించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారిణి సి.వసంత పర్యవేక్షణలో బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

– గోల్కొండ

హెచ్‌ఎండీఏ అనుమతులు అదుర్స్

ప్రొసీడింగులు 922.. ఆదాయం రూ.519 కోట్లు



సాక్షి, సిటీబ్యూరో: హెచ్‌ఎండీఏ పరిధిలో 'రియల్' పరుగు ఊపందుకుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు భవనాలు, అపార్ట్‌మెంట్‌లు, హైరైజ్ బిల్డింగ్‌లు, లే అవుట్ తదితర నిర్మాణ రంగానికి సంబంధించి 922 అనుమతులను (ప్రొసీడింగ్స్)ను ఇచ్చినట్లు హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. వీటిపై ఫీజుల రూపంలో ప్రభుత్వానికి రూ.519 కోట్లకు పైగా ఆదాయం లభించింది. గతేడాది జనవరి నుంచి జూన్ వరకు అందజేసిన అనుమతుల కంటే ఈ ఏడాది జూన్‌వరకు నిర్మాణరంగ అనుమతులు పెరిగాయి. గత సంవత్సరం జూన్ నాటికి 388 అనుమతులు మాత్రమే అందజేయడం గమనార్హం. మొత్తంగా 2024లో హెచ్‌ఎండీఏ 878 అనుమతులను అందజేసింది. వీటిపై రూ.395.13 కోట్ల ఆదాయం లభించింది. మరోవైపు 2023లో 1,361 అనుమతులను ఇచ్చారు. రూ.563.32 కోట్ల ఆదాయం లభించింది. నిర్మాణరంగంలో ఎలాంటి స్తబ్దత లేదని, గత రెండేళ్లుగా పరుగులు పెడుతూనే ఉందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 922 ప్రొసీడింగ్స్ ఇవ్వగా డిసెంబర్ నాటికి రెట్టింపయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. మరోవైపు అనుమతుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా సకాలంలో అందజేస్తున్నట్లు చెప్పారు. బిల్డ్‌నౌ అందుబాటులోకి వచ్చిన తర్వాత దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరమైందన్నారు.

మహా కసరత్తు!

hmda Growing Global

లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌కు కన్సల్టెన్సీ

- ఆసక్తి వ్యక్తీకరణకు హెచ్‌ఎండీఏ బిడ్డింగ్
- ప్రతి ప్లాట్‌కు మౌలిక సదుపాయాలు లభించేలా..
- నిర్మాణ రంగానికి సరికొత్త నిర్దేశం

సాక్షి, సిటీబ్యూరో:

భవన నిర్మాణ రంగానికి సరికొత్త దిశా నిర్దేశాన్ని అందజేసేలా స్థానిక ఏరియా అభివృద్ధి ప్రణాళిక (ఎల్‌ఏడీపీ)కు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ కసరత్తు చేపట్టింది. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విధివిధానాలను రూపొందించేందుకు కన్సల్టెన్సీని ఎంపిక చేసేందుకు చర్యలు తీసుకోనుంది. ఈ మేరకు అర్హత గల సంస్థల నుంచి ఆసక్తి వ్యక్తీకరణ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్)ను ఆహ్వానిస్తున్నట్లు హెచ్‌ఎండీఏ ప్రకటించింది. ఆసక్తిగల సంస్థలు ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అనంతరం వివిధ సంస్థల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఎల్‌ఏడీపీ రూపకల్పనకు అర్హత కలిగిన ఏజెన్సీని ఎంపిక చేయనున్నారు.

భవిష్యత్‌లో టౌన్‌షిప్పులే కీలకం..

హెచ్‌ఎండీఏ స్వయంగా అభివృద్ధి చేసే లే అవుట్‌లలో కానీ ప్రైవేట్ సంస్థలు అభివృద్ధి చేసే వెంచర్‌లలో కానీ ప్రతి ప్లాట్‌కు రోడ్లు తదితర సదుపాయాలు అందుబాటులో ఉండేలా ఎల్‌ఏడీపీ ఉంటుంది. హైదరాబాద్ మహానగర విస్తరణలో భాగంగా భవిష్యత్‌లో టౌన్‌షిప్పులే కీలకం కానున్నాయి. ఈమేరకు భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ ఉంటుందని హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. భూసేకరణ దశ నుంచి టౌన్‌షిప్పుల నిర్మాణం వరకు అంతర్జాతీయ ప్రమాణాలకనుగుణంగా ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ఎల్‌ఏడీపీ ఉండనుంది. ఈ నెలాఖరు వరకు కన్సల్టెన్సీని ఏర్పాటు చేసేందుకు కార్యాచరణను వేగవంతం చేయనున్నట్లు అధికారులు చెప్పారు. మెగా మాస్టర్‌ప్లాన్–2050లో భాగంగా ఎల్‌ఏడీపీని అమలు చేస్తారు.


సెప్టెంబర్ నుంచి మ్యాపింగ్..

హెచ్‌ఎండీఏ మెగా మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా ప్రతిపాదించిన కామన్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ), ఎకనామికల్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఈడీపీ), బ్లూ,గ్రీన్ ఏరియా ప్లాన్‌లు తుది దశకు చేరుకున్నాయి. ఆగస్టు నాటికి ఈ మూడు ప్రణాళికలను సిద్ధం చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కామన్ మొబిలిటీ ప్లాన్‌లో భాగంగా ట్రిపుల్ ఆర్ వరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రజా రవాణా సదుపాయాలను అధ్యయనం చేసి భవిష్యత్తు అవసరాల మేరకు ఏ ప్రాంతంలో ఏ విధమైన ప్రజా రవాణా సదుపాయాలు అవసరరమనే అంశంపై అధ్యయనం చేపట్టారు. అలాగే ప్రత్యేక ఆర్థికాభివృద్ధి మండలాలను ఎంపిక చేసేందుకు, పారిశ్రామిక, లాజిస్టిక్ కేంద్రాల ఏర్పాటు వంటి వాటిపైన ఈడీపీని సిద్ధం చేయనున్నారు.

- అలాగే ట్రిపుల్ ఆర్ వరకు నీటి వనరులు, అడవులను గుర్తించేందుకు బ్లూ,గ్రీన్ ప్రణాళిక పైన దృష్టి సారించారు. 2050 వరకు హైదరాబాద్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ మూడు ప్రణాళికల పైన హెచ్‌ఎండీఏ దృష్టి సారించింది. ఇందు కోసం గత సంవత్సరమే కన్సల్టెన్సీలను నియమించారు. ప్రస్తుతం ఈ మూడు ప్రణాళికలు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో ట్రిపుల్ ఆర్ వరకు మ్యాపింగ్ చేసేందుకు హెచ్‌ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇందుకోసం త్వరలో ఒక కన్సల్టెన్సీని నియమించనున్నారు. ప్రస్తుతం మ్యాపింగ్ చేసేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో సెప్టెంబర్ నుంచి చేపట్టి ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

విస్తరిత ప్రాంతంలో ఆధునిక హంగులు..

కొత్తగా రీజినల్ రింగ్‌రోడ్డు వరకు నగరం పరిధిని విస్తరించినప్పటికీ అనేక ప్రాంతాలు నగరీకరణకు దూరంగానే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా టౌన్‌షిప్పుల నిర్మాణంలో ఎల్‌ఏడీపీ కీలకం కానుంది. ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు వరకు ఆధునిక హంగులతో రేడియల్ రోడ్లు, టౌన్‌షిప్పులు అందుబాటులోకి రానున్నాయి. ఇందులో భాగంగా నగరీకరణకు దూరంగా ఉన్న గ్రామాల్లో రైతుల నుంచి పెద్ద ఎత్తున భూములను సేకరించి టౌన్‌షిప్పులను నిర్మించనున్నారు. 60 శాతం నివాస సముదాయాలు ఉంటే మిగతా 40 శాతం భూమిలో 30 శాతం రహదారులు, పార్కులు, ఆసుపత్రులు, స్కూళ్లు, కాలేజీలు, విద్యుత్ కేంద్రాలు వంటి వాటి కోసం వినియోగిస్తారు. మరో 10 శాతం భూమి హెచ్‌ఎండీఏ వద్ద ల్యాండ్‌బ్యాంక్ (భూనిధి) ఉంటుంది. ఈ ల్యాండ్ బ్యాంకును భవిష్యత్ అవసరాలకు వినియోగిస్తారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న భూసేకరణ విధానంలో మార్పులు చేసి సమగ్ర భూసేకరణ విధానాన్ని (కాంప్రహెన్సివ్ ల్యాండ్ పూలింగ్ పాలసీ)ని రూపొందిస్తారు.



టార్గెట్ సెల్‌ఫోన్స్!

స్నాచర్లు, పిక్ ప్యాకెటర్ల కళ్లు వీటిపైనే

- ఏటా వేల సంఖ్యలో ఫోన్లు గల్లంతు
- బల్కంపేట ఎల్లమ్మ ఉత్సవాల్లో పంజా
- 12 గంటల్లో 19 నేరాలు చేసిన ముఠాలు
- వీటిలో 13 ఉదంతాలు ఫోన్ల తస్కరణవే



సాక్షి, సిటీబ్యూరో: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం జరిగిన బుధవారం జేబుదొంగలు రెచ్చిపోయారు. భక్తుల మాదిరిగానే తిరుగుతూ క్యూలైన్లు, ప్రవేశ ద్వారాల వద్ద చేతివాటం చూపించారు. కేవలం 12 గంటల్లో మొత్తం 19 కేసులు నమోదు కాగా... వీటిలో 13 సెల్‌ఫోన్ చోరీలకు సంబంధించినవే కావడం గమనార్హం. కేవలం ఈ ఒక్క సందర్భంలోనే కాదు... గడిచిన కొన్నాళ్లుగా నగరంలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఈ పరిణామాలను పరిశీలిస్తున్న పోలీసులు ప్రస్తుతం పిక్‌పాకెటర్ల కన్ను సెల్‌ఫోన్లపై ఉన్నట్లు చెబుతున్నారు.

అంతటా ఇవే నేరాలు..

రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్నా, రద్దీ బస్సులో ప్రయాణిస్తున్నా, మార్కెట్‌కు వెళ్లినా, సభలు, ఉత్సవాలకు హాజరైనా అక్కడ పొంచి ఉంటున్న చోరులు స్మార్ట్ ఫోన్లను స్వాహా చేస్తున్నారు. చదువుకున్న యువత, జల్సాలకు అలవాటుపడిన వాళ్లు సైతం 'జాయ్ స్నాచర్లు'గా మారి పోలీసులకు కొత్త సవాల్ విసురుతున్నారు. అధికారిక, అనధికారిక సమాచారం ప్రకారం నగరంలో ఏటా దాదాపు 50 వేల వరకు సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. రాజధాని నగరంలో అనేక ఛోటామోటా ముఠాలు సెల్‌ఫోన్ పిక్‌పాకెటింగ్, స్నాచింగ్‌ను వ్యవస్థీకృతంగా చేస్తున్నాయి. బస్సు ప్రయాణికులు, పాదచారులతో పాటు రద్దీ ప్రాంతాల్లోని వాళ్లే లక్ష్యంగా చేసుకుని ఈ సెల్‌ఫోన్ నేరం అనేది కొనసాగుతోంది. వీరిబారిన పడే వారిలో మధ్య తరగతి వారే ఎక్కువగా ఉంటున్నారు.

పర్సులు, గొలుసుల నుంచి సెల్‌ఫోన్ల వైపు..

నగరంలోని పిక్ ప్యాకెటింగ్ గ్యాంగ్‌లు ఒకప్పుడు కేవలం పర్సుల్ని మాత్రమే టార్గెట్ చేసేవి. అయితే.. ప్లాస్టిక్ కరెన్సీగా పిలిచే క్రెడిట్, డెబిట్ కార్డుల వినియోగం పెరిగిన తర్వాత వీరి పంథా మారింది. గతంలో చైన్ స్నాచింగ్ గ్యాంగ్స్ వరుసపెట్టి పంజా విసిరాయి. ఎక్కడికక్కడ ఆడా, మగా అని తేడా లేకుండా గొలుసులు తెంచుకుపోయాయి. అయితే.. ఇటీవల పిక్ ప్యాకెటర్లు పర్సుల్ని, స్నాచర్లు గొలుసుల్ని వదిలేసి సెల్‌ఫోన్లపై పడ్డారు. కొందరు ఈజీ మనీకి అలవాటుపడి వరుసపెట్టి నేరాలు చేస్తున్నారు. వ్యవస్థీకృతం కాని, నేరం చేయాల్సి అవసరం లేని.. సరదా కోసం చేస్తున్న వారి సంఖ్యా ఇటీవల పెరుగుతోంది. ఈ నేరగాళ్లు సరదా కోసం సెల్‌ఫోన్లు లాక్కుపోతూ స్నాచింగ్, దోపిడీ కేసుల్లో నిందితులుగా మారుతున్నారని పోలీసులు చెబుతున్నారు.


కొన్నిసార్లు ఇన్సూరెన్స్ క్లెయిమ్‌కి ఇబ్బందే..

ఓ బాధితుడు పోలీసులకు ఆశ్రయించి ఎలాంటి ఫిర్యాదు చేసినా దాన్ని జీడీ ఎంట్రీ చేసి... ఆపై ఎఫ్ఐఆర్‌గా రిజిస్టర్ చేయాలి. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రం దీనికి న్యాయపరమైన సలహాలు తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం పోలీసులు దీన్ని పూర్తిగా అమలు చేయట్లేదు. ముఖ్యంగా జేబు దొంగతనాలు, స్నాచింగ్స్, సెల్‌ఫోన్ చోరీలు, వాహనాల దొంగతనాలకు సంబంధించిన కేసులు త్వరగా పరిష్కారం కావని, పెండింగ్ పెరుగుతుందనే ఉద్దేశంతో వీటిని చాలా వరకు ఎఫ్ఐఆర్ చేయట్లేదు. కేవలం జనరల్ డైరీ (జీడీ) ఎంట్రీతో సరిపెడుతున్నారు. ఈసీఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఆ ఫోన్ ఖరీదు చేసినప్పటి బిల్లు తదితరాలు లేకపోతే ఈ ఫిర్యాదు సాధ్యం కావట్లేదు. ఇలాంటి సందర్భాల్లో, ఆ ఫోన్ రికవరీ కానప్పుడు బాధితులు నష్టపోతున్నారు.

నల్లా బిల్లులపై నజర్!

వాటర్ 'మీటర్ బిల్లింగ్'పై స్పెషల్ డ్రైవ్

- రూ.1000 దాటిన బకాయిలపై దృష్టి
- ఆర్థిక బలోపేతానికి జలమండలి యోచన



సాక్షి, సిటీబ్యూరో: మహా నగరానికి తాగునీరు, సీవరేజీ సేవలందిస్తున్న జలమండలి ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఆదాయ వనరులపై దృష్టి సారించింది. పేరుకుపోతున్న పెండింగ్ బిల్లుల వసూలుకు సిద్ధమవుతోంది. రూ.1000 నుంచి ఆపై పెండింగ్ ఉన్న నల్లా కనెక్షన్లపై స్పెషల్ డ్రైవ్‌కు సిద్ధమైంది. బకాయిదారులు స్పందించని పక్షంలో నల్లా కనెక్షన్‌కు నీటి సరఫరా నిలిపివేయాలని యోచిస్తోంది. కాగా.. కనెక్షన్‌దారులకు ముందస్తుగా పెండింగ్ బకాయిలపై పూర్తి స్థాయి అవగాహన ఉండేలా బిల్లుల జారీకి సిద్ధమైంది.

జీఐఎస్‌తో పర్యవేక్షణ

నల్లా కనెక్షన్‌దారులకు మీటర్ బిల్లుల జారీ మిషన్లను జీఐఎస్‌తో అనుసంధానం చేసి డ్యాష్ బోర్డు ద్వారా జలమండలి పర్యవేక్షిస్తోంది. ప్రతి నెలా ఒకటి నుంచి పదో తేదీలోగా బిల్లులు జారీ చేసేవిధంగా చర్యలు చేపట్టనుంది. ప్రధానంగా పెండింగ్ బకాయిలపై దృష్టి సారించి బిల్లుల జారీని పర్యవేక్షించనుంది. సర్కిళ్లవారీగా బకాయి కనెక్షన్లకు బిల్లులు జారీ అయ్యాయా? లేదా? అని పరిశీలిస్తోంది. లేనిపక్షంలో బిల్లు జారీ చేసేలా ఆదేశాలు జారీ చేస్తోంది. కనెక్షన్ల దారులకు బకాయిలపై అవగాహన కల్పించిన తర్వాత నోటీసులు ఇవ్వడం.. ఆ తర్వాత కనెక్షన్ తొలగించే ప్రక్రియ కొనసాగించాలని యోచిస్తోంది.

బల్క్ కనెక్షన్ల బకాయిలే అధికం

జలమండలికి బల్క్ కనెక్షన్ల బకాయిలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. బల్క్ కనెక్షన్ల మొత్తం బకాయిలు రూ.1,310 కోట్లు, గృహ నల్లాల కనెక్షన్ల పెండింగ్ బిల్లులు రూ.828 కోట్లు, వాణిజ్య కనెక్షన్ల నుంచి రూ.336 కోట్లు, పరిశ్రమలు నుంచి రూ.282 కోట్ల వసూలు కావాల్సి ఉంది. కాలనీల కనెక్షన్ల నుంచి రూ.138 కోట్లు, మురికి వాడల కనెక్షన్ల నుంచి రూ.106 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

నెలకు రూ.130 కోట్ల లోటు..

జలమండలికి నెలవారీగా నీటి బిల్లులు, నల్లా కనెక్షన్లు, వాటర్ ట్యాంకర్ల రూపంలో రూ.130 కోట్ల మేర ఆదాయం వస్తుండగా.. ఖర్చులు మాత్రం రెట్టింపు స్థాయిలో రూ.260 కోట్లు అవుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి నెలా రూ.130 కోట్ల లోటుతో ఆర్థికంగా సతమతమవుతోంది. దీంతో పెండింగ్ బకాయిల వసూలుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టనుంది.

గృహమస్తు!

ఇందిరమ్మ ఇళ్ల కోసం స్లమ్ మ్యాపింగ్


- ఎంపిక చేసిన ఐదు ప్రాంతాల్లో జీఐఎస్‌తో..
- కన్సల్టెన్సీ సేవలకు టెండరు
- కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నిర్మాణం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఎంపిక చేసిన స్లమ్స్‌లో జీ+3 అంతస్తులుగా గృహ నిర్మాణం చేసేందుకు జీహెచ్‌ఎంసీ సమాయత్తమవుతోంది. నగరంలోని స్లమ్స్‌లో ఎక్కడ ఉంటున్న వారికి అక్కడే వీటిని నిర్మించడంతో పాటు, ఎక్కడా ఎలాంటి ఇళ్లు లేని పేదలకు సైతం వీటిలో సదుపాయం కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు సిద్ధమవుతున్నారు. అందుకుగాను తొలుత ప్రయోగాత్మకంగా మాదన్నపేటలోని సరళాదేవినగర్, సైదాబాద్‌లోని పిల్లిగుడిసెలు, మారేడ్‌పల్లిలోని అంబేడ్కర్ నగర్ సహా ఐదు ప్రాంతాల్లోని స్లమ్స్‌ను జీఐఎస్ బేస్డ్ సర్వే చేయించనున్నారు. దాంతోపాటు స్లమ్స్ డెవలప్‌మెంట్ లేదా రీ డెవలప్‌మెంట్ కోసం అవసరమైన డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టులు, లే ఔట్ ప్లాన్స్ కోసం కన్సల్టెన్సీ సర్వీసులను ఆహ్వానించారు. వీటితో పాటు ఇందిరమ్మ ఇళ్ల మోడల్‌కు అనుగుణంగా తగిన డిజైన్లు, డ్రాయింగులు, అంచనా వ్యయం కూడా ఎంపికయ్యే కన్సల్టెన్సీ సంస్థే రూపొందించాల్సి ఉంది. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన (యు) నిధులను కూడా వినియోగించుకొని అఫర్డబుల్ హౌసింగ్ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇళ్లను నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేసే నిధులతో పాటు, అవసరమైన మిగతా నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. స్లమ్స్ మ్యాపింగ్, డిజైన్లు పూర్తయ్యాక, వాటిని కేంద్ర ప్రభుత్వానికి పంపించి ఆమోదం పొందాక ఇళ్ల నిర్మాణాలు చేపడతారు. ఎంపిక చేసిన స్లమ్స్‌తో పాటు గ్రేటర్‌లో ఖాళీగా ఉన్న ప్రదేశాలను కూడా గుర్తించి ఈ పథకాల ద్వారా ఇళ్ల నిర్మాణం చేయనున్నారు.

స్థలాల్లేని వారే ఎక్కువ..

నియోజక వర్గానికి ఏటా 3,500 ఇందిరమ్మ ఇళ్లు అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించడం తెలిసిందే. నగరంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దాదాపు 10.71 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులను ఎంపిక చేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ పథకం కింద సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు అందజేస్తుండగా, నగరంలో అలా స్థలం ఉన్న వారు దాదాపు పదిశాతం మంది మాత్రమే ఉన్నారు. దాదాపు 90 శాతం మందికి ఎలాంటి స్థలం లేదు. ఈ నేపథ్యంలో వారికి ప్రభుత్వ స్థలాల్లో బహుళ అంతస్తులతో ఇళ్లు నిర్మించాలని భావించిన ప్రభుత్వం, వాటితోపాటు స్లమ్స్‌లో ఉంటున్న దరఖాస్తుదారులకు వాటిని కూల్చేసి వారుంటున్న ప్రాంతాల్లోనే జీ+3 అంతస్తులుగా నిర్మించాలని భావించింది. ఇందులో భాగంగానే జీహెచ్‌ఎంసీ ప్రస్తుతం కన్సల్టెన్సీ సేవలను ఆహ్వానించింది. కన్సల్టెన్సీ సేవల కింద మొత్తం ప్రాజెక్టులో ఎంతశాతం కావాలో పేర్కొనాల్సిందిగా ఏజెన్సీలకు సూచించింది. ఎంపికయ్యే ఏజెన్సీలు ఏడాది పాటు సేవలందించాలి. అవసరమైతే ఇందిరమ్మ ఇళ్లు.. పీఎంఏవై కింద చేపట్టే వీటి నిర్మాణం పూర్తయ్యేంత వరకు సేవలందించాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి ఈ నెల 8న ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నారు. బిడ్ దాఖలుకు ఈ నెల 18 వరకు గడువు ఉంది.





'కాంటా లగా' మ్యూజిక్ ఆల్బమ్ ఫేమ్, ప్రముఖ బాలీవుడ్ నటి షెఫాలీ జరీవాలా బ్యూటీ ట్రీట్‌మెంట్‌లో భాగంగా ఓ ఇంజెక్షన్ తీసుకున్న కొద్దిసేపటికే కార్డియాక్ అరెస్ట్‌తో మృతిచెందిన సంఘటన ఇటీవల చాలా సంచలనం రేపింది. షెఫాలీ అనేక ఏళ్లుగా ఈ చికిత్స తీసుకుంటున్నప్పటికీ ఆరోజు ఆమె ఉపవాసంలో ఉండి... ఇంజెక్షన్ తీసుకున్నందున ఇలా జరిగిందనే వార్తలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో సాధారణంగా నటీనటులతో పాటు ఇతరులు తీసుకునే బ్యూటీ చికిత్సలనూ అలాగే... గుండెపై వాటి ప్రభావాలను చూద్దాం...

'అందమె ఆనందం... ఆనందమె జీవిత మకరందం' అంటూ తెలుగు కవులు వినిపించారూ... వివరించారు. అందం ఆనందాన్నిస్తుంది. దానికి ప్రాణాల్ని మూల్యంగా చెల్లించాలా అన్నది సమాజం అడుగుతున్న ప్రశ్న. ఈ నేపథ్యంలో అసలు బ్యూటీ చికిత్సల్లో జరిగేదేమిటి, వాటి పర్యవసానాలేమిటి, గుండెపైన వాటి ప్రభావాలేమిటో తెలుసుకుందాం. మొదట్లో సినీతారలు... తర్వాత్తర్వాత క్రమంగా బాగా ధనవంతులు మొదలు... నేడు సామాన్యుల వరకూ సౌందర్య కాంక్ష చేరింది. ఇప్పుడు పార్లర్‌కు వెళ్లడమన్నది మధ్యతరగతీ, దిగువ మధ్యతరగతికీ సాధారణమైంది. మెరుస్తున్న మేని నిగారింపు, యూత్‌ఫుల్ లుక్‌తో కనిపించడం అందరికీ ఇష్టమైన అంశమైంది. బ్యూటీ థెరపీ లేదా ఈస్థటిక్ ట్రీట్‌మెంట్ అని పిలిచే సౌందర్య చికిత్సల్లో రక్తనాళం ద్వారా నేరుగా రక్తంలోకి పంపించే గ్లుటాథియోన్ డ్రిప్స్ మొదలుకొని రకరకాల మీసోథెరపీ (మీసోథెరపీ అంటే చర్మంలో ఉండే మూడు పొరల్లోని మధ్యపొరపై ప్రభావం చూపేవి) మందులూ, కొలాజెన్ పౌడర్లు, చర్మం నిగారింపుతో ఫెయిర్‌గా కనిపించేందుకు వాడే ఇంజెక్షన్లు, పైపూతగా వాడే క్రీములు, పౌడర్లు... ఇలా రకరకాల ట్రీట్‌మెంట్లు ఉంటాయి. పైకి మిలమిలా మెరుస్తూ ఉండే చర్మం వెనక కొన్ని నల్లటి చిక్కటి చీకటి రహస్యాలూ ఉంటాయి. కొన్నింటిపైన ఓ మేరకు నియంత్రణలు ఉన్నప్పటికీ... మరికొన్నింటి విషయంలో అసలు ఎలాంటి అదుపూ లేకుండా ఏమాత్రం శిక్షణ లేనివారూ, తమకు ఎలాంటి పరిజ్ఞానమూ లేనివారూ చేసేవి కూడా ఉంటాయన్నది ఓ నగ్న సత్యం.



డాక్టర్ సంజూషా కుంచ
సీనియర్ డర్మటాలజిస్ట్

• కాంటా లగా

గుండెను గుచ్చే అందమైన ముల్లు

నిర్వహణ: యాసీన్

ఎందుకీ అనర్థాలు...

ఈ అనర్థాలకు చాలా కారణాలు ఉంటాయి.
- చట్టపరంగా వీటిని అదుపు చేసే యంత్రాంగం కొరవడటం
- యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా ఈ తరహా క్లినిక్‌లూ, చికిత్సల గురించి విపరీత ప్రచారం
- ఏమాత్రం అర్హతా, పర్యవసానాలపై అవగాహన లేని అనర్హులు చికిత్సలందించడం.

అన్నిటికంటే ముఖ్యంగా వినియోగదారుల్లో కొరవడిన అవగాహన : ఈ ఉత్పాదనల విషయంలో ప్రజల్లో ఎలాంటి అవగాహన లేకపోవడం వల్ల కూడా ఈ తరహా అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. ఉదాహరణకు 'స్వాభావికమైన, ప్రకృతిసిద్ధమైన (నేచురల్)' వంటి మాటలు ఉపయోగించినప్పుడు అవేవీ ప్రమాదకరం కానివిగా భావిస్తూ చాలామంది ప్రమాదకరమైన సింథసైజ్డ్ రసాయనాలనూ విచ్చలవిడిగా వాడుతున్నారు.

వసతులన్నీ హాస్పిటల్స్ లోనే...



డాక్టర్ ఎం.ఎస్.ఎస్. ముఖర్జీ
సీనియర్ కార్డియాలజిస్ట్

బ్యూటీ చికిత్సలు తీసుకునే సమయంలో అది పెద్ద హాస్పిటల్ అయి ఉండటం, ఎమర్జెన్సీ సౌకర్యాలూ కలిగి ఉండేలా చూసుకోవడం ముప్పును తప్పిస్తుంది. వాస్తవానికి రక్తంలోకి ఎక్కించే గ్లుటాథియోన్ వంటివి తగిన మోతాదులో ఇచ్చినప్పుడు గుండెపోటు రావడం, గుండె ఆగిపోవడం (కార్డియాక్ అరెస్ట్), అనాఫిలెక్టిక్ షాక్‌కు గురికావడం వంటి సందర్భాలు చాలా అరుదు. అయితే అన్ని వసతులూ, ఎమర్జెన్సీ సౌకర్యాలు ఉన్న ఆసుపత్రితో తగిన విద్యార్హతలూ, చికిత్స అర్హతలూ కలిగిన డాక్టర్ల ఆధ్వర్యంలో బ్యూటీ చికిత్సలు తీసుకుంటే... ఒకవేళ ఏవైనా రియాక్షన్స్, అనాఫిలెక్టిక్ రియాక్షన్స్ వచ్చినా తక్షణం చికిత్స అందించడం వల్ల ప్రాణాలను కాపాడటానికి అవకాశముంటుంది.

బ్యూటీ చికిత్సల్లో ఎన్నెన్నో రకాలు...

వ్యక్తులు అందంగా కనిపించేందుకు చేసే చికిత్సల్లో పలు రకాలైనవి ఉంటాయి. ఉదాహరణకు...
- పెరుగుతున్న వయసు ఛాయలు చర్మంపై కనిపించకుండా... ముడుతలూ, లోతైన గీతలు కనిపించకుండా చేసేందుకు యాంటీ ఏజింగ్ చికిత్సగా బొటాక్స్ ఇంజెక్షన్లు, ఇతర డర్మల్ ఫిల్లర్స్
- మార్కెట్‌లో యాంటీ ఏజింగ్ మందులు, డీ-టాక్స్ లేదా ఇమ్యూనిటీ బూస్టర్స్‌గా పిలుస్తూ... రక్తనాళం ద్వారా రక్తంలోకి మందును ఎక్కించే గ్లుటాథియోన్, నికొటినమైడ్ అడినైన్ డైన్యూక్లియోటైడ్ (ఎన్ఏడీ+) మందులు
- రక్తంలోని ప్లాస్మాను వేరు చేసి చర్మంలోకి ఎక్కించే పీఆర్‌పీ (ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా) థెరపీ, (జుట్టు ఒత్తుగా పెరిగేలా చేసే గ్రోత్ ఫ్యాక్టర్ కాన్సంట్రేట్ (జీఎఫ్‌సీ) చికిత్స, ఎగ్జోసోమ్స్, చర్మాన్ని ఉత్తేజితం చేసే పాలీ డైయాక్సీ రైబో న్యూక్లియోటైడ్ (పీడీఆర్ఎన్) వంటి చికిత్సలు
- కొలాజెన్ పెప్టైడ్స్, బయోటిన్, చర్మాన్ని తెల్లగా మార్చే గ్లుటాథియోన్ లాంటి పిల్స్‌తో పాటు కొన్ని హార్మోన్ థెరపీలు. ఇవన్నీ ఆహారంలోని సప్లిమెంట్స్ కాగా... వీటిలో కొన్నింటిని నోటి ద్వారా (ఓరల్‌గా) ఇస్తారు
- ఇక పైపూత లేపనాలు (టాపికల్)గా వాడే పెప్టైడులూ, రెటినాయిడ్స్ ఉండే క్రీములు... ఇవి సౌందర్య ఔషధ రూపాల్లో ఇస్తుండటం వల్ల వీటిని 'కాస్మస్యూటికల్స్'గానూ చెబుతారు.

మన దేశంలో అనుమతి ఉన్నవి కొన్నే...

మన దేశంలో ఇలాంటి మందులకు అనుమతి ఇచ్చే అత్యున్నత అథారిటీ 'సెంట్రల్ డ్రగ్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ - సీడీఎస్‌సీఓ) అనే సంస్థ. దీనితో పాటు అమెరికన్ సంస్థ ఎఫ్‌డీఏ అనుమతించిన వాటిని మనదేశంలోనూ అనుమతిస్తుంటారు. వాటిల్లో కొన్నింటికే అనుమతులున్నాయి
- ఉదాహరణకు రక్తంలోకి ఎక్కించే గ్లుటాథియోన్, హై-డోస్ విటమిన్ సి, ఎన్ఏడీ+ లేదా మరికొన్ని మిశ్రమ మందులు (కాక్‌టెయిల్స్)కు పై సంస్థల అనుమతి లేదు
- చర్మంలో ఉండే మూడు పొరల్లో మధ్యపొరపై పనిచేసే మరికొన్ని చికిత్సలను 'ఎక్సోజోమ్ బేస్‌డ్' చికిత్సలు అంటారు. వీటితో పాటు స్టెమ్‌సెల్ థెరపీల వంటి వాటిని శిక్షణ పొందిన క్వాలిఫైడ్ నిపుణులు అందిస్తేనే సురక్షితం.

ప్రమాదాలూ / అనర్థాలు ఎప్పుడంటే...

ముందుగా చెప్పిన ప్రకారం... అత్యంత సుశిక్షితులూ, అన్ని విధాలా తగిన విద్యార్హతలు ఉన్న డర్మటాలజిస్టుల వంటి నిపుణులు మాత్రమే ఈ చికిత్సలను అందించాల్సిన నేపథ్యంలో ప్రస్తుతం చాలాచోట్ల అనధికారిక సెలూన్లు, స్పాలు ఇంకా చెప్పాలంటే కొన్నిచోట్ల ఇళ్లలో కూడా అనధికారికంగా ఈ ఔషధాలనూ, ఇవ్వకూడని సప్లిమెంట్లను ఇస్తున్నారు. పైగా ఇళ్లలో ఇచ్చే ఈ చికిత్సల్లో ఏవైనా దుష్ప్రభావాలు ఎదురైతే... వాటి పర్యవసానాలేమిటీ, వాటిని ఎలా ఎదుర్కోవాలన్న పరిజ్ఞానం అనర్హులైన చికిత్సకులకు ఉండదూ, అలా ఎదుర్కొనేందుకు అవసరమైన వనరులూ ఉండవు. అయినప్పటికీ చాలా మంది వీటిని యథేచ్ఛగా ఇస్తున్నారూ... అలాగే అందంపై ఆసక్తి ఉన్న యువతీ యువకులు తీసుకుంటున్నారు.

ఇవీ నమోదైన (డాక్యుమెంటెడ్) ప్రమాదాలు / అనర్థాలు

- అలర్జిక్ రియాక్షన్లు, అనాఫిలాక్సిస్ అనర్థాలు (అదుపు చేయలేని విధంగా చాలా తక్కువ వ్యవధిలో వచ్చే తీవ్రమైన రియాక్షన్లు వీటి ద్వారా ఒక్కోసారి షాక్ కూడా కలిగితే దాన్ని అనాఫిలెక్టిక్ షాక్‌గా కూడా వ్యవహరిస్తారు). ఈ రియాక్షన్లు అరుదుగా ప్రాణాంతకమూ అయ్యే అవకాశాలు లేకపోలేదు
- రక్తంలోకి ఎక్కించే గ్లుటాథియోన్ ఇంజెక్షన్లతో అనాఫిలెక్టిక్ షాక్, అసెప్టిక్ మెనింజైటిస్ (మెదడు, వెన్నుపాములో ఉండే పొరల వాపు) వంటివి చాలా అరుదు. అయితే కొన్నిసార్లు ఇలాంటి రియాక్షన్స్ కనిపించిన దాఖలాలు ఉన్నాయి
- హై-డోస్ విటమిన్ బి కాంప్లెక్స్ ఇచ్చిన కొన్ని సందర్భాల్లో అవి వికటించి, ప్రాణాంతకంగా మారిన సందర్భాలూ ఉన్నాయి. నిజానికి చాలాకాలం నిల్వ చేయడానికి అందులో వాడే ప్రిజర్వేటివ్స్ వల్ల ఇలాంటి రియాక్షన్లు కనిపించాయి
- కొన్ని సందర్భాల్లో బ్యూటీ మందులు వాడాక ఇన్ఫెక్షన్లు, రక్తానికి ఇన్ఫెక్షన్ (సెప్సిస్) కనిపించాయి
- స్టెమ్ సెల్ చికిత్సల్లో కొంతమేరకు కనిపించే ముప్పు (రిస్క్). స్టెమ్‌సెల్స్‌తో చేసే చికిత్సల్లో ఇమ్యూన్ రియాక్షన్స్, ఇన్ఫెక్షన్స్ వచ్చే ముప్పు ఉన్నందున నిజానికి బ్యూటీ చికిత్సల్లో స్టెమ్‌సెల్స్‌కు అనుమతి లేదు.

ప్రజలు తెలుసుకోవలసిన అంశాలు...

- బ్యూటీ చికిత్స అందించేవారికి వాస్తవంగా ఆ అర్హత ఉందా, వారికి తగిన విద్యార్హతలు ఉన్నాయా వంటి అంశాలను అడిగి తెలుసుకోవాలి
- చాలా త్వరగా ప్రభావం చూపుతాయన్న 'క్విక్ ఫిక్స్ మార్కెటింగ్' ప్రచారాలను నమ్మడం సరికాదు. మెల్లగా వచ్చే ప్రభావాలే దీర్ఘకాలం నిలుస్తాయి. ఇవి చాలావరకు నిరపాయకరమని గుర్తించాలి
- ఆ సౌందర్యసాధనాలకూ, ఉత్పాదనలకు ఎఫ్‌డీఏ లేదా సీడీఎస్‌సీఓ సంస్థల ఆమోదం ఉందా అని చూడాలి
- గ్లుటాథియోన్ వంటి మందులు ఇచ్చే సమయంలో అది నిరపాయకరమైన మోతాదులోనే ఉందా అని చూడాలి. అంటే వారానికి 600 నుంచి 1200 ఎంజీకి మించి మందు తీసుకోకూడదు. (అనర్థాలు సంభవించిన కొన్ని కేసులను చూసినప్పుడు కొందరు అవసరమైన మోతాదుకు ఐదు రెట్లు ఇచ్చిన దాఖలాలనూ గుర్తించారు)

చివరగా... అందం చాలా ఆకర్షణీయమైదే. అందరూ కోరుకునేదే. అయితే దానికి చెల్లించాల్సిన మూల్యం ప్రాణాలు కాకూడదు. అందంగా ఉండటం కంటే ఆరోగ్యంగా జీవించి ఉండటం ముఖ్యం.



• తల్లితో... ఆమిర్ ఖాన్

నేనున్నానని...

నేడు సమాజంలో ప్రతి ఒక్కరూ సంక్షోభ సమయాలు ఎదుర్కొంటున్నారు. సంక్షోభ సమయంలో 'నీ కోసం నేనున్నానని' ఎవరో ఒకరు నిలవకపోతే బయటపడటం కష్టమవుతోంది. 'రీనాతో విడాకుల తర్వాత తాగుడు అలవాటు లేని నేను తాగుబోతుగా మారాను. సంవత్సరం పాటు లెక్కకు మించి తాగుతూ స్పృహ తప్పేవాణ్ణి. కాని అమ్మ నన్ను కాపాడింది' అని తాజాగా ఒక ఇంటర్వ్యూలో తెలిపాడు ఆమిర్ ఖాన్. అతడు తీసిన 'సితారే జమీన్ పర్' విజయవంతం కావడంతో తన జీవితంలో సవాళ్లను ఎలా అధిగమించాడో పంచుకున్నాడు.

మనిషి ఒంటరితనం అనుభవిస్తున్నప్పుడు, సమస్యతో కొట్టుమిట్టాడుతున్నప్పుడు ఎవరో ఒకరు వచ్చి 'ఇక చాలు... బయటపడు... నిన్ను నువ్వు నిలబెట్టుకో' అని ధైర్యం చెప్పాలి. అలా ధైర్యం చెప్పే మనిషి ప్రతి ఒక్కరి జీవితంలో ఉండాలి. లేదంటే సంక్షోభంలో ఉన్న మనిషి తీసుకునే నిర్ణయాలు అసాధారణం అవుతాయి. నేడు పేపర్ తెరిస్తే హత్యలు, ఆత్మహత్యలు కనపడుతున్నాయి. సాటి మనిషి నుంచి సరైన సహాయం లేకపోవడం వల్లే ఇలాంటి దుర్ఘటనలు. స్వీయ విధ్వంసం లేకుండా జీవితాన్ని నిలబెట్టుకోవడం నేడు పెద్ద సవాలుగా ఉంది. ఇలాంటి స్థితి సెలబ్రిటీలకు కూడా ఉంటుంది. కాని వారు ఎలా బయటపడ్డారో తెలిస్తే సాధారణ వ్యక్తులకు స్ఫూర్తి అందవచ్చు. తాజాగా 'సితారే జమీన్ పర్' సినిమాతో విజయం అందుకున్న ఆమిర్ ఖాన్ ఆ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఇంటర్వ్యూలు ఇస్తూ తన జీవిత విశేషాలు చెప్పుకుంటూ వస్తున్నాడు. వాటిలో ఒకటి తన మొదటి విడాకుల సమయంలో ఎదురైన కుంగుబాటు. 'మా అమ్మ హెచ్చరికతో నేను కోలుకున్నాను' అంటున్నాడు.

తాగుబోతుగా మారాను

ఆమిర్ ఖాన్ కెరీర్‌లో ఎదగక ముందే రీనా దత్తాను 1986లో రహస్య పెళ్లి చేసుకున్నాడు. ఇది 'సఖి' సినిమాలో జరిగినట్టుగానే జరిగింది. అయితే ఆ తర్వాత ఇరు కుటుంబాలూ మెల్లగా వారిని యాక్సెప్ట్ చేశాయి. అయితే 2000 సంవత్సరం నాటికి వీరి అనుబంధంలో పగుళ్లు వచ్చాయి. అదే సంవత్సరం రీనా పిల్లల్ని తీసుకుని సమీపంలోని ఫ్లాట్‌లోకి మారిపోయింది. ఆ తర్వాత ఏం జరిగిందో ఆమిర్ ఇలా చెప్పాడు-

'రీనా వెళ్లిన రోజు రాత్రి నేను ఇంట్లో ఒక్కణ్ణే ఉన్నాను. పనివాళ్లు లేరు. మా డ్రైవర్‌ని ఆమెకు, పిల్లలకు తోడు ఇచ్చి పంపాను. నాకు ఏం చేయాలో పాలుపోలేదు. అప్పటికి నేను ఆల్కహాల్ ముట్టలేదు- ఒకటి రెండుసార్లు సినిమా షూటింగ్‌లో భాగంగా తప్ప. అయితే స్నేహితుల కోసం మా ఇంట్లో ఆల్కహాల్ ఉండేది. ఆ రోజు రాత్రి బాటిల్ తాగి స్పృహ తప్పి పడిపోయాను. అప్పటి నుంచి రోజూ తాగుతూనే ఉండేవాణ్ణి. నాకు నిద్ర వచ్చేది కాదు. తాగి తాగి స్పృహ తప్పేవాణ్ణి అంతే. ప్రతి శనివారం పిల్లలు వచ్చేవారు. రెండు వారాలకు ఒకసారి రెండు రోజులు నాతో ఉండేవారు. ఆ రోజుల కోసం ఎదురుచూసే వాణ్ణి. అప్పుడు మాత్రం తాగేవాణ్ణి కాదు. ఆ సమయంలో నేను సినిమాలు చేయలేదు. ఇంట్లో నుంచి బయటకు రాలేదు. సినిమా పరిశ్రమలో కేవలం ఇద్దరు ముగ్గురే నా పరిస్థితి విని చూడటానికి వచ్చారు. వారిలో జూహీ చావ్లా, సల్మాన్ ఖాన్, అనిల్ కపూర్ ఉన్నారు. ఇక ఇలాగే ఉండిపోతానేమో అనుకున్నాను' అన్నాడతను.

తల్లి చెప్పిన మాట

ఆమిర్ తండ్రి తాహిర్ హుసేన్ ఒకప్పటి ప్రసిద్ధ నిర్మాత. తల్లి జీనత్ గృహిణి. తండ్రి 2010లో మరణించాడు. తల్లి ముంబైలోని మరో ఇంట్లో కుమార్తెలతో ఉంటోంది. ఆమిర్ జీవితంలో ఏం జరుగుతున్నదో ఆమెకు తెలుసు. కాని ఆమిర్‌ను ఎలా దారికి తేవాలో తెలియదు. ఆ సమయంలో ఏం జరిగిందో ఆమిర్ ఇలా తెలియచేశాడు. 'నేను డిప్రెషన్‌లో వ్యాయామం వదిలేశాను. ఏం తింటున్నానో ఏం తినడం లేదో తెలియదు. అప్పటికి ఏడాదిన్నర అయ్యింది నేను షూటింగ్ చేసి. ఒకరోజు ఉదయాన్నే మా అమ్మ ఫోన్ చేసింది. పేపర్‌లో నీ ఫొటో రాణి ముఖర్జీతో వచ్చింది చూడు అంది. నా ఫొటో రాణిముఖర్జీతో ఎందుకు వచ్చింది అని పేపర్ చూశాను. ఆ రోజుల్లో చాలా లావుగా ఉండే ఒక యాక్టర్‌తో రాణి ముఖర్జీ ఫొటో ఉంది. నేను తిరిగి అమ్మకు కాల్ చేశాను- నీ ఫొటో కూడా అలా చూస్తానేమోనని బెంగగా ఉందిరా అంది. వెంటనే నాకు షాక్ తగిలింది. సాధారణంగా అమ్మలు తమ పిల్లల్ని ఎంత లావుగా ఉన్నా చిక్కిపోయాడనే అంటూ ఉంటారు. ఇక్కడ మా అమ్మ మాత్రం నేను లావుగా అయిపోతున్నానని బాధ పడుతోంది. అమ్మ ఇలా బాధపడటం నా అరాచకానికి అంతిమస్థాయి అనిపించింది. అంతే. ఆ రోజే నిర్ణయం తీసుకున్నాను... మళ్లీ పూర్వపు మనిషి కావాలని. అలా మా అమ్మ నన్ను నిలబెట్టింది' అన్నాడు.



• మొదటి భార్య రీనాతో...

ఆమిర్, రీనా 2002లో విడాకులు తీసుకున్నారు.

• కిచెన్ టిప్

➡ గోరువెచ్చని నీటిలో అరస్పూను వంటసోడా, స్పూను వెనిగర్, స్పూను వాషింగ్ మెషిన్ లిక్విడ్, స్పూను కంఫర్ట్ వేసి చక్కగా కలపాలి. ఈ నీటిలో ఒక వస్త్రాన్ని ముంచి పిండి, సోఫా, పరుపులను తుడిస్తే దుమ్ము ధూళీ, దుర్వాసన పోతుంది. ఈ మిశ్రమం ఉంటే ఎటువంటి ఎలక్ట్రానిక్ క్లీనర్స్ అవసరం ఉండదు.



➡ గ్లాసు వేడినీళ్లలో టీస్పూను సర్ఫ్, పావు టీస్పూను పసుపు వేసి బంగారు ఆభరణాలను నానబెట్టాలి. పదినిమిషాలు నానాక నగలను టూత్‌బ్రష్‌తో రుద్ది కడిగితే కొత్తవాటిలా మెరుస్తాయి.

బులియన్ జూలై 3న ముగింపు రూ.లలో (బంగారం 10 గ్రా.: వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,110
బంగారం (22 క్యారెట్లు)	91,987
వెండి	1,09,000
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,580
బంగారం (22 క్యారెట్లు)	91,050
వెండి	1,09,900
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,330
బంగారం (22 క్యారెట్లు)	91,050
వెండి	1,21,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,580
బంగారం (22 క్యారెట్లు)	93,780
వెండి	1,09,900
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,750
బంగారం (22 క్యారెట్లు)	89,930
వెండి	1,08,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,330
బంగారం (22 క్యారెట్లు)	91,050
వెండి	1,21,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

• సోషల్ మీడియా

ప్రధాని మెచ్చిన రొట్టె!

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన 'మన్ కీ బాత్' కార్యక్రమంలో కర్నాటకలోని కలబుర్గి రొట్టెల గురించి ప్రస్తావించడం ఒక విశేషం అయితే, కొన్ని గంటల వ్యవధిలోనే కలబుర్గి రొట్టెల ఉత్పత్తి సహకార సంఘానికి 60కి పైగా అమెజాన్ ఆర్డర్లు రావడం మరో విశేషం. కలబుర్గి జిల్లాలోని వందలాది మహిళలకు ఈ సంఘం ఉపాధి కల్పిస్తోంది. జిల్లాలోని వివిధ గ్రామాల మహిళల నుంచి రొట్టెలను సేకరించి ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా విక్రయిస్తుంటుంది.

'కలబుర్గి రొట్టెల గురించి ప్రధానమంత్రి ప్రస్తావించడం వల్ల ఎంతోమంది పేద మహిళలకు మేలు జరుగుతోంది. ఒకప్పుడు మేమందరం ఇంటిపనులకే పరిమితమయ్యేవాళ్లం. రొట్టెల తయారీ ద్వారా వ్యాపారంలోకి అడుగుపెట్టాం' అంటుంది కొట్నూరు గ్రామంలోని 'నంది బసవేశ్వర రొట్టె కేంద్ర'కు చెందిన నింగమ్మ.



'కలబుర్గి రొట్టెల గురించి ప్రధాని మాట్లాడడం చాలా సంతోషంగా అనిపించింది. దీని వల్ల మా రొట్టెలకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది' అంటుంది చిట్టాపూర్ గ్రామానికి చెందిన శరణమ్మ. ఆమె 'మాతా మల్లమ్మ రోటీ కేంద్ర' నిర్వాహకురాలు.









ఫ్యాషన్

పర్స్ వడ్డాణం

ఎంబ్రాయిడరీ చేసిన మ్యాచింగ్ బెల్ట్‌లు డ్రెస్‌ను అందంగా చూపుతాయి. దీంతో వడ్డాణాల స్థానంలో రకరకాల మోడల్స్‌లో ఉన్న ఫ్యాబ్రిక్ బెల్ట్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ మోడల్స్ అంతటితో ఆగిపోకుండా మరింత ఉపయుక్తంగా, అందంగా పర్స్ బెల్ట్‌లను డిజైన్ చేస్తున్నారు డిజైనర్లు. శారీ, లెహంగా, ఏ డ్రెస్ అయినా అదే మెటీరియల్‌తో డిజైన్ చేసే పర్సుల బెల్ట్‌లు అదీ మ్యాచింగ్‌తో వాడటం వేడుకలలోనూ హైలైట్ అవుతున్నాయి.

ముస్తాబు పూర్తయ్యాక వేడుకకు వెళ్లే ముందు ఫోన్, డబ్బులు పెట్టుకోవడానికి పొట్లి బ్యాగ్స్, క్లచెస్.. వంటివి వెతుకుతుంటారు. అవి కూడా డ్రెస్‌కి మ్యాచ్ అయ్యేవి ఉంటే బాగుండేది అని కొందరు, అదనంగా వీటిని పట్టుకెళ్లడం కష్టమే అని విసుక్కునే వారూ ఉంటారు. ఈ సమస్యకు పరిష్కారంగా బెల్ట్ పర్సుల మోడళ్లు అందంగా ఆకట్టుకుంటున్నాయి.

టాప్ టు బాటమ్

పొట్లీ, ఇతర హ్యాండ్ బ్యాగ్స్ ధరించే డ్రెస్‌కు మ్యాచ్ అయ్యేలా అదే ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేయడం కూడా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుంది. వీటివల్ల విడిగా హ్యాండ్ బ్యాగ్, పర్సులను కొనుగోలు చేయనక్కర్లేదు. ఒకే రంగు, ప్రింటెడ్ ఫ్యాబ్రిక్‌ను ఉపయోగించి డ్రెస్‌తో పాటు బ్యాగ్‌నూ రూపొందించుకోవచ్చు. వేడుకలలోనే కాదు క్యాజువల్‌గానూ కలర్‌ఫుల్‌గా వెలిగిపోవచ్చు.

నడుముకు పర్స్

ఎంబ్రాయిడరీ చేసిన ఫ్యాబ్రిక్‌తో బెల్ట్, దానికి జత చేసిన పర్స్ ఈ బెల్ట్ స్పెషల్. లెహంగా, శారీ, డ్రెస్ ఏదైనా అదే ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేయడం వల్ల ప్రత్యేకంగా కనిపిస్తుంటాయి. లేసులు, టాజిల్స్, పూసలు, స్టోన్స్... ఈ పర్సులకు జత చేయడం అదనపు ఆకర్షణ.



సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 4 । జూలై । 2025



13, 14 తేదీల్లో తనికెళ్ల భరణి రంగస్థల స్వర్ణోత్సవాలు

గన్‌ఫౌండ్రీ: రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈ నెల 13, 14వ తేదీల్లో రవీంద్రభారతిలో సినీనటుడు తనికెళ్ల భరణి రంగస్థల జీవిత స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నట్లు సంగమం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సంజయ్ కిశోర్ తెలిపారు. ఈ మేరకు గురువారం సంగమం కార్యాలయంలో స్వర్ణోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంజయ్ కిశోర్ మాట్లాడుతూ తనికెళ్ల భరణి నాటక రంగంలోకి ప్రవేశించి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 13వ తేదీన 'తనికెళ్ల భరణి నాటికలు – ప్రయోగశీలత'అనే అంశంపై సదస్సు, 'గోగ్రహణం', 'చల్ చల్ గుర్రం' నాటిక ప్రదర్శనలు ఉంటాయని, 14న కూడా నాటిక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నాటక దర్శకులు మంజునాథ, గోవాడ వెంకట్, బాషా, షఫీ తదితరులు పాల్గొన్నారు.





బోనం మెరిసె.. ఢిల్లీ మురిసె..

దేశ రాజధానిలో మన తెలంగాణ బోనం కనువిందు చేసింది. ఢిల్లీలో కన్నుల పండువగా బోనాల జాతర సాగింది. మూడు రోజుల అనంతరం హైదరాబాద్ లాల్ దర్వాజా బోనాల ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ముగిశాయి. గత నెల 29న పాతబస్తీలోని లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారికి బంగారు బోనం సమర్పించిన అనంతరం భక్తులు న్యూఢిల్లీకి బయలుదేరారు. ఈ నెల ఒకటవ తేదీన ఇండియా గేట్ వద్ద అమ్మవారి ఘటస్థాపన ఊరేగింపు నిర్వహించారు. 2న ఉదయం అమ్మవారికి బంగారు బోనాలు, పట్టువస్త్రాల సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఒగ్గు డోళ్ల విన్యాసాలు ఢిల్లీ భక్తులను ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథులుగా హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయతోపాటు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరై అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిలు విచ్చేసి అమ్మవారికి బంగారు బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు గురువారం ఉదయం లాల్‌దర్వాజకు తిరుగు ప్రయాణమయ్యారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతీయాదవ్, కమిటీ కన్వీనర్ జి.అరవింద్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. –చార్మినార్

చిన్నారుల సంరక్షణకే 'ముస్కాన్'

హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి



ఆపరేషన్ ముస్కాన్-11 కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన

సాక్షి,సిటీ బ్యూరో: చిన్నారుల సంరక్షణ ధ్యేయంగా ఆపరేషన్ ముస్కాన్ కొనసాగాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రసంగించారు. భిక్షాటన, వెట్టిచాకిరీల నుంచి చిన్నారులకు విముక్తి కల్పించి, పునరావాస కేంద్రాల్లోగానీ, వారి తల్లిదండ్రులకు అప్పగించటంలోగానీ అధికారులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, పారిశ్రామికవాడలు, పరిశ్రమల్లో బాల కార్మికులు పనిచేసే అవకాశం ఉండటంతో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. గుర్తించిన ప్రతీ చిన్నారి వివరాలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాల్లో చేర్పించిన పిల్లల సంరక్షణకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స అందించాలన్నారు. వారి ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఆధార్, హెల్త్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు ఆయా శాఖలు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. గతంలో ఆపరేషన్ ముస్కాన్ ద్వారా కనుగొన్న చిన్నారుల భవిష్యత్తు కోసం చేపడుతున్న ప్రగతి గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు వివరించారు. సమావేశంలో సీడబ్ల్యూసీ చైర్మన్ శైలజ, ఆర్డీవోలు రామకృష్ణ, సాయిరాం, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బి.జాన్సన్, డీఈఓ రోహిణి, డీసీపీఓ శ్రీనివాస్, తహసీల్దార్లు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తే సహించం

– విద్యుత్ సంస్థల జేఏసీ



విద్యుత్ ఉద్యోగుల జేఏసీ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో విద్యుత్ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తే సహించబోమని నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ నేషనల్ జనరల్ సెక్రటరీ సుదీప్ దత్తా అన్నారు. ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో విద్యుత్ ఉద్యోగులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీఎస్, ఏపీ) ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. సుదీప్ దత్తా మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఉత్తరప్రదేశ్‌లో 7 నెలలుగా నిరవధికంగా సమ్మె చేస్తున్నారని అన్నారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ ప్రధాన కార్యదర్శి మోహన్‌శర్మ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న 27 లక్షల మంది విద్యుత్ ఉద్యోగులు ఈ పోరాటంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్ ప్యాట్రన్ అశోక్‌రావు, తెలంగాణ స్టేట్ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ రత్నాకర్ రావు, కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీ రెడ్డి, అనిల్‌కుమార్, రాధాకృష్ణ, ఏపీ చైర్మన్ కృష్ణయ్య, కె.నాగప్రసాద్, రాఘవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్య దందా!

- నగరంలో నిద్రావస్థ వీడని వైద్యారోగ్య శాఖ
- మెడికల్ కౌన్సిల్ దాడుల్లో వెలుగు చూస్తున్న దారుణాలు

వైద్యుల ముసుగులో అబార్షన్లు, ఇన్‌ఫెర్టిలిటీ సేవలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నకిలీ వైద్యులు యథేచ్ఛగా వైద్యం చేస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి అబార్షన్లు, ఇన్‌ఫెర్టిలిటీ సేవలు అందించడానికి కూడా వెనుకాడటం లేదు. అవసరాలకు మించి హై ఎండ్ యాంటీ బయోటిక్స్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ ఇస్తూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అడ్డుకోవాల్సిన వైద్యారోగ్య శాఖ మాత్రం నిద్రావస్థలో మగ్గుతోంది. ఆసుపత్రులకు అనుమతులు ఇవ్వడం, నిబంధనలు అతిక్రమించిన, అనధికారికంగా నడిచే ఆసుపత్రులపై చర్యలు తీసుకోవడం తమ పని కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తనిఖీల మాట గాలికొదిలేశారు.

ఆర్‌ఎంపీల నిర్వాకాలు..

ఇటీవల తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించిన దాడుల్లో పలువురు ఆర్‌ఎంపీల నిర్వాకాలు వెలుగుచూశాయి. నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్లు చేస్తున్నారని గుర్తించారు. ఇన్‌ఫెర్టిలిటీ మందులు సైతం ఆయా క్లినిక్‌లలో లభించాయి. రంగారెడ్డి, సిద్దిపేట్, దేవరకొండ, హైదరాబాద్ తదతర ప్రాంతాల్లో చేపట్టిన దాడుల్లో అబార్షన్, ప్రెగ్నెన్సీ కిట్లు దొరికాయి. మూడు నెలల క్రితం వరంగల్‌లో ఓ గర్భిణీకి చేసిన అబార్షన్ వికటించింది. ఇన్‌ఫెక్షన్ అయి అవయవాలన్నీ దెబ్బతినడంతో ఆమె మృతి చెందింది. హైదరాబాద్ నగరంలోనూ పలు క్లినిక్‌లలో అబార్షన్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయినా ఈ వ్యవహారంపై వైద్యారోగ్య శాఖ కన్నెత్తి చూడటంలేదు.





హైఎండ్ డ్రగ్స్ వినియోగం..

ఆర్‌ఎంపీలు, అనధికారిక క్లినిక్‌లలో మోమోసెఫ్, నెలోజెల్, జెంటా మెడిసిన్ 30 ఎంఎల్ వైల్స్ వంటి హైఎండ్ యాంటీబయోటిక్స్, స్టెరాయిడ్స్, పెయిన్ కిల్లర్స్ వినియోగిస్తున్నారు. న్యూరాలజీ స్పెషలిస్టు వైద్యులు, గైనకాలజీ సూపర్ స్పెషాలిటీ వైద్యులు రాసిన మందులు చిన్న, చిన్న క్లినిక్‌లలో దర్శనమివ్వడంతో తనిఖీలకు వెళ్లిన వైద్యుల బృందం ఆశ్చర్యానికి గురవుతోంది. ఒక ఇన్పెక్షన్‌కు ఎంత మొత్తంలో యాంటీ బయోటిక్ డ్రగ్ ఇవ్వాలనేది ఏఎంఎఫ్‌సీ గైడ్‌లైన్స్ స్పష్టం చేస్తున్నాయి. అయితే చిన్నపాటి ఇన్పెక్షన్‌కు హైఎండ్ యాంటీబయోటిక్ మందులు ఇస్తున్నారు. దీంతో కిడ్నీ సమస్యలు వస్తాయి. అధిక మొత్తంలో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి నశించి, డయాబెటిస్, కేట్రాక్ట్ సమస్యలు వస్తున్నాయి. భవిష్యత్తులో ఇన్ఫెక్షన్లు త్వరగా వస్తాయి. కోవిడ్ సమయంలో పది లక్షల మంది మృతి చెందిగా, యాంటీబయోటిక్స్ అధికంగా వినియోగించడం వల్ల భవిష్యత్తులో అంతకంటే ఎక్కువ మరణాలు సంభవించే ప్రమాదముందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకునే క్రమంలో అర్హత లేని వ్యక్తులకు అమ్మవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

మూడు రకాల డ్రగ్స్ వినియోగిస్తున్నారు



నకిలీ వైద్యులు మూడు రకాల డ్రగ్స్‌ను అధికంగా వినియోగిస్తున్నారు. నగరంలో అర్హత లేని వైద్యులు, క్లినిక్‌లపై 200 కేసులు నమోదు చేశాం. ఇటీవల ఉప్పల్‌లో అర్హత లేని వైద్యుడు ఇచ్చిన మందులు వికటించి జిమ్ ట్రైనర్ చనిపోయాడు. వరంగల్, సూర్యాపేట, వర్ధన్నపేట్‌లలోనూ అర్హత లేని వైద్యులు చేసిన చికిత్సలకు అమాయకులు బలైపోయారు. నకిలీ వ్యక్తి వైద్యం చేస్తే ఎలా ఉంటుందనే దానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రజలు నిపుణులైన వైద్యులు మాత్రమే సంప్రదించాలి. – శ్రీనివాస్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు

నకిలీ వైద్యులు, అనధికారిక క్లినిక్‌లపై ఫిర్యాదుల కోసం: వాట్సాప్ నెంబర్: 91543 82727

వాన జల్లు.. రోడ్లకు చిల్లు

- పాదచారులు, వాహనదారుల అవస్థలు

నగరంలో 7,256 ప్రాంతాల్లో గుంతలు



సాక్షి, సిటీబ్యూరో: చిన్నపాటి వర్షానికే రహదారులు చెరువులయ్యే నగరంలో.. ఇటీవల వరుస వానలతో చాలాచోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారుల్లోనూ బీటీ, సీసీ తేడా లేకుండా అన్ని రకాల రోడ్లకు గుంతలు పడ్డాయి. దీంతో పాదచారులతో పాటు వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గుంతల రోడ్లపై వాహనాలు ముందుకు సాగక ట్రాఫిక్‌జామ్‌లేర్పడుతున్నాయి. గుంతలతో అధ్వానంగా మారిన రోడ్లతో ప్రధానంగా ద్విచక్ర వాహనదారులకు వెన్నెముక సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో ప్రధాన రహదారుల మార్గాల్లో సమగ్ర రోడ్డు నిర్వహణ పథకం (సీఆర్‌ఎంపీ) కింద ప్రైవేటు ఏజెన్సీలకిచ్చిన కాంట్రాక్టు గడువు ముగిసిపోవడంతో, ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ నిర్వహణ విభాగమే ఈ పనులు చేస్తోంది. ఎప్పటికప్పుడు గుంతలను పూడుస్తున్నా, మళ్లీ వర్షం పడుతుండటంతో పరిస్థితి మొదటికొస్తోంది.

బోనాలు, మొహర్రం పనులు..

ఇప్పటికే బోనాల పండగ, మొహర్రంను పురస్కరించుకొని వివిధ ప్రాంతాల్లో రోడ్ల బాగు కోసం నిధులు మంజూరు చేశారు. ఎలాగూ ఆ పనులు చేయాల్సి ఉన్నందున అవి పూర్తయ్యాక ఇంకా ఎక్కడైనా గుంతలుంటే పూడ్చాలని అధికారులు భావిస్తున్నారు. లేని పక్షంలో ఒకే పనికి రెండు మూడుసార్లు చెల్లింపులు జరిగే అవకాశం ఉంది. గతంలో ఎన్నోసార్లు ఇలా జరగడంతో ప్రస్తుతం ఆచితూచి నిధులు కేటాయిస్తున్నారు. బోనాలు, మొహర్రం కోసం ప్యాకేజీలుగా 84 పనులకు నిధులు మంజూరు చేశారు. 28 పనులు చేపట్టారు. మిగతా 56 పనులు టెండర్ల దశలో ఉన్నాయి. త్వరలోనే టెండర్లు పూర్తిచేసి పండుగల పనులు పూర్తయ్యాక, ఇంకా మిగిలి ఉన్న గుంతలుంటే వాటిని పూడ్చి వేస్తామంటున్నారు అధికారులు.

జోన్	ఎల్‌బీనగర్	చార్మినార్	ఖైరతాబాద్	శేరిలింగంపల్లి	కూకట్‌పల్లి	సికింద్రాబాద్	మొత్తం
గుంతలు	1,876	971	527	1,305	1,091	1,486	7,256

మానవతావాది డాక్టర్ వైఎస్సార్



ఆత్మీయ సమ్మేళనం వాల్ పోస్టర్‌ను విడుదల చేసిన ఫౌండేషన్ నాయకులు

వైఎస్సార్ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఈశ్వరప్రసాద్ రెడ్డి

మణికొండ: జాతి, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సమసమాజం కోసం సమన్యాయం పాటిస్తూ పాలన కొనసాగించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గొప్ప మానవతావాదిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని వైఎస్సార్ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, 'సాక్షి'దినపత్రిక ఫైనాన్షియల్ డైరెక్టర్ వై.ఈశ్వర ప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్స్ హిల్స్‌లో ఈ నెల 8న వైఎస్సార్ 76వ జయంతిని పురస్కరించుకుని హైటెక్ సిటీ సమీపంలోని బుట్ట కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న ఆత్మీయుల సమ్మేళనం వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వద్దకు వచ్చిన వారికి అదే రోజు న్యాయం జరగాలనే తాపత్రయం, రాని వారందరికీ ప్రభుత్వ పథకాల ద్వారా మేలు జరగాలనే మానవత్వం వైఎస్సార్‌లో ఉండేదన్నారు. అలాంటి తపనలోంచి వచ్చిన 108, రాజీవ్ ఆరోగ్య శ్రీ,, రైతులకు ఉచిత విద్యుత్, పంట రుణమాఫీ, మహిళలకు పావలా వడ్డీ రుణాలు, ముఖ్యమంత్రి సహాయ నిధి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, జలయజ్ఞం లాంటి పథకాలతో ప్రజల మనసుల్లో ఆయన చెరగని ముద్ర వేశారని కొనియాడారు. హైదరాబాద్ లాంటి నగరానికి ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, పీవీ ఎక్స్‌ప్రెస్ వే లాంటివి నిర్మించి ప్రపంచ పటంలో నిలిపారన్నారు. ప్రతి ఒక్కరికీ సహాయపడాలి, వీలైనంత ఎక్కువ మందికి సేవ చేయాలనే ఆయన ఆశయాన్ని భావి తరాలకు అందించాలనే ఉద్దేశంతోనే వైఎస్సార్ స్ఫూర్తి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఏపీ రెడ్డి, సుబ్రమణ్యారెడ్డి, రాఘవరెడ్డి, నరసింహారెడ్డి, సీతారాం, గిరిధర్, రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌బాబు, రామసుబ్బారెడ్డి, ఉపేంద్రనాథ్‌రెడ్డిలతో పాటు ఆయన అభిమానులు ఎ.లక్ష్మన్ రావు, ఆరీఫ్ మహ్మద్, బి.శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసగించిన కేంద్రం

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

హిమాయత్‌నగర్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసగించిందని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు మండిపడ్డారు. సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కిసాన్ మోర్చా కార్యదర్శి విస్సా కిరణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన మోదీ అనంతరం దానిని విస్మరించారన్నారు. నూతనంగా తీసుకొచ్చిన వ్యవసాయ విధానంలో కనీస మద్దతు ధర ఊసేలేదని మండిపడ్డారు. అభివృద్ధి పేరిట వ్యవసాయ భూములను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు.

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతుల కంటే, కంపెనీలకే లబ్ధి చేకూరుస్తోందని ఆరోపించారు. అమెరికా దేశంతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం రైతులకు శరాఘాతంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు టి.సాగర్, ప్రసాద్, శోభన్, భిక్షపతి, జక్కుల వెంకటయ్య, పశ్య పద్మ పాల్గొన్నారు.

హెచ్‌ఎంఏ అధ్యక్షుడిగా దేవేందర్‌రెడ్డి ఎన్నిక



సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(హెచ్‌ఎంఏ) నూతన అధ్యక్షుడిగా అల్వాల దేవేందర్ రెడ్డి ఎన్నికయ్యారు. 2025–26 సంవత్సరానికి హెచ్‌ఎంఏ నూతన కార్యవర్గాన్ని కూడా సభ్యులు ఎన్నుకున్నారు. గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో ఈరైడ్ విద్యుత్ వాహనాల సంస్థ వ్యవస్థాపకుడు, హెచ్‌ఎంఏ అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ పరిశ్రమల్లో యాజమాన్యాలు అనుసరిస్తున్న విధానాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెడతామని తెలిపారు. అదే సమయంలో విద్యార్థుల సామర్థ్యాలను కూడా పెంపొందిస్తామని, వారిని ఎంట్రప్రెన్యూర్లుగా లేదా కార్పొరేట్ ఉద్యోగాలకు సరిపోయేలా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శరత్ చంద్ర మారోజును ఉపాధ్యక్షుడిగా, వాసుదేవన్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

కొనసాగుతున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

రామంతాపూర్: రాష్ట్రంలో ఇటీవల ఇంజనీరింగ్ ఫార్మసీ అగ్రికల్చరల్ ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా గురువారం రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 840 మంది విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సెలింగ్ హెల్ప్ డెస్క్ కోఆర్డినేటర్ ప్రిన్సిపాల్ వినయ్‌కుమార్ మాట్లాడుతూ సర్టిఫికెట్ల పరిశీలన కోసం విద్యార్థులు ఎప్‌సెట్ హాల్ టికెట్ ర్యాంకు కార్డు, ఎస్ఎస్‌సీ, ఇంటర్ వరకు బోనఫైడ్ సర్టిఫికెట్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతోపాటు ఆధార్ ర్యాంకు కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని సూచించారు.



కాంగ్రెస్ సభకు నగరం ముస్తాబు

- నేడు ఎల్బీస్టేడియంలో జరిగే సభలో పాల్గొననున్న మల్లికార్జున ఖర్గే
- అడుగడుగునా స్వాగత బ్యానర్లు.. భారీ ఎత్తున కటౌట్లు, తోరణాలు

సాక్షి,సిటీబ్యూరో: కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనం సభకు నగరం ముస్తాబైంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 వేల కాంగ్రెస్ ప్రతినిధులు శుక్రవారం మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో జరిగే సభకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో అడుగడుగున స్వాగత బ్యానర్లు, కటౌట్లు, తోరణాలు ఏర్పాటు చేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులతో సమావేశం కానున్నారు. ఈ సమ్మేళనానికి గ్రామ మండల, జిల్లా అధ్యక్షులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరుకానున్నారు. సమ్మేళనం సభ ఏర్పాట్లను ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి పర్యవేక్షించారు. సామాజిక న్యాయ సమరభేరి పేరిట జరిగే ఈ సభలో గ్రామ అధ్యక్షులకు ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు దిశానిర్దేశం చేస్తారు. మధ్యాహ్నం మూడు గంటలకల్లా అందరూ సభాస్థలికి చేరుకోవాలని టీపీసీసీ సూచించింది.

నగరానికి చేరుకున్న ఏఐసీసీ అధ్యక్షుడు

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుల సమ్మేళనంలో పాల్గొనేందుకు గురువారం సాయంత్రమే ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ఆయనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు ఘన స్వాగతం పలికారు.

'టీటా' బోనాల ఉత్సవాలు పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల ఉత్సవాలు–2025 పోస్టర్‌ను రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. గురువారం నగరంలో మంత్రి శ్రీధర్‌బాబును టీటా గ్లోబల్ అధ్యక్షుడు సందీప్‌కుమార్ మక్తాలా నాయకత్వంలో బోనాల నిర్వహణ కమిటీ సభ్యులు కలిశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ బోనాల వేడుకల్లో ఐటీ ఉద్యోగులను భాగస్వాములను చేయడం, ఐటీ కారిడార్‌లో సంస్కృతి, సంప్రదాయాల ఆధారిత కదలికను టీటా ఆధ్వర్యంలో నిలబెట్టడం హర్షణీయమన్నారు. సందీప్ కుమార్ మక్తాలా మాట్లాడుతూ ఈ ఏడాది ఐటీ బోనాల వేడుకలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆదివారం ఐటీ బోనాల వేడుకను మాదాపూర్‌లోని శిల్పకళావేదిక నుంచి చిన్న పెద్దమ్మ దేవస్థానం వరకు బోనాల ఊరేగింపు సాగుతుందన్నారు. ఇన్ఫోసిస్, ఐబీఎం, మైక్రోసాఫ్ట్ సహ ప్రముఖ ఐటీ కంపెనీల నుంచి వచ్చిన 21 బోనాలను తమతమ కార్యాలయాల నుంచి బయలుదేరి శిల్పకళావేదిక వద్ద కలుస్తాయని, అక్కడి నుంచి భారీ ఊరేగింపుగా చిన్నపెద్దమ్మ దేవాలయానికి వెళ్లనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీటా బోనాల కమిటీ ప్రతినిధులు భాగలక్ష్మీ, వాకిటి శ్రీనివాస్‌మారి, హరిని, యామిని, మానస, దినేష్ కీర్తన, ప్రణీత్, వెంకట్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.



టీటా బోనాల ఉత్సవాలు-2025 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, సందీప్

దరఖాస్తుల ఆహ్వానం

పంజగుట్ట: గుర్తింపు ఫౌండేషన్, వ్యూవ్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ టూరిజం, సాంస్కృతిక శాఖల సహకారంతో ఆగస్టు 21న టీ హబ్‌లో 'ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ 2025' అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఆయా సంస్థల సీఈఓ కొప్పుల వసుంధర తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు.అర్హులైన వారు జూన్ 26 నుంచి జులై 27 వరకు ప్రైడ్ ఆఫ్ హైదరాబాద్ వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

నాలాలు పొంగొద్దు.. వరద ముంచెత్తొద్దు

- వరద ప్రవాహానికి ఆటంకాలు కలిగించొద్దు
- వరద ముప్పు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ పర్యటన



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నాలాలు పొంగకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు సూచించారు. నాలాలకు ఉన్న ఆటంకాలన్నీ తొలగిస్తే చాలా వరకు ముంపు సమస్య తలెత్తదన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గురువారం ఆయన పలు ప్రధాన నాలాలు, ముంపు ప్రాంతాలను పరిశీలించారు. నాలా ఆక్రమణలను ప్రత్యక్షంగా చూసి వెంటనే తొలగింపు పనులకు ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాలు పడినప్పుడు మూసీ నదీ పరీవాహకం కంటే.. ఎక్కువ కూకట్‌పల్లి, జీడిమెట్ల నాలాలే ప్రమాదకరంగా మారుతున్నాయని గుర్తించామన్నారు. ఈ రెండు నాలాలు సాఫీగా సాగకపోవడంతో భరత్‌నగర్, మూసాపేట, బాలానగర్, జింకలవాడ, దీన్‌దయాల్‌నగర్, వినాయక్‌నగర్, కల్యాణ్‌నగర్ ప్రాంతాలు నీట మునుగుతున్నాయని.. ఈ ఏడాది ముప్పు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

సగానికి పైగా నాలాలు కబ్జా..

జీడిమెట్లలోని ఫాక్స్ సాగర్ నుంచి వచ్చే వరద కాలువ ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురై కుంచించుకుపోయిన విషయాన్ని హైడ్రా కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఫాక్స్ సాగర్ అలుగు కాలువ ఆనవాళ్లే లేకుండా పోయింది. జీడిమెట్ల ప్రాంతంలో ఆ కాలువ 30 మీటర్ల వెడల్పులో ఉండగా.. కల్వర్టుల వద్ద ఉన్న వెడల్పు కాలనీలు, బస్తీలకు వచ్చేసరికి లేకుండా పోయింది. బాలానగర్ జింకలవాడ, దీన్‌దయాల్‌నగర్ కల్వర్టు కింద 22 మీటర్ల వెడల్పుతో ఉన్న నాలా.. బస్తీలకు వచ్చేసరికి 10 మీటర్లకు పరిమితమైంది. వాస్తవానికి 22 మీటర్ల వెడల్పు, నాలాకు ఇరువైపులా 9 మీటర్ల చొప్పున బఫర్‌ని కలిపి మొత్తం 40 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా 10 మీటర్లకు పరిమితమవ్వడంతోనే జీడిమెట్ల నాలా పొడవునా.. ఫతేనగర్, బాలానగర్ బస్తీలన్నీ నీట మునుగుతున్నాయని గుర్తించారు. వెంటనే జీడిమెట్ల నుంచి వచ్చే నాలాను డ్రోన్ కెమెరాతో పరిశీలించి ఆక్రమణలు తొలగించాలని అలాగే ఫాక్స్‌సాగర్ చెరువు కిందన నాలాలో పోసిన మట్టిని వెంటనే తొలగించాలని ఆదేశించారు.

నాగిరెడ్డి కుంటతో సహా ఔట్‌లెట్ నాలాల కబ్జా..

అల్వాల్ మండలం, యాప్రాల్‌లో నాగిరెడ్డి కుంటలో దాదాపు 19 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు 6 ఎకరాల వరకూ కబ్జాకు గురైందని గ్రహించారు. చెరువు గర్భంలో పోసిన మట్టిని తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాగిరెడ్డి కుంట నుంచి కాప్రా చెరువుకు వెళ్లాల్సిన వరద కాలువలు ఎక్కడికక్కడ దారి తప్పడంతో పాటు.. కబ్జాలకు గురికావడాన్ని హైడ్రా కమిషనర్ గమనించారు. కొన్ని చోట్ల నాలాలకు ఏర్పడిన ఆటంకాలను తనిఖీ చేశారు. గోల్ఫ్ ఫ్రైడ్ హోమ్స్, మల్బార్ గిన్స్ విల్లాస్, హరిప్రియనగర్, గోల్ఫ్ వ్యూ ప్యారడైజ్, స్వర్ణాంధ్ర ఫేజ్ 01, 02 ఇలా పలు గేటెడ్ కమ్యూనిటీలలో వాగులు రూటు మారడాన్ని, కొన్ని చోట్ల ఆటంకాలు ఏర్పడడాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. నాలా ఆరంభంలో ఎంత వెడల్పులో ఉందో.. కాప్రా చెరువులో కలిసే వరకూ అదే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక్కడి వివిధ కాలనీ వాసులతో త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసి.. గతంలో నాలాలు ఏ మార్గంలో వెళ్లేవి.. ఇప్పుడు వాటిని పునరుద్ధరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తామన్నారు. హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు.. యాప్రాల్‌లోని స్వర్ణాంధ్ర ఫేజ్ 01కు వరద ముప్పును తప్పించే కాలువ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేశారు. మధ్యాహ్నం పరిశీలించగా.. ఆ వెంటనే హైడ్రా సహకారంతో మల్కాజిగిరి సర్కిల్ అధికారులు పనులు ప్రారంభించి పూర్తి చేశారు.

ఫ్రిడ్జ్ పేలి గృహోపకరణాలు దగ్ధం

అమీర్‌పేట: ఫ్రిడ్జ్ పేలి ఇంట్లోని వస్తువులు కాలిపోయిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సనత్‌నగర్ రాజరాజేశ్వరీనగర్‌లో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఖమ్మం జిల్లాకు చెందిన రవి భార్య, కుమారుడితో కలిసి రాజరాజేశ్వరి నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. గురువారం ఉదయం భార్యా, భర్తలు నీళ్లు తెచ్చేందుకు కిందకు వెళ్లగా మూడో అంతస్తులోని వారి ఇంట్లో ఫ్రిడ్జ్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో పేలిపోయింది. మంటలు ఇంట్లో ఉన్న సామగ్రికి వ్యాపించడంతో కాలి బూడిదయ్యాయి. అగ్నిమాపక, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగిందా లేక ఫ్రిడ్జ్ కంప్రెషర్ పేలి ప్రమాదం జరిగిందా అనేది తెలియాల్సి ఉందని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపారు.

రబ్బర్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం



మైలార్‌దేవ్‌పల్లి: షార్ట్‌సర్క్యూట్ కారణంగా కాటేదాన్‌లోని ఓ రబ్బర్ పరిశ్రమలో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బంజారాహిల్స్‌కు చెందిన అనిల్‌సురేఖ కాటేదాన్‌లోని నేతాజీ నగర్‌లో రబ్బర్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. ఉదయం 4 గంటల ప్రాంతంలో పరిశ్రమ నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వారు రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటు చేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సకాలంలో రక్తం అందక బాలింత మృతి

మలక్‌పేట: సకాలంలో రక్తం అందక బాలింత మృతి చెందిన సంఘటన మలక్‌పేటలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలు కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..అక్బర్‌బాగ్‌కు చెందిన సురేష్ భార్య నెమలిక(21) ప్రసవం నిమిత్తం మంగళవారం మలక్‌పేట ఏరియా ఆసుపత్రిలో చేరింది. బుధవారం ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆమెకు తీవ్రరక్తస్రావం కావడంతో ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో, ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ లేనందున ఆమెను కోఠి మెటర్నిటీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. సకాలంలో వైద్యం అందనందునే నెమలిక మృతి చెందిందని ఆరోపిస్తూ ఆమె బంధువులు గురువారం ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. వందల కాన్పులు జరిగే ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

భారీగా డ్రగ్స్ పట్టివేత

ఉప్పల్: రాష్ట్ర ఈగల్ టీం అంతర్రాష్ట్ర డ్రగ్ ముఠా గుట్టును రట్టు చేసింది. రాచకొండ డ్రగ్స్ నార్కొటిక్ బృందం కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 2న ఉప్పల్ క్రికెట్ స్టేడియం పార్కింగ్ గ్రౌండ్‌లో డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఈగల్ టీం మాటు వేసింది. ఆ ప్రాంతంలో తచ్చాడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని సోదా చేయగా వారి నుంచి 200 గ్రాముల ఓజి కుష్, 32 ఎక్స్‌టసీ మాత్రలు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు రూ. 10 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా సికింద్రాబాద్ సింధీ కాలనీకి చెందిన కూరగాయల వ్యాపారి కామటం మోహిత్, మధ్యప్రదేశ్‌కు చెందిన పాత వాహనాల వ్యాపారి స్వప్నిల్ వార్తెగా గుర్తించారు. తరచూ పబ్‌లకు వెళ్లే మోహిత్ డ్రగ్స్‌కు బానిసయ్యాడు. తన అవసరాల కోసం ఆన్‌లైన్, కొరియర్ ద్వారా డ్రగ్స్ తెప్పించుకునే అతను వాటిని అవసరమైన వారికి విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో స్వప్నిల్ వార్తే మధ్యప్రదేశ్ నుంచి బస్సులో ఓజీకుష్ నగరానికి తీసుకు వచ్చి మోహిత్‌కు విక్రయించే వాడు. మంగళవారం ఉప్పల్ క్రికెట్ స్టేడియం వద్ద పార్కింగ్ గ్రౌండ్‌లో అతను మోహిత్‌కు డ్రగ్స్ అందిస్తుండగా రాచకొండ డ్రగ్స్ నార్కొటిక్ పోలీసులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ ఆపరేషన్‌లో ప్రవీణ్ కుమార్, రామ్ ప్రసాద్, ఎస్‌ఐ జీవన్ రెడ్డి, చెన్నరాయుడు పాల్గొన్నారు.

కారు ఇంజన్‌లో మంటలు



మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పక్కన భారత్ పెట్రోల్ పంపులో పెను ప్రమాదం తప్పింది. కారులో పెట్రోల్ పోయించుకుని వెళ్తుండగా మంటలు చెలరేగడంతో సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతానికి చెందిన సుదర్శన్ తన క్విడ్ కారులో షాద్‌నగర్ నుంచి వచ్చి మైలార్‌దేవ్‌పల్లిలోని భారత్ పెట్రోల్ పంపులో పెట్రోల్ పోయించుకున్నాడు. తిరిగి వెళ్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పెట్రోల్ పంపు సిబ్బంది ఫైర్ సిలిండర్లతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. దీంతో వాహనాదారులు భయాందోళనకు గురయ్యారు.

తల్లి సహకారంతో తండ్రిని హత్యచేశాడు

- మైనర్‌తోపాటు ఇద్దరి అరెస్ట్
- బాలుడు జువైనల్ హోంకు తరలింపు

నాగోలు: డబ్బులు ఇంట్లో ఇవ్వడం లేదని స్నేహితుడు (మైనర్ బాలుడి), తల్లి సహకారంతో తండ్రిని హత్య చేసిన నిందితుని, సహకరించి తల్లిని పోలీసులు గురువారం నాగోలు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్య చేసిన మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. నాగోలు ఇన్‌స్పెక్టర్ సూర్య నాయక్ తెలిపిన మేరకు... జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అశోక్ మహతా పది సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వచ్చి కాచిగూడలో జ్యూస్ పాయింట్ నిర్వహిస్తున్నాడు.మూడు సంవత్సరాల క్రితం భార్య క్రాంతి దేవి, కుమారులు రాజేందర్‌కుమార్, రాజేష్‌లను కాచిగూడకు తీసుకు వచ్చి తన సమీపంలో మరో జ్యూస్ పాయింట్ పెట్టించాడు. అందరూ కలిసి కాచిగూడలోని వీరన్నగుట్ట లో నివాసం ఉంటున్నారు. అశోక్ మహతా తను సంపాదించిన డబ్బులను తన కుటుంబ సభ్యులకు ఇవ్వకుండా తన తమ్ముళ్లకు ఇవ్వడంతో తన కుమారుడికి, భార్యకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. అశోక్ మహతా అయిదు రోజుల క్రితం తనకు తెలిసిన వ్యక్తిని పంపించి తన పెద్ద కుమారుడిని కొట్టించగా అది మనసులో పెట్టుకొని అశోక్ మహతా పెద్ద కుమారుడు రాజేందర్ కుమార్ యాదవ్, అతని భార్య క్రాంతి దేవిలు కలిసి అశోక్ మహతొను హత్య చేయాలని ప్లాన్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో అశోక్ మహతా ను జూన్ 30 న అర్ధ రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో పెద్ద కుమారుడు కొత్తపేటలోని ఉన్న టీకొంటర్ ను చూసివద్దామని చెప్పి ఒక మైనర్ బాలుడిని వెంట పెట్టుకొని తన ద్విచక్ర వాహనంపైన కొత్తపేట్ నుండి ఓఆర్ ఆర్ మార్గంలో పసుమాముల సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లారు. వెంట తెచ్చుకున్న ఐస్ ను కొట్టే బ్యాటు సహాయంతో మైనర్ బాలుడు, రాజేందర్ కుమార్ యాదవ్ కలిసి అశోక్ మహతా ను తలపై దాడి చేయడంలో తీవ్ర గాయాలతో అక్కడి కక్కడే మృతి చెందాడు. ఈనెల 1న నాగోలు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. హత్య అనంతరం భార్య, కుమారులు పరారీలో ఉండటంలో పోలీసులు వారిపై అనుమానం రావడంతో బుధవారం రాత్రి నేరస్తులను అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. హత్య చేసినట్లు హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో భార్య, పెద్ద కుమారుడు రాజేందర్‌కుమార్ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా మైనర్ బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

పోటీపడి పైరసీ చేశాడు!

- వనస్థలిపురానికి చెందిన ఏసీ టెక్నీషియన్ వ్యవహారం
- ఏడాదిన్నరలో ఏకంగా 40 సినిమాలు అక్రమంగా లీక్
- ఒక్కో చిత్రానికి 300 నుంచి 400 డాలర్ల సంపాదన
- వ్యవస్థీకృతంగా దందా చేస్తున్న 1తమిళ్‌ఎంవీ సైట్
- నిందితుడి అరెస్టు



జన కిరణ్‌కుమార్

సాక్షి, సిటీబ్యూరో: ఏడాదిన్నరగా నగరంలోని వివిధ థియేటర్లను అడ్డాగా చేసుకుని దాదాపు 40 సినిమాలను రికార్డు చేసి, పైరసీ సైట్లకు విక్రయించిన ఘరానా నిందితుడు జన కిరణ్‌కుమార్‌ను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పైరసీ చిత్రాలను అందుబాటులో ఉంచే 1తమిళ్‌ఎంవీ అనే సైట్‌లో వచ్చిన ప్రకటన చూసి పోటీపడిన ఇతగాడు ఒక్కో సినిమాకు 300 నుంచి 400 డాలర్లు క్రిప్టో కరెన్సీ రూపంలో పొందాడని పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన జన కిరణ్‌కుమార్ వనస్థలిపురంలో ఉంటూ ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. 1తమిళ్‌బ్లాస్టర్స్, 5మూవీరూల్స్, 1తమిళ్‌ఎంవీ తదితర వెబ్‌సైట్లను తరచూ సందర్శించే ఇతగాడు వాటిలో ఉన్న పైరసీ సినిమాలు చూసేవాడు. ఈ క్రమంలోనే కొన్నాళ్ల క్రితం 1తమిళ్‌ఎంవీ సైట్‌లో 'పైరసీ పోటీ'కి సంబంధించిన ప్రకటన కిరణ్ దృష్టిని ఆకర్షించింది. కొత్తగా విడుదలైన సినిమాలను వీలైనంత త్వరగా రికార్డు చేసి, దాని హెచ్‌డీ ప్రింట్‌తో కూడిన లింక్‌ను తమకు పంపిస్తే ఒక్కో సినిమాకు 300 నుంచి 400 డాలర్లు చెల్లిస్తామన్నది ఆ పోటీ సారాంశం. దీనికి ఆకర్షితుడైన కిరణ్ ప్రొటాన్ మెయిల్ ద్వారా వారిని సంప్రదించాడు. తెలుగు చిత్రాలను రికార్డు చేసి పంపిస్తానంటూ సందేశం ఇచ్చాడు. పోలీసుల నిఘాకు చిక్కకుండా ఉండటానికి టెలిగ్రాం యాప్ ద్వారా సంప్రదింపులు జరపాలని నిర్ణయించుకున్న అతను తన ఖాతా ఐడీని వారికి పంపాడు. అప్పటి నుంచి సదరు వెబ్‌సైట్ నిర్వాహకులతో ఈ యాప్ ద్వారానే సమాచార మార్పిడి చేసుకున్నాడు. వారితో ఒప్పందం కుదుర్చుకున్న కిరణ్ కొత్తగా విడుదలయ్యే చిత్రాలకు సంబంధించి మొదటి షోకే ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకునే వాడు. సెల్‌ఫోన్‌లో రికార్డింగ్ ఆన్ చేసుకుని, షర్టు జేబులో పెట్టుకున్నా పక్కాగా రికార్డు అయ్యే సీటునే ఎంపిక చేసుకునే వాడు. ఈ రకంగా ఆ సినిమా మొత్తాన్ని రికార్డు చేసి, క్లౌడ్‌లో సేవ్ చేసే కిరణ్ దాని లింక్‌ను టెలిగ్రాం యాప్ ద్వారా వెబ్‌సైట్ నిర్వాహకులకు పంపేవాడు. దీనికి ప్రతిఫలంగా నిర్ణీత మొత్తాన్ని బిట్‌కాయిన్ల రూపంలో అందుకునే వాడు. ఈ క్రిప్టో కరెన్సీని జెబ్ పే, కాయిన్ డీసీఎక్స్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో ఎక్స్ఛేంజ్ చేసుకుని రూపాయల్లోకి మార్చుకునేవాడు. ఇలా ఏడాదిన్నరలో 40 చిత్రాలు రికార్డు చేసి పైరసీ వెబ్‌సైట్‌కు అందించాడు. మే 9న విడుదలైన హ్యాష్‌ట్యాగ్ సింగిల్ సినిమానూ ఇలానే చేశాడు. ఈ చిత్రం విడుదలైన రోజే ఆయా పైరసీ వెబ్‌సైట్లలో ఈ చిత్రం హెచ్‌డీ ప్రింట్ ప్రత్యక్షం కావడంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ) స్పందించింది. దాని అంతర్భాగమైన యాంటీ వీడియో పైరసీ సెల్ ప్రతినిధి సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నమోదైన కేసును ఇన్‌స్పెక్టర్ ఎస్.నరేష్ నేతృత్వంలోని బృందం దర్యాప్తు చేసింది. సాంకేతిక ఆధారాలను బట్టి కిరణ్ కుమార్ నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుంది. పైరసీ కారణంగా గత ఏడాది తెలుగు చిత్ర పరిశ్రమ రూ.3700 కోట్లు నష్టపోయినట్లు టీఎఫ్‌సీసీ అంచనా వేసిందని, ఈ నేపథ్యంలో పైరసీ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నామని పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

వికలాంగులు, ఆసరా పెన్షన్లు పెంచాలి

హిమాయత్‌నగర్: ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని వికలాంగుల, ఆసరా పెన్షన్ దారుల పెన్షన్లు పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో ఆగస్టు 13న ఎల్‌బీ స్టేడియంలో వికలాంగుల, ఆసరా పెన్షన్ దారుల మహాగర్జన పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగా వికలాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలన్నారు. వికలాంగుల పెన్షన్లను రూ.6 వేలు, ఇతర ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు పెంచాలన్నారు. తీవ్ర వైకల్యంతో బాధపడుతున్న వికలాంగులకు రూ.15 వేల పెన్షన్ మంజూరు చేయాలన్నారు. పెన్షన్ల పెంపుదల కోసం జూలై 7న విహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాల సమర్పించనున్నట్లు తెలిపారు. జూలై 9న 33 జిల్లాల్లో విహెచ్‌పిఎస్, ఎమ్మార్పీఎస్ సంఘాల కార్యాచరణ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. జూలై 10, 11, 12వ తేదీలలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. సమావేశంలో నాయకులు ఎల్.గోపాల్ రావు, అందె రాంబాబు, సామినేని భవానీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

సికింద్రాబాద్: మానసిక సమస్యలతో బాధపడుతున్న బీటెక్ విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ పండరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, బెల్లెపల్లికి చెందిన చీర సాయిప్రకాశ్ (22) నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. కొంతకాలంగా డిప్రెషన్‌తో బాధపడుతున్న అతను బుధవారం రాత్రి చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం స్వాధీనం

కాచిగూడ: గుర్తుతెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కాచిగూడ, కృష్ణానగర్ నాలాలో గుర్తుతెలియని వ్యక్తి (45) మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫిలింనగర్ ఎస్సై దుర్మరణం

సంగారెడ్డి జిల్లా కంది మండలం చేర్యాల గేటు వద్ద ఘటన



రాజేశ్వర్ (ఫైల్)

కంది(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఎస్సై దుర్మరణం చెందాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వర్ రావు(54) సంగారెడ్డి పట్టణంలోని చాణిక్యపురి కాలనీలో నివాసం ఉంటున్నాడు. మూడు రోజులుగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో విధులు ముగించుకొని బుధవారం రాత్రి సంగారెడ్డికి కారులో బయలు దేరాడు. ఈ క్రమంలో కంది మండలం చేర్యాల గేటు వద్ద జాతీయ రహదారిపై రాజేశ్వర్ కారు ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

ఎస్సై కుటుంబంలో తీవ్ర విషాదం

రోడ్డు ప్రమాదంలో ఎస్సై అకాల మరణం చెందడంతో ఆయన కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడికి భార్య గాయత్రి తోపాటు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆరు నెలల క్రితం ఎస్సైగా ప్రమోషన్ పొందిన రాజేశ్వర్ ఫిలింనగర్‌కు వారం రోజుల క్రితమే బదిలీపై వెళ్లారు. కొత్త పోస్టింగ్‌లో చేరిన కొన్ని రోజులకే ఎస్సై మృతి చెందడం తోటి సిబ్బందిని కలచివేసింది. ఎస్సై అంత్యక్రియల్లో అదనపు ఎస్పీ సంజీవ రావు, డీఎస్పీ సత్తయ్య గౌడ్, సీఐలు క్రాంతి కుమార్, రమేష్, సంతోష్‌తోపాటు రూరల్ ఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

నేటి నుంచి లలితా పరమేశ్వరి దేవి శాకాంబరి మహోత్సవం

మోతీనగర్: మోతీనగర్ ఎక్స్‌టెన్షన్ అవంతినగర్‌లోని శివరామాంజనేయ దేవాలయంలో లలితా పరమేశ్వరి దేవి శాకాంబరి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు లలిత పరమేశ్వరి అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ, సాయంత్రం 6 గంటలకు లలిత సహస్ర నామ పూర్వక కుంకుమార్చన, శనివారం ఉదయం విశేష శాకంబరి దేవి అలంకారం, కాయగూరలు, పూలు, పండ్లతో అలంకారం, 10 గంటలకు విశేష లలిత సహస్ర నామ పారాయణం, సాయంత్రం 6 గంటలకు శరణాగతి ఉత్సవం, ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు శాకాంబరి అమ్మవారి ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



జోనల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న బండి రమేష్

కూకట్‌పల్లి: అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేసే విధంగా కృషి చేయాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ కోరారు. గురువారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌ను మూసాపేటలోని ఆయన కార్యాలయంలో కలిసి నియోజకవర్గ సమస్యలపై మాట్లాడారు. వర్షాకాలం వరదలను దృష్టిలో పెట్టుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించాలని సూచించారు.

ఖర్గే పర్యటనను విజయవంతం చేయాలి

కూకట్‌పల్లి: ఎల్‌బీ స్టేడియంలో జరగనున్న కాంగ్రెస్‌పార్టీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, పీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ పిలుపునిచ్చారు. గురువారం మూసాపేటలోని పార్టీ కార్యాలయంలో వారు సమావేశమయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే హాజరుకానున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున పాల్గొనాలని సూచించారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనుల్లో భాగంగా ఎల్లమ్మబండ పరిధిలోని మొగులమ్మ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లను గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో నూతన డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు ఇటీవలే పూర్తయ్యాయని త్వరలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు మొదలు పెట్టి యుద్ధప్రాతిపదికన పూర్తయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, జాన్, భాస్కర్, శ్రీనివాస్, ప్రదీప్, రవి, కృష్ణ, నరసింహ, ప్రసాద్, శ్యామ్సన్, విక్రమ్, వర్కు ఇన్‌స్పెక్టర్ రవికుమార్, శ్రీనివాస్, సూపర్‌వైజర్ శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చింతల్: బాలానగర్ లయన్స్ ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారని బీజేపీ నాయకుడు విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. చింతల్ డివిజన్ చంద్రానగర్‌లోని రోడ్డు నెంబరు 1 లోని 6వ వీధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. ఉచిత చెకప్‌తో పాటు అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తారని, స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.



రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ శ్రీహరిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ వాజిద్ భాష గురువారం కలిసి సన్మానించారు. కష్టపడే కార్యకర్తలకు గుర్తింపు తప్పనిసరిగా ఉంటుందన్నారు.
– మోతీనగర్

మాన్సూన్ ఎమర్జెన్సీ టీం సిద్ధం

కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో ఒక్కో డివిజన్‌కు ఒక్కో ఎమర్జెన్సీ టీం

మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలకు జీహెచ్‌ఎంసీలో కొత్తగా హైడ్రా టీం నేతృత్వం వహిస్తుంది. ఇప్పటి వరకు మాన్సూన్ విధులు నిర్వహించేందుకు జీహెచ్‌ఎంసీలోని కొన్ని శాఖల సిబ్బందితో టీంలుగా ఏర్పాటు చేసేవారు. ఈసారి ఒక్కో డివిజన్‌కు ఇద్దరు హైడ్రా సిబ్బందితో పాటు నలుగురు వర్కర్లు మూడు షిఫ్టుల వారీగా 12 మంది మాన్సూన్ ఎమర్జెన్సీ పనులు చేపట్టనున్నారు. ఎప్పటికప్పుడు వరద నీటిని సులువుగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవడానికి హైడ్రా పూర్తి స్థాయిలో బాధ్యతలు చేపట్టింది. అందులో భాగంగా గురువారం నుంచి అన్ని డివిజన్‌లకు టీంలను ఏర్పాటు చేశారు.



వరద నిలిచే ప్రాంతాలను హైడ్రా అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఇతర సిబ్బంది

- హైడ్రా ఆధ్వర్యంలో పనులు
- మూడు షిఫ్టుల్లో పని చేయనున్న సిబ్బంది

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్లలో ఉన్న కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీనగర్, అల్లాపూర్, మూసాపేట, ఫతేనగర్‌తో పాటు కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి, వివేకానందనగర్, ఆల్విన్‌కాలనీ, హైదర్‌నగర్ డివిజన్‌లకు మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లను ఏర్పాటు చేశారు. గురువారం రోజు రంగంలోకి దిగిన ఈ టీమ్‌లు వరద నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ఎప్పటికప్పుడు మ్యాన్‌హోల్స్‌ను శుభ్ర పర్చడమే కాకుండా కాల్వల్లో వరద నీరు సులువుగా వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే జీహెచ్‌డెంసీ అధికారుల ద్వారా క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగిన హైడ్రా టీం వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించాయి.

- ఈ టీంలలో ఒక్కో డివిజన్‌కు 4 మంది వర్కర్లు, మూడు షిఫ్టులలో మొత్తం 12 మంది పని చేస్తారు.
- భారీగా వరద నీరు నిలిచే చోట మోటార్ల సహాయంతో నీటిని తోడేందుకు పెద్ద పంపు సెట్లు కూడా ఈ బృందాలకు అందజేశారు.
- వర్షపు నీరు నిలిచే చోట స్టాటిక్ టీంలు కూడా రెండు షిఫ్టుల్లో పనిచేసే విధంగా కొంతమంది సిబ్బందిని నియమించారు.
- కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్స్ పరిధిలోని డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా వర్షాకాలంలో వరద నీటి పనుల్లో హైడ్రాకు సహకరిస్తారు.
- కూకట్‌పల్లి జోన్‌లో సుమారు 100 మందికి పైగా డీఆర్‌ఎఫ్ సిబ్బంది సేవలందిస్తున్నారు. షిఫ్టుల వారీగా డివిజన్‌లలో పనిచేయనున్నారు.
- డివిజన్‌లలో హైడ్రా టీం ఎమర్జెన్సీ బైక్ బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ మాన్సూన్ ఎమర్జెన్సీ ప్రాంతాలను గుర్తిస్తారు.
- ఒక్కో సర్కిల్‌లో పనులను పర్యవేక్షించేందుకు హైడ్రాకు చెందిన మార్షల్స్‌ను కూడా నియమించారు.
- ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగంతో కలిసి పనిచేసేందుకు రెండు షిఫ్టులలో మరో రెండు బృందాలను కూడా ఏర్పాటు చేశారు. చెట్ల కొమ్మలు, చెత్తను ఎత్తివేసేందుకు వీలుగా ఒక్కో షిఫ్టులో ముగ్గురు చొప్పున సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వరద నీటి కాల్వలను శుభ్రం చేసేందుకు హైడ్రా సర్వం సిద్ధం చేసింది.
- లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కోసం ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి సమన్వయంతో ముందుకు సాగే విధంగా హైడ్రా ముందుకు వెళ్తుంది.

నిరంతర సాధనతో అద్భుత ఫలితాలు సాధించవచ్చు



క్రీడా సామాగ్రిని అందజేస్తున్న పీఏసీ చైర్మన్ గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

ఆల్విన్‌కాలనీ: నిరంతర సాధనతో క్రీడల్లో అద్భుత ఫలితాలు సాధించవచ్చని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ అన్నారు. వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లోని యూత్ సభ్యులకు గురువారం వాలీబాల్, షటిల్, క్యారం బోర్డులు, చెస్ తదితర క్రీడా సామాగ్రిని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరక శ్రమతో పాటు మానసికి ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, హరినాథ్, ఎండీ ఇబ్రహీం, రాంచందర్, శ్రీనివాస్‌రెడ్డి, చంద్రమోహన్ సాగర్, లింగయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణం!

- గతంలో కూల్చివేసి హెచ్చరించిన అధికారులు
- అయినా తీరు మారని కబ్జాదారులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ రైతు బజార్ సమీపంలోని సర్వే నెంబర్ 336లో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని నిర్మించారు. గతంలో ఇదే స్థలంలో పలుమార్లు నిర్మాణం చేపట్టగా మండల అధికారులు కూల్చివేతలు చేపట్టి హెచ్చరించారు. అయినా తిరిగి కబ్జాదారులు రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణం చేశారు. గతంలో కూలిచ్చేసిన ప్రదేశంలో బుధవారం రాత్రి సగం కూలిపోయి ఉన్న గోడకు చాటుగా నిర్మాణాన్ని చేపట్టాడు. ప్రశ్నించిన స్థానికులపై దురుసుగా ప్రవర్తించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మండల అధికారులు కబ్జాలు చేసిన ప్రదేశంలో నిర్మాణాలను పూర్తి స్థాయిలో నేలమట్టం చేయాలని, తూతూ మంత్రంగా కూల్చివేయటంతో వారికి అలుసుగా మారుతోందని స్థానికులు తెలిపారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిశీలించి కూల్చివేస్తాం

సర్వే నెంబర్ 336 ప్రభుత్వ భూమి కబ్జా చేసినట్లు తమ దృష్టికి వచ్చింది. ఆ స్థలాన్ని పరిశీలించి కూల్చివేతలు చేపడతాం. ఎంతటి వారైనా ఉపేక్షించబోం. చట్టపరమైన చర్యలు తప్పవు.
– అగస్టీన్, ఆర్ఐ



15 రోజుల్లోనే ఓటర్ కార్డు అందజేత



శిక్షణలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ, బీఎల్‌ఓలు

మూసాపేట డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ

కూకట్‌పల్లి: పదిహేను రోజుల్లోని ఇంటికే ఓటర్ కార్డు వచ్చే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు కొత్త సంస్కరణలు చేపట్టిందని మూసాపేట డిప్యూటీ కమిషనర్ వంశీకృష్ణ అన్నారు. నియోజకవర్గంలో గురువారం 45 మంది బీఎల్‌ఓలకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు. అందులో 6ఏ, 7ఏ, 8ఏ దరఖాస్తు ఫారాలను నింపే ప్రక్రియతో పాటు ఓటర్ నమోదు అయిన మార్పు, చేర్పులను, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి చిరునామా మార్పు చేసుకునే వారికి ఏ విధంగా సహాయపడాలో శిక్షణ ఇచ్చారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి ఎథిక్ జనరేట్ చేసినప్పటి రోజు నుంచి పోస్టల్ ద్వారా చేరే అంత వరకు ఓటర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందించి, 15 రోజుల్లో కార్డు అందే విధంగా కొత్త సంస్కరణలు తీసుకువచ్చినట్లు వివరించారు.

కార్పొరేటర్ పరామర్శ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన సీనియర్ నాయకుడు మల్లేష్ ఇటీవల అడిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆయన ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, వాసుదేవరావు, పోశెట్టి గౌడ్, కాజా, కటికరవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



ఆల్విన్‌కాలనీ: బీజేపీ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం. రాంచందర్‌రావును గురువారం ఆయన నివాసంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉస్మానియా విద్యార్థి నాయకుడిగా విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేసి లాఠీ, తూటాలను ఎదుర్కొన్న నాయకుడని గుర్తు చేశారు. అనేక ఉద్యమాలు సాగించి ఎమ్మెల్సీగా గెలిచి తెలంగాణలో ఉన్న యువజన సమస్యలపై గళమెత్తారన్నారు. అదే విధంగా న్యాయవాదిగా పార్టీ కార్యకర్తలకు అండదండగా నిలిచారని తెలిపారు.

హెచ్‌సీయూ విద్యార్థికి ఎఫ్ఆర్‌టీ స్కాలర్‌షిప్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థికి అరుదైన అవకాశం లభించింది. విద్యార్థి ప్రణవ్ ఆస్ట్రేలియాలోని కాన్‌బెర్రాలోని ఆస్ట్రేలియన్ నేషనల్ యూనివర్సిటీ (ఏఎన్‌యూ)లో 11 వారాల ఫ్యూచర్ రీసెర్చ్ టాలెంట్(ఎఫ్ఆర్‌టీ) ప్రోగ్రామ్‌కు ఎంపికయ్యారు. హెచ్‌సీయూలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంఏ. ఎకనామిక్స్ చదువుతున్నారు. ఈ ప్రాజెక్టు అగ్రశ్రేణి భారతీయ సంస్థల నుంచి అత్యుత్తమ విద్యార్థులలో పరిశోధన సహకారం, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది.

సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ సబిహా బేగం

మోతీనగర్: సీసీ రోడ్డు పనులు సత్వరమే పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ రాజీవ్ గాంధీ నగర్‌లో సీసీ రోడ్డు పనులను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారి అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారి రంజిత్, మేడ్చల్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు గౌసుద్దీన్, అస్లాం, సలీం తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

సమస్యలను సకాలంలో పరిష్కరించాలి

కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్

ఓల్డ్ బోయిన్‌పల్లి: ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పరిష్కరించాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. గురువారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో తాగునీరు సరిపడా సరఫరా చేయాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. దీంతో ఆయన అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో రాములు, యాదగిరి, చంద్రం, నరసింహ, జయమ్మ, గంగమణి, ప్రమీల, కమల, గణేష్, మోహన్, బాలయ్య, శ్యామ్, మైపాల్‌రెడ్డి, మట్టి శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో యువకుడు రిమాండ్

గచ్చిబౌలి: బావపై బ్లేడ్‌తో దాడి చేసిన బావమరిదిని రిమాండ్‌కు తరలించారు. గచ్చిబౌలి పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గౌలిదొడ్డిలోని బసవతారకనగర్‌లో నివాసం ఉండే కొమిరి రామకృష్ణను అతని కొడుకు కొమిరి శంకర్(19) తరచుగా కొడుతుండటంతో రామకృష్ణ హెచ్‌సీయూ వద్ద ఉండే తన అల్లుడు గిరికి విషయం చెప్పాడు. దీంతో గిరి జూలై 1న సాయంత్రం 7.30 గంటలకు అత్తవారి ఇంటికి వచ్చాడు. తండ్రిని బాగా చూసుకోవాలని బావ గిరి సర్ది చెప్పేందుకు ప్రయత్నించగా బ్లేడ్‌తో మెడపై గాయపరచడంతో తీవ్ర రక్తస్రావం అయ్యింది. వెంటనే స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా 11 కుట్లు పడ్డాయి. ఆస్పత్రి నుంచి తిరిగి వచ్చిన గిరి బుధవారం తన బావమరిది శంకర్ తనను చంపేందుకు ప్రయత్నించాడని గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు శంకర్‌ను గురువారం రిమాండ్‌కు తరలించారు.

రైలు రోకోకు మున్నూరుకాపు పటేల్ సంఘం మద్దతు



నిజాంపేట్: జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను గురువారం మున్నూరు కాపు పటేల్ సంఘం సభ్యులు కలిసి మద్దతు తెలిపారు. బీసీ 42శాతం రిజర్వేషన్ కోసం కేంద్రంపై ఒత్తిడి చేయడం కోసం జులై 17న రైలు రోకోకు కవిత పిలుపునిచ్చారు. ఈ పిలుపునకు మున్నూరు కాపు పటేల్ సంఘం పూర్తి మద్దతు తెలియజేస్తుందని నాయకులు తెలిపారు. చంద్రగిరి సతీష్, మున్నూరు కాపు పటేల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ పటేల్, మేడ్చల్ జిల్లా మున్నూరు కాపు ఉపాధ్యక్షులు గందం శ్రీను పటేల్, బిక్షపతి, మేడ్చల్ జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, సునీల్ పాల్గొన్నారు.

విద్యార్థి నాయకుడికి కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వాలి

బాలానగర్: తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంని జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి సంఘాల ప్రతినిధులు గురువారం కలిశారు. జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి సంఘాలు అన్నీ కలిసి చేసిన తీర్మానం కాపీని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్ చైర్మన్‌గా జేఎన్‌టీయూహెచ్ విద్యార్థి నాయకుడు డా. శాడగొండ కరుణాకర్‌రెడ్డికి ఇప్పించే విధంగా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అంబటి విశ్వజ్ఞ, అశోక్ గౌడ్, భాను ప్రకాష్ నాయక్, ఎర్రవల్లి జగన్, తిరుపతి తేజ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి తీర్మానం కాపీని అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్లాస్టిక్‌ను నివారిద్దాం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మూసాపేట: మూసాపేటలోని శ్రీహరినగర్‌లోని కిడ్డీ మౌంట్ లిటెరా పాఠశాలలో గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణ దినాన్ని నిర్వహించారు. విద్యార్థులు ప్లాస్టిక్ వాడకూడదు అని, పేపర్ బ్యాగ్‌లు, జూట్ బ్యాగులు ఉపయోగించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పేపర్ బ్యాగులు చేతపట్టి శ్రీహరి నగర్‌లోని వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రావణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి

ఓల్డ్ బోయిన్‌పల్లి: టీబీ రహిత తెలంగాణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హస్మత్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎలిజా కెనడీ అన్నారు. గురువారం టీబీ ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా హస్మత్‌పేట మోడల్ మార్కెట్‌లో ఏఐ ఎక్స్‌రే ద్వారా 145 మందికి స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. వ్యాధి సాధారణ లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



టీబీపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది

చదువు చెబుతూ.. శిక్షణ ఇస్తూ..

ఉపాధికి బాటలు వేస్తున్న ఎఫ్‌డీడీఐ క్యాంపస్

రాయదుర్గం: దక్షిణాదిలో ఫుట్‌వేర్ రంగంలో ఉన్నత విద్యాసంస్థగా ఎదిగిన ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)–హైదరాబాద్ క్యాంపస్ నేడు ఉత్తమ శిక్షణకు చిరునామాగా మారింది. కళాకారులు, ఇతరులకు నైపుణ్యాలను నేర్పించడానికి దశలవారీగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్. తేజ్‌లోహిత్‌రెడ్డి నాయకత్వంలో రక్షణశాఖ ఉద్యోగులకు సైతం శిక్షణ ఇచ్చి తమ సత్తాను చాటారు. మరిన్ని శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తాజాగా రక్షణశాఖ ఉద్యోగులకు సర్టిఫికెట్ కోర్సు

- ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్, రక్షణ శాఖలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ ఆధ్వర్యంలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్(డీజీఆర్) పర్యవేక్షణలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు సర్టిఫికెట్ కోర్స్ ఇన్ రిటైల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



- విశ్రాంత ఉద్యోగులు 22 మందిని ఎంపిక చేసి వారికి రాయదుర్గం ఎఫ్‌డీడీఐలో శిక్షణ ప్రారంభించారు.
- రోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు శిక్షణ ఇస్తారు.
- ముఖ్యంగా వినియోగదారులకు అందించాల్సిన సేవలు, అమ్మకాల పద్ధతులు, మెళకువలను నేర్పిస్తున్నారు.

చెప్పులు, షూ తయారీపై శిక్షణ

- కేంద్ర ప్రభుత్వ ఆదేశంపై ఎఫ్‌డీడీఐ, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్(కేవీఐసీ) సంయుక్తంగా చర్మకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు
- మూడు విడతలలో 25 రోజులపాటు శిక్షణ ఇచ్చారు
- శిక్షణలో అనేక మెళకువలను నేర్చుకున్నామని చర్మకారులు పేర్కొన్నారు

మహిళలకూ నేర్పేందుకు..

- మహిళలు స్వయం సంవృద్ధి బాట పట్టేలా శిక్షణ ఇవ్వాలని ఎఫ్‌డీడీఐ భావిస్తోంది.
- జనపనారతో రకరకాల బ్యాగులు, చెప్పులు, టోపీల తయారీపై మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని సంకల్పించినట్లు డాక్టర్ రాంబాబు వివరించారు. –మహిళలు సిద్ధంగా ఉంటే శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తామన్నారు.

సాక్షి సిటీ ప్లస్
6
హైదరాబాద్‌ శుక్రవారం
4 జూలై 2025

యాంత్రిక జీవితంలో నుంచి నగరవాసుల సాయంత్రాలు నవ్వులతో నిండుతున్నాయి. నగరంలోని అనేక గ్యాలరీలు, థియేటర్లు, కేఫ్స్‌.. ఇలా ప్రతీ చోటా వారాంతపు దినాలు నవ్వులతో ప్రతిధ్వనిస్తున్నాయి. నవ్వు నలభై విధాలుగా రైటంటూ నగరం నలుచెరగులా కామెడీ ఈవెంట్స్‌ విస్తరిస్తున్నాయి. ఉరుకుల పరుగుల జీవితంలో మనసారా నవ్వుకుని ఎంతకాలమైందో.. ఇలా భావించని ఆధునికులు అరుదే.. నవ్వును మించిన దివ్య ఔషధం లేదని ఓ వైపు సైకాలజిస్ట్‌లు చెబుతున్నారు. అయితే నవ్వాలంటే చుట్టుపక్కల పరిసరాలు మర్చిపోవాలి. మనకు పరిచయం లేని పరిసరాల్లో లీనమైపోవాలి. రోజువారీ ఆలోచనలకు చెల్లుచీటి ఇవ్వాలి. అవును.. అందుకే అలాంటి వేదికలు ఇప్పుడు నగరవాసులకు అందుబాటులోకి వచ్చాయి. వారాంతపు రోజులైన శుక్ర, శని, ఆదివారాల్లో నగరంలోని పలు కేఫేలు, కల్చరల్‌ స్పేసులు కామెడీ ప్రదర్శనలకు వేదికగా మారాయి.

– సాక్షి, సిటీబ్యూరో



మనసారా.. నవ్వేద్దాం..

వినోదం అదే నగరవాసికి ప్రమోదం

- హాస్య కార్యక్రమాల కోసం ఆరాటం
- నగరంలో ఇబ్బడి ముబ్బడిగా కామెడీ క్లబ్స్‌
- ఒత్తిడికి విరుగుడు మార్గం అంటున్న సైకాలజిస్టులు
- వేర్వేరు నగరాలకు చెందిన కమెడియన్లకు రెడ్‌ కార్పెట్‌



బంజారాహిల్స్‌, గచ్చిబౌలి తదితర ప్రదేశాల్లో ప్రతివారం నిర్వహించే వివిధ కామెడీ షోలకు నగరవాసులు హాజరై హాయిగా నవ్వుకుంటున్నారు. పాప్‌ కల్చర్‌, రోజువారీ జీవితంలోని చిన్న సంఘటనలు, ట్రావెల్‌ ఎక్స్‌పీరియెన్స్‌లు, రిలేషన్‌షిప్స్‌ వంటి అంశాలను హాస్యాత్మకంగా వివరించే స్టాండ్‌–అప్‌ ఆర్టిస్టులు యువతను ఆకట్టుకుంటున్నారు. నగరంలో ఈ ట్రెండ్‌ బాగా ఊపందుకోవడంతో ముంబై, బెంగళూరు, ఢిల్లీ వంటి మెట్రో నగరాల నుంచి కూడా పాపులర్‌ స్టాండ్‌–అప్‌ కమెడియన్లు వస్తున్నారు. అలా తరచూ నగరాన్ని సందర్శిస్తున్నవారిలో సౌరవ్‌ ఘోష్‌(ముంబై), నవీన్‌ రిచర్డ్‌(బెంగళూరు), సీతాలక్ష్మి కృష్ణన్‌(చెన్నై), ఆకాశ్‌ గుప్తా, అభిషేక్‌ ఉపమాన్యు వంటి నేషనల్‌ స్టార్‌ కమెడియన్లు ఉన్నారు.

లోకల్‌ కూడా హల్‌చల్‌..

స్థానిక కమెడియన్లకు కూడా ఈ ట్రెండ్‌ అవకాశాలను అందిస్తోంది. కొత్త టాలెంట్‌కు ఓపెన్‌ మైక్స్‌ రూపంలో అవకాశాలు లభిస్తున్నాయి. అనిల్‌ వుండేటి, మానస్‌ మిత్ర, నవీన్‌ అబ్బినేని, పల్లవి సింగ్‌ లాంటి హైదరాబాదీ కమెడియన్లు మంచి ఫాలోయింగ్‌ సంపాదించుకుంటున్నారు. నగరంలో వేగంగా పెరుగుతున్న ఈ కామెడీ ట్రెండ్‌ ద్వారా పేరొందిన ఆర్టిస్టుల్లో హాస్యాన్ని తేలిక పాటి హ్యూమర్‌తో వ్యక్తీకరించే అనిల్‌ వుండేటి, సోషల్‌ సిట్యుయేషన్స్‌, తెలుగు–ఇంగ్లిష్‌ మిక్స్‌ హాస్యంలో ప్రావీణ్యంతో అలరించే మానస్‌ మిత్ర, ఫుల్‌ టిఫ్ఫి యూట్యూబ్‌ కమెడియన్‌గా కూడా గుర్తింపు పొందిన శివమణి, ఓపెన్‌ మైకుల్లో ప్రసిద్ధి పొందిన వాణిజ్య కామెడీ కళాకారుడు వెంకట్‌ రామ్‌, మహిళా కామెడీ వాయిస్‌ని కొత్తగా పరిచయం చేసిన స్టాండ్‌–అప్‌ ఆర్టిస్ట్‌ పల్లవి సింగ్‌ వంటివారు ఉన్నారు.

నగర నవ్వుల వేదికలు ఇవే..

స్టాండప్‌, స్కెచ్‌కామెడీ, స్ట్రీట్‌ కామెడీ.. వంటివి అందిస్తూ జూబ్లీహిల్స్‌లోని హాఫ్‌ పింట్‌, గచ్చిబౌలిలోని కేఫ్‌ కామెడీ అలాగే తెలుగు, ఇంగ్లిష్‌ రెండింటిలోనూ షోలు నిర్వహించే గచ్చిబౌలిలోని రం గ్‌భూమి స్పేసెస్‌ మిమిక్రీ యాక్ట్స్‌కి పేరొంది, యువతకు నచ్చే కామెడీ ప్లేస్‌గా మారింది. స్టాండప్‌ ప్లస్‌ ఇంప్రూవ్‌ కామెడీ, కార్పొరేట్‌ అర్బన్‌ హ్యూమర్‌కు హైటెక్‌ సిటీలోని ఫినిక్స్‌ ఎరీనా చిరునామా. అలాగే మాదాపూర్‌లోని కామెడీ థియేటర్‌ ప్రత్యేకంగా స్టాండ్‌–అప్‌ కామెడీకి అంకితమై నేషనల్‌ కమెడియన్ల షోలకు పేరొందింది. వీటిలో టికెట్‌ షోలకు ముందుగానే బుక్‌ చేసుకుంటే డిస్కౌంట్స్‌ కూడా లభిస్తాయి. అలాగే లమాకాన్‌, ఫీనిక్స్‌ అరేనా వంటి కొన్ని వేదికలలో ఫ్రీ ఎంట్రీతో షోలు కూడా ఉంటాయి.



డిజైర్‌ డిజైన్‌ ఎగ్జిబిషన్‌ అదుర్స్‌

గచ్చిబౌలి: డిజైర్‌ డిజైన్‌ ఎగ్జిబిషన్‌ అదుర్స్‌ అనిపించింది. ప్రముఖ మోడల్స్‌ ఈ డిజైర్‌ డిజైన్‌ ఎగ్జిబిషన్‌లో సందడి చేశారు. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్‌ సెంటర్‌లో డిజైర్‌ డిజైన్‌ ఎగ్జిబిషన్‌ గురువారం ప్రారంభమైంది. ప్రముఖ మోడల్స్‌ ఫ్యాషన్‌ లవర్స్‌ ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మూడు రోజులపాటు సాగే ఈ ఎగ్జిబిషన్‌లో టాప్‌ డిజైనర్స్‌ రూపొందించిన షోకేజింగ్‌ ఫ్యాషన్‌ వియర్‌, జువెల్లరీ వెడ్డింగ్‌ వియర్‌, శారీస్‌ ప్రదర్శనకు ఉంచారు. సందర్శకులు రకరకాల చీరలను తిలకించి మైమరిచి పోయారు.



ట్రెండ్‌.. చక్కెర లేని స్వీట్‌..

సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు పేరొందిన బ్రాండ్‌గా, చక్కెర, మైదా, గ్లూటెన్‌ ఇతర నిల్వకారకాలు లేకుండా తయారైన డిజర్ట్స్‌ను తమ మెనూలో అందిస్తున్నట్లు యమ్మీ బీ బ్రాండ్‌ నిర్వాహకులు సందీప్‌ జంగాల తెలిపారు. నగరంలోని ఖాజాగూడలో తమ కొత్త కేఫ్‌ను ఏర్పాటు చేసిన సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొంత కాలంగా ఆరోగ్యకరమైన ఉత్పత్తులకు నగరవాసుల ఆదరణ బాగా పెరిగిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పదార్థాల ఎంపిక నుంచి సీటింగ్‌ ఏర్పాట్ల వరకు ప్రతీదీ శ్రద్ధగా తీర్చిదిద్దుతున్నామన్నారు.



5న ఫారెస్ట్‌ టెక్‌ పార్కులో నేచర్‌ క్యాంపు

గచ్చిబౌలి: తెలంగాణ ఫారెస్ట్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో మంచిరేవులలోని ఫారెస్ట్‌ ట్రెక్‌ పార్కులో నేచర్‌ క్యాంప్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కార్పొరేషన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఎకోటూరిజమ్‌ రంజిత్‌నాయక్‌ తెలిపారు. ఈ నెల 5వ తేదీన సాయంత్రం 5 గంటల నుంచి ఆదివారం ఉదయం 9.30 గంటల వరకు నేచర్‌ క్యాంప్‌ ఉంటుందన్నారు. ఇందులో టీమ్‌ బిల్డింగ్‌, టెంటు పిచింగ్‌, రాత్రిపూట అడవిలో నడక, నైట్‌ క్యాంపింగ్‌, ఉదయం బర్డ్‌ వాచింగ్‌, ట్రెక్కింగ్‌ వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. నేచర్‌ క్యాంప్‌లో పాల్గొనే వారికి 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచితంగా, మిగతావారికి రూ.1,199 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌: 73823 07476, 94935 49399.



తియ్యటి వేడుక

- సరికొత్త డెజర్ట్‌ మెనూ పరిచయం చేసిన బర్మా బర్మా
- వినూత్నంగా బర్మీస్‌ టచ్‌తో క్లాసిక్‌ డెజర్ట్‌ల రుచి
- వావ్‌ అనిపించే కస్టర్డ్‌లు, గెలాటోలు, చెర్రీ సార్బెట్‌
- సిటీలో సరికొత్తగా 'ఫ్లేవర్‌ బకెట్‌' స్వీట్‌

సాక్షి, సిటీబ్యూరో: సరికొత్త రుచులను ఆస్వాదించడంలో నగరంలోని ఫుడ్‌ లవర్స్‌ ముందుంటారు. ఈ ఆదరణకు అనుగుణంగానే కాంటినెంటల్‌ మొదలు స్థానిక సమ్మిళిత రుచులు సిటీకి హాయ్‌ చెబుతుంటాయి. ఇందులో భాగంగానే నగరంలో బర్మీస్‌ వెజ్‌ క్యూసిన్‌కు పేరొందిన బర్మా బర్మా ఆధ్వర్యంలో 'ది స్వీట్‌ లైఫ్‌' పేరుతో సరికొత్త డెజర్ట్‌ మెనూ, క్లాసిక్‌ డెజర్ట్‌లను బర్మీస్‌ టచ్‌తో వినూత్నంగా ఆవిష్కరిస్తోంది. ఈ స్వీట్‌ మెనూ కళాత్మకమైన ప్లేటింగ్‌, కొత్తగా ఆవిష్కరించిన టెక్చర్లు, రంగురంగుల ఫలాల ఆధారిత కాంబినేషన్లకు మేళవింపుగా నిలుస్తోంది.





తీపి కోణంలో ఓ కొత్త ప్రయోగం..

హైదరాబాద్‌కు బర్మీస్‌ రుచులను పరిచయం చేసిన బర్మా బర్మా ఇప్పుడు వంటకాల్లో కాకుండా డెజర్ట్‌ లెవెల్లోనూ సరికొత్త ప్రయోగంతో ఆకట్టుకుంటోంది. 'ది స్వీట్‌ లైఫ్‌' మెనూలోని ఏడు ప్రత్యేకమైన డెజర్ట్‌లు నోరూరిస్తున్నాయి. బర్మీస్‌ పదార్థాలు, ఫలాల ఆధారిత సాస్‌లు, గెలాటో, చాక్లెట్‌ షెల్స్‌, కాంపోట్స్‌ వంటి అంశాలతో ఆధునికంగా తయారు చేస్తున్నారు. కస్టర్డ్‌లు, గెలాటోలు, లేదా చెర్రీ సార్బెట్‌లకు ప్రాముఖ్యత ఇచ్చే వారికి ఓ ప్రత్యేక అనుభవాన్ని ఇస్తుంది.

ఫుడ్‌ మూడ్‌తో.. హ్యాపీ మూడ్‌కు..

డెజర్ట్‌ అనేది కేవలం ఇష్టంగా తినేది మాత్రమే కాదు, ఇదొక భావోద్వేగం, ఓ జ్ఞాపకం, ఓ సంతోష క్షణం కావాలి. ఈ మెనూ అలాంటి అనుభూతిని అందించడానికే రూపొందించబడింది.

– అంకిత్‌ గుప్తా, బర్మా బర్మా సహ వ్యవస్థాపకులు.

సిటీ ఫుడ్‌ లవర్స్‌కు టేబుల్‌పైనే డెసర్ట్‌ షో..

ఈ డెజర్ట్‌లలో కొన్ని టేబుల్‌ సైడ్‌ సర్వింగ్‌తో కనువిందు పండగలా తలపిస్తోంది. ఇందులో భాగంగా సెలబ్రేషన్స్‌ కేక్‌ ఏడుసార్లు చాక్లెట్‌ లేయర్స్‌, చెర్రీ సార్బెట్‌, టేబుల్‌ సైడ్‌లో పులకరిస్తూ పోసే మెల్టింగ్‌ చాక్లెట్‌తో.. ఒక స్పెషల్‌ సెలబ్రేషన్‌కు తగ్గట్టు తయారు చేసిన డెజర్ట్‌. కిమిల్క్‌ టీ చీస్‌ కేక్‌, బస్క్‌ స్టైల్‌ చీజ్‌ కేక్‌లో బర్మీస్‌ మిల్క్‌ టీ(లఫెట్‌ యే)తో, వేడి ఆపిల్‌ కంపోట్‌, దాల్చిన చెక్క ఐస్‌క్రీమ్‌తో ఇంతకు ముందు ఎన్నడూ చూడని రుచిని పరిచయం చేస్తోంది.



చినుకులు.. జాగ్రత్త

- ముసురేసిన సిటీ.. చిట్కాలు తప్పనిసరి
- దీర్ఘకాలిక వ్యాధులున్నవారు బీ కేర్‌ ఫుల్‌



సాక్షి, సిటీబ్యూరో: వర్షాల సీజన్‌ మొదలైంది.. ఈ నెలంతా పుష్కలంగా వానలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతోంది. నగరంలో సీజన్‌ వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో నగరానికి చెందిన పల్మనాలజిస్ట్‌ డా.నళినీ నాగళ్ల పలు సూచనలు చేస్తున్నారు.



- వర్షాకాలంలో తరచూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. తడవకుండా చూసుకోవాలి. వర్షంలో తడిచిన వెంటనే పొడి బట్టలు ధరించాలి. జలుబు దగ్గు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించాలి.
- ఫ్లూ వ్యాక్సిన్‌, నిమోనియా వ్యాక్సిన్‌ తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఇంటి వాతావరణం ఎప్పుడూ పొడిగా ఉండేలా, వెంటిలేషన్‌ బాగా ఉండేలా చూడాలి. వీలున్నంత వరకూ వేడి ద్రవపదార్థాలు తీసుకోవాలి.
- ప్రతిరోజూ కనీసం తేలికపాటి వ్యాయామాలైనా చేయాలి. దీని వల్ల లంగ్‌ కెపాసిటీ పెరుగుతుంది. మానసిక ఆరోగ్యం మెరుగవుతుంది. పోషకాహారం, మంచి నిద్ర అవసరం.
- ఆస్తమా వంటి వ్యాధులు ఉన్నవారు ధూమపానం పూర్తిగా మానేయాలి. అలాగే హై ఫీవర్‌, ఎడతెరపి లేని దగ్గు, మత్తుగా ఉండటం, నాలుక నీలిరంగుకు తిరగడం, ఆక్సిజన్‌ స్థాయిలు 92కన్నా తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి.
- వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలు ఉన్నవారికి నిమోనియా వచ్చే అవకాశం ఉంటుంది. బయటకు వెళ్లినప్పుడు మాస్క్‌ ధరించడం మంచిది.

ఆకృతి ఎక్స్‌పో ప్రారంభం




సాక్షి, సిటీబ్యూరో: విభిన్న రకాల ఫ్యాషన్‌ ఉత్పత్తులు, దుస్తులు, యాక్సెసరీస్‌ను అందుబాటులోకి తెచ్చే ఆకృతి ఎక్స్‌పో బంజారాహిల్స్‌లోని హయత్‌ ప్యాలెస్‌ హోటల్‌లో ఏర్పాటైంది. దీనిని గురువారం ఎక్స్‌పో నిర్వాహకులు శశినెహతా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 3 రోజుల పాటు కొనసాగే ఈ ప్రదర్శనలో దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన బ్రాండ్స్‌, చేనేత, హస్తకళ కళాకారుల ఉత్పత్తులు పెద్ద సంఖ్యలో కొలువుదీరాయన్నారు.

టయోటా మాన్‌సూన్‌ కేర్‌ రెడీ

సాక్షి సిటీబ్యూరో: వర్షాల సీజన్‌ పురస్కరించుకుని ప్రముఖ ఆటోమొబైల్‌ బ్రాండ్‌ టయోటా కిర్లోస్కర్‌.. మాన్‌సూన్‌ కేర్‌ సర్వీసెస్‌ను నగరవాసులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ విషయాన్ని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సీజన్‌లో వాహనాలు ఎదుర్కొనే ఇబ్బందులకు ముందస్తుగా సిద్ధం చేయడంతో పాటు వాహన యజమానులకు అవగాహన కలిగించడం కోసం ఈ టయోటా సర్వీస్‌ క్యాంపెయిన్‌ నిర్వహిస్తున్నామన్నారు. వాహన యజమానులు తమ డీలర్‌ వద్ద సేవలు పొందవచ్చన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.



వెలుగు జిలుగుల తుంగభద్ర

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో తుంగభద్ర జలాశయం నిండు కుండలా మారింది. ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరుకోవడంతో గురువారం 20 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. డ్యాం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పెద్ద సంఖ్యలో జనం అక్కడికి చేరుకుని తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు





ప్రకృతి సౌందర్యం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈదులపాలెం నుంచి దేవాపురం వెళ్లే ఘాట్ మార్గంలో మేఘాలు కొండలను ముద్దాడుతూ.. పాల సముద్రాన్ని తలపించాయి. అబ్బురపరిచే ఈ ప్రకృతి అందాలు చూపరులకు ప్రత్యేక అనుభూతిని కలిగించాయి.

ఓవైసీ వాస్తవాలు చెబితే టీడీపీ ఉలికిపడుతోంది

ముస్లిం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మునీర్ అహ్మద్



సాక్షి, అమరావతి: కర్నూల్‌లో ముస్లిం పర్సనల్ లా బోర్డు ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ వాస్తవాలు చెబితే టీడీపీ ఉలికిపడుతోందని, ఆయనపై టీడీపీ నేత ఎంఏ షరీఫ్ విమర్శలు చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) రాష్ట్ర కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్ అన్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు సభను వైఎస్సార్‌సీపీ సభ అంటూ షరీఫ్ విమర్శలు చేయడం తగదని మునీర్ గురువారం హితవు పలికారు. దేశంలోని ముస్లిం సమాజ హితాన్ని దెబ్బతీసేలా కేంద్రం వక్ఫ్ చట్ట సవరణ చేసిందని, అందుకు టీడీపీ మద్దతు పలికిందని గుర్తు చేశారు. సీఏఏ, ఎన్ఆర్సీ, యూసీసీ వంటి బిల్లులు మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నాయన్నారు. ముస్లిం సమాజాన్ని దెబ్బతీసే ప్రయత్నాలకు టీడీపీ ఊతమిస్తోందని, ముస్లింలకు వైఎస్సార్‌సీపీ అండగా నిలబడిందన్నారు. ఈ విషయాలన్నీ తెలిసిన షరీఫ్.. ముస్లిం సమాజ శ్రేయస్సును విడనాడి, టీడీపీ కోసం ఒవైసీపై విమర్శలు చేయడం అవకాశవాదమవుతుందన్నారు.

పాస్టర్ చింతాడ ఆనంద్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఆగస్టు 12నకు వాయిదా వేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: క్రైస్తవ మతం స్వీకరిస్తే.. ఎస్సీ హోదా వర్తించదనే హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ ఉమ్మడి గుంటూరు జిల్లా పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెంకు చెందిన మత ప్రబోధకుడు చింతాడ ఆనంద్ వేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. ఆగస్టు 12న దీనిపై విచారణ చేపట్టనున్నట్లు గురువారం తెలిపింది. తనను కులం పేరుతో కొందరు దూషించి, దాడి చేసి గాయపరిచారంటూ 2021లో చందోలు పోలీస్ స్టేషన్‌లో పాస్టర్ ఆనంద్ ఫిర్యాదు చేశారు. అయితే ఆనంద్ పదేళ్లుగా పాస్టర్‌గా ఉన్నారని, క్రైస్తవ్యం స్వీకరిస్తే ఎస్సీ కులస్తులుగా పరిగణించరాదు కాబట్టి తమపై నమోదైన ఎస్సీ,ఎస్టీ కేసు కొట్టేయాలని నిందితులు హైకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ వాదనల అనంతరం క్రైస్తవ్యం స్వీకరిస్తే ఎస్సీ హోదాను కోల్పోతారని హైకోర్టు స్పష్టం చేసింది. దీనిని సవాల్‌చేస్తూ ఆనంద్ మే 14న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ గురువారం జస్టిస్ సుందరేష్, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు రాగా.. కేసు విచారణను ఆగస్టు 12కు న్యాయమూర్తులు వాయిదా వేశారు.

బదిలీల్లో అవకతవకలపై రీ కౌన్సెలింగ్ నిర్వహించాలి

సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్): గ్రామ/వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలపై విచారణ జరిపి, రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. విజయవాడ ఆటోనగర్‌లోని సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్‌కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బదిలీల ప్రక్రియలో జీఓ నం.05ను అనుసరించకుండా, ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం అన్యాయమన్నారు. సమస్యను విన్నవించుకోడానికి ప్రత్యేక గ్రీవెన్స్ ఫోన్ నంబర్ ఏర్పాటు చేయాలని కోరారు. అనంతపురం, ధర్మవరం పట్టణాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులను రూల్ ఫాలో అవ్వకుండా కదిరి మున్సిపాలిటీకి బదిలీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, సంయుక్త కార్యదర్శి పార్థా మధు, కార్యవర్గ సభ్యులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కోనసీమ.. అభి'నందనం'

ఉద్యాన పంటలు భేష్

- అరుదైన ఎర్ర చక్కెరకేళీ సాగులో అగ్రస్థానం
- 'పాన్'కు పెట్టింది పేరు సీమ తమలపాకు
- కేరళను మించిన 'వక్క'
- ఘనా దేశానికి దీటుగా కోకో గింజలు
- గూడపల్లి మామిడికి యమ క్రేజ్



సాక్షి, అమలాపురం: ఉద్యాన పంటల సాగులో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడ పండే ఉద్యాన పంటలకు దేశవ్యాప్తంగా గిరాకీ ఉంది. ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులైతే ఇక్కడ పంటల కొనుగోలుకు అమిత ఆసక్తి చూపుతారు. పంటల సాగులో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతోపాటు రుచిలోనూ మైమరిపించడమే దీనికి కారణం.



రావులపాలెం మండలం గోపాలపురంలో తమలపాకు తోటలు

అను 'పాను' తెలుసు

కోనసీమ నుంచి వెళ్తున్న తమలపాకును ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల్లో కిళ్లీల తయారీలో ఎక్కువగా వినియోగిస్తారు. ఆనుపానులు తెలుసుకుని ఇక్కడ రైతులు పండించే తమలపాకు రుచి బాగుంటుందని ఉత్తరాది వ్యాపారులు చెబుతుంటారు. జిల్లాలోని పి.గన్నవరం, రావులపాలెం, అయినవిల్లి మండలాల్లో సుమారు 240 ఎకరాల్లో ఈ పంట పండుతోందని అంచనా. ఇప్పుడు పశ్చిమ గోదావరి నుంచి వచ్చే ఆకుతో కలిపి రోజుకు ఒక లారీ వరకు ఎగుమతి జరుగుతున్నట్టు వ్యాపారులు చెబుతున్నారు.



పనస కాయలు

పనస.. 'ఫల'ప్రదం

పనస సాగుకూ కోనసీమ పెట్టింది పేరు. మార్చి నుంచి జూలై వరకూ పనస సీజన్. ఒక్కో చెట్టుకు 50 నుంచి 100కు పైగా కాయలు వస్తాయి. జిల్లావ్యాప్తంగా కొబ్బరిలో అంతర పంటగా సుమారు 100 ఎకరాల్లో సాగవుతుందని అంచనా. అంబాజీపేట కేంద్రంగా ఏటా రూ.కోటి విలువైన పనస కాయలు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంటాయి.

ఆశ్చర్య 'పోక' తప్పదు

కోనసీమలోని అంబాజీపేట, పి.గన్నవరం, అయినవిల్లి, కొత్తపేటతోపాటు మండపేట మండలం ద్వారపూడి ప్రాంతంలో సుమారు 386 ఎకరాల్లో పోక (వక్క) సాగు జరుగుతోంది. కొబ్బరి తోటల్లో అంతర పంటగా, తోటల చుట్టూ గట్ల మీద ఈ పంట సాగవుతోంది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశాకు పోక ఎగుమతి అవుతోంది. పోక విస్తృతంగా పండే కేరళను మించి ఇక్కడ వక్క సాగవుతుందంటే ఆశ్చర్యపోక తప్పదు. ఎర్ర చెక్కల (పూజా సుపారీ) తయారీ ఇక్కడి ప్రత్యేకత.



రవాణాకు సిద్ధంగా ఎండబెట్టిన పోక



ప్రపంచ ఖ్యాతిగాంచిన కోకో గింజలు

'కోకో'ల్లలుగా గింజల దిగుబడి

ఆఫ్రికా దేశాల్లో ఒకటైన ఘనాలో పండే కోకో గింజలు మాత్రమే నాణ్యమైనవని నిన్న మొన్నటి వరకూ పేరుండేది. కోనసీమలో పండే కోకో గింజలు ఇప్పుడు ఆ పేరును తుడిచిపెట్టేశాయి. జిల్లాలోని 3,800 ఎకరాల్లో కొబ్బరిలో అంతర పంటగా కోకో సాగవుతోంది. ఏటా సగటున 1,140 టన్నుల గింజలు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రస్తుత మార్కెట్ రేటును బట్టి ఏటా రూ.54.20 కోట్ల విలువైన కోకో గింజల దిగుబడి వస్తోందని అంచనా.

ఏ దిల్ 'మ్యాంగో'మోర్

కోనసీమ జిల్లా మలికిపురం మండలం గూడపల్లిలో పండే బంగినపల్లి కాయకు యమ క్రేజ్ ఉంది. ఈ సీజన్‌లో ఇక్కడ పండే బంగినపల్లికి ఉమ్మడి రాష్ట్రాలతో పాటు చెన్నై, బెంగళూరులో కూడా డిమాండ్ ఉంది. గూడపల్లితో పాటు చుట్టుపక్కల సుమారు 2 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది.



గూడపల్లిలో బంగినపల్లి మామిడి తోట

గుండెలు 'గెల'చిన ఎర్ర చక్కెరకేళీ

ఎర్ర చక్కెరకేళీ రుచిలో రారాజు. తమిళవాసులు అమితంగా ఇష్టపడతారు. టైప్–2 మధుమేహ బాధితులూ నిర్భయంగా తింటారు. కోనసీమతో పాటు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 2 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతోందని అంచనా. గెల ధర ఏడాదిలో సగటున రూ.350 వరకూ ఉంటోంది. రావులపాలెం మార్కెట్ యార్డు నుంచి రోజుకు సగటున రెండు లారీల ఎర్ర చక్కెరకేళీ ఎగుమతి అవుతోంది.



రావులపాలెం మార్కెట్‌లో ఎర్ర చక్కెరకేళీ గెలలు

బ్రాండింగ్ కోసం కృషి

కోనసీమలో పండే గూడపల్లి మామిడి, ఎర్ర చక్కెరకేళీ, పనస, తమలపాకు, పోక, ఇతర ఉద్యాన పంటలకు అరకు కాఫీ తరహాలో ప్రత్యేక బ్రాండింగ్ కోసం కృషి చేస్తున్నాం. దీంతో పాటు సాగు విస్తీర్ణం పెంచేందుకు, మార్కెట్ అవకాశాలు కల్పించేందుకు ఉద్యాన శాఖ ద్వారా రాయితీలు అందిస్తున్నాం.

– బీవీ రమణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా



ఇస్కాన్ రథయాత్రను మరో రోజు పెట్టుకోమనండి

లేదా ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లమనండి

- అదే రోజు మొహర్రం ఊరేగింపు కూడా ఉంది
- అందువల్ల అనుమతులు ఇవ్వడం కష్టం
- ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించాలని ఇస్కాన్, పోలీసులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: అనంతపురంలో ఇస్కాన్ ఈ నెల 5న తలపెట్టిన జగన్నాథ రథయాత్రకు అనుమతినివ్వాలంటూ సింగిల్ జడ్జి జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం హైకోర్టు ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలు చేసింది. అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ధర్మాసనం విచారణ జరిపింది. అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. 5, 6 తేదీల్లో మొహర్రం సందర్భంగా ముస్లింల ఊరేగింపు ఉందని తెలిపారు. 5వ తేదీన అదే మార్గంలో రథయాత్ర కూడా వెళుతోందన్నారు. ఈ రెండూ ఊరేగింపులు పరస్పరం ఎదురయ్యే అవకాశం ఉందని, దీంతో శాంతిభద్రతల సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. రథయాత్రను మరో రోజు చేపడితే అనుమతులు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అలాకాని పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో రథయాత్రను నిర్వహించుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం సమస్య పరిష్కారానికి చర్చలు జరపాలని ఇస్కాన్ ప్రతినిధులను, అనంతపురం పోలీసులను ఆదేశించింది. ప్రత్యామ్నాయాలను చూడాలని, అంతిమంగా ఓ ఏకాభిప్రాయానికి రావాలని స్పష్టం చేసింది. ఇస్కాన్ నిర్వాహకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలంది. మార్గాలను వేరు చేస్తే రెండు వర్గాలు కూడా తమ తమ ఊరేగింపులను కొనసాగించుకునేందుకు అనుమతినివ్వాలని, ఈ ఊరేగింపులను పోలీసులు పర్యవేక్షించాలని ఆదేశించింది. ప్రత్యామ్నాయ మార్గాల విషయంలో నిర్ణయం తమకు తెలియచేయాలంటూ విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది.

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై రూట్ మ్యాప్ ప్రకటించాలి

- తక్షణమే పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలి
- ఏపీ ఎన్జీవో జేఏసీ చైర్మన్ విద్యాసాగర్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూట్ మ్యాప్‌ప్రకటించాలని ఏపీ ఎన్జీవో జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) నూతన చైర్మన్‌గా విద్యాసాగర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్ గా డీవీ రమణ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోమ్‌లో విద్యాసాగర్ మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని కూటమి మేనిఫెస్టోలో సైతం ప్రకటించిందని గుర్తు చేశారు. నూతన పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. డీఏల మంజూరు, సరెండర్ లీవ్‌ల చెల్లింపు, పెన్షనర్లకు పెన్షన్ విధానంలో మార్పులు, ఉద్యోగుల ఆరోగ్య సేవల కోసం ఉద్యోగుల నుంచి సేకరిస్తున్న నిధులను సరాసరి ఆసుపత్రుల ఖాతాకు జమ చేసేలా మార్పులు చేయటం వంటి ముఖ్యమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ప్రభుత్వానికి ఒక సంవత్సరం సమయం ఇచ్చామని, అయినా తమ సమస్యలపై నిష్క్రియాపరత్వం ప్రదర్శిస్తోందని అన్నారు. ప్రభుత్వంలోని కీలకమైన రంగాల్లో ఎన్నో పోస్టులు ఖాళీగా ఉన్నా, భర్తీ చేయడంలేదని, ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ కేఎస్ఎస్ ప్రసాద్, ఏపీఎన్జీవో ప్రధాన, కార్యదర్శి డీవీ రమణ, జేఏసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

యువ వైద్యులపై పోలీసుల దాడి దారుణం

శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ



సాక్షి, అమరావతి: యువ వైద్యులపై పోలీసులు దాడి అత్యంత దారుణమని శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. అమ్మాయిలని కూడా చూడకుండా భౌతిక దాడులు చేయడం అన్యాయమని గురువారం ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన మెడికల్ గ్రాడ్యుయేట్ల పట్ల ప్రభుత్వం కిరాతకంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వాళ్లను నేరస్తుల మాదిరిగా చూస్తోందని, కనీసం మానవత్వం చూపడం లేదన్నారు. అర్హతలున్న వారికి శాశ్వత రిజిస్ట్రేషన్ చేయకపోవడం ఏంటని ప్రభుత్వాన్ని నిలదీశారు. పిల్లల జీవితాలతో ఎందుకు ఆడుకుంటారని ప్రశ్నించారు. ఎవరి స్వలాభం కోసం పిల్లలను ప్రభుత్వం వేధిస్తోందన్నారు. రూ. లక్షలు ఖర్చు చేసి చదివించుకున్న వారి తల్లిదండ్రులకు శోకం ఎందుకు తెప్పిస్తున్నారని ప్రశ్నించారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారికి రోడ్డు మీద పోరాటాలు చేయాల్సిన పరిస్థితిని చంద్రబాబు తీసుకురావడం శోచనీయమన్నారు. వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే వారి పోరాటాల్లో తాము కూడా భాగస్వాములవుతామన్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. ఒకరు మృతి

అనంతపురం జిల్లా ఇరువెందులలో ఘటన

శింగనమల: ఇంటి రస్తా విషయంలో ఇరువర్గాలు ఘర్షణకు దిగగా... ఒకరు మృతి చెందారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన గురువారం అనంతపురం జిల్లా శింగనమల మండల పరిధిలోని ఇరువెందల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు... ఇరువెందల గ్రామంలో ఇంటి రస్తా విషయంలో ప్రభాకర్, మల్లికార్జున ఘర్షణపడ్డారు. ఇరువురి బంధువులూ కలగజేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారింది. ఈ క్రమంలో ఘర్షణ తీవ్రతరం కాగా ఒకరిపై మరొకరు కట్టెలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో ఇరువర్గాలకు సంబంధించిన 8 మంది గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన శంకరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. క్షతగాత్రులను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

6వ తేదీలోపు 'విజన్' సమావేశాలు పూర్తిచేయాలి

సీఎస్ కె.విజయానంద్

సాక్షి, అమరావతి: ఈ నెల 6వ తేదీలోపు జిల్లా, నియోజకవర్గాల విజన్ ప్రణాళిక సమావేశాలను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల కార్యదర్శులతో పలు అంశాలపై సీఎస్ సమీక్ష నిర్వహించారు. వెంటనే జిల్లా, నియోజకవర్గ విజన్ చాప్టర్లను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. శుక్రవారం ముఖ్యమంత్రి పీ–4పై సమీక్షించనున్నట్టు తెలిపారు. ఈ నెల 23న కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో పూర్తి స్థాయిలో సీఎం సమీక్షిస్తారన్నారు. పీ–4, స్వర్ణాంధ్రప్రదేశ్–2047కు సంబంధించి శిక్షణ, అవగాహనా కార్యక్రమాలు పూర్తిచేశామని, ఇకపై పూర్తిస్థాయి కార్యాచరణ ప్రణాళికల అమలుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని అన్న క్యాంటీన్ల వద్ద సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటుచేసి, నిర్వహణ తీరును పర్యవేక్షించాలని స్పష్టంచేశారు. మున్సిపల్ కార్పొరేషన్లలో రోజూ ఇంటింటి చెత్త సేకరణ, డ్రైయిన్లలో పూడికతీతపై కార్పొరేషన్ ప్రత్యేక అధికారులుగా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఎస్పీలతో కలెక్టర్లు సమావేశమై మహిళలపై నేరాలు, డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నైరుతి రుతుపవన కాలంలో తుఫానులు, వరదలు వస్తే సమర్థంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని వేగవంతంగా అమలుచేయాలని సీఎస్ ఆదేశించారు.

డబుల్ ధమాకా


● చిరంజీవి


● ప్రభాస్


● ఎన్టీఆర్ ● రామ్ చరణ్


● అల్లు అర్జున్

తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఒక్కోసారి ఒక్కో సీజన్ నడుస్తుంటుంది. ఈ కోవలోనే ప్రస్తుతం డ్యూయల్ రోల్స్ సీజన్ కనిపిస్తోంది. తమ అభిమాన హీరో ఒక్క పాత్రలో కనిపిస్తేనే అభిమానుల ఆనందాలకు అవధులుండవు. అలాంటిది రెండు పాత్రల్లో కనిపిస్తే? ఇక చెప్పేదేముంది... పండగ చేసుకుంటారు. పైగా ద్విపాత్రాభినయం చేస్తే వేరియేషన్ చూపించే అవకాశం కూడా ఉంటుంది హీరోలకి. ఇక డ్యూయల్ రోల్స్‌తో ప్రేక్షకులకు, అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వనున్న హీరోలపై ఓ లుక్కేద్దాం.

మరోసారి...

'రిక్షావోడు, స్నేహం కోసం, అందరివాడు'... ఇలా తన కెరీర్‌లో పలు సినిమాల్లో ద్విపాత్రాభియం చేసి, ప్రేక్షకులను అలరించారు చిరంజీవి. చాలా రోజుల తర్వాత ఆయన మరోసారి ప్రేక్షకులకు, అభిమానులకు డబుల్ ధమాకా ఇవ్వనున్నారు. చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మెగా 157' (వర్కింగ్ టైటిల్). 'సంక్రాంతికి వస్తున్నాం' వంటి బ్లాక్ బస్టర్ మూవీ తర్వాత అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుష్మిత కొణిదెల నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుపుకుంటోంది. చిరంజీవితో పాటు ఇతర నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు అనిల్ రావిపూడి. చాలా గ్యాప్ తర్వాత చిరంజీవి నటిస్తున్న పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం ఇది. ఈ సినిమాలో ఆయన ద్విపాత్రాభినయం చేయబోతున్నారని ఫిల్మ్ నగర్ టాక్. వినోదం నేపథ్యంలో రూపొందుతోన్న 'మెగా 157'లో మనసుని హత్తుకునే భావోద్వేగ సన్నివేశాలు కూడా ఉంటాయని సమాచారం. చిరంజీవి పాత్ర 'రౌడీ అల్లుడు, గ్యాంగ్ లీడర్, ఘరానా మొగుడు, యముడికి మొగుడు, చంటబ్బాయి' చిత్రాల తరహాలో ఉంటుందని తెలిసింది. ద్విపాత్రాభినయంలో కనిపించనున్న చిరంజీవి తండ్రీ కొడుకులుగా కనిపిస్తారా? లేకుంటే సోదరులుగానా? అనే వార్తలు నెట్టింట సందడి చేస్తున్నాయి. ఈ సినిమాలో హీరో వెంకటేశ్ కీలకమైన అతిథి పాత్రలో కనిపించనున్నారట. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ మూవీ టైటిల్ ప్రకటించనున్నారు మేకర్స్. ఇదిలా ఉంటే... ఈ సినిమా 2026 సంక్రాంతికి విడుదల కానుంది.


● విజయ్ దేవరకొండ

రెండు చిత్రాల్లో...

'బాహుబలి 1, 2' చిత్రాల తర్వాత వరుస పాన్ ఇండియా సినిమాలు చేస్తున్నారు హీరో ప్రభాస్. 'కల్కి 2898 ఏడీ' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ప్రభాస్ నటిస్తున్న సినిమాల్లో 'ది రాజా సాబ్' ఒకటి. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఇప్పటికే 'బాహుబలి, బిల్లా' వంటి సినిమాల్లో డ్యూయల్ రోల్స్ చేసిన ఆయన 'ది రాజా సాబ్'తో మరోసారి తన అభిమానులకు, ప్రేక్షకులకు డబుల్ ట్రీట్ ఇవ్వబోతున్నారు. పీరియాడికల్ హారర్ కామెడీ నేపథ్యంలో రూపొందుతోన్న ఈ సినిమాలో తాత-మనవడు పాత్రల్లో ప్రభాస్ నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ చూస్తే ఈ విషయం స్పష్టం అవుతోంది. ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఈ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌ని బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ చేయనున్నారనే వార్తలొస్తున్నాయి. 'ది రాజా సాబ్' తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈ ఏడాది ఏప్రిల్ 10న విడుదల కావాల్సి ఉండగా డిసెంబరు 5వ తేదీకి వాయిదా పడింది.


● కార్తీ

సలార్ 2 లోనూ...

ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'సలార్: పార్ట్ 1 సీజ్‌ఫైర్'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషించారు. 2023 డిసెంబరు 22న విడుదలైన ఈ చిత్రం పాన్ ఇండియా హిట్‌గా నిలిచింది. ఈ సినిమాకి సీక్వెల్‌గా 'సలార్: పార్ట్ 2 శౌర్యాంగపర్వం' ఉంటుందని చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలోనూ తండ్రీ కొడుకులుగా కనిపించనున్నారట ప్రభాస్. 'సలార్'లో ప్రభాస్ తండ్రి కనిపించకపోయినా 'సలార్ 2'లో ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో ఆయన వస్తారని సమాచారం.

రెండు సినిమాల్లోనూ తండ్రి... కొడుకు?

''ఈ సముద్రం సేపల్ని కంటే కత్తుల్ని, నెత్తుర్ని ఎక్కువ సూసుండాది.. అందుకే నేమో దీన్ని ఎర్ర సముద్రం అంటారు'' అంటూ 'దేవర: పార్ట్ 1' చిత్రంలో ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ గుర్తుండే ఉంటుంది. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్-డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'దేవర పార్ట్ 1'. దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ ఈ సినిమా ద్వారా తెలుగుకి హీరోయిన్‌గా పరిచయమైన సంగతి తెలిసిందే. సైఫ్ అలీ ఖాన్, షైన్ టామ్ చాకో ప్రధాన పాత్రల్లో నటించారు. మిక్కిలినేని సుధాకర్, కొసరాజు హరికృష్ణ, నందమూరి కల్యాణ్ రామ్ నిర్మించిన ఈ సినిమా 2024 సెప్టెంబర్ 27న విడుదలై సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా ఇటీవల జపాన్‌లో కూడా విడుదలవడం, అక్కడి ప్రమోషన్లలో ఎన్టీఆర్ పాల్గొనడం తెలిసిందే. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి సీక్వెల్‌గా 'దేవర: పార్ట్ 2' రూపొందనుంది. కొరటాల శివ 'దేవర 2' స్క్రిప్ట్ వర్క్ పనుల్లోనే ఉన్నారు. ఈ చిత్రంలో ఎన్టీఆర్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేయనున్నారు. 'దేవర' చిత్రంలో కేవలం కొడుకు పాత్రనే చూపించారు దర్శకుడు. రెండో భాగంలో తండ్రి పాత్ర సందడి చేయనుంది. తండ్రి పాత్ర ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో వస్తుందని టాక్. ఇదిలా ఉంటే... ఎన్టీఆర్ నటించిన బాలీవుడ్ చిత్రం 'వార్ 2' (హృతిక్ రోషన్ హీరో) ఆగస్టు 14న విడుదల కానుంది. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు ఎన్టీఆర్. 'ఎన్టీఆర్ నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలోనూ ఎన్టీఆర్ డ్యూయల్ రోల్ చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. మరి... ఈ వార్తల్లో ఎంత నిజం ఉందో తెలియాల్సి ఉంది. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ అనుకుంటున్నారని టాక్.

మూడోసారి?

హీరో రామ్‌చరణ్ 'నాయక్', 'గేమ్ చేంజర్' సినిమాల్లో ద్విపాత్రాభినయం చేశారు. తాజాగా రామ్‌చరణ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'పెద్ది'. తొలి చిత్రం 'ఉప్పెన'తో బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రంలో రామ్‌చరణ్ ద్విపాత్రాభియం చేయనున్నారనే వార్తలు వస్తున్నాయి. అలాగే ఈ సినిమాలోని ఓ ప్రత్యేక పాటలో కాజల్ అగర్వాల్ సందడి చేయనున్నారని భోగట్టా. అయితే ఇందుకు సంబంధించి అధికారిక ప్రకటన లేదు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇదిలా ఉంటే... రామ్ చరణ్ బర్త్ డే సందర్భంగా 'పెద్ది' చిత్రాన్ని 2026 మార్చి 27న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్.

తొలిసారి...

'పుష్ప 1, 2'' వంటి భారీ పాన్ ఇండియా హిట్స్ తర్వాత హీరో అల్లు అర్జున్... తమిళ దర్శకుడు అట్లీ సినిమాకి పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. 'ఏఏ22 ఏ6' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ చిత్రం తెరకెక్కనుంది. కళానిధి మారన్ సమర్పణలో సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ సినిమాలో బాలీవుడ్ నటి దీపికా పదుకోన్ హీరోయిన్‌గా ఖరారు కావడంతో ఈ క్రేజ్ మరింత పెరిగింది. రెండు దశాబ్దాలకు పైగా కెరీర్‌లో అల్లు అర్జున్ తొలిసారి 'ఏఏ 22 ఏ6'లో ద్విపాత్రాభినయం చేయనున్నారట. ఒక పాత్ర హీరో కాగా మరో పాత్రలో నెగెటివ్ షేడ్స్ ఉంటాయని ఫిల్మ్‌నగర్ వర్గాలు చెబుతున్నాయి. తొలిసారి ఆయన ద్విపాత్రాభినయం చేయనుండటంతో అల్లు అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు. పీరియాడికల్ డ్రామాగా భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్‌కి చాలా ప్రాధాన్యత ఉందట. హాలీవుడ్ సూపర్ హీరో సినిమాల తరహాలో ఈ మూవీ ఉంటుందని, అందుకే ఈ సినిమా కోసం హాలీవుడ్ మేకర్స్‌ను రంగంలోకి దింపుతున్నారనీ టాక్. ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోంది. 2026 ఆగస్టులో ఈ సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తోందట యూనిట్. కాగా ఈ చిత్రంలో అల్లు అర్జున్ త్రిపాత్రాభినయం చేయనున్నారనే వార్తలు కూడా నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. మరి అల్లు అర్జున్‌ది ద్విపాత్రాభినయమా? త్రిపాత్రాభినయమా? అనే విషయంపై స్పష్టత వచ్చే వరకు వేచి చూడాలి.

తొలిసారి...

హీరో విజయ్ దేవరకొండ, డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్‌లది హిట్ కాంబినేషన్. వీరి కాంబోలో వచ్చిన తొలి చిత్రం 'ట్యాక్సీవాలా' 2018 నవంబరు 17న విడుదలై, హిట్‌గా నిలిచింది. వీరి కాంబినేషన్‌లో రూపొందుతోన్న తాజా చిత్రం 'వీడీ 14' (వర్కింగ్ టైటిల్). మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. బ్రిటిష్ పాలన నేపథ్యంలో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న చిత్రమిది. 19వ శతాబ్దం నేపథ్యంలో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన వాస్తవ చారిత్రక ఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రూపొందనుంది. ఈ చిత్రంలో తొలిసారి ద్విపాత్రాభినయం చేయనున్నారట విజయ్. తండ్రీ కొడుకులుగా వెండితెరపై సందడి చేయనున్నారనే వార్తలు వస్తున్నాయి.

సర్దార్ 2లో...

కార్తీ హీరోగా నటించిన హిట్ చిత్రాల్లో 'సర్దార్' ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రం 2022 అక్టోబరు 21న విడుదలై థియేటర్లలో కాసుల వర్షం కురిపించింది. రూ. 100 కోట్లకు పైగానే వసూళ్లు సాధించింది. స్పై యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'సర్దార్ 2'. ఇక గత ఏడాది కార్తీ పుట్టినరోజు (మే 25) సందర్భంగా ప్రారంభించిన ఈ సినిమా షూటింగ్ ఈ ఏడాది జూన్‌లో ముగిసింది. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తీ హీరోగా నటించిన ఈ చిత్రంలో మాళవికా మోహనన్, ఆషికా రంగనాథ్, రజీషా విజయన్ హీరోయిన్లుగా నటించగా, ఎస్‌జే సూర్య పవర్‌ఫుల్ పాత్రలో నటించారు. ఎస్. లక్ష్మణ్ కుమార్ నిర్మించిన ఈ సినిమాలోనూ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు కార్తీ. ఈ సినిమా ఫస్ట్ లుక్, ప్రోలాగ్ వీడియోను ఇటీవల విడుదల చేశారు. ఈ సినిమాని 2026 పొంగల్‌కి విడుదల చేయనున్నారట మేకర్స్.

వీరే కాదు.. మరికొందరు హీరోలు కూడా డ్యూయల్ రోల్స్‌లో కనిపించే అవకాశం ఉంది.

- దేరంగుల జగన్ మోహన్


● సూర్య

టైటిల్ ఫిక్స్!

హీరో సూర్య, దర్శకుడు వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో ఓ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా రవీనా టాండన్, రాధికా శరత్ కుమార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ లొకేషన్స్‌లో జరుగుతోంది. సూర్యతో పాటు ఈ సినిమా కీలక తారాగణం పాల్గొంటుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన వార్త తెరపైకి వచ్చింది. అదేంటంటే... ఈ ఫ్యామిలీ డ్రామా సినిమాకు 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారట మేకర్స్. ఫైనల్‌గా ఇదే టైటిల్ ఖరారు అవుతుందా? లేక మరో టైటిల్ తెరపైకి వస్తుందా? అనేది చూడాలి. ఇక శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది. ఈ సినిమాకు జీవీ ప్రకాష్‌కుమార్ సంగీతం అందిస్తున్నారు.


● శేఖర్ కమ్ముల


శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో..?

''శేఖర్ కమ్ములతో సినిమా చేయాలని ఉంది. హీరోయిన్లకు ఆయన మంచి పాత్రలు రాస్తారు'' అన్నట్లుగా ఓ సందర్భంలో సమంత పేర్కొన్నారు. ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైనట్లు తెలుస్తోంది. ఇటీవల నాగార్జున-ధనుష్‌లతో 'కుబేర' వంటి హిట్ మూవీ ఇచ్చిన శేఖర్ కమ్ముల తదుపరి ఒక ఫీమేల్ ఓరియంటెడ్ సినిమా చేయాలనుకుంటున్నారని సమాచారం. ఈ చిత్రంలో సమంత కథానాయికగా నటిస్తారనే టాక్ వినిపిస్తోంది. ఒక బలమైన అంశం చుట్టూ తిరిగే ఈ చిత్రంలో కథానాయిక పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుందట. ఇదిలా ఉంటే నాని హీరోగా శేఖర్ కమ్ముల ఓ సినిమా చేయనున్నారనే వార్త వచ్చిన విషయం తెలిసిందే. ''ఈ సినిమాకి సంబంధించిన చర్చ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. పూర్తి స్క్రిప్ట్ రెడీ అయ్యాక ఈ సినిమా గురించిన వివరాలను షేర్ చేస్తాను'' అని ఆ మధ్య శేఖర్ కమ్ముల స్పష్టం చేశారు. ఈలోపు సమంతతో ఆయన సినిమా చేయనున్నారనే వార్త తెరపైకి వచ్చింది. మరి... శేఖర్ కమ్ముల దర్శకత్వంలో నెక్స్ట్ రానున్న సినిమా ఏంటి? అది హీరో ఓరియంటెడ్ మూవీనా? లేక హీరోయిన్ ఓరియంటెడా? ఎవరు నటిస్తారు? అనేది తెలియాలంటే కొన్నాళ్లు వేచి చూడక తప్పదు.


● సమంత

యాక్షన్ అడ్వెంచర్

మార్వెల్ అభిమానులకు పండగే. 'ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్' సినిమా ఈ నెల 25న విడుదల కానుంది. పెడ్రో పాస్కల్, వెనెస్సా కిర్బీ, ఎబోన్ మోస్-బాచ్రాచ్, జోసెఫ్ క్విన్, జూలియా గార్నర్, నటాషా లియోన్, పాల్ వాల్టర్ హౌసర్, రాల్ఫ్ ఇనేసన్ ప్రధాన పాత్రలు పోషించారు. మాట్ షాక్‌మాన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాని కెవిన్ ఫీజ్ నిర్మించారు. లూయిస్ డి ఎపోసిటో, గ్రాంట్ కర్టిస్, టిమ్ లూయిస్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌లుగా వ్యవహరించారు. ఈ సినిమా ఈ నెల 25న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో విడుదల కానుంది. ''యాక్షన్ అడ్వెంచర్‌గా రూపొందిన చిత్రం 'ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్'. 1960ల నాటి రెట్రో-ఫ్యూచరిస్టిక్ సెట్టింగ్‌లో ఈ సినిమా ఉంటుంది. మార్వెల్ మొదటి సూపర్ హీరో కుటుంబానికి, గ్రహాలను మింగేసే గెలాక్టస్‌కి మధ్య జరగబోయే భీకర పోరాటాన్ని ఈ చిత్రంలో చూస్తారు'' అని మేకర్స్ తెలిపారు.


● 'ఫెంటాస్టిక్ ఫోర్ ఫస్ట్ స్టెప్స్' పోస్టర్

జోరు చూపించిన సేవల రంగం

జూన్‌లో పీఎంఐ 60.4 పాయింట్లు.. 10 నెలల గరిష్టానికి చేరిక




న్యూఢిల్లీ: సేవల రంగం జూన్ నెలలో బలమైన పనితీరు చూపించింది. ఇందుకు నిదర్శనంగా హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ ఇండెక్స్ పది నెలల గరిష్ట స్థాయిలో 60.4 పాయింట్లకు చేరింది. మే నెలలో ఇది 58.8 పాయింట్ల వద్ద ఉంది. స్థానిక మార్కెట్ నుంచే కాకుండా ఎగుమతి మార్కెట్ల నుంచి కొత్త ఆర్డర్లు రావడం బలమైన పనితీరుకు దోహదం చేసింది. వ్యయాలు తగ్గడం మార్జిన్ల విస్తరణకు దోహదం చేసినట్టు హెచ్ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. 2024 ఆగస్ట్ తర్వాత తొలిసారి కొత్త ఆర్డర్లు జూన్ నెలలో గణనీయంగా పెరిగాయి. దేశీ మార్కెట్లో కార్యకలాపాలు పెరగడం, ఎగుమతులు వృద్ధి చెందడం మెరుగైన పనితీరుకు సాయపడ్డాయి. ముఖ్యంగా ఆసియా, మధ్యప్రాచ్యం, యూఎస్ మార్కెట్ల నుంచి డిమాండ్ అధికమైందని భండారీ అంచనా వేశారు. వరుసగా 37వ నెలలోనూ జూన్‌లో ఉపాధి అవకాశాలు పెరిగినట్టు చెప్పారు. వచ్చే ఏడాది కాలంలో వృద్ధి పట్ల 18% సేవల రంగ సంస్థలు సానుకూలంగా ఉన్నాయి. 2022 తర్వాత చూస్తే ఇదే కనిష్ట స్థాయి.

61పాయింట్లకు కాంపోజిట్ ఇండెక్స్

తయారీ, సేవల రంగ కార్యకలాపాలను ప్రతిబింబించే హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ అవుట్‌పుట్ ఇండెక్స్ జూన్‌లో 61 పాయింట్లకు పెరిగింది. మే నెలలో ఇది 59.3గా ఉంది. 14 నెలల్లోనే ఇది గరిష్ట స్థాయి కావడం గమనార్హం.

నైకాలో వాటా విక్రయం

2 శాతం విలువ రూ. 1,213 కోట్లు



న్యూఢిల్లీ: ఫ్యాషన్, బ్యూటీ రిటైలర్ నైకా మాతృ సంస్థ ఎఫ్ఎస్ఎన్ ఈకామర్స్ వెంచర్స్‌లో తొలి దశ ఇన్వెస్టర్లు తాజాగా 2.1 శాతం వాటా విక్రయించారు. బీఎస్ఈ, ఎన్ఎస్ఈ బల్క్ డీల్స్ వివరాల ప్రకారం షేరుకి రూ. 202.25 సగటు ధరలో సుమారు 6 కోట్ల ఈక్విటీ షేర్లు అమ్మివేశారు. తద్వారా రూ. 1,213 కోట్లకుపైగా అందుకున్నారు. కమోడిటీల బిలియనీర్, కారావెల్ గ్రూప్(హాంకాంగ్) చైర్మన్, సీఈవో హరీందర్‌పాల్ సింగ్ బంగా, ఆయన భార్య ఇంద్ర బంగా సంయుక్తంగా నైకాలో వాటా విక్రయించారు. 2021లో పబ్లిక్ ఇష్యూకి వచ్చిన నైకాలో తొలి దశలోనే ఇన్వెస్ట్ చేసిన హరీందర్‌పాల్ సింగ్ వాటా తాజా లావాదేవీ తదుపరి 4.97 శాతం నుంచి 2.87 శాతానికి క్షీణించింది. కాగా.. గతేడాది ఆగస్ట్‌లోనూ నైకాలో 1.43 శాతం వాటాకు సమానమైన 4 కోట్ల షేర్లను సింగ్ దాదాపు రూ. 852 కోట్లకు విక్రయించారు. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26)లో కంపెనీ నష్టాల నుంచి బయటపడనున్నట్లు(బ్రేక్‌ఈవెన్) గత నెలలో కంపెనీ అంచనా వేసింది. ఇందుకు మార్కెటింగ్ సామర్థ్యాలు, సొంత బ్రాండ్ వృద్ధి తదితర అంశాలు దోహదపడనున్నట్లు పేర్కొంది. కంపెనీ నైకా నౌ పేరుతో క్విక్‌కామర్స్‌లోకి ప్రవేశించింది. తద్వారా 7 ప్రధాన నగరాలలో 30-120 నిమిషాలలో డెలివరీ సేవలు ప్రారంభించింది. బుధవారం ముగింపు ధర రూ. 211.6తో పోలిస్తే సింగ్ విక్రయ ధర 4.4 శాతం డిస్కౌంట్‌కాగా.. తాజాగా నైకా షేరు 4.4 శాతం పతనమై ఎన్ఎస్ఈలో రూ. 202 వద్ద ముగిసింది.

బిజినెస్ రీల్

ఫేస్‌జిమ్‌లో రిలయన్స్‌కు వాటా


రిటైల్ విభాగం చేతికి మైనారిటీ వాటా



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థ రిలయన్స్ రిటైల్ వెంచర్స్(ఆర్ఆర్‌వీఎల్) తాజాగా యూకే సంస్థ ఫేస్‌జిమ్‌లో మైనారిటీ వాటాను సొంతం చేసుకుంది. తద్వారా దేశీయంగా ఫేషియల్ ఫిట్‌నెస్, స్కిన్‌కేర్ బ్రాండును ప్రవేశపెట్టనుంది. తాజా పెట్టుబడులతో దేశీయంగా అధిక వృద్ధిలోనున్న సౌందర్యం, వెల్‌నెస్ విభాగంలో కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు తెలియజేసింది. అయితే వాటా కొనుగోలు విలువను వెల్లడించలేదు. ఓమ్నిచానల్ బ్యూటీ రిటైల్ ప్లాట్‌ఫామ్ 'టిరా' ద్వారా ఫేస్‌జిమ్‌ను భారత్‌లో ప్రవేశపెట్టేందుకు తాజా భాగస్వామ్యం వీలు కల్పించనున్నట్లు పేర్కొంది. రానున్న ఐదేళ్లలో ఫేస్‌జిమ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలియజేసింది. కీలక పట్టణాలలో స్టాండెలోన్ స్టుడియోలు, ఎంపిక చేసిన టిరా స్టోర్ల ద్వారా ఇందుకు అవకాశాలను సృష్టించనున్నట్లు వివరించింది.

గరుడ ఏరోస్పేస్ డ్రోన్లకు భారీగా ఆర్డర్లు

3 రాష్ట్రాల ప్రభుత్వ విభాగాల నుంచి కాంట్రాక్టులు



ముంబై: ఏఐ ఆధారిత డ్రోన్ సొల్యూషన్స్ కోసం గుజరాత్, తమిళనాడు, జార్ఖండ్ రాష్ట్రాల ప్రభుత్వ విభాగాల నుంచి పలు కాంట్రాక్టులు లభించినట్లు డ్రోన్ టెక్నాలజీ సంస్థ గరుడా ఏరోస్పేస్ తెలిపింది. ఒరిస్సా మైనింగ్ కార్పొరేషన్‌తో ఒప్పందం ప్రకారం వార్షిక సర్వేల నిర్వహణ, గనుల మూసివేత ప్రణాళికల కోసం డిజిటల్ డేటాబేస్‌లను, సర్వే మ్యాప్‌లు మొదలైన వాటిని తయారు చేయాల్సి ఉంటుంది. అలాగే, గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, తమిళనాడుకు చెందిన జియాలజీ, మైనింగ్ డిపార్ట్‌మెంట్, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ టెండర్లను కూడా గరుడ ఏరోస్పేస్ దక్కించుకుంది. అటు జార్ఖండ్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ మైనింగ్ కార్పొరేషన్ నుంచి కూడా కాంట్రాక్టు లభించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు అగ్నీశ్వర్ జయప్రకాష్ చెప్పారు. తమ డ్రోన్ యాజ్ ఎ సర్వీస్ (డాస్) మోడల్ వినియోగం పెరుగుతుండటాన్ని ఇది సూచిస్తోందని, తమ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకునేందుకు ఈ కాంట్రాక్టులు తోడ్పడతాయని వివరించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

4-7-2025

విశాఖ	585-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	570-00
విజయవాడ	590-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	575-00
వరంగల్	577-00
రిటైల్ ధర	6.35

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,295.00	1.9
APOLLOHOSP	7,572.50	1.77
HEROMOTOCO	4,318.00	1.75
ONGC	243.95	1.19
MARUTI	12,750.00	1.01

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
SBILIFE	1,803.60	-2.87
KOTAKBANK	2,125.00	-2.03
BAJAJFINSV	1,979.80	-1.4
JSWSTEEL	1,046.50	-1.26
GRASIM	2,814.40	-1.24

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,335
ఎన్ఎస్ఈ	96,739
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,61,113
ఎఫ్ఐఐ	- 1,481
డీఐఐ	+ 1,333

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.96 (రాత్రి 11.30కు)	$ 67.45 (క్రితం ముగింపు)
బ్రెంట్	68.83 (రాత్రి 11.30కు)	$ 69.11 (క్రితం ముగింపు)

హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలు ఓకే!

జనవరి-జూన్ కాలంలో 3% పెరుగుదల

- దేశవ్యాప్తంగా టాప్-8 నగరాల్లో పరిస్థితి భిన్నం
- బలంగా కార్యాలయ వసతుల లీజింగ్
- నైట్‌ఫ్రాంక్ నివేదిక విడుదల



న్యూఢిల్లీ: హైదరాబాద్ మార్కెట్లో ఇళ్ల అమ్మకాలు ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 3 శాతం పెరిగాయి. 19,048 యూనిట్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఇదే కాలంలో దేశవ్యాప్తంగా టాప్-8 నగరాల్లో చూస్తే భిన్నమైన పరిస్థితి నెలకొంది. మొత్తంగా ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 2 శాతం తగ్గినట్టు నైట్‌ఫ్రాంక్ నివేదిక వెల్లడించింది. ఆఫీస్ స్పేస్ (కార్యాలయ వసతులు) లీజింగ్ మార్కెట్ మాత్రం బలమైన పనితీరు చూపించింది.

- దేశవ్యాప్తంగా టాప్ 8 నగరాల్లో 2025 జనవరి-జూన్ కాలంలో ఇళ్ల అమ్మకాలు 1,70,201 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలోని విక్రయాలతో పోల్చి చూస్తే 2 శాతం తక్కువ.
- ఎనిమిది నగరాల్లో ఇళ్ల ధరలు 2 శాతం నుంచి 14 శాతం మధ్య పెరిగాయి.
- ఇళ్ల అమ్మకాల్లో 49 శాతం రూ.కోటి అంతకుమించి ధరల శ్రేణిలోనే ఉన్నాయి. మిగిలిన 51 శాతం ఇళ్ల ధరలు రూ.కోటిలోపు ఉన్నాయి.
- ముంబై నగరంలో ఇళ్ల అమ్మకాలు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే ఎలాంటి మార్పు లేకుండా 47,035 యూనిట్లుగా ఉన్నాయి. అహ్మదాబాద్ నగరంలో అమ్మకాలు కూడా పెద్ద మార్పు లేకుండా 9,370 యూనిట్లుగా ఉన్నాయి.
- చెన్నై నగరంలో క్రితం ఏడాది ఇదే కాలంలోని విక్రయాలతో పోల్చి చూస్తే 12 శాతం పెరిగి 26,795 యూనిట్లుగా నమోదయ్యాయి.
- బెంగళూరులో అమ్మకాలు 3 శాతం తగ్గి 26,599 యూనిట్లకు పరిమితమయ్యాయి. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో 8 శాతం తగ్గి 26,795 యూనిట్లుగా ఉన్నాయి.
- పుణెలో ఒక శాతం తగ్గాయి. 24,329 యూనిట్ల విక్రయాలు జరిగాయి. కోల్‌కతాలో అమ్మకాలు 11 శాతం తగ్గి 8,090 యూనిట్లకు పరిమితమయ్యాయి.

జోరుమీదున్న ఆఫీస్ స్పేస్ లీజింగ్

హైదరాబాద్ సహా టాప్-8 నగరాల్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 41 శాతం పెరిగి 48.9 మిలియన్ (489 లక్షలు) చదరపు అడుగులుగా (ఎస్ఎఫ్‌టీ) నమోదైంది. ఈ ప్రకారం చూస్తే ఈ ఏడాది మొత్తం మీద లీజింగ్ 80-90 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకుంటుందని నైట్‌ఫ్రాంక్ అంచనా.

- చెన్నైలో ఆఫీస్ స్పేస్ లీజింగ్ 68 శాతం వృద్ధితో 5.1 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- ముంబైలో మాత్రం క్రితం ఏడాది మొదటి ఆరు నెలల కాలం గణాంకాలతో పోల్చి చూస్తే 5 శాతం క్షీణించి 5.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.
- బెంగళూరులో ఆఫీస్ స్పేస్ లీజింగ్ క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రెట్టింపై 18.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో బలమైన వృద్ధి నమోదైంది. 27 శాతానికి పైగా పెరిగి 7.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- పుణెలో లీజింగ్ 17% వృద్ధితో 5.1 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- కోల్‌కతాలో ఏకంగా 60 శాతం పెరిగి 1.1 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి చేరింది.
- అహ్మదాబాద్‌లో 51 శాతం తగ్గిపోయి 0.8 మిలియన్ ఎస్ఎఫ్‌టీకి పరిమితమైంది.

ఏటా ఒక ఎలక్ట్రిక్ బైక్

మూడేళ్ల పాటు మ్యాటర్ మోటర్ వర్క్స్ ప్రణాళికలు



న్యూఢిల్లీ: వచ్చే మూడేళ్ల పాటు వరుసగా ప్రతి సంవత్సరం ఒక కొత్త ఎలక్ట్రిక్ బైక్‌ని ప్రవేశపెట్టే యోచనలో ఉన్నట్లు మ్యాటర్ మోటర్ వర్క్స్ గ్రూప్ సీవోవో అరుణ్ ప్రతాప్ సింగ్ తెలిపారు. తమ ఎలక్ట్రిక్ గేర్డ్ బైక్ 'ఏరా' (ఏఈఆర్‌ఏ)ని ఢిల్లీ మార్కెట్లో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా కొత్తగా 60 డీలర్‌షిప్‌లను ప్రారంభించనున్నామని, వీటిలో అత్యధిక భాగం దక్షిణాదిలోనే ఉంటాయని సింగ్ వివరించారు. ప్రస్తుతానికి తాము మోటర్‌సైకిల్స్‌పైనే దృష్టి పెడుతున్నాయని, ఎలక్ట్రిక్ స్కూటర్ల యోచన లేదని చెప్పారు. తమ తొలి మోడల్ ఏఈఆర్‌ఏని ఆరేళ్ల పాటు రూపొందించామని, గతేడాది అక్టోబర్ నుంచి డెలివరీలు ప్రారంభించామని వివరించారు. తొలి ఏడాదిలో 10,000తో మొదలుపెట్టి రెండో ఏడాది 50,000-60,000 వరకు వాహనాలను విక్రయించే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు చెప్పారు. అహ్మదాబాద్‌లోని తమ ప్లాంటుకు ప్రతి నెలా 10,000 వాహనాల ఉత్పత్తి సామర్థ్యం ఉందని సింగ్ తెలిపారు.

భారత్ కీలక మార్కెట్

- జియో డేటా సెంటర్లలో మా జీపీయూలే వాడతారు
- ఏఎండీ జీఎం ఆండ్రూ డీక్‌మాన్



న్యూఢిల్లీ: ఇంజినీరింగ్ కోణంలో భారత్ తమకు అత్యంత కీలకమైన మార్కెట్‌గా ఉంటోందని ఏఎండీ జనరల్ మేనేజర్ (డేటా సెంటర్ జీపీయూ వ్యాపార విభాగం) ఆండ్రూ డీక్‌మాన్ తెలిపారు. టెల్కో దిగ్గజం రిలయన్స్ జియో తదితర సంస్థలు తమ డేటా సెంటర్లలో గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్లను (జీపీయూ) ఉపయోగిస్తున్నట్లు వివరించారు. భారత్‌లో జియో తమకు ముఖ్యమైన భాగస్వామి అని కంపెనీ నిర్వహించిన అడ్వాన్సింగ్ ఏఐ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా పేర్కొన్నారు. దేశీయంగా ఏఐ మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏఎండీ పోటీ సంస్థ ఎన్‌విడియాతో జియో జట్టు కట్టిన నేపథ్యంలో ఆండ్రూ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏఎండీకి భారత్‌లో 8,000 మంది పైగా ఉద్యోగులు ఉన్నారు. ఏఐ చాలా పెద్ద మార్కెట్ అని, ఏ ఒక్క సంస్థకో ఇది పరిమితం కాదని ఆండ్రూ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 40 దేశాల ప్రభుత్వాలకు ఏఐపరంగా తోడ్పాటు అందించడంపై ఏఎండీ కలిసి పని చేస్తోందని ఆయన పేర్కొన్నారు. పోటీ సంస్థలతో పోలిస్తే తమ చిప్‌లు తక్కువ ధరలో మరింత మెరుగైన పనితీరు కనపరుస్తున్నాయని కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఏఎండీ సీఈవో లీసా సూ చెప్పారు.

జోయాలుక్కాస్ ఆఫర్ కొద్దిరోజులే



హైదరాబాద్: జోయాలుక్కాస్ 'ద బిగ్గెస్ట్ జ్యువెలరీ సేల్ ఆఫ్ ది ఇయర్' ఆఫర్ ఈ జూలై 13న ముగియనుంది. ఆఫర్‌లో భాగంగా ఆభరణాల తయారీ చార్జీలపై ఫ్లాటు 50% తగ్గింపు పొందవచ్చు. ప్రతి కొనుగోలుపై ఉచిత జీవితకాలం నిర్వహణ, ఏడాది బీమా, 100% బై బ్యాక్ హామీ ప్రయోజనాలు పొందవచ్చు. దేశవ్యాప్తంగా జ్యువెలరీ అభిమానులను అలరిస్తున్న ఈ మెగా సేల్‌లో గోల్డ్, డైమండ్, ప్లాటినమ్, సిల్వర్, ప్రెషస్ స్టోన్‌లో విస్తృత శ్రేణి డిజైన్లు ఉన్నాయి. అద్భుతమైన ఆఫర్లు ఆనందించేందుకు కొద్ది రోజులే ఉన్నాయని, కస్టమర్లు అవకాశాన్ని వినియోగించుకోవాలని కంపెనీ ఎండీ జాయ్ అలుక్కాస్ కోరారు.

వ్యాపారాలపై 'ఆర్‌కామ్' ప్రభావమేమీ లేదు

ఆర్‌ఇన్‌ఫ్రా, ఆర్‌పవర్ వెల్లడి

న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) ఖాతాను ఫ్రాడ్ అకౌంటుగా ఎస్‌బీఐ వర్గీకరించడమనేది తమ వ్యాపారాలపై ఎలాంటి ప్రభావమూ చూపదని అనిల్ ధీరుభాయ్ అంబానీ గ్రూప్‌లో (అడాగ్) భాగమైన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, రిలయన్స్ పవర్ స్పష్టం చేశాయి. ఆర్‌కామ్‌తో తమకెలాంటి వ్యాపార, ఆర్థిక సంబంధాలు లేవని, తమ రెండు సంస్థలు వేర్వేరుగా లిస్టెడ్ కంపెనీలుగా కార్యకలాపాలు సాగిస్తున్నాయని స్టాక్ ఎక్స్చేంజీలకు విడివిడిగా తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆర్‌కామ్‌పై ఎలాంటి చర్యలు తీసుకున్నా తమ గవర్నెన్స్, మేనేజ్‌మెంట్, కార్యకలాపాలు, ఉద్యోగులు, షేర్‌హోల్డర్లపై ఎలాంటి ప్రభావమూ ఉండదని వివరించాయి. రుణాల మళ్లింపు ఆరోపణలతో ఆర్‌కామ్ ఖాతాను ఫ్రాడ్ అకౌంటుగా వర్గీకరించాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్ణయించిన సంగతి తెలిసిందే.

షెల్ చేతికి రాజ్ పెట్రో స్పెషాలిటీస్



న్యూఢిల్లీ: గ్లోబల్ దిగ్గజం షెల్ లూబ్రికెంట్స్ తాజాగా బ్రెంటాగ్ గ్రూప్ నుంచి రాజ్ పెట్రో స్పెషాలిటీస్ ప్రయివేట్ లిమిటెడ్‌ను సొంతం చేసుకుంది. 100 శాతం ఈక్విటీ వాటాను కొనుగోలు చేసినట్లు షెల్ లూబ్రికెంట్స్ తెలియజేసింది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. దీంతో లూబ్రికెంట్స్ పోర్ట్‌ఫోలియో మరింత పటిష్టంకానున్నట్లు పేర్కొంది. కీలక మార్కెట్లలో ఒకటైన భారత్‌లో పోర్ట్‌ఫోలియోతోపాటు కస్టమర్ల బేస్ బలపడనున్నట్లు ఒక ప్రకటనలో షెల్ లూబ్రికెంట్స్ తెలియజేసింది. చెన్నై, సిల్వాసాలలో తయారీ ప్లాంట్లు కలిగిన రాజ్ పెట్రో ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్‌సహా పెట్రోలియం జెల్లీలు, వైట్ ఆయిల్స్, లూబ్రికెంట్స్, వాక్స్‌లు తదితర పలు ప్రొడక్టులు రూపొందిస్తోంది. 80 ఏళ్ల క్రితం ముంబైలో ఏర్పాటైన కంపెనీని 2017-18లో జర్మన్ దిగ్గజం బ్రెన్‌టాగ్ సొంతం చేసుకుంది.

మరిన్ని నగరాల్లో వొడాఫోన్ ఐడియా 5జీ సేవలు



న్యూఢిల్లీ: ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా తమ 5జీ సర్వీసులను మరో 23 నగరాలకు విస్తరించింది. వీటిలో వైజాగ్‌తో పాటు జైపూర్, కోల్‌కతా, లక్నో తదితర సిటీలు ఉన్నట్లు సంస్థ తెలిపింది. ప్రారంభ ఆఫర్ కింద రూ. 299 నుంచి డేటా ప్లాన్లను అందిస్తున్నట్లు వివరించింది. కంపెనీ ఇప్పటికే ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, చండీగఢ్, పాట్నాలాంటి అయిదు నగరాల్లో 5జీ సేవలు అందిస్తోంది. 22 టెలికం సర్కిళ్లకు గాను 17 సర్కిళ్లలో 5జీ స్పెక్ట్రంను వొడా-ఐడియా కొనుగోలు చేసింది. 4జీ సేవలకు సంబంధించి సుమారు 65,000 సైట్లలో నెట్‌వర్క్‌ను పటిష్టం చేసుకున్నామని, కవరేజీని మెరుగుపర్చామని కంపెనీ పేర్కొంది. వచ్చే ఆరు నెలల్లో కొత్తగా 1 లక్ష టవర్లను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నట్లు తెలిపింది.

ఏరోస్పేస్ విభాగంపై అక్జో నోబెల్ దృష్టి

జేఎస్‌డబ్ల్యూతో దీర్ఘకాలిక భాగస్వామ్యం • కంపెనీ సీఈవో గ్రెగ్ వెల్లడి



ముంబై: నెదర్లాండ్స్‌కి చెందిన పెయింట్స్ దిగ్గజం అక్జో నోబెల్ భారత్‌లో ఏరోస్పేస్, మెరైన్ కోటింగ్ విభాగంలో వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవడంపై దృష్టి పెడుతోంది. అలాగే, జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్య సంబంధాలను కూడా కొనసాగించాలని భావిస్తోంది. బుధవారం విలేకరుల సమావేశంలో కంపెనీ సీఈవో గ్రెగ్ పోక్స్-గిలామీ ఈ విషయాలు వెల్లడించారు. అక్జో నోబెల్ ఇండియాలో (ఏఎన్ఐఎల్) వాటాలను జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు కంపెనీ విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ డీల్‌లో పౌడర్ కోటింగ్ వ్యాపారం, భారత్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని అక్జో నోబెల్ తన వద్ద అట్టే పెట్టుకుంది. జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్‌కి తాము టెక్నాలజీ భాగస్వామిగా కొనసాగుతామని, 4.5 శాతం రాయల్టీ, లైసెన్సింగ్ ఒప్పందాలు మొదలైనవి ఉంటాయని గ్రెగ్ తెలిపారు. ప్రస్తుతం పౌడర్ కోటింగ్స్ వ్యాపారం అంతర్జాతీయంగా వేగంగా వృద్ధి చెందుతోందని ఆయన చెప్పారు. ఈ విభాగంలో రెండో స్థానంలో ఉన్న సంస్థకన్నా తమ కంపెనీ పరిమాణం రెండు రెట్లు అధికమని వివరించారు. అంతర్జాతీయంగా ఏరోస్పేస్ కోటింగ్స్ విభాగంలో తాము అగ్రగామిగా ఉన్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రాథమిక స్థాయిలో ఉన్న భారత మార్కెట్లోనూ అవకాశాలను అందిపుచ్చుకోవడంపై మరింతగా దృష్టి పెడుతున్నామన్నారు. మరోవైపు, ఇతరత్రా విభాగాల్లోనూ అక్జో నోబెల్‌తో కలిసి పని చేసే అవకాశం ఉందని జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్ డైరెక్టర్ పార్థ్ జిందాల్ తెలిపారు. కాయిల్ కోటింగ్స్, ప్రొటెక్టివ్ కోటింగ్స్ విభాగంలో నంబర్‌వన్‌గా ఎదుగుతామని, అక్జో నోబెల్ పటిష్టంగా ఉన్న మెరైన్ విభాగంపైనా దృష్టి పెడతామని పేర్కొన్నారు.

ఇండిగో డైరెక్టరుగా అమితాబ్ కాంత్



ముంబై: ఇండిగో మాతృ సంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ నాన్-ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్ కాంత్ నియమితులయ్యారు. షేర్‌హోల్డర్లు, నియంత్రణ సంస్థ అనుమతులకు లోబడి ఈ నియామకం ఉంటుందని కంపెనీ తెలిపింది. జీ20 షెర్పా హోదాకు కాంత్ గత నెల రాజీనామా చేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అడ్మినిస్ట్రేషన్‌కి సంబంధించి ఆయనకు అపార అనుభవం ఉందని, 2030 నాటికల్లా గ్లోబల్ సంస్థగా ఎదగాలన్న తమ లక్ష్యానికి కాంత్ అనుభవం ఉపయోగపడుతుందని ఇండిగో డైరెక్టర్ల బోర్డ్ చైర్మన్ విక్రమ్ సింగ్ మెహతా తెలిపారు. ఇండిగో కొత్త మార్కెట్లను అందుబాటులోకి తెస్తుందని, మన విమానాశ్రయాలను అంతర్జాతీయంగా కనెక్టివిటీ, వాణిజ్యానికి హబ్‌లుగా మార్చగలదని కాంత్ చెప్పారు.

అలెంబిక్ చేతికి యుటిలిటీ థెరప్యూటిక్స్

డీల్ విలువ రూ. 100 కోట్లు



న్యూఢిల్లీ: దేశీ ఔషధ రంగ కంపెనీ అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ తాజాగా యూఎస్ సంస్థ యుటిలిటీ థెరప్యూటిక్స్‌ను కొనుగోలు చేసింది. ఇందుకు యూఎస్ అనుబంధ సంస్థ ద్వారా 1.2 కోట్ల డాలర్లు(రూ. 100 కోట్లు) చెల్లించనుంది. దీంతో యూఎస్ మార్కెట్లో కార్యకలాపాలను మరింత పటిష్టపరచుకోనున్నట్లు అలెంబిక్ పేర్కొంది. సంక్లిష్టంకాని మూత్ర సంబంధ వ్యాధుల చికిత్సలో వినియోగించే పివ్యా(పివ్‌మెథిసిల్లమ్)కు ఇటీవలే ఎఫ్‌డీఏ అనుమతిని యుటిలిటీ సాధించినట్లు తెలియజేసింది. ఈ ఔషధాన్ని వాణిజ్య ప్రాతిపదికన మార్కెటింగ్ చేయనున్నట్లు వెల్లడించింది. తాజా కొనుగోలు స్పెషాలిటీ, బ్రాండెడ్ ప్రొడక్టుల విభాగంలోకి ప్రవేశించేందుకు వ్యూహాత్మకంగా దోహదపడనున్నట్లు అలెంబిక్ తెలియజేసింది.

రియల్టీలో సంస్థాగత పెట్టుబడులు డీలా

ఏప్రిల్-జూన్ మధ్య 33శాతం డౌన్

- 1.69 బిలియన్ డాలర్లకు పరిమితం
- కొలియర్స్ ఇండియా నివేదిక విడుదల



న్యూఢిల్లీ: భారత రియల్ ఎస్టేట్ మార్కెట్లో సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు (ఇనిస్టిట్యూషన్స్) నీరసించాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి మూడు నెలల్లో (ఏప్రిల్-జూన్) క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 33 శాతం తగ్గిపోయి 1.69 బిలియన్ డాలర్లు (14,365 కోట్లు)గా ఉన్నట్టు కొలియర్స్ ఇండియా వెల్లడించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితులు ఇందుకు దారితీసినట్టు తెలిపింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఇనిస్టిట్యూషన్స్ 2.53 బిలియన్ డాలర్లను (రూ.21,505 కోట్లు) రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడం గమనార్హం. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే సగానికి తగ్గి 1,048 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రం 643 మిలియన్ డాలర్లను ఇన్వెస్ట్ చేశారు. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో 486 మిలియన్ డాలర్ల పెట్టుబడుల కంటే 32 శాతం అధికమయ్యాయి.

దేశీ పెట్టుబడుల అండ..

''దేశీ పెట్టుబడులు రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు కీలక చోదకంగా మారాయి. భారత రియల్ ఎస్టేట్‌లో దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల వాటా 2021లో 16 శాతంగా ఉంటే, అక్కడి నుంచి క్రమంగా పెరుగుతూ 2024 నాటికి 34 శాతానికి చేరింది'' అని కొలియర్స్ ఇండియా సీఈవో బాదల్ యాజ్ఞిక్ తెలిపారు. ఇక 2025 మొదటి ఆరు నెలల కాలంలో రియల్ ఎస్టేట్ పెట్టుబడుల్లో దేశీ పెట్టుబడుల వాటా 48 శాతంగా ఉన్నట్టు చెప్పారు. దేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులు పెరగడం.. అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సాయపడ్డాయని, మొదటి ఆరు నెలల్లో మొత్తం పెట్టుబడులు 3 బిలియన్ డాలర్లకు దూసుకువెళ్లాయని తెలిపారు. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్యకాలంలో రియల్ ఎస్టేట్ మార్కెట్లో ఇనిస్టిట్యూషనల్ పెట్టుబడులు 15 శాతం తగ్గి 2,998 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. మొదటి ఆరు నెలల్లో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు క్రితం ఏడాది ఇదే కాలంలో ఉన్న 2,594 మిలియన్ డాలర్ల నుంచి 1,571 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. దేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు మాత్రం క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 53 శాతం ఎగసి 1,427 మిలియన్ డాలర్లకు చేరాయి. ఫ్యామిలీ ఆఫీసులు, విదేశీ కార్పొరేట్ గ్రూప్‌లు, విదేశీ బ్యాంక్‌లు, ప్రొప్రయిటరీ బుక్‌లు, పెన్షన్ ఫండ్స్, ప్రైవేటు ఈక్విటీ సంస్థలు, ఎన్‌బీఎఫ్‌సీలు, లిస్టెడ్ రీట్‌లు సంస్థాగత పెట్టుబడిదారుల కిందకు వస్తాయి.

పావోలిని కూడా అవుట్

రెండో రౌండ్‌లోనే ఓడిన గత ఏడాది రన్నరప్

ఇటలీ స్టార్‌పై అన్‌సీడెడ్ ప్లేయర్ రఖిమోవా సంచలన విజయం

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ మూడో రౌండ్‌లోకి క్రెజికోవా, ఒసాకా

టెన్నిస్ సీజన్ మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ వింబుల్డన్‌లో ఈ ఏడాది సంచలనాల మోత కొనసాగుతోంది. ముఖ్యంగా మహిళల సింగిల్స్ విభాగంలో టైటిల్ ఫేవరెట్స్ అనూహ్య పరాజయాలతో ఇంటిదారి పడుతున్నారు. ఇప్పటికే రెండో సీడ్ కోకో గాఫ్, మూడో సీడ్ జెస్సికా పెగూలా, ఐదో సీడ్ కిన్‌వెన్ జెంగ్, తొమ్మిదో సీడ్ పౌలా బదోసా తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా... తాజాగా వీరి సరసన గత ఏడాది రన్నరప్, నాలుగో సీడ్ జాస్మిన్ పావోలిని చేరింది. రష్యాకు చెందిన ప్రపంచ 80వ ర్యాంకర్, అన్‌సీడెడ్ కామిలా రఖిమోవా అద్భుత ఆటతో పావోలిని ఆట కట్టించి మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లింది. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ క్రెజికోవా (చెక్ రిపబ్లిక్), మాజీ నంబర్‌వన్ నయోమి ఒసాకా (జపాన్) మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు.



పావోలిని

లండన్: గత ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌కు గెలుపు దూరంలో ఉండిపోయిన ఇటలీ టెన్నిస్ స్టార్ జాస్మిన్ పావోలినికి ఈ సీజన్ కలిసి రావడం లేదు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లో వెనుదిరిగిన పావోలిని... ఫ్రెంచ్ ఓపెన్‌లో నాలుగో రౌండ్‌లో ఓడిపోగా... తాజాగా వింబుల్డన్ టోర్నీలో రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. రష్యాకు చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి, ప్రపంచ 80వ ర్యాంకర్ కామిలా రఖిమోవా 4-6, 6-4, 6-4తో ప్రపంచ ఐదో ర్యాంకర్, నాలుగో సీడ్ పావోలినిపై సంచలన విజయం సాధించింది. తద్వారా తన కెరీర్‌లో మూడోసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మూడో రౌండ్‌కు చేరుకుంది. గత ఏడాది ఫ్రెంచ్‌ఓపెన్ ఫైనల్లో స్వియాటెక్ చేతిలో... వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో క్రెజికోవా చేతిలో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచిన పావోలిని ఈ ఏడాది మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోతోంది. రఖిమోవాతో జరిగిన పోరులో తొలి సెట్‌ను నెగ్గిన పావోలిని ఆ తర్వాత తడబడింది. 2 గంటల 19 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో పావోలిని 40 అనవసర తప్పిదాలు చేసి, 23 విన్నర్స్ కొట్టింది. తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేసింది. రఖిమోవా 26 విన్నర్స్ కొట్టింది. నెట్ వద్దకు 12 సార్లు దూసుకొచ్చి ఎనిమిదిసార్లు పాయింట్లు గెలిచింది.

స్వియాటెక్ ముందంజ...

మరోవైపు డిఫెండింగ్ చాంపియన్ క్రెజికోవా (చెక్ రిపబ్లిక్), మాజీ నంబర్‌వన్ నయోమి ఒసాకా (జపాన్), ఏడో సీడ్ మిరా ఆంద్రీవా (రష్యా), ఎనిమిదో సీడ్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), మాజీ చాంపియన్ రిబాకినా (కజకిస్తాన్), పదో సీడ్ ఎమ్మా నవారో (అమెరికా) మూడో రౌండ్‌లోకి ప్రవేశించారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో క్రెజికోవా 6-4, 3-6, 6-2**తో డొలెహిడి (అమెరికా)పై,** ఒసాకా 6-3, 6-2**తో సినియకోవా (చెక్ రిపబ్లిక్)**పై, ఆంద్రీవా **6-1, 7-6 (7/4)తో** బ్రాన్‌జెట్టి (ఇటలీ)**పై, రిబాకినా 6-3,** 6-1తో సాకరి (గ్రీస్)**పై, నవారో** 6-1, 6-2తో **కుదెర్మెటోవా** (రష్యా)పై, **స్వియాటెక్** 5-7, 6-2, 6-1**తో కేటీ** మెక్‌నాలీ (అమెరికా)**పై** గెలిచారు.

బాలాజీ జోడీ బోణీ

పురుషుల డబుల్స్ విభాగంలో శ్రీరామ్ బాలాజీ (భారత్)-వరేలా (మెక్సికో) జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో బాలాజీ-వరేలా ద్వయం 6-4, 6-4తో లెర్నర్ టియెన్-కొవాసెవిక్ (అమెరికా) జంటను ఓడించింది.



జొకోవిచ్... వరుసగా 16వసారి

పురుషుల సింగిల్స్ విభాగంలో ఏడుసార్లు చాంపియన్, సెర్బియా దిగ్గజం నొవాక్ జొకోవిచ్ వరుసగా 16వ సారి వింబుల్డన్ టోర్నీలో మూడో రౌండ్‌కు చేరుకున్నాడు. గత ఆరు పర్యాయాల్లో ఫైనల్ చేరిన జొకోవిచ్... గురువారం జరిగిన రెండో రౌండ్‌లో అలవోకగా గెలిచాడు. 1 గంటా 47 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో జొకోవిచ్ 6-3, 6-2, 6-0తో డేనియల్ ఇవాన్స్ (బ్రిటన్)పై గెలుపొందాడు. 11 ఏస్‌లు కొట్టిన జొకోవిచ్ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. 26 సార్లు నెట్ వద్దకు దూసుకొచ్చి 23 సార్లు పాయింట్లు గెలిచాడు. తన సర్వీస్‌ను ఒక్కసారి కూడా చేజార్చుకోని జొకోవిచ్ ప్రత్యర్థి సర్వీస్‌ను ఆరుసార్లు బ్రేక్ చేశాడు.

టాపార్డర్ విఫలం

- ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 203/5
- వెస్టిండీస్‌తో రెండో టెస్టు

సెయింట్ జార్జెస్: వెస్టిండీస్‌తో రెండో టెస్టులో ఆస్ట్రేలియా టాపార్డర్ విఫలమైంది. ఓపెనర్లు సామ్ కొన్‌స్టాస్ (37 బంతుల్లో 25; 4 ఫోర్లు), ఉస్మాన్ ఖ్వాజా (29 బంతుల్లో 16; 2 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోగా... స్టీవ్ స్మిత్ (3), కామెరూన్ గ్రీన్ (37 బంతుల్లో 26; 4 ఫోర్లు), ట్రావిస్ హెడ్ (43 బంతుల్లో 29; 3 ఫోర్లు) పెవిలియన్‌కు వరుస కట్టారు. ఫలితంగా తొలి ఇన్నింగ్స్‌లో కడపటి వార్తలు అందేసరికి ఆస్ట్రేలియా 47 ఓవర్లలో 5 వికెట్లకు 203 పరుగులు చేసింది. వెస్టిండీస్ బౌలర్లలో అల్జారీ జోసెఫ్ 2 వికెట్లు పడగొట్టగా... సీల్స్, షామార్ జోసెఫ్, ఫిలిప్ తలా ఒక వికెట్ తీశారు.

బ్రాత్‌వైట్ 100వ టెస్టు



బ్రాత్‌వైట్

వెస్టిండీస్ మాజీ కెప్టెన్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ ఈ మ్యాచ్ ద్వారా వంద టెస్టులు ఆడిన పదో కరీబియన్ ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కాడు. ఫ్రాంచైజీ క్రికెట్ ప్రభావంతో జాతీయ జట్టు కన్నా లీగ్‌లకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్న విండీస్ ప్లేయర్ల మధ్య బ్రాత్‌వైట్ ఈ ఘనత అందుకోవడం విశేషం. జాతీయ జట్టు తరఫున ఒక్క మ్యాచ్ ఆడినా చాలు అనే లక్ష్యంతో క్రికెట్‌ను కెరీర్‌గా ఎంచుకున్న బ్రాత్‌వైట్... సుదీర్ఘ ఫార్మాట్‌పై మక్కువతో టి20ల జోలికి వెళ్లకుండా ఈ స్థాయికి చేరుకున్నాడు.

10 వెస్టిండీస్ తరఫున 100 టెస్టులు ఆడిన పదో ప్లేయర్‌గా బ్రాత్‌వైట్ నిలిచాడు. చందర్‌పాల్ (164), వాల్ష్ (132), లారా (130), రిచర్డ్స్ (121), హేన్స్ (116), క్లయివ్ లాయిడ్ (110), గార్డన్ గ్రీనిడ్జ్ (108), గేల్ (103), కార్ల్ హూపర్ (102) ఈ జాబితాలో ఉన్నారు.

28 ఏళ్లకే అనంతలోకాలకు..


కారు ప్రమాదంలో పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ డియాగో జోటా దుర్మరణం



మాడ్రిడ్: పోర్చుగల్ ఫుట్‌బాల్ జట్టు ఫార్వర్డ్ ప్లేయర్ డియాగో జోటా రోడ్డు ప్రమాదంలో కన్నుమూశాడు. స్పెయిన్‌లో జరిగిన కారు ప్రమాదంలో 28 ఏళ్ల డియాగో జోటాతో పాటు అతడి సోదరుడు ఆంద్రె సిల్వా (25) మృతి చెందాడు. జమోరా నగరంలో బుధవారం అర్ధరాత్రి దాటాక ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. ఘటనలో ఇతర వాహనాల ప్రమేయం లేదని... అతి వేగంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చారు. అయితే ఘటన జరిగిన సమయంలో కారు ఎవరు నడుపుతున్నారనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపడుతున్నారు. జోటా ఇటీవలే తన ప్రియురాలు రూట్ కార్డోసోను వివాహమాడాడు. 'ఈ బంధం శాశ్వతం' అని సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించిన వారాల్లోనే అనుకోని ప్రమాదంలో జోటా కన్నుమూశాడు. వీరికి ముగ్గురు సంతానం. గత నెలలో పోర్చుగల్ జాతీయ జట్టు నేషన్స్ లీగ్ టైటిల్ సాధించడంలో జోటా కీలక పాత్ర పోషించాడు. మరోవైపు ఆంద్రె సిల్వా పోర్చుగల్ క్లబ్ పినాఫైల్ తరఫున పలు డివిజన్ లీగ్‌లలో పాల్గొన్నాడు. 'ఈ విషాదం తీవ్రంగా బాధిస్తోంది' అని లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రకటించింది. ఇలాంటి క్లిష్ట సమయంలో జోటా, ఆంద్రె కుటుంబానికి అండగా ఉంటామని వెల్లడించింది.

లివర్‌పూల్ ప్రధాన ఆయుధం

ప్రముఖ ఫుట్‌బాల్ క్లబ్ లివర్‌పూల్ తరఫున 123 మ్యాచ్‌లాడిన జోటా 47 గోల్స్ సాధించాడు. లెఫ్ట్ వింగ్‌లో ఫార్వర్డ్‌గా ఆడే డియాగో జోటా... అద్వితీయమైన ఫినిషింగ్, ప్రత్యర్థికి అంతుచిక్కని డ్రిబ్లింగ్‌లో సిద్ధహస్తుడు. చిన్నప్పటి నుంచి ఆటను ప్రేమించిన జోటా... జూనియర్ స్థాయిలో సంచలనాలతో వెలుగులోకి వచ్చాడు. లా లీగాలో అట్లెటికో మాడ్రిడ్ తరఫున 2016 నుంచి రెండు సీజన్‌లు ఆడిన జోటా... ఆ తర్వాత వివిధ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. 2020 నుంచి లివర్‌పూల్ తరఫున కొనసాగుతున్న జోటా... మూడు మేజర్ ట్రోఫీలు గెలుచుకున్నాడు. గత సీజన్‌లో ప్రీమియర్ లీగ్ టైటిల్ గెలిచిన జట్టులో డియాగో ప్రధాన సభ్యుడు. ఇక 2019లో పోర్చుగల్ జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేసిన జోటా... కెరీర్‌లో 49 మ్యాచ్‌లాడి 14 గోల్స్ చేశాడు.





ఇది తీరని లోటు...

పోర్చుగల్ సాకర్ సమాఖ్య కూడా జోటా మృతికి సంతాపం తెలిపింది. 'ఇది పూడ్చలేని లోటు. జాతీయ జట్టు తరఫున 50కి పైగా మ్యాచ్‌లు ఆడిన అద్భుత ఆటగాడు ఇలా అర్ధాంతరంగా మృతిచెందడం కలచివేస్తోంది. సహచరులు, ప్రత్యర్థులు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ గౌరవించే అత్యుత్తమ ఆటగాడు అప్పుడే లోకం వీడి వెళ్లడం బాధగా ఉంది' అని ఒక ప్రకటనలో తెలిపింది. జోటా మృతికి సంతాపంగా... గురువారం పోర్చుగల్, స్పెయిన్ మహిళల జట్ల మధ్య యూరోపియన్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌కు ముందు ఇరు జట్ల ఆటగాళ్లు ఒక నిమిషం పాటు మౌనం వహించారు. పోర్చుగల్ ప్రధానమంత్రి లూయిస్ మోంటెనెగ్రో కూడా డియాగో జోటా మృతికి సంతాపం ప్రకటించారు. 'మేము ఇద్దరు చాంపియన్లను కోల్పోయాము. వారి లోటు పోర్చుగల్ సాకర్‌కు తీరని లోటు. వారి వారసత్వాన్ని గౌరవించేందుకు మా వంతు కృషి చేస్తాం. దేశ ఖ్యాతిని పెంచిన ఆటగాళ్లో జోటా ఒకడు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి. ఇది సాకర్‌కు విషాదకరమైన రోజు' అని పేర్కొన్నారు. ఇక సహచర ఆటగాడు పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో... ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశాడు. 'ఇప్పటి వరకు జాతీయ జట్టులో డియాగోతో కలిసి ఆడాను. ఇంతలో ఇలా ఎలా జరిగిందో. ఇటీవలే జోటా వివాహం జరిగింది. కుటుంబంతో కలిసి సంతోషంగా గడుపుతాడు అనుకుంటే ఊహించని ఘటన అతడిని దూరం చేసింది. ఈ క్లిష్ట సమయంలో అతడి కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. మేమందరం మిమ్మల్ని మిస్ అవుతాము' అని రొనాల్డో అన్నాడు. బాస్కెట్‌బాల్ దిగ్గజం లెబ్రాన్ జేమ్స్‌తో పాటు టెన్నిస్ స్టార్ రాఫెల్ నాదల్ వంటి పలు ప్లేయర్లతో పాటు... ఇతర క్లబ్‌లు, పలువురు ప్రముఖులు కూడా సంతాపం ప్రకటించారు.


కర్ణాటక ప్రభుత్వ సహకారం మరవలేనిది

దేశంలో తొలి జావెలిన్ త్రో ఈవెంట్‌పై నీరజ్ చోప్రా వ్యాఖ్య



బెంగళూరు: శిక్షణ కొనసాగిస్తూనే... టోర్నీ నిర్వహణ అంశాలను చూసుకోవడం సవాలుతో కూడుకున్నదని భారత స్టార్ జావెలిన్ త్రోయర్, రెండు ఒలింపిక్స్ పతకాల విజేత నీరజ్ చోప్రా అన్నాడు. అతడి పేరు మీద మన దేశంలో మొదటిసారి నిర్వహిస్తున్న అంతర్జాతీయ జావెలిన్ ఈవెంట్ 'నీరజ్ చోప్రా క్లాసిక్' శనివారం బెంగళూరు వేదికగా జరగనుంది. ఇటీవల పారిస్ డైమండ్ లీగ్, ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్ టోర్నీల్లో టైటిల్స్ నెగ్గిన నీరజ్ చోప్రా... ఆ వెంటనే 'నీరజ్ చోప్రా క్లాసిక్' ఈవెంట్ నిర్వహణ పనుల్లో మునిగిపోయాడు. ఈ నేపథ్యంలో నీరజ్ మాట్లాడుతూ... 'పారిస్, ఓస్ట్రావా టోర్నీల తర్వాత బెంగళూరుకు చేరుకున్నా. సాధనకు ఎక్కువ సమయం దక్కలేదు. దీంతో పాటు నిర్వహణకు సంబంధించిన వ్యవహారాలు పరిశీలిస్తున్నా. దేశంలో తొలిసారి నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి జావెలిన్ ఈవెంట్‌ను విజయవంతం చేయడానికి కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నాం' అని అన్నాడు. గురువారం కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసిన నీరజ్ చోప్రా... ఈవెంట్ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వ సహకారం మరవలేనిదని అన్నాడు. తక్కువ సమయంలో టోర్నీ కోసం ఏర్పాట్లు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

సెమీస్‌లో సాక్షి



అస్తానా (కజకిస్తాన్): వరల్డ్ బాక్సింగ్ కప్ టోర్నమెంట్‌లో భారత్‌కు మరో రెండు పతకాలు ఖరారయ్యాయి. మహిళల 54 కేజీల విభాగంలో సాక్షి... పురుషుల 70 కేజీల విభాగంలో హితేశ్ గులియా సెమీఫైనల్లోకి ప్రవేశించి కనీసం కాంస్య పతకాలను ఖాయం చేసుకున్నారు. క్వార్టర్ ఫైనల్లో సాక్షి 5-0తో తాతియానా రెజీనా (బ్రెజిల్)పై, హితేశ్ 5-0తో అల్మాజ్ ఒరోజ్‌బెకోవ్ (కజకిస్తాన్)పై గెలుపొందారు. ఈ టోర్నీలో ఇప్పటికే భారత్ నుంచి మీనాక్షి (48 కేజీలు), పూజా రాణి (80 కేజీలు), సంజూ (60 కేజీలు) సెమీఫైనల్లోకి దూసుకెళ్లి పతకాలను ఖాయం చేసుకున్నారు.



హ్యాట్రిక్ సిరీస్ లక్ష్యంతో..

మూడో టి20 బరిలోకి భారత మహిళల జట్టు

- నేడు ఇంగ్లండ్‌తో హర్మన్‌ప్రీత్ బృందం పోరు
- రాత్రి 11 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

లండన్: ఇంగ్లండ్ పర్యటనకు వచ్చిన భారత మహిళల జట్టు మొదట సన్నాహకంగా ఈసీబీ డెవలప్‌మెంట్ టీమ్‌తో రెండు మ్యాచ్‌లాడింది. ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ హర్మన్‌ప్రీత్ బృందం ఓడింది. అయితే అసలైన సిరీస్ మొదలుకాగానే అమ్మాయిల జట్టు అద్భుతంగా రాణిస్తోంది. వరుసగా ఓడిన జట్టే... ఇప్పుడు వరుసగా రెండు మ్యాచ్‌ల్ని గెలిచింది. ఇక 'హ్యాట్రిక్'తో ఇంకో రెండు మ్యాచ్‌లుండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో భారత మహిళల జట్టు బరిలోకి దిగుతోంది. ఇదే జరిగితే ఇంగ్లండ్ గడ్డపై అమ్మాయిలు సాధించే తొలి టి20 సిరీస్ కానుంది. మరోవైపు సొంతగడ్డపై వరుస పరాభవాల భారం ఒత్తిడి పెంచగా... తాజాగా అనువజ్ఞురాలైన కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ గాయంతో కీలకమైన మూడో మ్యాచ్‌కు దూరమైంది. ఇది ఆతిథ్య జట్టుకు మరింత ప్రతికూలమవగా... సిరీస్‌ను గెలిచేందుకు భారత్‌కు అనుకూలతనీయనుంది. రెగ్యులర్ కెప్టెన్ గైర్హాజరీతో టామీ బ్యూమాంట్ జట్టును నడిపించనుంది. బ్రంట్ స్థానంలో మైయా బౌచియెర్‌ను ఎంపిక చేశారు.

జోరుమీదున్న భారత్

విజయాలిచ్చి ఉత్సాహం, బ్యాటర్ల ఫామ్‌తో భారత అమ్మాయిల జట్టు జోరుమీదుంది. తొలి మ్యాచ్‌లో స్మృతి మంధాన చెలరేగితే... గత మ్యాచ్‌లో జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జోత్ కౌర్ బ్యాటింగ్ బాధ్యతను పంచుకున్నారు. రిచా ఘోష్ కూడా మెరుపులు మెరిపించింది. వీరితో పాటు షఫాలీ వర్మ, దీప్తి శర్మలు కూడా ఫామ్‌లో ఉండటం జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచుతోంది. బౌలింగ్‌లో తెలుగమ్మాయి శ్రీచరణి నిలకడగా ప్రత్యర్థి బ్యాటర్లను తిప్పేస్తోంది. తొలి మ్యాచ్‌లో 4 వికెట్లు తీసిన ఆంధ్ర స్పిన్నర్, రెండో మ్యాచ్‌లో రెండు కీలక వికెట్లతో ఇంగ్లండ్ వెన్నువిరిచింది. దీప్తి శర్మ, అమన్‌జోత్, రాధా యాదవ్, అరుంధతి రెడ్డి కూడా బౌలింగ్‌లో ఆకట్టుకుంటున్నారు. ఇన్ని సానుకూలాంశాల మధ్య మూడో విజయం సాధించడం హర్మన్‌ప్రీత్ బృందానికి ఏమంత కష్టం కానేకాదు. అన్నింటికి మించి ఆల్‌రౌండ్ సత్తాతో ఆతిథ్య జట్టును చిత్తు చేస్తున్న తీరు వచ్చే ఏడాది ఇక్కడ జరిగే టి20 ప్రపంచకప్‌కు ఎంతగానో దోహదం చేసే అవకాశాలున్నాయి.

గెలిస్తేనే నిలిచేది!

వరుస వైఫల్యాలకు తోడు రెగ్యులర్ కెప్టెన్ బ్రంట్ గాయంతో ఈ మ్యాచ్‌కు దూరమవడం ఇంగ్లండ్‌ను తీవ్రమైన ఒత్తిడిలోకి నెడుతోంది. పర్యాటక బ్యాటర్లేమో చెలరేగుతుంటే... సొంతగడ్డపై ఇంగ్లండ్ బ్యాటర్లు పరుగులు సాధించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. గెలిస్తేనే సిరీస్‌లో నిలిచే దశలో ఒత్తిడిని తట్టుకొని ఏ మేరకు నెట్టుకురాగలరన్నది ప్రశ్నార్థకంగా మారింది. తొలి టి20లో ఆడిన బ్రంట్ అందుబాటులో లేదు. రెండు మ్యాచ్‌లో బ్యూమాంట్ రాణించింది. వీరిద్దరు మినహా ఇంకెవరూ భారత బౌలర్లను ఎదుర్కోలేకపోతున్నారు. మూడో మ్యాచ్‌లోనూ ప్రత్యర్థి బౌలర్లదే పైచేయి అయితే మాత్రం మాంచెస్టర్ (నాలుగో మ్యాచ్ వేదిక) వెళ్లకముందే ఇక్కడే సిరీస్‌ను కోల్పోవడం ఖాయం.

తుది జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన, షఫాలీ, జెమీమా, అమన్‌జోత్, రిచా ఘోష్, దీప్తిశర్మ, రాధా యాదవ్, అరుంధతి, స్నేహ్ రాణా, శ్రీచరణి. ఇంగ్లండ్: టామీ బ్యూమాంట్ (కెప్టెన్), సోఫియా, డానీ వ్యాట్, మైయా బౌచియెర్, అమీ జోన్స్, అలైస్ క్యాప్సీ, అర్లాట్, సోఫీ ఎకిల్‌స్టోన్, లారెన్ ఫిలెర్, లారెన్ బెల్, లిన్సే స్మిత్.



లార్డింగ్టన్ రకం లావెండర్ పూదోటలో మొక్కల వరసను ట్రాక్టర్‌లో వెళ్తూ పరిశీలిస్తున్న రైతు. బ్రిటన్‌లోని చిచెస్టర్ సిటీలో తీసిందీ ఫొటో.





వర్షాకాలం వచ్చేసింది. రైతులు దుక్కి దున్నడం, పైర్లు వేయడం మొదలైంది. గురువారం పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లాలో ఓ రైతు దున్నపోతులతో పొలం దున్నుతుండగా, అసోం రాష్ట్రం నగావ్ జిల్లాలో గురువారం వరి పొలంలో నాట్లు వేస్తూ కెమెరాలకు చిక్కారు.

బిహార్‌లో ఒంటరి పోరు

ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ప్రకటన

- ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికలకే అని స్పష్టీకరణ
- నష్టపోనున్న కాంగ్రెస్, ఆర్‌జేడీ



సాక్షి, న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ గురువారం విపక్ష ఇండియా కూటమికి ఝలక్ ఇచ్చే కీలక ప్రకటన చేశారు. వచ్చే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తు ప్రసక్తే లేదని కుండబద్దలు కొట్టారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ఉద్దేశించింది మాత్రమేనని పేర్కొన్నారు. 'ఆప్ బిహార్ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తుంది. ఇండియా కూటమి లోక్‌సభ ఎన్నికలకు మాత్రమే. ఇప్పుడు కాంగ్రెస్‌తో పొత్తు లేదు. పొత్తు ఉంటే కాంగ్రెస్ పార్టీ గుజరాత్‌లోని విశావదర్ ఉప ఎన్నికలో ఎందుకు పోటీ చేసింది. కాంగ్రెస్ కేవలం ఆప్‌ను ఓడించేందుకు పోటీ చేసింది. ఆప్‌ను ఓడించేందుకు, ఓట్లను తగ్గించేందుకు కాంగ్రెస్‌ను బీజేపీ పంపింది' అని అహ్మదాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో కేజ్రీవాల్ విమర్శలు గుప్పించారు. బిహార్‌లో ఆప్ తన ఎన్నికల అరంగేట్రం కోసం సన్నాహాలు మొదలుపెట్టిందన్నారు. తమ నిర్ణయం ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలను సవాల్ చేయడానికి ఒక ప్రణాళికాబద్ధమైన చర్యగా అభివర్ణించారు. అదే సమయంలో గుజరాత్‌లో ఆప్ రాజకీయ గెలుపుపై కీలక వ్యాఖ్యలు చేశారు. 'గుజరాత్‌లో ఏ ఒక్క వర్గమూ సంతోషంగా లేదు. అయినప్పటికీ బీజేపీ పదేపదే గెలుస్తోంది. దీనికి కారణం అక్కడ బలమైన ప్రత్యామ్నాయం లేకపోవడమే. కాంగ్రెస్ పార్టీ బీజేపీ జేబులో ఉంది. ఒకవిధంగా బీజేపీని గెలిపించే కాంట్రాక్ట్‌ను కాంగ్రెస్ తీసుకుంది. ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మరు. కాంగ్రెస్‌కు ఓటేస్తే గెలవరని, గెలిచినా బీజేపీలోకి వెళ్తారని ప్రజలకు తెలుసు. అందుకే ఆప్‌ను ప్రజలు ప్రత్యామ్నాయంగా చూస్తున్నారు. గుజరాత్‌ను మొదటి 30 ఏళ్లు కాంగ్రెస్, తర్వాత 30 ఏళ్లు బీజేపీ పాలించాయి. ఇప్పుడు ఆప్‌కు అవకాశం వస్తుంది' అని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు దెబ్బే

ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఆర్‌జేడీ పార్టీలు ప్రధానంగా యాదవులు, ముస్లింలు, దళితుల ఓట్లపైనే ఆధారపడ్డాయి. కాంగ్రెస్ ఎక్కువగా పట్టణ, దళిత నియోజకవర్గాల్లో ఆధిపత్యం చెలాయిస్తోంది. ఆప్ సైతం ఈ ఓట్లపైనే దృష్టి పెట్టే అవకాశముంది. విద్య, ఆరోగ్యం, విద్యుత్ వంటి అంశాలపై బిహార్‌లో ప్రజల వద్దకు వెళ్తామని, పట్టణ పేదలు, గ్రామీణుల ప్రజలను చేరుకునేలా తమ వ్యూహం ఉంటుందని కేజ్రీవాల్ ఇదివరకే ప్రకటించారు. ఆప్ నిజంగా అదే వ్యూహంతో ముందుకెళితే ఇండియా కూటమి ఓట్లకు భారీగా గండి పడే అవకాశాలున్నాయి. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో ఇండియా కూటమి 9 స్థానాలను గెలుచుకుంది. ఆప్ పోటీలో నిలిస్తే కాంగ్రెస్, ఆర్‌జేడీ ఓట్ల వాటాను దెబ్బతీసే అవకాశాలున్నాయి. ఇది పరోక్షంగా ఎన్డీఏకు ప్రయోజనం చేకూర్చనుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 52 శాతం, ఇండియా కూటమి 42 శాతం ఓట్లను సాధించాయి. ఇప్పుడు ఆప్ పోటీలో ఉంటే ఇండియా కూటమికు నష్టం జరిగే అవకాశం ఉంది. సంక్లిష్టమైన కుల సమీకరణాలు, బలమైన ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం ఉండే బిహార్ రాజకీయాల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయాలనే ఆప్ నిర్ణయం ఇండియా కూటమికి నష్టం కలిగించేదేనని రాజకీయ విశ్లేషకులు సైతం లెక్కలు వేస్తున్నారు. ఆప్ కనీసంగా 5–10శాతం ఓట్లు సాధించినా, అది ఎన్డీఏకే కలిసొస్తుందని అంటున్నారు. ఈ ఓట్ల శాతం రాష్ట్రంలో దీర్ఘకాలిక ప్రత్యామ్నాయంగా తనను ప్రకటించుకునేందుకు ఆప్‌కు దోహదపడుతుందని భావిస్తున్నారు.

ఆగని అమాయకుల మరణాలు

అన్నార్తులపై బుల్లెట్ల వర్షం

- గాజా ఘటనల్లో మొత్తంగా 94 మంది దుర్మరణం

టెల్ అవీవ్: ఇరవై ఒక్కటి నెలలుగా వైమానిక, క్షిపణి దాడులతో గాజాను మరుభూమిగా మారుస్తున్న ఇజ్రాయెల్ బలగాలు భూతలం నుంచీ విచక్షణారహితంగా కాల్పులు తెగబడుతున్నాయి. ఆకలితో అలమటిస్తూ సాయం కోసం క్యూలైన్లలో నిల్చున్న నిస్సహాయులపైకీ ఇజ్రాయెల్ బలగాలు బుల్లెట్ల వర్షం కురిపించాయి. వైమానిక దాడులు, పాలస్తీనియన్లపై నేరుగా కాల్పుల ఘటనల్లో గత 24 గంటల్లో 94 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్ సాయంతో కొత్తగా ఏర్పాటైన అమెరికా సంస్థ 'గాజా హ్యుమానిటేరియన్ ఫౌండేషన్'సంస్థ భోజన వితరణ కేంద్రాల వద్ద కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. గాజా స్ట్రిప్‌లో వేర్వేరు చోట్ల ఔషధాలు, అత్యావశ్యక సరకులు అందించే ప్రాంతాల్లో జనం ఎగబడటంతో వారిని అదుపుచేసేందుకు ఇజ్రాయెల్ సైనికులు నిస్సహాయులపై కాల్పులు జరిపారు. ఈ దారుణఘటనలో మరో 40 మంది ప్రాణాలు కోల్పోయారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు మువాజీ జోన్‌పై జరిగిన వైమానిక దాడుల్లో డజన్ల మంది చనిపోయారని గాజా ఆస్పత్రులు, ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. యుద్ధం మొదలైన 2023 అక్టోబర్ ఏడో తేదీ నాటి నుంచి ఇజ్రాయెల్ జరిపిన కనీవినీ ఎరుగని భూతల, గగనతల దాడుల్లో ఇప్పటిదాకా 57,000 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. 23 లక్షల గాజా జనాభాలో 90 శాతం మంది వేరే దేశాలు, సురక్షిత ప్రాంతాలకు వలసవెళ్లారు.

సభలో అవాంతరాలను తగ్గించండి

రాజకీయ పార్టీలకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వినతి

గురుగ్రామ్: సభా కార్యక్రమాలకు అవరోధం కలిగించడం మానుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాజకీయ పార్టీలను కోరారు. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగించే రాజకీయ పార్టీలకు ప్రజలు గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. గతేడాది జూన్‌లో జరిగిన 18వ లోక్‌సభ మొట్టమొదటి సెషన్‌లో అంతరాయాలు తక్కువగా నమోదయ్యాయన్నారు. 'మారాల్సిన సమయం వచ్చింది. మన ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే, ప్రజాస్వామ్య సంస్థలను జవాబుదారీగా ఉంచాలంటే, సభలు సరైన రీతిలో పనిచేసేలా చూసుకోవాల్సిన అవసరముంది' అని ఓం బిర్లా తెలిపారు. సమావేశాలు సక్రమంగా కొనసాగితేనే ప్రజల సమస్యలపై చర్చలు చేపట్టేందుకు అవకాశముంటుందన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 21వ తేదీ నుంచి మొదలు కానున్న వేళ ఆయనీ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఓం బిర్లా గురువారం పట్టణ స్థానిక సంస్థల జాతీయ స్థాయి సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మాదిరిగా పట్టణ స్థానిక సంస్థల సమావేశాల్లోనూ ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌లు కలిగి కనీసం 8 గంటలపాటు కొనసాగాలన్నారు. సభలో చర్చల ఫలితంగా యంత్రాంగంలో జవాబుదారీ తనం, కార్యక్రమాల్లో పారదర్శకత పెరుగుతాయన్నారు.

కొనసాగుతున్న జడ్జీల ఎంపిక ప్రక్రియ

- అభ్యర్థుల వివరాలను ఆమూలాగ్రం పరిశీలిస్తున్న సుప్రీం కొలీజియం
- రెండు రోజుల్లో 54 మంది ఇంటర్వ్యూలు పూర్తి
- దేశవ్యాప్తంగా 25 హైకోర్టుల్లో 371 ఖాళీలు
- తెలంగాణలో 16, ఏపీలో ఎనిమిది జడ్జీ పోస్టులు ఖాళీ

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని హైకోర్టుల్లో ఖాళీగా ఉన్న జడ్జి పోస్టులను భర్తీ చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజియం తన ఎంపిక విధానాన్ని మరింతగా కఠినతరం చేసింది. అనధికారిక వర్గాల సమాచారం ప్రకారం జూలై ఒకటో తేదీ నుంచి రెండు రోజుల్లో 54 మంది అభ్యర్థులతో ముఖాముఖి సమావేశమై వారి సమగ్ర వివరాలను కొలీజియం పరిశీలించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్‌లతో కూడిన కొలీజియం జూలై 1, 2 తేదీల్లో అభ్యర్థులతో విస్తృతంగా ఇంటర్వ్యూలు నిర్వహించింది. మొదటి రోజున 20 మందితో, రెండో రోజున 34 మందితో సమావేశమైంది. అభ్యర్థుల పనితీరు, బయోడేటా, అనుభవం వంటి అంశాలపై అరగంటపాటు ప్రశ్నలు సంధిస్తూ క్షుణ్ణంగా పరిశీలించింది. ఇప్పటివరకు ఎక్కువగా రాష్ట్ర ప్రభుత్వ నివేదికలు, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) రిపోర్టులు, అలాగే సంబంధిత హైకోర్టులకు చెందిన సుప్రీంకోర్టు జడ్జిల అభిప్రాయాలపైనే ఆధారపడుతూ నియామకాలు జరిగేవి. కొలీజియం ఇప్పటికే చాలా సందర్భాల్లో కేంద్ర ప్రభుత్వంతో సిఫారసుల ఆమోదంలో ఆలస్యాలు రావడం వల్ల సమస్యలు ఎదుర్కొంటోంది. కొంతమంది అభ్యర్థులు వీలైనంతకాలం ఎదురు చూడలేక తమ అభ్యర్థిత్వం వెనక్కి తీసుకోవడం కూడా జరిగిపోయింది. అయితే ఇటీవల జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో లభించిన అప్రకటిత నగదు కేసు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు వంటి పరిణామాల నేపథ్యంలో కొలీజియం ఈసారి తన పరిశీలనను కఠినతరం చేసింది. ఇందులో భాగంగా, జిల్లా న్యాయవ్యవస్థ నుంచి వచ్చే అభ్యర్థుల కోసం ఒక రోజు, బార్ అభ్యర్థుల కోసం మరొక రోజు కేటాయించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 25 హైకోర్టుల్లో 371 ఖాళీలుండగా ఇందులో తెలంగాణ హైకోర్టులో 16, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో 8 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

నా ఫ్రెండ్‌ను కత్తితో పొడిచాడు!

కోల్‌కతా రేపిస్ట్‌పై మరో విద్యార్థి ఆరోపణలు

కోల్‌కతా: కోల్‌కతా లా కాలేజీలో విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడిన టీఎంసీ నేత మోనోజిత్ మిశ్రా బాధితులు ఒక్కరొక్కరుగా బయటకు వస్తున్నారు. కాలేజీ విద్యార్థులను శారీరకంగా, మానసికంగా అతడు వేధిస్తుంటాడని, తన స్నేహితుడొకరిని మిశ్రా కత్తితో పొడిచాడంటూ ఓ విద్యార్థి ఆరోపించారు. 'మాజీ విద్యార్థులను విమర్శించిన వారిని అతడు హింసిస్తుంటాడు. మానసికంగా వేధించినా లెక్క చేయని వారిపై భౌతికంగా దాడులు చేస్తుంటాడు' అని బాధిత విద్యార్థి వివరించారు. తమ జోలికొస్తే చంపేస్తామని వాళ్లు బెదిరించేవారు. 'నా ఫ్రెండ్‌పై అతడు పదేపదే దాడికి పాల్పడ్డాడు. ఒక రోజు క్లాస్ నుంచి బయటికి వచ్చిన మాపై అతడి ముఠా దాడి చేసింది. నా ఫ్రెండ్‌ను కిడ్నాప్ చేసింది. మా ఫ్రెండ్‌ను బ్లేడ్‌తో కోసి, కర్రలతో కొట్టారు. రక్తపు మడుగులో అతడిని వదిలేసి వెళ్లారు. ఆ వీడియోలను మాకు చూపి బెదిరించారు. ఆ భయంతోనే నేను, మా ఫ్రెండ్ దాదాపు 10 నెలలుగా కాలేజీకి వెళ్లడం మానేశాం' అని అతడు తెలిపాడు. జూన్ 28వ తేదీన లా కాలేజీలోకి వెళ్లిన తనపై మోనోజిత్, మరో ఇద్దరితో కలిసి గ్యాంగ్ రేప్‌నకు పాల్పడినట్లు ఓ విద్యార్థిని పోలీసులకు ఫిర్యాదు చేయడం తెల్సిందే.

అమెరికా-పాక్ రక్షణ బంధం బలోపేతం!

- అమెరికాలో పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ జహీర్ అహ్మద్ బాబర్ సిద్ధూ పర్యటన
- రక్షణ సహకారంపై యూఎస్ సైనికాధికారులతో చర్చలు

వాషింగ్టన్: అమెరికా–పాకిస్తాన్ మధ్య రక్షణ బంధం క్రమంగా బలోపేతం అవుతోంది. పహల్గాం ఉగ్రవాద దాడి తర్వాత భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భారీగా నష్టపోయిన పాక్ సైన్యం అమెరికాకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్(పీఏఎఫ్) చీఫ్, ఎయిర్ చీఫ్ మార్షల్ జహీర్ అహ్మద్ బాబర్ సిద్ధూ అమెరికాలో పర్యటిస్తున్నారు. ఇదొక ఉన్నత స్థాయి పర్యటన. పాకిస్తాన్ వైమానిక దళం అధినేత అమెరికాలో అధికారికంగా పర్యటిస్తుండడం గత పదేళ్లలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం. పాక్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వైట్‌హౌస్‌లో ఇటీవల ఘనమైన ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. అమెరికాలో పర్యటనలో భాగంగా జహీర్ అహ్మద్ బాబర్ సిద్ధూ అమెరికా అత్యున్నత సైనికాధికారులతో, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. యూఎస్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డేవిడ్ అల్విన్‌ను కలుసుకున్నారు. విస్తృతంగా చర్చలు జరిపారు. అమెరికాతో రక్షణ సహకారం పెంపొందించుకోవడం, కలిసి పనిచేయడం, టెక్నాలజీ ఆధారిత సైనిక మార్పిడి వంటి అంశాలపై చర్చించినట్లు సమాచారం. జహీర్ అహ్మద్ బాబర్ సిద్ధూ పర్యటనతో అమెరికా–పాక్ మధ్య ద్వైపాక్షిక రక్షణ సహకారం, పరస్పర ప్రయోజనాలు మరింత వృద్ధి చెందుతాయని ఆశిస్తున్నట్లు పాకిస్తాన్ వైమానిక దళం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇరుదేశాల సంబంధాల్లో ఇదొక కీలక మైలురాయి అని అభివర్ణించింది. తమ వైమానిక దళాన్ని ఆధునీకరించాలని పాకిస్తాన్ నిర్ణయానికొచ్చింది. ఇందుకోసం అమెరికా సాయాన్ని అర్థిస్తోంది. అమెరికా నుంచి 70 ఎఫ్–16 బ్లాక్ ఫైటర్‌జెట్లు, గగనతల రక్షణ వ్యవస్థలు, ఏఐఎం–7 స్పారో ఎయిర్–టు–ఎయిర్ మిస్సైళ్లు, ఆర్టిలరీ రాకెట్ సిస్టమ్ బ్యాటరీలు సమకూర్చుకోవాలని భావిస్తోంది. చైనా ఇచ్చిన ఆయుధాలపై ఆధారపడడం క్షేమంకాదని ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు తెలిసొచ్చింది. అందుకే అమెరికా ఆయుధాలపై దృష్టి పెట్టింది. అందుకు అమెరికా సైతం సానుకూలంగా స్పందిస్తుండడం చర్చనీయాంశంగా మారతోంది.

బీజేపీ బెంగాల్ చీఫ్‌గా సామిక్ భట్టాచార్య

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడిగా రాజ్యసభ ఎంపీ సామిక్ భట్టాచార్య ఎంపికయ్యారు. బీజేపీ ప్రెసిడెంట్ పదవికి నామినేషన్ల దాఖలుకు గడువు బుధవారం మధ్యాహ్నంతో ముగియగా సామిక్ భట్టాచార్య ఒక్కరే నామినేషన్ వేశారు. ఆయన ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు గురువారం బీజేపీ అధికారికంగా ప్రకటించింది. దీంతో, వచ్చే ఏడాది పశ్చిమబెంగాల్ అసెంబ్లీకి జరిగే ఎన్నికల్లో అధికార టీఎంసీని ఢీకొట్టి కాషాయ పార్టీని విజయతీరాలకు నడిపించే బాధ్యత ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ మూలాలున్న సామిక్‌పై పడిందని అంటున్నారు. 'బెంగాల్‌లో సున్నా నుంచి మా ప్రస్థానం మొదలైంది. రాష్ట్ర ప్రజలు మాకొక స్థానం కల్పించారు. పార్టీ సిద్ధాంతాలపై ఎన్నడూ మేం రాజీపడలేదు. టీఎంసీ ఓటమికి సమయం దగ్గరపడింది' అని రాష్ట్ర పార్టీ పగ్గాలు చేపట్టిన అనంతరం సామిక్ భట్టాచార్య పేర్కొన్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 77 సీట్లను బీజేపీ గెలుచుకుంది. ఉప ఎన్నికలు, కొందరు టీఎంసీ చేరడం వంటి కారణాలతో ప్రస్తుతం బీజేపీ ఎమ్మెల్యేల 65కి తగ్గిపోయింది.

రెండు వారాల్లో 900 సార్లు..

జపాన్ దీవులను వణికిస్తున్న వరుస భూకంపాలు

టోక్యో: వరుస భూకంపాలు జపాన్‌లోని మారుమూల ద్వీపాలను నిద్రలేకుండా చేస్తున్నాయి. కేవలం రెండు వారాల్లో 900 భూకంపాలు సంభవించాయి. దీంతో ప్రజలకు రాత్రుళ్లు నిద్ర ఉండటం లేదు. ఏ క్షణం ఏం జరగుతుందోనని ఆందోళనతో రాత్రంతా మేల్కొని ఉంటున్నారు. జూన్ 21 నుంచి టోకారా దీవుల చుట్టూ ఉన్న సముద్రాలలో భూకంప కార్యకలాపాలు చాలా చురుగ్గా ఉన్నాయని, బుధవారం 5.5 తీవ్రతతో సంభవించిన భూకంపం సంభవించిందని అధికారులు తెలిపారు. అయితే ఎలాంటి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. కానీ అవసరమైతే ఖాళీ చేయడానికి సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచించారు. భూమిపై అత్యంత భూకంప ప్రమాదం ఉన్న దేశాలలో జపాన్ ఒకటి. టెక్టోనిక్ ప్లేట్లు కలిసే.. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్ ప్రదేశంలో ఉండటంతో తరచూ భూకంపాలు వస్తుంటాయి. ఇది ప్రతి సంవత్సరం దాదాపు 1,500 భూకంపాలను ఎదుర్కొంటుంది. కాగా, 12 టోకారా దీవులలో ఏడింటిలో దాదాపు 700 మంది నివసిస్తున్నారు. ఈ సుదూర దీవులలో కొన్నింటిలో ఆసుపత్రులు లేవు. ప్రిఫెక్చురల్ రాజధాని కగోషిమాకు వెళ్లాలంటే ఫెర్రీలో కనీసం ఆరు గంటలు ప్రయాణించాలి. భూకంపాల కారణంగా టోకారా దీవుల్లోని కొన్ని గెస్ట్‌హౌస్‌లు పర్యాటకులను అనుమతించడం లేదు. త్వరలో భారీ, ప్రాణాంతక భూకంపం సంభవించవచ్చనే వదంతులలో దేశం మొత్తం ఆందోళన చెందుతున్న తరుణంలో ఈ వరుస ప్రకంపనలు వస్తున్నాయి.

పుణేలో టెకీపై డెలివరీ ఏజెంట్ అత్యాచారం

పుణె: మహారాష్ట్రలోని పుణె సిటీలో దారుణం జరిగింది. ఆర్డర్ చేసిన వస్తువులు అందించే డెలివరీ ఏజెంట్ ముసుగులో ఓ దుండగుడు 22 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె సొంత ఫ్లాట్‌లోనే బుధవారం రాత్రి 7.30 గంటలకు ఈ ఘటన చోటుచేసుకుంది. అత్యాచారం తర్వాత దుండగుడు ఆమె ఫోన్‌లోనే ఫొటోలు తీశాడు. ఎవరికైనా ఫిర్యాదు చేస్తే ఈ ఫొటోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని, మళ్లీ వస్తానంటూ అదే ఫోన్‌లో ఒక సందేశం రికార్డు చేశాడు. చాలాసేపటి తర్వాత అపస్మారక స్థితి నుంచి బయటపడిన బాధిత యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దుండగుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు.

త్వరలో జస్టిస్ వర్మపై అభిశంసన!

న్యూఢిల్లీ: కాలిన కరెన్సీ నోట్ల కట్టల వ్యవహారంలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను పార్లమెంట్‌లో అభిశంసించడానికి రంగం సిద్ధమవుతోంది. అభిశంసన తీర్మానానికి మద్దతుగా విపక్ష సభ్యుల నుంచి సంతకాలు సేకరించబోతున్నామని, త్వరలో ఈ ప్రక్రియ ప్రారంభమతుందని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గురువారం చెప్పారు. జస్టిస్ వర్మను పదవి నుంచి తొలగించే తీర్మానానికి మద్దతు ఇస్తామని ఇప్పటికే విపక్ష సభ్యులు ప్రకటించారు. అయితే, అభిశంసన తీర్మానాన్ని పార్లమెంట్‌లోని ఏ సభలో ప్రవేశపెట్టాలన్నది ఇంకా నిర్ణయించలేదని రిజిజు తెలిపారు. లోక్‌సభలో తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 100 మంది ఎంపీలు, రాజ్యసభలో ప్రవేశపెట్టడానికి 50 మంది ఎంపీల సంతకాలు అవసరం. ఏ సభలో ప్రవేశపెట్టాలన్నది ప్రభుత్వం నిర్ణయించిన తర్వాత సంతకాలు సేకరిస్తామని మంత్రి పేర్కొన్నారు.

ఇండోనేసియాలో పడవ మునక

ఆరుగురు మృతి, 29 మంది గల్లంతు

బాలి: ఇండోనేసియాలోని బాలిలో పడవ మునిగిన ఘటనలో ఆరుగురు చనిపోయారు. కనీసం 29 మంది గల్లంతయ్యారు. 31 మందిని రక్షించామని అధికారులు తెలిపారు. కేఎంపీ తును ప్రతమ జయ అనే పడవ బుధవారం సాయంత్రం తూర్పు జావాలోని కేతాపాంగ్ ఓడరేవు నుంచి బాలిలోని గిలిమనుక్‌కు బయలుదేరిన అరగంటకే అలల తాకిడికి గురైంది. ప్రమాద సమయంలో ఫెర్రీలో 53 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది, 22 వాహనాలు, ట్రక్కులు ఉన్నాయి. గురువారం మధ్యాహ్నం వరకు 31 మందిని కాపాడారు. వీరిలో సుమారు 20 మంది అపస్మారక స్థితిలో ఉన్నారని అధికారులు తెలిపారు. టగ్ బోట్లు, నౌకలతో సహా తొమ్మిది బోట్లతో గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు. అలలు రెండు మీటర్ల ఎత్తులో ఎగసిపడుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. పూర్తిగా మునిగిపోయిన పడవలో చిక్కుకుని ఎవరూ ఉండే అవకాశాల్లేవని చెప్పారు. కాగా, అధికారులు చెబుతున్న దానికంటే పడవలో ఎక్కువ మంది ప్రయాణికులు ఉండే అవకాశాలున్నాయని ప్రత్యక్ష సాక్ష్యులు అంటున్నారు. ఇలా ఉండగా, ఇండోనేసియాలోని దీవుల మధ్య రోజూ ప్రయాణించే లక్షలాది మందికి పడవలే ఆధారం. అయితే, కాలం చెల్లిన ఓడలు, తగినంత భద్రతా తనిఖీలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల బాలి సమీపంలో ఒక పర్యాటక పడవ బోల్తా పడటంతో ఆస్ట్రేలియాకు చెందిన ఓ మహిళ మరణించింది. 2018లో టోబా సరస్సులో పడవ మునిగిన ఘటనలో 150 మందికి పైగా జల సమాధి అయ్యారు.



గ్రీస్ దేశంలోని క్రీట్ దీవంలోని అప్లియా వద్ద దట్టంగా కమ్ముకున్న కార్చిచ్చు. దీంతో సమీప ఇయెరాపెట్రా పట్టణం నుంచి జనాన్ని ఖాళీ చేయించారు

కాలిఫోర్నియాలో బాణసంచా పేలుడు

ఏడుగురు గల్లంతు

కాలిఫోర్నియా: ఉత్తర కాలిఫోర్నియాలోని గ్రామీణ ప్రాంతంలో బాణసంచా ఫ్యాక్టరీలో బుధవారం భారీ పేలుడు సంభవించింది. ఏడుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. బుధవారం ఉదయం నాటికి దాదాపు 80 ఎకరాలకు మంటలు విస్తరించాయి. భారీ మంటలు వ్యవసాయ పొలాలకు వ్యాపించడంతో చుట్టుపక్కల కమ్యూనిటీలోని ప్రజలను ఖాళీ చేయించారు. గల్లంతైన వారిని గుర్తించడానికి అత్యవసర బృందాలు, దర్యాప్తు అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. డ్రోన్లను ఉపయోగించి ఆ ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నామని కాలిఫోర్నియా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫారెస్ట్రీ అండ్ ఫైర్ ప్రొటెక్షన్ తెలిపింది. అయితే ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో ఎవరైనా పనిచేస్తున్నారా? లేదా సమీప ప్రాంతాల్లో నివసిస్తున్నారా? అనే విషయం ఇంకా తెలియరాలేదు. పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుగుతోంది. కాగా, పేలుడు సంభవించిన ఫ్యాక్టరీ 'బ్లాక్‌స్టార్ బాణసంచా సంస్థ' రాష్ట్ర అగ్నిమాపక శాఖ వెబ్‌సైట్ లైసెన్స్ జాబితాలో ఉందని ప్రభుత్వం తెలిపింది.

కూలిన ఉగాండా సైనిక హెలికాప్టర్

ఐదుగురు మృతి, ముగ్గురికి గాయాలు

మొగదిషు: ఆఫ్రికన్ యూనియన్ శాంతి పరిరక్షక మిషన్ (ఏయూఎస్ఎస్ఓఎం)తో వెళ్తున్న ఉగాండా సైనిక హెలికాప్టర్ సోమాలియాలోని మొగదిషు విమానాశ్రయంలో బుధవారం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మరణించారు. ముగ్గురు తీవ్ర కాలినగాయాలతో బయటపడ్డారు. హెలికాప్టర్ కూలిపోయిన వెంటనే అందులో ఉన్న మందుగుండు సామగ్రి పేలిపోయి, సమీపంలోని నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. హెలికాప్టర్ మరి కొద్దిసేపట్లో మొగదిషు అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి ఉండగా ప్రమాదం జరిగింది. అల్–ఖైదా అనుబంధ సంస్థ అల్–షబాబ్‌ను ఎదుర్కోవడానికి ఏయూఎస్ఎస్ఓఎం దేశ సైన్యానికి సహాయం చేస్తోంది. ప్రస్తుతం 11,000 మందికి పైగా ఏయూఎస్ఎస్ఓఎం సిబ్బంది సోమాలియాలో ఉన్నారు.

ఎమ్మెల్యేను పరారీలో ఉన్న నేరగాడిగా ప్రకటించిన యూపీ కోర్టు

మౌ: ఉత్తరప్రదేశ్‌లోని ఎంపీ/ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక న్యాయస్థానం సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఎమ్మెల్యేను పరారీలో ఉన్న నేరగాడిగా ప్రకటించింది. ఘోసి ఎమ్మెల్యే సుధాకర్ సింగ్‌పై దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం నమోదైన కేసుపై గురువారం మౌలో ప్రత్యేక న్యాయస్థానం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసిందని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దొహారీఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ విద్యుత్ ఉప కేంద్రం వద్ద 1986లో విద్యుత్ కోతలకు నిరసనగా ఆందోళన జరిగింది. ఈ సమయంలో సుధాకర్ సింగ్ అధికారుల అనుచితంగా ప్రవర్తించడంతోపాటు విధ్వంసానికి పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదైంది. అప్పట్లో ఈ ప్రాంతం ఆజంగఢ్ జిల్లా పరిధిలో ఉండటంతో విచారణ చేపట్టిన ఆజంగఢ్ కోర్టు సింగ్‌కు బెయిలిచ్చింది. అనంతరం, ప్రత్యేక జిల్లాగా మారడంతో కేసు ఆజంగఢ్ నుంచి మౌకు మారింది. కేసు విచారణకు హాజరు కావడం లేదంటూ మౌ కోర్టు 2023లో సింగ్‌ను పరారీలో ఉన్న నేరగాడి ప్రకటించింది. తాజాగా, ఈ కేసును విచారించిన న్యాయస్థానం మరోసారి సింగ్‌ను పరారీలో ఉన్నట్లు ప్రకటించింది.

పాత వాహనాలను జప్తు చేయబోం

నిషేధం నిర్ణయంపై వెనక్కి తగ్గిన ఢిల్లీ సర్కార్

న్యూఢిల్లీ: పదేళ్లు పైబడిన పాత వాహనాలను జప్తు చేయాలన్న నిర్ణయంపై ఢిల్లీలోని బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. ఇకపై జీవిత కాలం ముగిసిన వాహనాలను స్వాధీనం చేసుకోబోమని తెలిపింది. సాంకేతికపరమైన సమస్యలు, సంక్లిష్ట వ్యవస్థల కారణంగా పదేళ్లు పైబడిన వాహనాలపై ఇంధన నిషేధం సాధ్యం కాదని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా తెలిపారు. జూలై ఒకటో తేదీ నుంచి ఢిల్లీ రాజధాని ప్రాంతంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో పదేళ్లు పైబడిన డీజిల్ వాహనాలకు, 15 ఏళ్లు పైబడిన పెట్రోల్ వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపరాదని, వాటిని రోడ్లపైకి రానివ్వరాదని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించడం తెల్సిందే. దీనిపై మంత్రి సిర్సా గురువారం మీడియాతో మాట్లాడారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నందున ఈ నిర్ణయాన్ని పక్కనబెట్టాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. నిషేధం నేపథ్యంలో ఇంధనం నింపుకోవడానికి పెట్రోల్ పంపుల వద్దకు చేరుకున్న జీవితకాలం ముగిసిన వాహనాలను రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకుంటున్నారు. దీన్ని ఇక నిలిపివేస్తామన్నారు. పర్యావరణం దెబ్బతినకుండా, కాలం మళ్లిన వాహనాలను స్వాధీనం చేసుకునే అవసరం లేకుండా జాతీయ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్) పరిధిలోనే నిషేధాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామని వివరించారు. ఎన్‌సీఆర్ పరిధిలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్(ఏఎన్‌పీఆర్) వ్యవస్థ నిరంతరాయంగా అందుబాటులోకి వచ్చే వరకు గత నెల్లో జారీ చేసిన 89వ నంబర్ ఉత్తర్వును నిలిపివేయాలని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిటీకి లేఖ రాసినట్లు చెప్పారు. కాలం చెల్లిన వాహనాల(ఈఎల్‌వీ)ను గుర్తించే ఏఎన్‌పీఆర్ వ్యవస్థ వల్ల సాంకేతికపరమైన అవాంతరాలు ఎదురవుతున్నాయని తెలిపారు.

అమెరికాలో కాల్పులు.. నలుగురు మృత్యువాత

షికాగో: అమెరికాలోని షికాగో నగరంలో చోటుచేసుకున్న కాల్పుల ఘటనలో నలుగురు చనిపోగా 14 మంది వరకు గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. రివర్ నార్త్ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి ఓ నైట్ క్లబ్ పాప్ ఆల్బమ్ విడుదల కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు. క్లబ్ వద్ద గుమికూడిన వారిపై గుర్తు తెలియని వ్యక్తులు తుపాకులతో కాల్పులు జరిపి, ఆ వెంటనే వాహనంలో పరారయ్యారు. తీవ్రగాయాలతో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఘటనకు సంబంధించి ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని పోలీసులు తెలిపారు.

సింధు, వైదిక నాగరికతలు

సింధు, వైదిక నాగరికతల మౌలిక లక్షణాలను తులనాత్మకంగా పరిశీలించండి?

క్రీ.పూ.2500 నుంచి 1750 మధ్య వాయవ్య భారతదేశంలో సింధు, దాని ఉపనదుల పరివాహక ప్రాంతాల్లో విలసిల్లిన నాగరికతనే సింధు నాగరికత అంటారు. క్రీ.పూ.1500 నుంచి 600 సంవత్సరాల మధ్య సప్త సింధు, గంగా-యమునా మైదాన ప్రాంతాల్లో వెలసిన నాగరికత వైదిక నాగరికత. ఈ నాగరికతలు ఒక దాని తర్వాత ఒకటి వెలసినప్పటికీ వీటి మధ్య పలు అంశాల్లో అనేక వ్యత్యాసాలు, పోలికలు ఉన్నాయి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

వ్యత్యాసాలు

దాదాపు 250 దాకా అత్యంత ప్రణాళికాబద్ధంగా నిర్మించిన పట్టణాలు, కోటలు, కాల్చిన ఇటుకలతో రూపొందించిన నిర్మాణాలు, భూగర్భ మురుగు నీటి కాలువల వ్యవస్థ వంటి పలు అంశాలతో కూడిన సింధు నాగరికత ప్రధానంగా పట్టణ నాగరికత. కానీ వైదిక నాగరికత చివరి దశలో మాత్రమే ప్రాథమిక స్థాయిలో పట్టణాలు ప్రారంభమయ్యాయి.

- సింధు నాగరికత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన నిర్దిష్ట సమాచారం ఏదీ లభించడం లేదు. కానీ వేద కాలంలో తెగ ఆధారిత రాజకీయ వ్యవస్థలు ఉండి, చివరి దశలో ప్రాదేశిక రాజ్యాలు కూడా ఏర్పడినట్లు తెలుస్తుంది.
- సింధు సమాజంలో కుల వ్యవస్థ కనిపించదు. వర్గ బేధాలు మాత్రమే ఉన్నాయి. సమాజంలో స్త్రీలకు ఉన్నత స్థానం ఉన్నట్లుగా అసంఖ్యాకంగా లభించిన మాతృ మూర్తి విగ్రహాల వల్ల తెలుస్తుంది. వీరిది మాతృస్వామిక వ్యవస్థ అని కొందరి అభిప్రాయం. కానీ వైదిక సమాజంలో పటిష్ఠమైన చాతుర్వర్ణ వ్యవస్థ ఉంది. శూద్రులతోపాటు స్త్రీలకు సామాజిక గౌరవం లేదు. మలి వేద కాలంలో అనేక దురాచారాలు వచ్చి చేరాయి. ఆర్యులది పితృస్వామిక వ్యవస్థ.
- సింధు ప్రజలది స్థిర జీవనం. ప్రధాన వృత్తి వ్యవసాయం. గోధుమ, బార్లీ ప్రధాన పంటలు. కాగా వరికి అంత ప్రాధాన్యత కనిపించదు. వీరు పలు రకాల చేతి వృత్తుల పరిశ్రమలను స్థాపించుకున్నారు. ప్రామాణికమైన తూనికలు, కొలతలను వినియోగించేవారు. దేశీయ వ్యాపారంతోపాటు విదేశీ వ్యాపారాన్ని కొనసాగించారు. వైదిక ప్రజలు సంచార జీవితాన్ని గడిపేవారు. వీరి ప్రధాన వృత్తి పశుపోషణ. కేవలం మలి వేద కాలంలోనే వీరు వ్యవసాయాన్ని ముఖ్య వృత్తిగా స్వీకరించారు. ప్రధాన పంట వరి. సింధు ప్రజలకు లేని ఇనుము లోహ పరిజ్ఞానం వీరికి ఉంది. వీరు విదేశీ వ్యాపారాన్ని నిర్వహించలేదు. వీరి ఆర్థిక వ్యవస్థలో గోవులతోపాటు గుర్రాలకు ముఖ్యస్థానం ఉంది. సింధు ప్రజల విషయంలో గుర్రానికి సంబంధించిన వివరాలు సంతృప్తికరంగా నిర్ధారణ కాలేదు. ఒకవేళ వీరికి గుర్రం తెలిసినా.. దాని వినియోగం పరిమితమే.
- సింధు ప్రజల మతానికి సంబంధించిన సరైన సమాచారం లేకున్నా.. పురావస్తు ఆధారాల ద్వారా వీరు అమ్మతల్లిని ప్రధాన దేవతగా పూజించినట్లు తెలుస్తుంది. ఈ కాలంలో ఒకే ఒక పురుష దేవుడు పశుపతి మహాదేవ. ఆర్యుల దేవతల్లో స్త్రీల కంటే పురుష దేవుళ్ల ఆధిక్యం ఎక్కువ. ఇంద్ర, వరుణ, అగ్ని, త్రిమూర్తులు మొదలైన 33 మంది దేవుళ్లను వీరు పూజించేవారు.
- సింధు ప్రజల పూజా విధానానికి భిన్నంగా.. యజ్ఞ యాగాలు, క్రతువులకు ఆర్యులు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. లిపి విషయంలోనూ రెండు నాగరికతల మధ్య భేదాలు కనిపిస్తాయి. సింధు ప్రజలు చిత్ర లిపిని అభివృద్ధి చేసుకున్నారు. వైదిక ఆర్యులకు లిపి లేదు. కానీ వీరికి మౌఖిక సాహిత్యం ఉంది.


పోలికలు

- సింధు ప్రజల మాతృదేవతను వైదిక మతంలోని దుర్గగా గుర్తించారు. సింధు కాలంలోని పశుపతి మహాదేవుడినే ఆర్యులు రుద్రుడిగా పూజించారు.
- జంతువులను, వృక్షాలను ఆరాధించే సంప్రదాయం రెండు నాగరికతల్లో కనిపిస్తుంది.
- భూత ప్రేత పిశాచాలు, దుష్ట శక్తులు, మంత్ర తంత్రాల పట్ల నమ్మకం రెండింటిలోనూ ఉంది.
- ప్రాతిపదికలు వేరైనా రెండు సమాజాల్లోనూ సామాజిక వివక్షతలు కనిపిస్తాయి.
- వైద్య విధానాల్లోనూ రెండు నాగరికతల్లో సారూప్యం ఉంది.
- కుమ్మరి చక్రాన్ని రెండు నాగరికతల్లోని ప్రజలు వినియోగించారు.
- స్త్రీల అలంకార ప్రియత్వం, రవాణా సాధనాలు మొదలైన అంశాల్లోనూ రెండింటికి సారూప్యం ఉంది.
- పైన పేర్కొనట్లు సింధు, వేద నాగరికతల మధ్య పలు అంశాల్లో వ్యత్యాసాలు, పోలికలు ఉన్నాయి. అయినప్పటికీ ఈ రెండు నాగరికతల్లోని పలు అంశాలు నేటి సంస్కృతిలో భాగంగా ఇప్పటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతుండటంతో ఈ నాగరికతలను భారతీయ సంస్కృతికి మూల నాగరికతలుగా భావించవచ్చు.

జైన, బౌద్ధ మతాలు

జైన, బౌద్ధ మతాల ఆవిర్భావానికి, వ్యాప్తికి దోహదపడిన అంశాలను పరిశీలించండి?

మలి వేదకాలం చివర్లో నెలకొన్న పరిస్థితులే క్రీ.పూ.6వ శతాబ్దంలో భారతదేశంలో అనేక మత ఉద్యమాలు ప్రారంభం కావడానికి కారణమయ్యాయి. ఈ ఉద్యమాల్లో ముఖ్యమైనవి జైన, బౌద్ధ మతాలు.



కారణాలు

ఈ కాలంలో సమాజంలో వర్ణ వ్యవస్థ బలపడింది. ఈ వ్యవస్థలో మిగిలిన మూడు వర్ణాలపై బ్రాహ్మణులు ఆధిక్యత కలిగి ఉన్నారు. కానీ విశాలమైన భూ భాగాల్లో రాజ్యాలను స్థాపించి రాజ్యాధికారంతోపాటు రాజకీయంగా ఉన్నత దశలో ఉన్న క్షత్రియులు సామాజికంగా ఉన్నత దశను కోరుకున్నారు. జైన, బౌద్ధ మత స్థాపకులు ఇద్దరూ క్షత్రియులే. ఈ కాలంలో వైశ్యుల ఆర్థిక స్థితి మెరుగుపడింది. కానీ సామాజికంగా వారి స్థాయిలో మార్పు లేనందువల్ల వారిలో కూడా సామాజిక అశాంతి కలిగింది. శూద్రులు, స్త్రీలు తమకు మోక్షం ఇవ్వని వైదిక మతం పట్ల అసంతృప్తికి లోనయ్యారు. ఇదే సమయంలో అందరికీ సామాజిక సమానత్వం, మోక్షాన్ని ప్రసాదించే జైన, బౌద్ధ మతాల పట్ల వీరంతా ఆదరణ చూపారు. పైగా వీటి మోక్ష మార్గం వ్యయ రహితం, సులువైనదీ.

క్రీ.పూ.6వ శతాబ్దంలో ఇనుప లోహ పరిజ్ఞానం వల్ల గంగానదీ మైదాన ప్రాంతం సాగులోకి వచ్చింది. దీంతో వ్యవసాయాభివృద్ధికి గొప్ప అవకాశం ఏర్పడింది. వ్యవసాయాన్ని విస్తరించడంలో పశువుల పాత్ర ఎంతో కీలకమైంది. అయితే వైదిక యజ్ఞయాగాది క్రతువుల పేరిట విలువైన పశు సంపదకు తీవ్ర నష్టం కలగడంతో వ్యవసాయ వర్గాల నుంచి వైదిక క్రతువుల పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. భారతదేశంలో క్రీ.పూ.6వ శతాబ్ద కాలాన్ని రెండో నగరీకరణగా భావిస్తారు. వ్యవసాయాభివృద్ధితో మిగులు ఏర్పడటం, తొలిసారిగా నాణేలు వాడకంలోకి రావడం మొదలైన కారణాల వల్ల వ్యాపార వాణిజ్యాలకు గొప్ప ప్రోత్సాహం లభించింది. వైదిక గ్రంథాలు వడ్డీ వ్యాపారాన్ని, సముద్రయానాన్ని నిషేధించడంతో వ్యాపారాభివృద్ధికి ఆటంకం కలిగింది. ఇదే సమయంలో జైన, బౌద్ధాలు ఇటువంటి నిషేధాలు విధించకపోగా తమ అహింసా సిద్ధాంతం ద్వారా వ్యాపార వాణిజ్యాలు అభివృద్ధి చెందడానికి తగిన శాంతియుత వాతావరణం కల్పించాయి. దీంతో వ్యాపార వర్గాల నుంచి వైదిక మతం కంటే ఈ కొత్త మతాల పట్ల అధిక మద్దతు లభించింది. జైన, బౌద్ధ మతాలు రెండూ గణతంత్ర రాజ్యాల్లో ప్రారంభించినవే. రాజరికాల్లోని బ్రాహ్మణాధిక్యత, ఇతర వివక్షతలకు ఇక్కడ స్థానం లేకపోవడమే కాకుండా ప్రజాస్వామిక విలువలకు ఇవి ప్రతీకలుగా నిలిచాయి. దీంతో ఈ కొత్త మతాల ప్రాభవానికి తగిన వేదిక లభించింది. ఈ మతాలను అధికంగా ఆదరించింది కూడా ఈ రాజ్యాల్లోని ప్రజలే. జైన, బౌద్ధ మతాలు వైదిక మతంలా బ్రాహ్మణులు, ఇతర ఉన్నత వర్గాల వారికి పరిమితమైన సంస్కృత భాషకు బదులు ప్రాకృతం, పాళి వంటి సామాన్య ప్రజానీకానికి దగ్గరగా ఉన్న సులువైన భాషల ద్వారా తమ ప్రచారాన్ని నిర్వహించాయి. దీంతో అవి వైదికం కంటే సులువుగా ప్రజలను చేరి వారి ఆదరణను పొందాయి.

మొఘలుల పాలన

భారతీయ కళలు, వాస్తు శిల్పానికి మొఘలుల సేవలను ఉదాహరణల సహితంగా వివరించండి?

సుస్థిరతతో కూడిన మొఘల్ పాలన సుదీర్ఘ కాలం కొనసాగడంతోపాటు, మొఘల్ రాజులకు కళల పట్ల ఉన్న శ్రద్ధ, ఆసక్తి, ఆదరణలు వంటి కారణాలతో.. వీరి కాలంలో వాస్తు శిల్ప కళ, చిత్ర కళ, భాష, సంగీత సాహిత్యాలన్నింటిలో విశేష ప్రగతి కనిపిస్తుంది.



వాస్తు శిల్పకళ

సుల్తానత్ కాలంలో మొదలైన ఇండో పర్షియన్ శైలి ఈ కాలంలో అత్యున్నత దశకు చేరడంతోపాటు జాతీయ లక్షణాలను సంతరించుకుంది. వీరి నిర్మాణాల్లో మసీదులు, రాజ ప్రాసాదాలు, కోటలు ముఖ్యమైనవి. తెల్లని రాజస్థాన్ పాలరాయిని ఉపయోగించడం, డబుల్ డోమ్, పీత్రాదురా అలంకరణలు, పారే నీటితో ఉండే ఉద్యానవనాలు వీరి వాస్తు కళల్లోని కొన్ని ముఖ్య లక్షణాలు..

- బాబర్ కాలంలో పానిపట్, సంబల్‌పూర్, అయోధ్య, కాబూల్‌లలో మసీదులు నిర్మించారు.
- అక్బర్... ఫతేపూర్ సిక్రీ అనే నూతన రాజధాని నిర్మించి అందులో అనేక కట్టడాలు నిర్మించాడు. ఈ నగరంలోని జామా మసీద్ ప్రవేశ ద్వారమే బులంద్ దర్వాజా. ఆగ్రాలోని కోటతోపాటు ఫతేపూర్ సిక్రీలోని పంచ మహల్, బీర్‌బల్ మహల్, సలీం చిష్తీ సమాధి అక్బర్ కట్టడాల్లో ముఖ్యమైనవి. జహంగీర్ కాలంలో పూర్తి పాలరాయి నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. నూర్జహాన్ నిర్మించిన ఇత్‌మద్ ఉద్దౌలా సమాధే దీనికి నాంది అని చెప్పొచ్చు. పీత్రాదురా అలంకరణ ఈ నిర్మాణంతోనే ప్రారంభమై తాజ్‌మహల్‌తో తారస్థాయికి చేరింది. ఇతని కాలంలోని మరో ముఖ్య నిర్మాణం సికింద్రా(ఉత్తరప్రదేశ్)లోని అక్బర్ సమాధి.
- షాజహాన్ కాలాన్ని వాస్తు కళకు స్వర్ణయుగంగా చెప్పొచ్చు. ఢిల్లీలోని ఎర్రకోట, అందులోని దివానీ ఆమ్, దివానీ ఖాస్ భవనాలు, ఆగ్రాలోని మోతీ మసీద్, ఢిల్లీలోని జామా మసీద్ షాజహాన్ కాలంలోని ముఖ్య నిర్మాణాలు. ఇతని కాలంలోని నిర్మాణాలన్నింటిలోకి మకుటాయమానంగా ఆగ్రాలోని తాజ్‌మహల్ నిలిచింది. తన భార్య ముంతాజ్ జ్ఞాపకార్థం నిర్మించిన సమాధి ఇది.
- ఔరంగజేబ్ కాలంలోని ముఖ్యమైన నిర్మాణం ఔరంగాబాద్ వద్ద నిర్మించిన ఆయన భార్య రాబియాద్దౌరాన్ సమాధి. దీన్ని పేదవాడి తాజ్ మహల్ అంటారు.

చిత్రకళ

- ఇస్లాం మతం చిత్ర కళను అంగీకరించకపోయినా లౌకిక పాలకులైన మొఘలులు దీన్ని గొప్పగా ఆదరించారు. ముఖ్యంగా అక్బర్, జహంగీర్‌ల కాలంలో ఇది తారస్థాయికి చేరింది. వీరి చిత్రకళల్లో ఆధ్యాత్మికత కంటే భౌతికతకు ప్రాధాన్యం ఎక్కువగా ఉండేది.
- హుమయూన్ కాలం నుంచీ మొఘల్ చిత్రకళ ప్రారంభమైంది. ఇతని ఆస్థానంలో ప్రముఖ పర్షియన్ చిత్రకారుడు మీర్ సయ్యద్ అలీ, అబ్దుస్ సమద్‌లు ఉండేవారు.
- అక్బర్ ఆస్థానంలోని చిత్రకారులతో ఒక కార్ఖానా ఏర్పడింది. వీరి ఆధ్వర్యంలోనే హంజనామా అనే చిత్ర కళా గ్రంథం రూపొందింది. ఇతని ఆస్థాన చిత్రకారుల్లో ముఖ్యులు ఫరూఖ్ బేగ్, సయ్యద్ అలీ తబ్రేజీ, దశావంత్, బసవన్, ముకుంద్.
- జహంగీర్ కాలాన్ని మొఘల్ చిత్రకళకు పరాకాష్ఠగా పేర్కొనొచ్చు. పర్షియన్, భారతీయ శైలుల విలీనం ఇక్కడ కనిపిస్తుంది. ఒకే చిత్రాన్ని పలువురు చిత్రించే సంప్రదాయం ఈ కాలంలోనే ప్రారంభమైంది. ఇతని కాలంలోని ముఖ్యమైన చిత్రకారులు ఉస్తాద్ మన్సూర్, బిషన్‌దాస్.
- షాజహాన్... చిత్రకళ కంటే వాస్తు కళపై అధిక శ్రద్ధ చూపాడు. అయినప్పటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగించాడు. చిత్రకళలో ఖరీదైన రంగుల వినియోగం మొదలుపెట్టాడు. ఇతని ఆస్థానంలో మహ్మద్ హుస్సేన్, అనుపచిత్రలు ప్రముఖ చిత్రకారులు.
- ఔరంగజేబ్ మతాభిమానం కారణంగా ఇస్లాంకు వ్యతిరేకమైన చిత్రకళను ప్రోత్సహించలేదు.


భాషా సాహిత్యాలు

మొఘలుల రాజ భాష పర్షియన్. అనేక సంస్కృత గ్రంథాలు ఈ భాషలోకి అనువాదమయ్యాయి. ఉదా: అక్బర్ కాలంలో మహాభారతాన్ని 'రజ్‌నామా'గా అనువదించారు. ప్రిన్స్ దారాషుకోవ్ కూడా ఉపనిషత్తులను 'మజ్‌మ-ఉల్-బహ్రెయిన్'గా అనువదించాడు. అనువాదాలతోపాటు స్వీయ చరిత్రలు, చారిత్రక రచనలు కూడా చోటుచేసుకున్నాయి. తుజ్‌కీ బాబరీ, తుజ్‌కీ జహంగీరీ ముఖ్యమైన స్వీయ రచనలు. చారిత్రక గ్రంథాల్లో అబుల్ ఫజల్ అక్బర్‌నామా, అబుల్ ఫైజీ ఇనీ అక్బరీ, అబ్దుల్ హమీద్ లాహోరీ పాదుషానామా, ఖాఫీ ఖాన్ ముంతక్వాబ్-ఉల్ లుబాబ్ ముఖ్యమైనవి. ఈ కాలంలో హిందీతో పాటు ఇతర ప్రాంతీయ భాషా సాహిత్యాలు కూడా వర్ధిల్లాయి.

సంగీతం

మొఘల్ చక్రవర్తులు సంగీతాన్ని కూడా ఆదరించారు. అక్బర్ స్వయంగా నక్కారాను వాయించడంలో నిష్ణాతుడు. ఇతని ఆస్థానంలో ఉన్న తాన్‌సేన్‌ను 'గత వేయి సంవత్సరాల్లో ఇటువంటి సంగీతకారుడు లేడు' అని అబుల్ ఫజల్ కీర్తించాడు. తాన్‌సేన్ మియాంకీ థాడీ, దర్బారీ కనడ వంటి పలు కొత్త రాగాలను సృష్టించాడు. జహంగీర్ స్వయంగా అనేక గీతాలు రాసి తన సంగీతాభిమానాన్ని చాటుకొన్నాడు. షాజహాన్‌కు ద్రుపద్ రాగాలాపనలో స్వయంగా ప్రవేశముంది. ఔరంగజేబ్ కూడా వీణా వాద్యంలో దిట్ట. ఇతడు సంగీతాన్ని నిషేధించినా అత్యధిక సంగీత గ్రంథాలు ఇతని కాలంలో రచనలకు నోచుకోవడం విశేషం. ఈ విధంగా మొఘల్ చక్రవర్తుల స్వీయ ప్రవేశం, ఆదరణతోపాటు ప్రాంతీయ రాజుల ఆదరణతో హిందుస్థానీ సంగీతం ఎంతో అభివృద్ధి చెందింది.

ప్రపంచంలో మొదటి యాంటీబయాటిక్?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

జనరల్ సైన్స్-బయాలజీ

1. మైక్రోబయాలజీ (సూక్ష్మజీవ శాస్త్రం) అంటే?
   - కంటికి కనిపించని సూక్ష్మజీవులైన బ్యాక్టీరియా, వైరస్, శైవలాలు, శిలీంధ్రాలు, ప్రోటోజోవన్ల గురించి అధ్యయనం చేసే శాస్త్రం.
2. మైక్రోబయాలజీ పితామహుడు ఎవరు?
   - లూయీ పాశ్చర్
3. లూయీ పాశ్చర్ ఆవిష్కరణలు ఏవి?
   - పాశ్చరైజేషన్ విధానాన్ని కనుగొన్నాడు.
   - వ్యాధులు, సూక్ష్మజీవ జనితాలు (జెర్మ్ థియరీ ఆఫ్ డిసీజ్) సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. (జెర్మ్ థియరీని రాబర్ట్ కోచ్ ప్రయోగ పూర్వకంగా నిరూపించాడు)
   - రేబిస్ వ్యాక్సిన్‌ను(కుక్క కాటుకు)కనుగొన్నాడు.
   - ఆంత్రాక్స్, కలరా వ్యాధులకు వ్యాక్సిన్‌ను కనుగొన్నాడు.
4. పాశ్చరైజేషన్ అంటే?
   - సేకరించిన పాలను 70°C వరకు వేడిచేసి, 15-30 సెకన్ల పాటు ఉంచి, వెంటనే చల్లార్చి (10°C) ప్యాకెట్లలో నిల్వచేసే పద్ధతిని పాశ్చరైజేషన్ అంటారు.
5. సూక్ష్మజీవ శాస్త్ర ప్రాముఖ్యత ఏమిటి?
   - చనిపోయిన మొక్కలు, జంతువుల దేహాలను సూక్ష్మజీవులు కుళ్లింపజేసి, పోషక పదార్థాలను ఏర్పరచి నేలను సారవంతం చేస్తాయి. ఆ పోషక పదార్థాలను మొక్కలు వినియోగించుకుంటాయి.
   - ఆక్సిజన్, కార్బన్, నత్రజని, సల్ఫర్ వంటి మూలకాలు పునఃచక్రీయం చెందడంలో సూక్ష్మజీవులు ప్రముఖ పాత్ర పోషిస్తాయి.
   - సూక్ష్మజీవులు మొక్కల్లో, మానవుల్లో అనేక వ్యాధులను కలగజేస్తాయి. మరోవైపు సూక్ష్మజీవ నాశక ఔషధాలు (యాంటీబయాటిక్స్), టీకా (వ్యాక్సిన్)ల ఉత్పత్తిలోనూ తోడ్పడుతున్నాయి.
6. ఎక్సో మైక్రోబయాలజీ (వ్యోమ సూక్ష్మ జీవ శాస్త్రం) అంటే?
   - ఇటీవల కాలంలో సూక్ష్మజీవులను ఉపయోగించి రోదసీలో జీవాన్వేషణ జరుపుతున్నారు. దీన్నే వ్యోమ సూక్ష్మజీవ శాస్త్రం అంటారు.
7. సూక్ష్మజీవ నాశిని పెన్సిలిన్‌ను ఆవిష్కరించిన వారు ఎవరు?
   - అలెగ్జాండర్ ఫ్లెమింగ్ (బ్రిటన్) పెన్సీలియం నోటేటమ్ అనే శిలీంధ్రం నుంచి పెన్సిలిన్ అనే సూక్ష్మజీవ నాశక ఔషధాన్ని 1929లో కనుగొన్నాడు.
   - 1945లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్, హోవర్డ్ ఫ్లోరీ, ఎర్నెస్ట్ బోరిస్ చైన్ (పెన్సిలిన్ ఔషధ గుణాన్ని వివరించారు)లు సంయుక్తంగా నోబెల్ బహుమతి పొందారు.
8. యాంటీబయాటిక్స్ (సూక్ష్మజీవ నాశకాలు) అంటే ఏమిటి?
   - రోగకారక సూక్ష్మజీవులను (బ్యాక్టీరియా, వైరస్, శిలీంధ్రాలు) నిర్మూలించే మందులను యాంటీబయాటిక్స్ అంటారు.
9. మొట్టమొదటి యాంటీబయాటిక్ పేరు?
   - పెన్సిలిన్. దీన్ని వండర్ డ్రగ్, సర్వరోగ నివారిణి అని కూడా అంటారు.
10. యాంటీబయాటిక్ పితామహుడు అని ఎవరిని పిలుస్తారు?
    - అలెగ్జాండర్ ఫ్లెమింగ్
11. ఆరియో మైసిన్ సృష్టికర్త ఎవరు?
    - డా.ఎల్లాప్రగడ సుబ్బారావు(పశ్చిమ గోదావరి జిల్లా)
    - ఆరియోమైసిన్‌ను టెట్రాసైక్లిన్ అని కూడా పిలుస్తారు.
    - టైఫాయిడ్, ప్లేగు, క్షయ వంటి అనేక బ్యాక్టీరియా వ్యాధులను టెట్రాసైక్లిన్ నయం చేస్తుంది.
    - యల్లాప్రగడను విజర్డ్ ఆఫ్ వండర్ డ్రగ్స్ అని పిలుస్తారు.
12. టీకాలు (వ్యాక్సిన్లు) అంటే ఏమిటి?
    - చంపివేసిన (లేదా) బలహీనపర్చిన సూక్ష్మ జీవులుగల మందులనే టీకాలు/వ్యాక్సిన్లు అంటారు.
    - చంపివేసిన (లేదా) నిర్వీర్యం చేసిన సూక్ష్మ జీవులను శరీరంలోకి ప్రవేశపెట్టినప్పుడు శరీరం ప్రతిరక్షకాలను తయారుచేసి, నిల్వ ఉంచుకొని రక్షణ కల్పిస్తుంది.
13. ప్రపంచంలో తొలిసారి కనుగొన్న వ్యాక్సిన్?
    - స్మాల్‌పాక్స్ (మశూచి వ్యాధికి- 1796)
    - ఎడ్వర్డ్ జెన్నర్ దీన్ని కనుగొన్నాడు.
    - ఇతణ్ని వ్యాక్సిన్ పితామహుడు, అసంక్రామ్యతా (ఇమ్యూనిటీ) పితామహుడు అని పిలుస్తారు.
14. వ్యాక్సినేషన్ అంటే ఏమిటి?
    - చంపిన (లేదా) బలహీనపర్చిన వ్యాధి కారక సూక్ష్మజీవులను మానవ శరీరంలోకి ప్రవేశపెట్టడాన్ని వ్యాక్సినేషన్ అంటారు.
15. వ్యాక్సిన్ పదానికి మూలం?
    - వ్యాక్సిన్ పదం 'వాకా' అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. వాకా అంటే ఆవు అని అర్థం.
16. పోలియో (శిశు పక్షవాతం) వ్యాధికి అందుబాటులో ఉన్న టీకాలు?
    - **పోలియో టీకా:** జోనాస్‌సాక్ (1952)
    - పోలియో చుక్కల మందు (Oral Polio Vaccine - OPV) ఆల్బర్ట్ సాబిన్ (1957)
17. ప్రపంచ వ్యాప్తంగా నిర్మూలించిన వైరస్ కారక వ్యాధి?
    - మశూచి (స్మాల్‌పాక్స్)

గతంలో అడిగిన ప్రశ్నలు

1. పోలియో వ్యాక్సిన్‌ను కనుగొన్నది ఎవరు?
   1) బాంటింగ్ 2) కేథరిన్ ఫ్రాంక్
   3) జోనాస్ సాక్ 4) ఫ్లెమింగ్
2. సూక్ష్మజీవ నాశిని పెన్సిలిన్‌ను కింది వాటిలో దేన్నుంచి ఉత్పత్తి చేస్తారు?
   1) బ్యాక్టీరియా
   2) ఫంగస్/బూజు
   3) వైరస్ 4) శైవలం
3. ప్రపంచంలో మొదటి యాంటీబయాటిక్?
   1) స్ట్రెప్టోమైసిన్ 2) క్రోసిన్
   3) పెన్సిలిన్ 4) క్వినైన్
4. భారతదేశంలో తొలిసారిగా, జన్యుపరంగా తయారు చేసిన వ్యాక్సిన్?
   1) B.C.G 2) O.P.V
   3) H.B.V 4) F.M.D
5. ఇమ్యునైజేషన్ ప్రక్రియలో సజీవ (లేదా) నిర్జీవ సూక్ష్మజీవులను ఉపయోగించి వ్యాధులు రాకుండా నివారించే పద్ధతులను ఏమంటారు?
   1) యాంటీటాక్సిన్ 2) వ్యాక్సిన్
   3) టాక్సాయిడ్ 4) ఎనీమియా
6. శాస్త్రీయ పద్ధతిలో పాలల్లోని సూక్ష్మజీవులను నశింపజేసే పద్ధతి?
   1) స్టెరిలైజేషన్ 2) పాశ్చరైజేషన్
   3) కిణ్వనం 4) ప్యూరిఫికేషన్

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 3; 5) 2; 6) 2

కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథైల్ ఆల్కహాల్ నుంచి లభించేది?

నిత్య జీవితంలో పంచదార, బెల్లంను ఏదో రూపంలో వినియోగిస్తూనే ఉంటాం. చక్కెర పరిశ్రమకు అనుబంధంగా 'ఆల్కహాల్' పరిశ్రమ ఉంది. ఆల్కహాల్‌ను ప్రధానంగా పరిశ్రమల్లో, వాహనాల్లో ఉపయోగిస్తారు. మత్తు పానీయాలైన సారాయి, గుడుంబా, బీర్, విస్కీ, బ్రాందీ, వైన్ తదితరాల తయారీ లోనూ ఆల్కహాల్‌ను విరివిగా వినియోగిస్తున్నారు. కల్తీ కల్లు తయారీలో వివిధ రసాయనాలు వాడుతున్నారు. ధనార్జనే లక్ష్యంగా ఇందులో మోతాదుకు మించి హానికర రసాయనాలను వాడటం వల్ల అనేక కుటుంబాలు ఛిద్రమవుతున్నాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం



పంచదార

మనం రోజూ ఉపయోగించే చక్కెర, బెల్లంను 'చెరకు రసం' నుంచి తయారు చేస్తారు. గడ్డి జాతికి చెందిన చెరకు (గెడల)లో భారాత్మకంగా 11-15 శాతం చక్కెర ఉంటుంది. ఇది రసాయనికంగా 'కార్బోహైడ్రేట్' కుటుంబానికి చెందిన డైశాకరైడ్ 'సుక్రోజ్'. ఈ సుక్రోజ్ అనేది 'గ్లూకోజ్', 'ఫ్రక్టోజ్'ల మిశ్రమం. దీన్నే 'టేబుల్ షుగర్'గా వ్యవహరిస్తారు. డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు తీపి కోసం రసాయనికంగా 'సుక్రోజ్' అనే చక్కెరకు బదులు కృత్రిమ తీపికారిణి 'శాకరిన్' లాంటి పదార్థాలను ఉపయోగిస్తారు. వీటికి సంబంధించిన అంశాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

- పంటచేను నుంచి చెరకు గెడలను కోసిన తర్వాత 24 గంటల లోపు చక్కెర ఫ్యాక్టరీలకు తరలిస్తారు. ఆలస్యం అయ్యేకొద్దీ చక్కెర శాతం తగ్గుతుంది. అందుకే సాధారణంగా చక్కెర పరిశ్రమలను చెరకు అధికంగా పండించే ప్రాంతాలకు సమీపంలో నెలకొల్పుతారు.
- చెరకు గెడలను చిన్న చిన్న ముక్కలుగా చేసి, క్రషర్‌లో వేసి చెరకు రసాన్ని తీస్తారు. రసం తీసిన తర్వాత మిగిలిన పిప్పిని 'బగాసే' అంటారు.
- బగాసేను గట్టి కాగితం తయారీకి, 'కాప్టివ్ పవర్' ఉత్పత్తిలో ఇంధనంగా వాడతారు. బెల్లం తయారీలో చెరకు రసాన్ని గాఢత చెందించడానికి కూడా 'బగాసే'ను ఉపయోగిస్తారు.
- ఆమ్లత్వం ఉన్న చెరకు రసానికి 'కాల్షియం హైడ్రాక్సైడ్' (తడి సున్నం)ను కలిపి తటస్థీకరిస్తారు. ఈ ప్రక్రియనే 'డెఫకేషన్' అంటారు.
- ఎక్కువైన సున్నాన్ని తొలగించడానికి 'కార్బన్ డై ఆక్సైడ్' (CO_2)ను కలిపి 'కార్బొనేషన్' చేస్తారు. దీంతో సున్నం 'కాల్షియం కార్బొనేట్ ($CaCO_3$)'గా అవక్షేపం చెందుతుంది.
- తర్వాత 'సల్ఫర్ డై ఆక్సైడ్' వాయువును పంపి మిగిలి ఉన్న సున్నాన్ని తొలగిస్తారు. ఈ ప్రక్రియను 'సల్ఫిటేషన్' అంటారు.
- పై మూడు ప్రక్రియల వల్ల ఏర్పడ్డ అవక్షేపాలను ప్రెస్‌మడ్ రూపంలో ఎరువుగా ఉపయోగిస్తారు.
- సల్ఫర్ డై ఆక్సైడ్ విరంజనకారిగా కూడా పని చేస్తుంది. ఇది చెరకు రసం రంగును తొలగిస్తుంది.
- రసాన్ని గాఢత పరిచి చక్కెర స్ఫటికాలను ద్రవం నుంచి వేరు చేస్తారు.
- చక్కెర తయారు చేసిన తర్వాత మిగిలే చిక్కని ద్రవాన్ని 'మొలాసిస్' అంటారు. ఇది చక్కెర పరిశ్రమలో ముఖ్యమైన ఉప ఉత్పన్నం (బై ప్రాడక్ట్).
- మొలాసిస్ నుంచి కిణ్వ ప్రక్రియ ద్వారా ఆల్కహాల్‌ను రూపొందిస్తారు. మొలాసిస్‌ను వేరు చేయకుండా చెరకు రసాన్ని కిణ్వ ప్రక్రియలో గాఢత పరిచి 'బెల్లం' తయారు చేస్తారు.

కిణ్వ ప్రక్రియ: ఈస్ట్, బ్యాక్టీరియా మొదలైన సూక్ష్మజీవులతో ఉత్పత్తైన ఎంజైమ్‌లు పెద్ద అణువులను చిన్న అణువులుగా విడగొడతాయి. దీన్నే 'కిణ్వ ప్రక్రియ' అంటారు. స్టార్చ్ లేదా మొలాసిస్ లేదా ద్రాక్ష రసం నుంచి ఆల్కహాల్ తయారు చేయడంలో; బ్రెడ్, ఇడ్లీ, సోయా సాస్, కాడ్ లివర్ ఆయిల్, వెనిగర్ లాంటి అనేక రకాల పదార్థాల తయారీలో కిణ్వ ప్రక్రియ ఇమిడి ఉంటుంది. ఇందులో 'కార్బన్ డై ఆక్సైడ్' విడుదలవుతుంది. బ్రెడ్, ఇడ్లీ పిండి ఈ ప్రక్రియ వల్లే పొంగుతాయి.

ఇథైల్ ఆల్కహాల్ తయారీ

సాధారణంగా ఆల్కహాల్‌గా వ్యవహరించే సమ్మేళనమే 'ఇథైల్ ఆల్కహాల్ (ఇథనోల్)'. చక్కెర పరిశ్రమలో ఉప ఉత్పన్నమైన మొలాసిస్‌పై ఈస్ట్ కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథనోల్‌ను తయారు చేస్తారు.

- ఈస్ట్‌లోని 'జైమేజ్' అనే ఎంజైమ్ మొదట చక్కెర (సుక్రోజ్)ను గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లుగా విడగొడుతుంది.
- గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లను ఈస్ట్‌లో ఉండే మరో ఎంజైమ్ అయిన 'జైమేజ్' కిణ్వ ప్రక్రియ ద్వారా 'ఇథనోల్'గా మారుస్తుంది. ఇందులో ఉప ఉత్పన్నం 'కార్బన్ డై ఆక్సైడ్'.
- ఈస్ట్ కణాలకు అమ్మోనియం సల్ఫేట్, అమ్మోనియం ఫాస్ఫేట్ లవణాలను ఆహారంగా అందిస్తారు.
- ఈ ప్రక్రియలో ఆల్కహాల్ 15-20 శాతానికి చేరగానే ఈస్ట్ కణాలు చనిపోయి కిణ్వ ప్రక్రియ ఆగిపోతుంది. ఈ ద్రావణాన్ని 'వాష్' అంటారు.
- కిణ్వ ప్రక్రియలోకి గాలి చేరితే అందులోని ఆక్సిజన్ ఇథనోల్‌ను 'ఇథనోయిక్ ఆమ్లం'గా ఆక్సీకరణం చెందించి ఆల్కహాలిక్ ద్రావణాల రుచిని పాడు చేస్తుంది.
- వాష్‌ను 'అంశిక స్వేదనం' చేయడం ద్వారా 96 శాతం ఆల్కహాల్‌ను పొందవచ్చు. దీన్ని 'రెక్టిఫైడ్ స్పిరిట్' అంటారు. ఇందులో 'ఎజియోట్రోపిక్ మిశ్రమం' ఏర్పడటం వల్ల వంద శాతం ఆల్కహాల్‌ను పొందలేం.
- మిగిలిన 4 శాతం నీటిని తొలగించడానికి సున్నం ఉపయోగిస్తారు.
- వంద శాతం ఆల్కహాల్‌ను అబ్సల్యూట్ ఆల్కహాల్ అంటారు.
- పారిశ్రామిక ఆల్కహాల్‌ను దుర్వినియోగం (మద్యంగా సేవించడం) చేయకుండా ఇథైల్ ఆల్కహాల్‌కు 'పిరిడీన్', 'మిథనోల్'ను కలిపి సరఫరా చేస్తారు. దీన్ని 'అసహజ స్పిరిట్' (డీనేచర్డ్ స్పిరిట్) అంటారు. దీన్ని తాగితే అంధత్వంతోపాటు మరణం కూడా సంభవించవచ్చు.
- ఇథైల్ ఆల్కహాల్‌ను ఔషధాల తయారీలోనూ ఉపయోగిస్తారు.
- బీర్, వైన్, బ్రాందీ, విస్కీ, రమ్, జిన్ మొదలైన మత్తు పానీయాల్లో ఆల్కహాల్ విభిన్న శాతాల్లో ఉంటుంది.
- సంక్లిష్ట కార్బోహైడ్రేట్లున్న బార్లీ, రైస్, గోధుమ లాంటి ధాన్యం గింజలు లేదా ద్రాక్ష లాంటి ఫలాల నుంచి ఈ మత్తు పానీయాలను తయారు చేస్తారు.

వివిధ మత్తు పానీయాల్లో ఇథైల్ ఆల్కహాల్ శాతం

పానీయం	ఆల్కహాల్ శాతం
బీర్	4 - 5
వైన్	10 -16
రమ్	15 - 40
బ్రాందీ, విస్కీ	40 - 50
బ్రీజర్	4 - 7
కల్లు	5 - 8
వోడ్కా	40

- మొలాసిస్‌లో 50 శాతం చక్కెర ఉంటుంది.
- ఇథైల్ ఆల్కహాల్‌ను 'స్పిరిట్ ఆఫ్ వైన్' అని కూడా అంటారు.
- మిథైల్ ఆల్కహాల్ విషపూరితమైంది. దీన్ని 'ఉడ్ స్పిరిట్' అంటారు. దీన్ని 'కలప' నుంచి విధ్వంసక స్వేదనం ద్వారా తయారు చేస్తారు.
- సాధారణంగా నల్ల బెల్లం నుంచి గుడుంబా; బార్లీ నుంచి బీర్; ద్రాక్ష నుంచి వైన్, బ్రాందీ; మొలాసిస్ నుంచి రమ్; మొక్కజొన్న నుంచి జిన్; పొటాటో నుంచి వోడ్కా; మాల్ట్ నుంచి విస్కీ రూపొందిస్తారు.

కల్తీ కల్లు

తాటి, ఈత చెట్ల నుంచి సహజసిద్ధమైన కల్లు లభిస్తుంది. ఇందులో సుమారు 4 నుంచి 8 శాతం వరకు ఆల్కహాల్ ఉంటుంది. ఇది పులుస్తున్న కొద్దీ ఆల్కహాల్ పరిమాణం పెరుగుతుంది. సాధారణంగా ఈ కల్లు గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వినియోగదారులకే సరిపోతుంది. అందువల్ల పట్టణ ప్రాంతాల్లో కల్తీ కల్లు తయారు చేస్తున్నారు. కేవలం లీటరు సహజ కల్లును ఉపయోగించి నీళ్లు, ఇతర రసాయనాలను కలిపి 100 నుంచి 150 లీటర్ల కల్తీ కల్లు ఉత్పత్తి చేస్తున్నారు. ఒక పెద్ద ట్యాంకును నీటితో నింపి అందులో కొంత సహజ కల్లు కలుపుతారు. దానికి చక్కెర కంటే 600 రెట్లు తీపిదనం ఉండే కృత్రిమ తీపికారిణి శాకరిన్, మత్తు కోసం యూరియా, క్లోరాల్ హైడ్రేట్, డైజీపాం, ఆల్ప్రజోలాం లాంటి మత్తు పదార్థాలను కలుపుతారు. సిట్రికామ్లం, సోడియం బైకార్బొనేట్, మెగ్నీషియం సల్ఫేట్ లాంటి స్థిరీకరణులను కూడా ఉపయోగిస్తారు.

- మత్తు పదార్థాలు నేరుగా కేంద్ర నాడీ మండలంపై పనిచేస్తాయి. వీటికి బానిసైన వారికి ఇవి అందకపోతే.. కాళ్లు, చేతులు వణకడం; రక్తపోటు, హృదయ స్పందన రేటు పెరగడం; నిద్ర రాకపోవడం; పిచ్చిగా ప్రవర్తించడం లాంటి రుగ్మతలకు లోనవుతారు.
- కల్తీ కల్లు బాధితులకు మానసిక రుగ్మతలు నయం చేయడానికి 'లొరజిపామ్' ఔషధాన్ని ఉపయోగిస్తున్నారు.

- ఎక్కువ మోతాదులో ఆల్కహాల్ తీసుకోవడం వల్ల రక్త ప్రసరణ, నాడీ వ్యవస్థలతో పాటు కాలేయం దెబ్బతింటుంది. చిన్న పేగుల్లో ఆమ్లత్వం పెరిగి చిన్న కురుపులు ఏర్పడి జీర్ణ వ్యవస్థ దెబ్బతింటుంది. గుండె సంబంధ వ్యాధులు కూడా వస్తాయి.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. రసాయనికంగా టేబుల్ షుగర్ అనేది?
   1) గ్లూకోజ్ 2) ఫ్రక్టోజ్
   3) సుక్రోజ్ 4) లాక్టోజ్
2. కిణ్వ ప్రక్రియ ద్వారా ఇథైల్ ఆల్కహాల్ నుంచి లభించేది?
   1) ఫార్మలిన్ 2) వెనిగర్
   3) పెర్ హైడ్రాల్ 4) ఉడ్ స్పిరిట్
3. వెనిగర్ రసాయన నామం?
   1) ఇథైల్ ఆల్కహాల్
   2) ఎసిటికామ్లం (ఇథనోయికామ్లం)
   3) సిట్రికామ్లం 4) మిథనోల్
4. కిందివాటిలో అతి తక్కువ ఆల్కహాల్ ఉండే పానీయం ఏది?
   1) విస్కీ 2) రమ్
   3) సారాయి 4) బీర్

సమాధానాలు

1) 3; 2) 2; 3) 2; 4) 4.

మాదిరి ప్రశ్నలు

1. మొలాసిస్ కిణ్వ ప్రక్రియలో గ్లూకోజ్‌ను ఇథైల్ ఆల్కహాల్‌గా మార్చే ఎంజైమ్?
   1) డయాస్టేజ్ 2) ఇన్వర్టేజ్
   3) జైమేజ్ 4) మాల్టేజ్
2. ఏ రకమైన ఆల్కహాల్ సేవించడం వల్ల అంధత్వం వస్తుంది?
   1) ఇథైల్ ఆల్కహాల్ 2) మిథైల్ ఆల్కహాల్
   3) బెంజైల్ ఆల్కహాల్ 4) ఎమైల్ ఆల్కహాల్
3. చక్కెర తయారు చేసిన తర్వాత మిగిలే మాతృ ద్రావణాన్ని ఏమంటారు?
   1) వాష్ 2) మొలాసిస్
   3) ఉడ్ స్పిరిట్ 4) ఫార్మలిన్
4. కల్తీ కల్లులో వాడే మత్తు పదార్థం ఏది?
   1) క్లోరాల్ హైడ్రేట్ 2) డైజీపాం
   3) అల్ప్రజోలాం 4) పైవన్నీ
5. చక్కెరను కిణ్వ ప్రక్రియ చేస్తే నిరంతరం ఏర్పడే సమ్మేళనం ఏది?
   1) మిథైల్ ఆల్కహాల్ 2) ఇథైల్ ఆల్కహాల్
   3) ఎసిటికామ్లం 4) ఎసిటలీన్

సమాధానాలు

1) 3; 2) 2; 3) 2; 4) 4; 5) 2.

There is a lot to be said about...



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is "No error".

1. He has a scheme (1)/ which he thinks is preferable (2)/ than that proposed (3)/ by the planning commission. (4)/ No error (5)
2. The details (1)/ are the matters (2)/ for future (3)/ considerations. (4)/ No error (5)
3. The rise and fall (1)/ of the British Empire (2)/ were (3)/ Historical processes. (4)/ No error (5)
4. Information technology (1)/ as well as (2)/ management are (3)/ taught here. (4)/ No error (5)
5. This is the only one (1)/ of his ideas (2)/ that have not found (3)/ favour with biologists. (4)/ No error (5)
6. He has promised (1)/ to buy shares (2)/ in whatever company (3)/ you are interested. (4)/ No error (5)
7. One has to reckon with paying (1)/ for supporting services (2)/ although it may not be apparent (3)/ from the glib sales talk of the bank personnel. (4)/ No error (5)
8. There is a general perception in our society (1)/ that public administrations and business executives (2)/ sit in their air-conditioned chambers and quietly administer (3)/ the affairs of the states or business. (4)/ No error (5)
9. The greatest need (1)/ of the hour is (2)/ we must learn (3)/ to work together as a team. (4)/ No error (5)
10. A virtuous man, (1)/ under all misfortune of life, (2)/ still finds an inward comfort (3)/ and satisfaction. (4)/ No error (5)

Directions (Q. No. 11-15): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

11. I should have <u>liked to have visited.</u>
    1) liking to visit
    2) like to visit
    3) like to have visited
    4) likes to visit
    5) No correction required
12. <u>It was being a very hot day,</u> I remained indoor.
    1) Being a very hot day
    2) Been a very hot day
    3) It is a hot day
    4) It been a hot day
    5) No correction required
13. Please excuse <u>me</u> being late.
    1) mine 2) my
    3) with 4) from
    5) No correction required
14. He fled lest he <u>would</u> be killed.
    1) will being 2) may
    3) should 4) might have
    5) No correction required
15. The river <u>has over flown</u> its banks.
    1) have over flown
    2) have been over flown
    3) has overflowed
    4) has over flowing
    5) No correction required

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Records going back to the fourth century A.D. refer to tea.
B. No one knows when tea was first discovered or how it came to be such a popular drink.
C. By the eighteenth century A.D. most Chinese were drinking tea both because they liked it as a beverage and for its medicinal value.
D. It was called Cha Ching, which translated means Tea Scripture.
E. The beverage is generally accepted to have originated in China hundreds of years ago.
F. Tea was so popular that one of the most distinguished poets of Tang dynasty a man called Lu Yu, even wrote a holy scripture about it.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. No. 21-25): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

21. There is a lot to be said about the ___ changes that technology has brought __ in the financial sector.
    1) alternate; along
    2) alternative; within
    3) attitudinal; about
    4) alternatively; forth
    5) attitude; with
22. Although seat belts have been shown to ___ lives, people give a number of __ for not using them.
    1) prosper; treason
    2) prefer; resign
    3) pamper; alternates
    4) save; reasons
    5) protect; cause
23. To create a scientific temper, there has to be a widely shared ___ to and belief in the value of science, particularly among the political ___.
    1) commitment; elite
    2) promise; choice
    3) assurance; best
    4) dedication; leaders
    5) pledge; privilege
24. The same sciences which had led us away from nature are now ___ the miracle of creation.
    1) discovering 2) unfolding
    3) inventing 4) revealed
    5) projected
25. Man's basic ___ is a fact and is the emotional factor for all the bloody violence that has marked human history since the beginning.
    1) fierceness 2) violence
    3) aggressiveness
    4) assertiveness
    5) ferociousness

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

By coach, by train, by ship and by plane, millions of tourists annually depart from home like migrating summer birds. They provide the best possible evidence to prove that the world is not really as big as it used to be. For the modern tourist is no Marco Polo. He ventures forth into the unknown and returns home in a matter of weeks, and years. Furthermore, he is armed with pamphlets, maps and weighty guide books which tell him where to go and how to get there; and where to stay, what to see and what to eat when he arrives. There are travel agencies everywhere to cater for his needs and make all the necessary preparations for him. They make out ambitious programmes and promise to **whisk** him through as many as six countries in fourteen days or, if he is in a hurry, they will cover much the same ground in eight or less.

It is a small wonder that the tourist is a busy man. He no sooner sets foot on foreign soil than he is rushed to his hotel and thence is immediately taken on a conducted tour of the city by night. In the morning he goes through another **arduous** course of sight-seeing. He has barely had the chance to recover, or indeed, to find out exactly where his hotel is located, before he is off again to yet another part of the country. It is not even a bird's eye view he gets. Rather, it is a snap-shot view.

26. Today, the world ___
    1) is not as big as it was in the past.
    2) is full of tourists
    3) can be toured in a matter of days
    4) has a lot of travel agents
    5) has different modes of transport
27. According to the passage:
    1) The hectic schedule of the tourist is described
    2) It deals with how the tourist enjoys his tour
    3) highlights the tourist's problems during the tour
    4) Defines the tourist as a nomad
    5) Defines the tourist as a confused person
28. Which of the following statements is false?
    1) Travel agencies provide the tourist with all the necessary information
    2) The tourist is a wanderlust
    3) The tourist wants to derive maximum benefit from his hard earned money
    4) The tourist does gets sufficient rest during his tour
    5) Each country welcomes the tourist for the foreign exchange he brings with him
29. The synonym of **whisk** is:
    1) Catapult 2) Leisure
    3) Walk 4) Decelerate
    5) Jaunt
30. The antonym of **arduous** is:
    1) Fatigue 2) Formidable
    3) Facile 4) Former
    5) Flaunt

Answers

1) 3	2) 2	3) 3	4) 3	5) 3
6) 3	7) 5	8) 4	9) 3	10) 2
11) 2	12) 5	13) 2	14) 3	15) 3
16) 3	17) 1	18) 4	19) 1	20) 4
21) 3	22) 4	23) 1	24) 2	25) 3
26) 1	27) 5	28) 4	29) 1	30) 3